www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

బుధవారం | 7-2-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 21 సంచిక (Issue) : 310
శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, హేమంతరుతువు, పుష్యమాసం, బహుళపక్షం; తిథి: ద్వాదశి మ. 3.02 తదుపరి త్రయోదశి; నక్షత్రం: పూర్వాషాఢ తె. 4.38 తదుపరి ఉత్తరాషాఢ, వర్జ్యం: మ. 3.20-4.48, దుర్ముహూర్తం: మ. 12.07-12.53, అమృతఘడియలు: రా. 12.12-1.40, రాహుకాలం: మ. 12.00-1.30, సూర్యోదయం: 6.50, సూర్యాస్తమయం: 6.10 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

రాష్ట్రాలు ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ చేయొచ్చా?


సుప్రీంకోర్టులో ఏడుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం విచారణ

పంజాబ్ రిజర్వేషన్ల చట్టంపైనా పరిశీలన

ఏపీ కేసును ఉటంకించిన పిటిషనర్లు

వర్గీకరణకు కాంగ్రెస్ కట్టుబడి ఉంది

సుప్రీంలో బలంగా వాదన: దామోదర



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వాలు ఎస్సీ, ఎస్టీల వర్గీకరణ చేయొచ్చా? అనే అంశంపై న్యాయపరమైన ప్రశ్నలను పరిశీలించేందుకు ఏడుగురు సభ్యుల సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం ఏర్పాటైంది. చీఫ్ జస్టిస్ డీవై చంద్రచూడ్‌తో పాటు.. జస్టిస్ బీఆర్ గవాయి, జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ బేలా.ఎం.త్రివేది, జస్టిస్ పంకజ్ మిత్తల్, జస్టిస్ మనోజ్ మిశ్రా, జస్టిస్

మిగతా 2వ పేజీలో...

టచ్ చేయలేవ్!

నన్ను, నా పార్టీని టచ్ చేయడం నీ వల్ల కాదు

నీకంటే హేమాహేమీలను ఎదుర్కొన్న చరిత్ర మాది

ఉడుత బెదిరింపులకు భయపడం.. ముందు ముందు చూద్దాం

కాంగ్రెస్ నేతలకు తెలివి లేదు.. ప్రాజెక్టులపై అవగాహన లేదు

అందుకే కేంద్రం గేమ్ స్టార్ట్ చేసి కేఆర్ఎంబీ పరిధిలోకి తీసుకుంది

తెలంగాణ ప్రయోజనాల కోసం కేసీఆర్ ఎన్నడూ వెనక్కి పోడు

కృష్ణా జలాల్లో వాటాపై పోరాటమే.. 13న నల్లగొండలో భారీ సభ

దీనిని మరో ప్రజా ఉద్యమంగా ప్రజల్లోకి తీసుకెళదాం: కేసీఆర్

కృష్ణా జలాల పరిరక్షణపై తెలంగాణ భవన్లో పార్టీ నేతలతో సమీక్ష

'కొత్త సీఎం'అంటూ రేవంత్ పేరు ప్రస్తావించకుండానే కేసీఆర్ విమర్శలు



హైదరాబాద్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): "నన్ను.. నా పార్టీని టచ్ చేయడం నీ వల్ల కాదు.. నీ కంటే హేమాహేమీలనే ఎదుర్కొన్న చరిత్ర మాకుంది. ఉడుత బెదిరింపులకు భయపడను. ముందు ముందు ఏందో చూద్దాం" అంటూ సీఎం రేవంత్ రెడ్డిని ఉద్దేశించి మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పరోక్షంగా హెచ్చరించినట్లు తెలుస్తోంది. నేరుగా ఆయన పేరు ప్రస్తావించకుండా 'కొత్త సీఎం' అని సంబోధిస్తూ.. అవగాహన రాహిత్యంతో కొత్త ముఖ్యమంత్రి తనను వ్యక్తిగతంగా, బీఆర్ఎస్ పార్టీని ఇష్టం వచ్చినట్లు తిడుతున్నారని వ్యాఖ్యానించినట్లు సమాచారం. కృష్ణా జలాల పరిరక్షణ కోసం బీఆర్ఎస్ పార్టీ చేపట్టనున్న పోరాటంలో భాగంగా నల్లగొండలో ఈనెల 13న నిర్వహించనున్న బహిరంగ సభ ఏర్పాట్లపై మంగళవారం తెలంగాణ భవన్‌లో ఉమ్మడి హైదరాబాద్, మహబూబ్‌నగర్, రంగారెడ్డి, ఖమ్మం, నల్లగొండ జిల్లాల పార్టీ ప్రతినిధులతో కేసీఆర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రాన్ని పదేళ్లు తాము పదిలంగా కాపాడుకున్నామని, దానిని పరాయివాళ్ల పాలుచేస్తున్నారని ఆయన ఆరోపించినట్లు తెలిసింది. "కాంగ్రెస్ నేతలకు తెలివి లేదు. ఇప్పుడున్న పాలకులకు ప్రాజెక్టులు, నీళ్ల గురించి

మిగతా 12వ పేజీలో...

'కాళేశ్వరం' భయంతో

కృష్ణాపై దుష్ప్రచారం

కాళేశ్వరం అవినీతిపై శ్వేతపత్రం నేపథ్యంలోనే బీఆర్ఎస్ కుట్ర.. ఈ ప్రయత్నాన్ని తిప్పికొట్టాలి

సాగర్, శ్రీశైలంలను కేఆర్ఎంబీకి అప్పగించలేదు

ఈ విషయాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకుపోవాలి

లోక్‌సభ ఎన్నికలను ఏమాత్రం తేలిగ్గా తీసుకోవద్దు

అజాగ్రత్తగా ఉంటే మూల్యం చెల్లించుకుంటాం

అభ్యర్థులకు గెలుపు, సామాజిక న్యాయం ప్రాతిపదిక

ప్రదేశ్ ఎన్నికల కమిటీ సమావేశంలో సీఎం రేవంత్

పార్టీలో చేరికలపై దృష్టి పెట్టాలి: దీపాదాస్ మున్షీ



కాంగ్రెస్‌లో చేరిన అనంతరం ఆ పార్టీ అధ్యక్షుడు ఖర్గేను కలిసిన వెంకటేశ్ నేత. చిత్రంలో భట్టి, రేవంత్, కేసీ వేణుగోపాల్

హైదరాబాద్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): కృష్ణా జలాల విషయంలో ప్రభుత్వంపై బీఆర్ఎస్ పార్టీ చేస్తున్న దుష్ప్రచారాన్ని క్షేత్రస్థాయిలో తిప్పికొట్టాలని ప్రదేశ్ ఎన్నికల కమిటీ (పీఈసీ) సభ్యులకు సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు. ఆ పార్టీ ప్రచారం చేస్తున్నట్లుగా శ్రీశైలం, నాగార్జునసాగర్‌పై హక్కులను కృష్ణా బోర్డుకు దఖలు చేయలేదని తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో అవినీతిపై విజిలెన్స్ విచారణ, శ్వేత పత్రం విడుదల చేయనున్న నేపథ్యంలోనే బీఆర్ఎస్ ఈ దుష్ప్రచారాన్ని తెరపైకి తెచ్చిందన్నారు. క్షేత్రస్థాయిలో ప్రజలకు ఈ కుట్ర అర్థమయ్యేలా

మిగతా 13వ పేజీలో...

బీఆర్ఎస్‌కు షాక్!

కాంగ్రెస్‌లో చేరిన పెద్దపల్లి ఎంపీ వెంకటేశ్ నేత

ఢిల్లీలో రేవంత్ సమక్షంలో చేరిక.. టికెట్ హామీ!

నల్లగొండ సభలోపే

బీఆర్ఎస్ నేతలు కాంగ్రెస్‌లోకి

లోక్‌సభ ఎన్నికల తర్వాత ఆ పార్టీ నాలుగు ముక్కలు

12-13 ఎంపీ స్థానాలు సాధిస్తాం: మంత్రి కోమటిరెడ్డి

'మూసీ' నమూనాలు రూపొందించండి

సింగపూర్ కంపెనీతో సీఎం రేవంత్..

సుందరీకరణ ఖర్చు రూ.5,813 కోట్లు!

గ్రూపు-1లో మరో 60 పోస్టులు

ఆర్థిక శాఖ ఉత్తర్వులు.. 563కు కొలువులు

నోటిఫికేషన్ జారీకి టీఎస్‌పీఎస్సీకి సూచన

సుప్రీంలో కేసు.. గత ప్రిలిమ్స్‌పై సందిగ్ధత

వక్ఫ్ బోర్డు చైర్మన్‌గా సయ్యద్ హుసేని



లబ్ధిదారుల ఖాతాకే గ్యాస్ సబ్సిడీ!

రాయితీని ప్రభుత్వం నుంచి తీసుకోవడానికి కంపెనీలు, పంపిణీదారుల విముఖత 13

నగదు బదిలీ కన్నా.. నేరుగా 500కు సిలిండర్

ఇస్తేనే ఎక్కువ ప్రభావమని ప్రభుత్వ అభిప్రాయం

బీపీఎల్ కుటుంబాలకు ఏటా 6 గ్యాస్ సిలిండర్లు

రూ.415 చొప్పున భరించనున్న సర్కారు

64 లక్షల మందికి ఏటా 3.84 కోట్ల సిలిండర్లు

వాటికి ఇచ్చే సబ్సిడీ రూ.1,594 కోట్లు

భగీరథలో అవినీతిపై విచారణ!



ప్రతి మండలంలో ఓ గ్రామంలో పరిశీలనకు నిర్దేశం

పథకంలో రూ.7 వేల కోట్ల అవినీతి జరిగిందంటూ

సర్కారుకు విజిలెన్స్ విభాగం అంతర్గత నివేదిక

గ్రామాల్లో ఓవర్ హెడ్ ట్యాంకులు, పైపులైన్లు,

నల్లాలు వేయకుండానే బిల్లులు డ్రా చేశారని ఆరోపణ

అవన్నీ కాంగ్రెస్ హయాంలో వేసినవేనని స్పష్టం

కొనుగోళ్లు జరపకుండానే నిధులు మింగేశారని విమర్శ

కేసీఆర్ ప్రతిష్ఠాత్మక పథకాలపై రేవంత్ విచారణ కత్తి

పూర్తిస్థాయి దర్యాప్తునకు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశం

హైదరాబాద్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): ఇంటింటికీ మంచినీటిని అందించేందుకు కేసీఆర్ ప్రభుత్వం అమలు చేసిన మిషన్ భగీరథ పథకంలోని అవినీతి, అక్రమాలపై విచారణకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించినట్లు తెలిసింది. ఈ పథకంలో రూ.7000 కోట్ల మేర అవినీతి జరిగిందంటూ విజిలెన్స్ విభాగం అంతర్గత నివేదిక సమర్పించిన నేపథ్యంలో ఈ మేరకు ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం. ప్రతి మండలంలోనూ ఒక గ్రామాన్ని ఎంపిక చేసి అక్కడ చేసిన పనులు, ఖర్చు చేసిన నిధులు తదితరాలను పరిశీలించాలని నిర్దేశించినట్లు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. ఇంటింటికీ మంచినీటి అందించేందుకు బీఆర్ఎస్ ప్రభుత్వం మిషన్ భగీరథ పథకాన్ని చేపట్టిన సంగతి తెలిసిందే. ఆయా పనుల్లో అక్రమాలు చోటుచేసుకున్నట్లు సర్కారుకు పలు వర్గాల నుంచి ఫిర్యాదులు అందాయి. ఆయా గ్రామాల వరకూ పైపు లైన్లను వేసినా.. గ్రామాల్లో మాత్రం పాత ఓవర్ హెడ్ ట్యాంకులు, పైపు లైన్లకే లింక్ చేసినట్లు కాంగ్రెస్ సర్కారుకు నివేదికలు అందాయి. అవన్నీ కూడా అంతకు ముందు కాంగ్రెస్ హయాంలో వేసినవేనని కూడా వాటిలో స్పష్టం చేశారు. ఆయా ఓవర్ హెడ్ ట్యాంకులు, పైపులైన్లను వేయకుండానే వేసినట్లు బిల్లులు కూడా తీసేసుకున్నారని ఫిర్యాదులు వచ్చాయి. తద్వారా కోట్ల రూపాయల అవినీతి అక్రమాలు జరిగాయని ఆరోపణలు వచ్చాయి. సదరు అక్రమాలపై విచారణ జరిపితే అసలు విషయం బయటకు వస్తుందని కోరినట్లు తెలిసింది. ప్రధానంగా ఓవర్ హెడ్ ట్యాంకుల నిర్మాణం, పల్లెల్లో వీధుల గుండా కొత్తగా పైపు లైన్లు వేయడం, ఇంటింటికీ నల్లాలు బిగించడం వంటి వాటిలో అక్రమాలు జరిగినట్లు సర్కారుకు సమాచారం అందింది. ఉమ్మడి రాష్ట్రంలోనే వేసిన పైపు లైన్లను కొత్తగా వేసినట్లు చెప్పడంతోపాటు వాటర్ ట్యాంకులకు రంగులు వేసి.. అప్పుడే నిర్మాణాలు జరిపినట్లు రికార్డుల్లో నమోదు చేసి డబ్బులు దండుకున్నట్లు పలు ఫిర్యాదుల్లో పేర్కొన్నట్లు తెలుస్తోంది. ఎటువంటి కొనుగోళ్లు జరపకుండానే పైపులైన్లు, ఇతర మెటీరియల్ కొన్నట్లు బిల్లులు సృష్టించి నిధులు మింగేశారని ఆరోపణలు వచ్చాయి. సర్కారుకు వచ్చిన ఫిర్యాదుల ఆధారంగా.. మిషన్ భగీరథ పనులపై విజిలెన్స్ బృందాలు ఇప్పటికే విచారణ జరిపాయి. పథకంలో భారీ అవినీతి జరిగిందని నిర్ధారణకు వచ్చాయి. దాదాపు రూ.7000 కోట్ల వరకూ నిధుల దుర్వినియోగం జరిగిందని సర్కారుకు అంతర్గత నివేదిక కూడా

మిగతా 14వ పేజీలో...

హైదరాబాద్ రిజిస్ట్రార్ సస్పెన్షన్

రూ.60 కోట్ల శంకర్‌పల్లి భూమి అక్రమ రిజిస్ట్రేషన్ వ్యవహారంలో వేటు

భార్య పేరిట కొన్న వెంకటేశ్వర్ల ప్రసాద్

కింది అధికారులపై ఒత్తిడి తెచ్చి రిజిస్ట్రేషన్

విచారణలో తేలడంతో సర్కారు చర్యలు

నకిలీ రిజిస్ట్రేషన్లపై విచారణకు కమిటీ

ఇప్పటికే శంకర్‌పల్లి సబ్ రిజిస్ట్రార్‌పై వేటు

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

హైదరాబాద్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలో రూ.60 కోట్ల విలువ చేసే భూమి అక్రమ రిజిస్ట్రేషన్ వ్యవహారానికి సంబంధించి హైదరాబాద్ జిల్లా రిజిస్ట్రార్‌పైనా వేటు పడింది. 'రికార్డుల్లో చంపేశారు' శీర్షికతో ఈ నెల 4న 'ఆంధ్రజ్యోతి'లో ఈ అక్రమ రిజిస్ట్రేషన్‌పై ప్రత్యేక కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో రిజిస్ట్రేషన్ల శాఖ ఐజీ నవీన్ మిత్తల్ విచారణకు ఆదేశించగా.. శంకర్‌పల్లి సబ్‌రిజిస్ట్రార్‌ను ఇప్పటికే సస్పెండ్ చేశారు. మరోవైపు, హైదరాబాద్

మిగతా 12వ పేజీలో...

ఎప్‌సెట్‌కు 26 నుంచి దరఖాస్తులు

మే 9 నుంచి పరీక్షలు

షెడ్యూల్ విడుదల 3



అండర్-19 ఫైనల్‌లో టీమిండియా

ప్రపంచ కప్ సెమీఫైనల్‌లో దక్షిణాఫ్రికాపై గెలుపు 11

ఒత్తిడిని తట్టుకొని విజయం

వరుసగా ఐదోసారి ఫైనల్‌కు



ఈసీ ఆదేశాల అనంతరం ముంబైలో అజిత్ మద్దతుదారుల ఆనందం

ఎన్సీపీ అజిత్‌దే

ఎన్నికల గుర్తు కూడా వారికే

ఎలక్షన్ కమిషన్ ప్రకటన

వ్యవస్థాపకుడు శరద్ పవార్‌కు దక్కని పార్టీ

నేటి మధ్యాహ్నంలోగా కొత్త పేరు చెప్పాలని సూచన

'ఇండియా'కు మరో షాక్

ఎన్డీఏలో చేరనున్న ఆర్ఎల్డీ?

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 6: మహారాష్ట్రలోని నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్సీపీ) ఎవరికి చెందుతుందన్న విషయమై కొన్ని నెలలుగా బాబాయ్ శరద్ పవార్, అబ్బాయ్ అజిత్ పవార్ మధ్య తలెత్తిన వివాదం ఎట్టకేలకు పరిష్కారమయింది. అజిత్ పవార్ ఆధ్వర్యంలోనిదే అసలైన ఎన్సీపీ అని మంగళవారం ఎన్నికల సంఘం ప్రకటించింది. ఎన్నికల గుర్తు అయిన 'గోడ గడియారం' కూడా ఆ పార్టీకే చెందుతుందని తెలిపింది. అసలైన శివసేన ఎవరన్నది తేల్చడానికి పలు రకాల పరీక్షలు నిర్వహించినట్లు ఎన్నికల సంఘం తెలిపింది. పార్టీ లక్ష్యాలు, ఆశయాల

మిగతా 2వ పేజీలో...

రండి.. మాట్లాడుకుందాం!

చంద్రబాబుకు అమిత్‌షా ఫోన్.. నేడు ఢిల్లీకి టీడీపీ అధినేత

షాతో సమావేశం.. జేపీ నడ్డా కూడా పాల్గొనే అవకాశం

టీడీపీతో పొత్తు కోరుకుంటున్న బీజేపీ.. దానిపైనే పిలుపు?

గతంలోనే వైఖరి చెప్పిన లోకేశ్.. ఏం జరుగుతుందోనని ఆసక్తి



అమరావతి, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల ముంగిట బీజేపీ జాతీయ నాయకత్వం నుంచి టీడీపీ అధినేత చంద్రబాబుకు పిలుపు అందింది. కేంద్ర హోం మంత్రి అమిత్ షా మంగళవారం ఉదయం ఆయనకు ఫోన్ చేశారు. కూర్చుని మాట్లాడుకుందాం రమ్మని ఢిల్లీకి ఆహ్వానించారు. ఆయన ఫోన్ చేసిన సమయంలో చంద్రబాబు ఏపీలోని ఉండవల్లిలో తన నివాసంలో ఉన్నారు. అమిత్ షా ఆహ్వానం మేరకు బుధవారం ఆయన ఢిల్లీ బయల్దేరుతారు. ఆయన పర్యటనకు సంబంధించి భద్రతాపరమైన షెడ్యూల్ కూడా విడుదలైంది. బుధవారం మధ్యాహ్నం 2.30 గంటలకు గన్నవరం విమానాశ్రయం నుంచి బయలుదేరి ఢిల్లీ వెళ్తారు. రాత్రి అమిత్ షాను కలుస్తారు. వారి చర్చల్లో బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా కూడా పాల్గొంటారని సమాచారం.

పొత్తులపై చర్చకేనా?

ఈ ఎన్నికల్లో టీడీపీతో పొత్తుపై బీజేపీ కొన్నాళ్లుగా ఆసక్తి ప్రదర్శిస్తోంది. స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో అరెస్టుకు ముందు... నాలుగు నెలల కిందట ఒకసారి చంద్రబాబు ఢిల్లీలో అమిత్‌షాతో భేటీ అయ్యారు. ఆయన అరెస్టయి రిమాండ్‌లో ఉన్న సమయంలో టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేశ్ రెండు పర్యాయాలు అమిత్‌షాతో

మిగతా 3వ పేజీలో...



బాణసంచా కర్మాగారంలో భారీ పేలుడు

మధ్యప్రదేశ్‌లో 11 మంది మృతి 2

200 మందికి తీవ్ర గాయాలు

మార్కెట్‌లోకి భారత్ బియ్యం 2

ఢిల్లీలో ప్రారంభించిన కేంద్ర మంత్రి గోయల్



11 నుంచి యాదాద్రి కొండపైకి ఆటోలు 3

రోజూ 2 షిఫ్టుల్లో 100 ఆటోలకు అనుమతి.. యథావిధిగా బస్సులు

పురాతన సంప్రదాయాలను పునరుద్ధరిస్తాం

వైటీడీఏ పనుల్లో సమన్వయలోపం.. సమీక్షలో విప్ బీర్ల ఐలయ్య

రాష్ట్రాలు ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ చేయొచ్చా?



(మొదటి పేజీ తరువాయి)

సతీశ్‌చంద్ర మిశ్రాల ధర్మాసనం మంగళవారం ఈ విచారణను ప్రారంభించింది. పంజాబ్ ప్రభుత్వం తీసుకువచ్చిన 'ద పంజాబ్ షెడ్యూల్డ్ క్యాస్ట్స్ అండ్ బ్యాక్‌వర్డ్ క్లాసెస్ (రిజర్వేషన్ ఇన్ సర్వీసెస్) యాక్ట్-2006'ను సవాలు చేస్తూ దాఖలైన 23 పిటిషన్లను(పంజాబ్ సర్కారు అప్పీల్‌తోపాటు) కలిపి ధర్మాసనం విచారిస్తోంది. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం ఎస్సీలకు 22.5% రిజర్వేషన్ కల్పిస్తుండగా.. పంజాబ్‌లో అది 25శాతంగా ఉంది. పంజాబ్ రిజర్వేషన్ల చట్టంలోని సెక్షన్ 4(5) ప్రకారం.. ఎస్సీ రిజర్వేషన్లలో వాల్మీకి, మజ్హబీ సిక్కులు పోటీలో ఉంటే.. వారికి ప్రాధాన్యతనిస్తూ 50% కోటాను కేటాయించాలి. ఈ చట్టం వల్ల ఎస్సీల్లోని ఇతర కులస్థులు ఉద్యోగావకాశాలను కోల్పోతున్నారని, ఇది రాజ్యాంగ విరుద్ధమంటూ పంజాబ్-హరియాణా హైకోర్టులో పిటిషన్లు దాఖలయ్యాయి. 2010లో పంజాబ్ సర్కారుకు వ్యతిరేకంగా హైకోర్టు తీర్పునిచ్చింది. 2011లో పంజాబ్ సర్కారు దీనిపై సుప్రీంకోర్టులో అప్పీల్‌కు వెళ్లగా.. ఇతర పిటిషనర్లు సైతం వ్యాజ్యాలను దాఖలు చేశారు. 2020 ఆగస్టు 27న జస్టిస్ అరుణ్ మిశ్రా(ప్రస్తుతం రిటైర్ అయ్యారు) నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం.. ఈ విషయాన్ని పరిశీలించేందుకు విస్తృత రాజ్యాంగ ధర్మాసనం అవసరమని స్పష్టం చేశారు. దాంతో ఏడుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం ఏర్పాటైంది. ఈ కేసులో పిటిషనర్లు 2004 నాటి 'ఈవీ చిన్నయ్య వర్సెస్ స్టేట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్' కేసులో సుప్రీంకోర్టు ఐదుగురు సభ్యుల ధర్మాసనం తీర్పును ఉటంకించారు. రాష్ట్ర ప్రభుత్వాలు ఎస్సీ, ఎస్టీల్లో వర్గీకరణ చేయడం రాజ్యాంగ విరుద్ధమని, అలాంటి నిర్ణయాలు భారత రాజ్యాంగంలోని 14వ అధికరణ(చట్టం ముందు అంతా సమానులే)ను ఉల్లంఘిస్తోందని 2004 నాటి తీర్పు స్పష్టం చేస్తోంది. దీనికి తోడు.. ఎస్సీ కులాల గుర్తింపు బాధ్యత పార్లమెంట్‌కు మాత్రమే ఉంటుందని, ఆయా కులాలను రాజ్యాంగంలోని ఆర్టికల్ 341 మేరకు రాష్ట్రపతి మాత్రమే నోటిఫై చేస్తారని పిటిషనర్లు తమ వ్యాజ్యాల్లో పేర్కొన్నారు.


ఉత్తరాఖండ్ అసెంబ్లీలో యూసీసీ బిల్లు

ప్రవేశ పెట్టిన రాష్ట్ర ప్రభుత్వం.. స్వతంత్ర భారతంలో తొలిసారి.. గిరిజనులకు మినహాయింపు



డెహ్రాడూన్, ఫిబ్రవరి 6 : ఉత్తరాఖండ్ రాష్ట్ర ప్రభుత్వం పౌరులందరికీ యూనిఫామ్ సివిల్ కోడ్(యూసీసీ) బిల్లును ఆ రాష్ట్ర అసెంబ్లీలో మంగళవారం ప్రవేశ పెట్టింది. స్వతంత్ర భారత దేశంలో తొలిసారిగా ఓ రాష్ట్ర ప్రభుత్వం యూసీసీని అమల్లోకి తేనుంది. రాష్ట్రంలోని గిరిజనులను ఈ బిల్లు నుంచి పూర్తిగా మినహాయించారు. అలాగే సహజీవనానికి గుర్తింపు ఇచ్చి నమోదు చేసేందుకు నిర్ణయించారు. వీరికి జన్మించిన పిల్లల్ని సక్రమ సంతానంగానే గుర్తిస్తారు. ఒకవేళ ఇద్దరూ విడిపోతే మహిళకు పురుషుడు మనోవర్తి చెల్లించాల్సి ఉంటుంది. మతంతో సంబంధం లేకుండా వివాహం, విడాకులు, భూమి, ఆస్తి, వారసత్వ హక్కులపై పౌరులందరికీ ఒకే చట్టం అని ఈ బిల్లు పేర్కొంటోంది. బహు భార్యత్వాన్ని ఈ ప్రతిపాదిత బిల్లు నిషేధిస్తుంది. ఉత్తరాఖండ్ అసెంబ్లీలో ఆ రాష్ట్ర సీఎం పుష్కర్‌సింగ్ ధామి స్వయంగా ఈ బిల్లును ప్రవేశపెట్టగా అధికార పక్ష సభ్యులు భారత్ మాతా కి జై అని నినదిస్తూ మద్దతు పలికారు. అయితే బిల్లును ఆమోదించకుండా ప్రతిపక్షాలు అడ్డుకున్నాయి. దాన్ని అధ్యయనం చేసేందుకు మరింత సమయం కావాలని కోరాయి. ఉత్తరాఖండ్ రాష్ట్రమంతటికీ... అలాగే ఆ రాష్ట్రం నుంచి వెళ్లినవారికీ ఈ బిల్లు వర్తిస్తుంది. సహజీవనం చేసేవారు 18 ఏళ్లలోపు వారై ఉండకూడదు. సహజీవనం చేస్తున్నవారు నెలలోగా ఆమేరకు రిజిస్ట్రార్‌కు స్టేట్‌మెంట్ సమర్పించకపోతే నెల రోజుల జైలుశిక్ష లేదా రూ.10వేల జరిమానా లేదా రెండూ విధించవచ్చు.

లోకం తీరు



ఎన్సీపీ అజిత్‌దే

(మొదటి పేజీ తరువాయి)

పరీక్ష, పార్టీ రాజ్యాంగం, నియమ నిబంధనల పరీక్ష, చట్టసభలు, పార్టీ సంస్థాగత వ్యవహారాల్లో ఆధిక్యత పరీక్ష నిర్వహించినట్టు పేర్కొంది. రెండు గ్రూపులు కూడా పార్టీ నియమ నిబంధనలకు అనుగుణంగా పనిచేయడం లేదని తెలిపింది. అందువల్ల చట్టసభల్లో ఆధిక్యత ప్రక్రియను ప్రామాణికంగా తీసుకున్నట్టు పేర్కొంది. చట్టసభల్లో అజిత్ వర్గానికే ఆధిక్యం ఉన్నందున దాన్నే అసలైన ఎన్సీపీగా గుర్తిస్తున్నట్టు వెల్లడించింది. 'వన్ టైం ఆప్షన్' కింద శరద్ పవార్ వర్గానికి ఎన్నికల కమిషన్ కాస్త వెసులుబాటు కల్పించింది. రాజ్యసభ ఎన్నిలను దృష్టిలో పెట్టుకొని బుధవారం మధ్యాహ్నంలోగానే పార్టీకి కొత్త పేరును ప్రతిపాదించాలని సూచించింది. మూడు పేర్లను ప్రతిపాదించవచ్చని తెలిపింది. ఎన్నికల సంఘం నిర్ణయాన్ని వినమ్రతతో స్వీకరిస్తున్నట్టు అజిత్ పవార్ వ్యాఖ్యానించారు. శరద్ పవార్ వర్గం మాత్రం ఇది దురదృష్టకర నిర్ణయమని అసంతృప్తి వ్యక్తం చేసింది. మాజీ మంత్రి అనిల్ దేశ్‌ముఖ్ మాట్లాడుతూ "ఎన్సీపీని శరద్ పవార్ స్థాపించారని అందరికీ తెలుసు. ప్రారంభం నుంచి ఆయనే జాతీయ అధ్యక్షునిగా ఉన్నారని కూడా తెలుసు. అయితే పై నుంచి వచ్చిన ఒత్తిడి మేరకు ఎన్నికల సంఘం ఈ నిర్ణయం తీసుకొంది" అన్నారు.

మధ్యప్రదేశ్ బాణసంచా ఫ్యాక్టరీలో పేలుడు

11 మంది మృతి.. 200 మందికి గాయాలు

భోపాల్, హర్దా, ఫిబ్రవరి 6: మధ్యప్రదేశ్‌లో ఘోర ప్రమాదం జరిగింది. ఓ బాణసంచా కర్మాగారంలో భారీ పేలుడు సంభవించడంతో మంటలు చెలరేగి పదకొండు మంది దుర్మరణం పాలయ్యారు. దాదాపు మరో 200 మంది గాయపడ్డారని అధికారులు తెలిపారు. ఈ ఘటన భోపాల్‌కు 150 కి.మీల దూరంలోని హర్దా పట్టణ శివార్లలో మంగళవారం జరిగింది. గాయపడిన వారిని ఆస్పత్రులకు తరలించారు. ప్రమాదంపై రాష్ట్ర సీఎం మోహన్ యాదవ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ప్రమాదానికి గల కారణాలు తెలియలేదు. ఘటనపై రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని మోదీ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రధాని మోదీ రూ.2 లక్షలు, సీఎం మోహన్ యాదవ్ రూ.4 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. గాయపడిన వారికి మోదీ రూ.50 వేల సాయం ప్రకటించారు.

పార్లమెంటు సమావేశాలు ఒక రోజు పొడిగింపు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 6: పార్లమెంటు సమావేశాలను ఒక రోజు పొడిగిస్తున్నట్టు ప్రభుత్వం ప్రకటించింది. ముందుగా నిర్ణయించిన ప్రకారం సమావేశాలు శుక్రవారమే ముగియాల్సి ఉంది. కానీ, ఈ నెల పదో తేదీ శనివారం వరకు జరుగుతాయని పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి మంగళవారం తెలిపారు. 2014కు ముందు.. ఆ తరువాత ఉన్న దేశ ఆర్థిక పరిస్థితిపై శ్వేత పత్రం విడుదల చేయాలని ప్రభుత్వం నిర్ణయించిన దృష్ట్యా ఈ పొడిగింపు ప్రాధాన్యం సంతరించుకొంది.

'లక్క ఇల్లు'గా చెబుతున్న స్థలం హిందువులదే

బాగ్‌పత్, ఫిబ్రవరి 6: ఉత్తరప్రదేశ్‌లో అర్థశతాబ్దానికిపైగా సాగిన 'లక్క ఇల్లు'- దర్గా స్థల వివాదంపై న్యాయస్థానం నిర్ణయాన్ని వెల్లడించింది. ఆ స్థలం హిందూ పక్షానికి చెందుతుందంటూ సోమవారం భాగపట్‌లోని జూనియర్ డివిజన్ సివిల్ జడ్జి శివం ద్వివేది తీర్పు చెప్పారు. బ్రిటిష్ కాలం నాటి గెజిట్‌ను ఆధారం చేసుకొని 53 ఏళ్లనాటి ఈ కేసుపై నిర్ణయాన్ని వెలువరించారు. ప్రస్తుతం ఈ స్థలం ఏఎస్ఐ సంరక్షణలో ఉండడం గమనార్హం. బాగ్‌పత్ జిల్లా బర్నావా గ్రామంలోని హిండన్-కృష్ణి నదుల సంగమ ప్రాంతం వద్ద ఉన్న 62 ఎకరాల మట్టి దిబ్బ మహాభారతంలో పేర్కొన్న 'లక్క ఇల్లు' అన్నది స్థానికుల విశ్వాసం. అయితే ఇక్కడ సూఫీ మతగురువు బద్రుద్దీన్ షా దర్గా (మజార్)తో పాటు, శ్మశానం కూడా ఉందన్నది ముస్లిం పక్షం వాదన. తమ స్థలాన్ని హిందువులు ఆక్రమించుకొని సమాధులు తొలగిస్తున్నారని, హోమాలు చేస్తున్నారని 1970లో ఆ శ్మశానం ముతావల్లి ముకీం ఖాన్ వక్ఫ్ బోర్డు కార్యవర్గ సభ్యుని హోదాలో 1970లో మీరట్ కోర్టులో దావా వేశారు. తర్వాత అది బాగ్‌పత్ జిల్లాకు బదిలీ అయింది.

జ్ఞానవాపీ అన్ని సెల్లార్లలో సర్వేపై 15న విచారణ

లఖ్‌నవూ, ఫిబ్రవరి 6: జ్ఞానవాపీ మసీదులో మూసి ఉంచిన అన్ని సెల్లార్లలో కూడా ఏఎస్ఐ ద్వారా సర్వే చేయించాలని కోరుతూ దాఖలైన వ్యాజ్యంపై ఈ నెల 15న విచారణ జరపనున్నట్టు మంగళవారం వారాణసీ జిల్లా కోర్టు తెలిపింది. బేస్‌మెంట్‌లో ఎనిమిది రహస్య గదులు ఉన్నాయని వాటన్నింటినీ తెరిపించి సర్వే జరపాలని పిటిషనర్ కోరారు. మందిరాన్ని కూలగొట్టి మసీదును నిర్మించారని నిరూపించడానికి ఈ సర్వే అవసరమని విన్నవించారు. మసీదుగోడపై ఉన్న హిందూ దేవతలను పూజించడానికి అనుమతించాలంటూ తొలుత దావా వేసిన విశ్వహిందూ సనాతన్ సంఘ్ వ్యవస్థాపక సభ్యురాలు రాఖీ సింగే ఈ పిటిషన్ కూడా వేశారు. ప్రస్తుతం దక్షిణ సెల్లార్‌లో సర్వే జరిపించిన కోర్టు అక్కడి విగ్రహాలకు పూజలు చేసుకోవడానికి అనుమతి ఇచ్చింది.

రాళ్లన్నీ విగ్రహాలు కావు: మద్రాసు హైకోర్టు

చెన్నై, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): రాళ్లన్నీ విగ్రహాలు కావని మద్రాసు హైకోర్టు వ్యాఖ్యానించింది. రోడ్డు పక్కన ఉండే రాళ్లకు వస్త్రాలు చుట్టి, పసుపు-కుంకుమ రాసి, విగ్రహాలు అని చెప్పుకొనే స్థాయికి దేశంలో మూఢ నమ్మకాలు పెరగడం దురదృష్టకరమని పేర్కొంది. తన స్థలం ముందు గుర్తు తెలియని వ్యక్తులు పెట్టిన రాయిని తొలగించాలని, తనకు తగిన భద్రత కల్పించేలా ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ తమిళనాడులోని చెంగల్పట్టు జిల్లా పల్లావరానికి చెందిన శక్తిమురుగన్ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ సందర్భంగా హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్.ఆనంద్ వెంకటేష్ మంగళవారం ఈ వ్యాఖ్యలు చేశారు. రాయిని వారం రోజుల్లోగా తొలగించాలని పల్లావరం పోలీసులను ఆదేశించారు.

బ్రిటన్ వీసా చార్జీల మోత

ఇంగ్లాండ్, ఫిబ్రవరి 6: బ్రిటన్‌లోని రుషి సునాక్ ప్రభుత్వం వీసా చార్జీలను భారీగా పెంచింది. అన్ని రకాల వీసాలపైనా ఇమ్మిగ్రేషన్ హెల్త్ సర్‌చార్జీ(ఐహెచ్ఎస్)ని 66% విధిస్తున్నట్టు తెలిపింది. దీంతో వీసా చార్జీలు భారీగా పెరగనున్నాయి. ఈ పెంపు మంగళవారం(నిన్న) నుంచే అమల్లోకి వచ్చేసింది. అయితే, జనవరి 6వ తేదీలోపు వీసాల కోసం దరఖాస్తు చేసుకున్నవారిని ఈ పెంపు నుంచి మినహాయించినట్టు సునాక్ ప్రభుత్వం పేర్కొంది. బ్రిటన్‌లో నివాసం ఉండాలన్నా, ఆ దేశంలోకి ప్రవేశించాలన్నా ఐహెచ్ఎస్ తప్పనిసరి. ఈ ఫీజును దరఖాస్తు సమర్పించే సమయంలోనే ముందస్తుగా చెల్లించాల్సి ఉంటుంది. కాగా, ఐహెచ్ఎస్ పెంపుతో ఒక్కొక్క వీసాపై రూ.65 వేలకు పైగా భారం పడనుంది.

వీసా లేకుండానే ఇండియన్లకు ఇరాన్ స్వాగతం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 6: వీసా లేకుండానే భారతీయులు తమ దేశంలో పర్యటించవచ్చని ఇరాన్ ప్రకటించింది. కానీ ఇందుకు ఇరాన్ అధికారులు కొన్ని షరతులు పెట్టారు. కేవలం పర్యాటకులకే 15 రోజుల తాత్కాలిక వ్యవధితో ఇరాన్ ప్రభుత్వం ఈ వెసులుబాటును కల్పిస్తోంది. పర్యాటక రంగాన్ని పటిష్ఠం చేసుకునేందుకు, భారత్‌తో సత్సంబంధాలను మరింతగా పెంపొందించుకునేందుకు ఇరాన్ ఈ కీలక నిర్ణయం తీసుకుంది.

ఈడీ దర్యాప్తే అసలు స్కాం!

ఢిల్లీ లిక్కర్ స్కాంలో విచారణల తాలూకు ఆడియో రికార్డులను ఈడీ తొలగించింది

» ఆప్ మంత్రి ఆతిషి సంచలన ఆరోపణ



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 6: ఢిల్లీ మద్యం పాలసీకి సంబంధించిన కేసులో ఏడాదిన్నరగా వివిధ వ్యక్తుల విచారణ సందర్భంగా రికార్డు చేసిన ఆడియో ఫైళ్లను ఈడీ తొలగించిందని ఢిల్లీ మంత్రి, ఆప్ సీనియర్ నాయకురాలు ఆతిషి సంచలన ఆరోపణలు చేశారు. విశ్వసనీయ వర్గాల ద్వారా ఈ సమాచారం తమకు అందిందని ఆమె తెలిపారు. మద్యం పాలసీలో కుంభకోణం చోటుచేసుకోలేదని, ఈడీ దర్యాప్తే పెద్ద కుంభకోణమని చెప్పారు. ఈడీకి సంబంధించి కొన్ని సంచలన విషయాలు మంగళవారం వెల్లడిస్తానని సోమవారం ట్విటర్‌లో ఆతిషి తెలిపారు. ఈ నేపథ్యంలో, మంగళవారం ఉదయం నుంచే ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ వ్యక్తిగత సహాయకుడు వైభవ్ కుమార్, ఆప్ కోశాధికారి, ఎంపీ ఎన్‌డీ గుప్తా, ఆప్ ఇతర నేతల ఇళ్లు, కార్యాలయాలపై ఈడీ సోదాలకు దిగింది. ఢిల్లీ జలమండలి టెండర్లలో అవినీతికి పాల్పడి, ఆ సొమ్మును ఆప్‌నకు ఎన్నికల నిధిగా అందించారన్న ఆరోపణల మీద ఈ సోదాలు జరిపినట్లు ఈడీ వర్గాలు తెలిపాయి. ఈ నేపథ్యంలో, మంత్రి ఆతిషి విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. లిక్కర్ స్కాం పేరిట గత రెండేళ్లుగా ఈడీ జరుపుతున్న దర్యాప్తులో ఒక్క రూపాయిగానీ, ఒక్క సాక్ష్యాధారంగానీ ఆ సంస్థ సేకరించలేకపోయిందని గుర్తు చేశారు. ఈ కేసులో విచారణ సందర్భంగా తాము చెప్పిన వివరాలను రికార్డు చేయాలని ఎంతోమంది నిందితులు, సాక్షులు, ప్రభుత్వ సాక్షులు ఈడీని కోరారని తెలిపారు. 2020లో సుప్రీంకోర్టు కూడా అన్ని దర్యాప్తు సంస్థలు నిందితుల విచారణను రికార్డు చేసి భద్రపరచాలని తీర్పు చెప్పిందని, కానీ, ఈడీ దీనిని పట్టించుకోలేదని విమర్శించారు.

ఏడాదిన్నరగా జరుగుతోంది

మద్యం పాలసీ కేసులో ఈడీ తనను ప్రశ్నించిన సందర్భంగా రికార్డు చేసిన వీడియో ఫుటేజీని తనకు అందజేయాలంటూ ఓ నిందితుడు కోర్టులో పిటిషన్ వేశారని ఆతిషి తెలిపారు. విచారణ సందర్భంగా తాను ఈడీకి చెప్పిన అంశాలకు, కోర్టులో ఈడీ సమర్పించిన వివరాలకు పోలికే లేదని సదరు నిందితుడు పేర్కొన్నారని చెప్పారు. విచిత్రమేమిటంటే, అతడి విచారణ సమయంలో గదిలో ఓ సీసీ టీవీ కెమెరా ఉందని, ఈ మేరకు కోర్టుకు ఈడీ సీసీటీవీ ఫుటేజీని సమర్పించిందని, అయితే, దాంట్లో వీడియో తప్ప ఆడియో లేదని తెలిపారు. అంటే, ఆడియో రికార్డును (మాటలను) ఈడీ తొలగించిందని, తద్వారా, సాక్ష్యాధారాలను మార్చిందన్నారు. ఇది ఈ ఒక్క నిందితుడికి సంబంధించినదే కాదని, గత ఏడాదిన్నరగా ఈడీ ఈ కేసులో జరిపిన విచారణలన్నింటిలోనూ ఇలాగే వ్యవహరించిందన్నారు. ఈడీ ఒక కుంభకోణంపై దర్యాప్తు జరపటం లేదని, ఈడీ దర్యాప్తే ఓ పెద్ద కుంభకోణమని ఆతిషి ఆరోపించారు.

ఈడీ ఎవరిని రక్షిస్తోంది

'ఈ ఆడియో ఫైళ్లను తొలగించటం ద్వారా ఈడీ ఎవరిని రక్షించటానికి ప్రయత్నిస్తోంది? దేన్ని దాచాలని చూస్తోంది? ఈడీ తన వద్ద ఉన్న ఆడియో ఫైళ్లను వెల్లడించగలదా? అలా చేయలేకపోతే, ఈ విచారణ తతంగం అంతా ఓ పెద్ద అవినీతి వ్యవహారమేనని తేలిపోతుంది కదా!' అని ఆతిషి పేర్కొన్నారు. మద్యం కేసులో ఈడీ జరిపిన విచారణల తాలూకు ఆడియో, వీడియో రికార్డులను తమకు అందించాలంటూ ఈడీ, సీబీఐ ప్రత్యేక కోర్టులలో తాము పార్టీ తరఫున పిటిషన్లు వేశామని వెల్లడించారు.

కోర్టు ధిక్కరణ చర్యలు తీసుకోవాలి

ఢిల్లీ మరో మంత్రి సౌరభ్ భరద్వాజ్ కూడా ఈ అంశంపై స్పందిస్తూ.. ఆడియో ఫైళ్ల తొలగింపునకు బాధ్యులైన అధికారుల పేర్లను వెల్లడించాలని డిమాండ్ చేశారు. ఆ అధికారులపై కోర్టు ధిక్కరణ చర్యలు తీసుకోవాలన్నారు. కాగా, ఆప్ మంత్రుల ఆరోపణలపై ఈడీ వర్గాలు స్పందిస్తూ.. విచారణను రికార్డు చేయటానికి ఉపయోగించే సీసీటీవీ వ్యవస్థల్లో గతంలో ఆడియో రికార్డింగ్ సదుపాయం లేదని, గత ఏడాది అక్టోబరు నుంచే వీడియో ఫుటేజీకి ఆడియో రికార్డును కూడా కలిపే సౌకర్యం అందుబాటులోకి వచ్చిందని పేర్కొన్నాయి. తాము ఎటువంటి ఆడియో రికార్డులను తొలగించలేదని, ఆతిషి ఆరోపణలపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఈడీ వర్గాలు వెల్లడించాయి. ఢిల్లీ జలమండలి కేసులో రూ.21 కోట్ల మేర చేతులు మారాయని, దీనిపై దర్యాప్తులో భాగంగానే మంగళవారం పలువురు ఆప్ నేతల ఇళ్లు, ఆఫీసులపై దాడులు జరిపామని తెలిపాయి.

మార్కెట్‌లోకి 'భారత్' బియ్యం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 6: కేంద్ర ప్రభుత్వం మంగళవారం 'భారత్ రైస్'ను మార్కెట్‌లోకి విడుదల చేసింది. గత ఏడాది కాలంలో బియ్యం ధరలు 15 శాతం పెరిగిన నేపథ్యంలో కిలో 29 రూపాయలకు భారత్ బ్రాండ్ బియ్యాన్ని అందుబాటులోకి తెస్తామని కేంద్రం ప్రకటించిన సంగతి తెలిసిందే. ఇవి 5 కిలోలు, 10 కిలోల ప్యాకెట్లలో లభిస్తాయి. కేంద్ర ఆహార, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి పీయూష్ గోయల్ ఢిల్లీలోని కర్తవ్య పథ్‌లో 'భారత్ రైస్'ను ప్రారంభించారు. నిత్యావసరాల ధరలు సామాన్యులకు అందుబాటులో ఉంచేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. ఇందులో భాగంగా ప్రారంభించిన కిలో రూ.29కే భారత్ రైస్‌తో పేద, మధ్యతరగతి ప్రజలకు ఉపశమనం లభిస్తుందన్నారు. ఈ బియ్యం విక్రయించే 100 మొబైల్ వ్యాన్లను కూడా మంత్రి ప్రారంభించారు. త్వరలో ఈ-కామర్స్ ప్లాట్‌ఫాంలలో కూడా లభ్యమవుతాయి.

మయన్మార్ సరిహద్దుల్లో కంచె

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 6: భారత్- మయన్మార్ సరిహద్దుల్లో కంచె నిర్మించేందుకు కేంద్రం నిర్ణయం తీసుకుంది. ఆ దేశం నుంచి భారత్‌కు అక్రమ వలసదారుల పోటు ఎక్కువ కావడంతో మొత్తం 1,643 కిమీ మేర కంచె వేసేందుకు సిద్ధమైంది. భారత్‌లోని మొత్తం నాలుగు రాష్ట్రాలతో మయన్మార్ సరిహద్దులు పంచుకుంటోంది. యాక్ట్ ఈస్ట్ పాలసీలో భాగంగా 2018లో కేంద్రం ఇరు దేశాల మధ్య స్వేచ్ఛా కదలికల విధానాన్ని ప్రవేశపెట్టింది. అయితే కొంతకాలంగా మయన్మార్‌లో సంక్షోభ పరిస్థితులు ఏర్పడడంతో ఆ దేశం నుంచి భారత్‌కు భారీ సంఖ్యలో వలసదారులు వస్తున్నారు. ఇదే అదునుగా తీవ్రవాదులు ఆయుధాలను, మాదకద్రవ్యాలను భారత్‌లోకి అక్రమంగా చేరవేస్తున్నారు. ఈ నేపథ్యంలో సరిహద్దులను మరింత కట్టుదిట్టం చేసి దేశంలో శాంతి భద్రతలను పెంపొందించేందుకు భారత్-మయన్మార్ సరిహద్దుల వెంబడి కంచె వేసేందుకు ప్రభుత్వం నిర్ణయించింది.

మోదీ సర్కారుపై 'దక్షిణ' పోరు!

నేడు ఢిల్లీలో కర్ణాటక ప్రభుత్వ ధర్నా

» రేపు కేరళ సర్కారు వంతు
» తమిళనాడు సీఎం స్టాలిన్ మద్దతు
» నిధులపై కేంద్రం వివక్ష చూపుతోందనే



బెంగళూరు, ఫిబ్రవరి 6: దక్షిణ భారత రాష్ట్రాలపై మోదీ సర్కారు వివక్ష చూపుతోందని.. నిధులివ్వకుండా సతాయిస్తోందని దక్షిణాదిన కర్ణాటక, కేరళ, తమిళనాడులోని బీజేపీయేతర ప్రభుత్వాలు మండిపడుతున్నాయి. లోక్‌సభ ఎన్నికల ముంగిట తమ పోరాటాన్ని ఢిల్లీ దాకా తీసుకెళ్తున్నాయి. కర్ణాటకలోని కాంగ్రెస్ ప్రభుత్వం బుధవారం ఉదయం హస్తినలోని జంతర్‌మంతర్ వద్ద రాష్ట్ర మంత్రులు, పార్టీ ఎమ్మెల్యేలు, ఎంపీలతో ధర్నా నిర్వహించనుంది. పన్నుల ఆదాయం పంపిణీ, గ్రాంట్లలో గత కొన్నేళ్లుగా కర్ణాటకపై వివక్ష చూపుతోందని సీఎం సిద్దరామయ్య ఆరోపిస్తున్నారు. కరువు సాయం అందించకుండా దాటవేస్తోందని విమర్శిస్తున్నారు. 15వ ఆర్థిక సంఘం సిఫారసుల కారణంగా గత ఐదేళ్లలో రూ.1.87 లక్షల కోట్లు నష్టపోయామని.. వాటిని చెల్లించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రానికి చెందిన బీజేపీ ఎంపీలు, కేంద్ర మంత్రులు కూడా ధర్నాలో పాల్గొనాలని సిద్దూ లేఖ రాశారు. నిధుల వ్యవహారంపైనే గురువారం కేరళలోని లెఫ్ట్ ఫ్రంట్ ప్రభుత్వం ఢిల్లీలో ధర్నా చేపట్టనుంది. తమ రాష్ట్రంపై కేంద్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని, అప్పులు తెచ్చుకోకుండా ఆంక్షలు పెడుతోందని, సమాఖ్య తత్వాన్ని దెబ్బతీస్తోందని సీఎం విజయన్ ఆరోపిస్తున్నారు. కేరళ ధర్నాకు తమిళనాడు సీఎం స్టాలిన్ సంఘీభావం ప్రకటించారు. మరోవైపు.. తమకు ఉపాధి హామీ పథకం బకాయిలు ఇవ్వడం లేదంటూ టీఎంసీ అధ్యక్షురాలు, బెంగాల్ సీఎం మమతా బెనర్జీ శుక్రవారం కోల్‌కతాలో నిరసన ప్రదర్శనకు పిలుపిచ్చారుజ కాగా, సిద్దరామయ్య సర్కారు ఢిల్లీలో ధర్నాకు పిలుపివ్వడాన్ని బీజేపీ ఖండించింది. అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చలేక.. లోక్‌సభ ఎన్నికల్లో ఓడిపోతామన్న భయంతో రాజకీయ స్టంట్ చేస్తోందని మాజీ సీఎం బొమ్మై ఎద్దేవాచేశారు.

వివక్ష లేదు: కేంద్రం

ఉమ్మడి మార్గదర్శకాలకు అనుగుణంగానే రాష్ట్రాలకు కేంద్రం ఆర్థిక కేటాయింపులు చేస్తుందని కేంద్ర ఆర్థిక శాఖ కార్యదర్శి టీవీ సోమనాథన్ స్పష్టం చేశారు. పన్నుల ఆదాయం పంపిణీ, సంక్షేమ కార్యక్రమాల నిధుల్లో వివక్షకు తావుండదని చెప్పారు. కర్ణాటక, కేరళ, బెంగాల్ రాష్ట్రాల ఆందోళనల నేపథ్యంలో ఆయన మంగళవారం ఓ ఆంగ్ల చానల్‌తో మాట్లాడారు. రాష్ట్రాలకు నిధులపై ఆర్థిక సంఘం రూపొందించిన ఫార్ములానే ఆర్థిక శాఖ పాటిస్తుందని.. ఏ రాష్ట్రానికీ ప్రతికూలంగా గానీ, అనుకూలంగా గానీ వ్యవహరించడం జరుగదని తేల్చిచెప్పారు. సోమవారం లోక్‌సభలో కాంగ్రెస్ పక్ష నేత అధీర్ రంజన్, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల మధ్య జరిగిన వాగ్వాదాన్ని ప్రస్తావించగా.. రాజకీయ కోణంలోకి తాను వెళ్లనన్నారు. పన్నుల ఆదాయం, జీఎస్టీ పంపిణీ గత కొన్నేళ్లుగా కేంద్ర రాష్ట్రాల మధ్య వివాదాస్పద అంశంగా ఉందన్నారు.

నెహ్రూ మాటల వక్రీకరణ సిగ్గుచేటు: ప్రియాంక

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 6: జవహర్‌లాల్ నెహ్రూ ప్రసంగాన్ని ఉటంకిస్తూ ప్రధాని మోదీ లోక్‌సభలో సోమవారం చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ పార్టీ భగ్గుమంది. నెహ్రూ ప్రసంగంలోని మాటలను మోదీ వక్రీకరించడం సిగ్గుచేటని ప్రియాంక గాంధీ వాద్రా ఆగ్రహం వ్యక్తం చేశారు. స్వాతంత్ర్య పోరాటం, దేశ పునర్నిర్మాణం వంటి అంశాలపై బీజేపీ, ఆర్ఎస్ఎస్‌కి ఉన్న విద్వేషం ప్రధాని మోదీ ప్రసంగంలో బయటపడిందని అన్నారు. రాష్ట్రపతి ప్రసంగంపై ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై లోక్‌సభలో సోమవారం జరిగిన చర్చలో మోదీ మాట్లాడుతూ.. 'భారతీయులు సోమరులు, తెలివి తక్కువ వారని దేశ తొలి ప్రధాని నెహ్రూ స్వాతంత్ర్య దినోత్సవం రోజున ఎర్రకోట మీది నుంచే చెప్పారని, ఇందిరాగాంధీ కూడా ఆయన కంటే భిన్నమైన నేత ఏమీ కారని అన్నారు. దీనిపై స్పందించిన ప్రియాంక.. నెహ్రూ ప్రసంగానికి సంబంధించిన ఆడియో క్లిప్‌ను ఎక్స్(ట్విటర్)లో పోస్ట్ చేశారు. ప్రధాని మంత్రి స్థానాన్ని, స్థాయిని దిగజార్చేలా మోదీ నడుచుకుంటున్నారని విమర్శించారు. తన కంటే తెలివైనవాడు లేడనుకునే మోదీ ప్రధాని స్థాయిని కించపరిచేలా ప్రవర్తిస్తున్నారని జైరాం అన్నారు.

కేంద్ర మంత్రిపై డీఎంకే ఎంపీల దుర్భాషలు!

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 6: డీఎంకే ఎంపీ టీఆర్ బాలు లోక్‌సభలో స్వరాష్ట్రానికే చెందిన ఓ కేంద్రమంత్రిని దుర్భాషలాడడం కలకలం రేపింది. దళిత మంత్రిని అవమానించారంటూ బీజేపీ విరుచుకుపడింది. వరదలతో అతలాకుతలమైన తమిళనాడు పునర్నిర్మాణానికి కేంద్రం ఏం చర్యలు తీసుకుందని మంగళవారం సభలో డీఎంకే ఎంపీలు రాజా, గణేశమూర్తి నిలదీశారు. తర్వాత టీఆర్ బాలు మాట్లాడుతుండగా.. తమిళనాడుకే చెందిన కేంద్ర సహాయమంత్రి మురుగన్ జోక్యం చేసుకుని.. డీఎంకే సభ్యులు సంబంధం లేని ప్రశ్నలు అడుగుతున్నారని ఆక్షేపించారు. దీనిపై బాలు మండిపడ్డారు. 'క్రమశిక్షణ నేర్చుకో.. నీకు పార్లమెంటు సభ్యుడిగా ఉండే అర్హత లేదు. కేంద్ర మంత్రిగా ఉండే యోగ్యతా లేదు. మమ్మల్ని ఎదుర్కొనే ధైర్యం నీకు లేదు. నీకు గుణపాఠం నేర్పుతాం' అన్నారు.

సిద్దరామయ్యకు 10 వేలు ఫైన్

» 2022 నాటి కేసులో విధించిన కోర్టు

బెంగళూరు, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): కర్ణాటక ముఖ్యమంత్రి సిద్దరామయ్య, జలవనరులశాఖ మంత్రి ఎంబీ పాటిల్, రవాణాశాఖ మంత్రి ఆర్.రామలింగారెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జ్ రణదీప్‌సింగ్ సుర్జేవాలాకు హైకోర్టు రూ.10వేల చొప్పున జరిమానా విధించింది. మార్చి 6న ప్రజాప్రతినిధుల న్యాయస్థానానికి స్వయంగా హాజరు కావాలని ఆదేశించింది. కాంట్రాక్టర్ సంతోష్‌పాటిల్ ఆత్మహత్య కేసులో అప్పటి బీజేపీ ప్రభుత్వంలో పంచాయతీరాజ్ మంత్రిగా ఉన్న కేఎస్ ఈశ్వరప్పను అరెస్టు చేయాలన్న డిమాండ్‌తో 2022లో బెంగళూరులోని రద్దీ ప్రదేశంలో అనుమతి తీసుకోకుండా వీరు ధర్నా చేశారు. తద్వారా ప్రజలకు ఇబ్బంది కలిగించారని దాఖలైన పిటిషన్‌పై హైకోర్టు మంగళవారం తీర్పునిచ్చింది. పిటిషన్‌ను రద్దు చేయాలని సిద్దరామయ్య తరఫు న్యాయవాదులు చేసిన విజ్ఞప్తిని హైకోర్టు తోసిపుచ్చింది. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఇలాంటి పోరాటాలు సహజమేనన్న న్యాయవాదుల వాదనతో ధర్మాసనం ఏకీభవించలేదు. ప్రజలకు ఇబ్బంది కలిగించేవి ప్రజా పోరాటాలు ఎలా అవుతాయని ప్రశ్నించింది. కాగా, కర్ణాటక ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్‌పై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని బెంగళూరు 42వ ఏసీఎంఎం కోర్టు నగర హైగ్రౌండ్ పోలీసులను ఆదేశించింది. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బీవై విజయేంద్రను అవహేళన చేస్తూ డీకే శివకుమార్ సోషల్ మీడియాలో పోస్టులు పెట్టారని బీజేపీ ఐటీ విభాగం దాఖలు చేసిన పిటీషన్‌పై విచారణ జరిపిన సెషన్స్ కోర్టు, ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది.

ఎన్‌డీఏలోకి ఆర్ఎల్‌డీ?

లఖ్‌నవూ,ఫిబ్రవరి 6: ఇండియా కూటమిలో మరో భారీ కుదుపు తప్పదనిపిస్తోంది. యూపీలో చెప్పుకోదగ్గ స్థాయిలో బలం,బలగం ఉన్న రాష్ట్రీయ లోక్‌దళ్(ఆర్ఎల్‌డీ), విపక్ష శిబిరానికి షాక్ ఇచ్చి బీజేపీ సారథ్యంలోని ఎన్‌డీఏతో జట్టు కట్టే సూచనలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. యూపీలో 4 లోక్‌సభ సీట్లు ఆర్ఎల్‌డీకి ఇచ్చేందుకు బీజేపీ అంగీకరించినట్లు సమాచారం. దీంతో కమలదళంలో చేరేందుకు ఆర్ఎల్‌డీ చీఫ్ జయంత్ చౌదరి సిద్ధపడుతున్నట్లు అభిజ్ఞవర్గాలు తెలిపాయి. యూపీలో సమాజ్‌వాదీ పార్టీ సారథ్యంలోని మహాకూటమిలో ఆర్ఎల్‌డీ భాగస్వామిగా ఉంది. ఆ పార్టీ 7 లోక్‌సభ సీట్లు కోరుతుండగా, రెండు సీట్లకు మించి ఇచ్చేందుకు సమాజ్‌వాదీ సుముఖంగా లేదు. దాంతో రెండు పార్టీల మధ్య ఇప్పటికే చిచ్చు రేగింది. బీజేపీ తాజాగా కైరానా, బాగ్‌పత్, మథుర, అమ్రోహా లోక్‌సభ సీట్లు ఇచ్చేందుకు ముందుకు రావడంతో, అటు వైపు ఫిరాయించేందుకు ఆర్ఎల్‌డీ సంసిద్ధమైనట్లు తెలుస్తోంది.

బీజేపీకి కుక్కలు ఏం హాని చేశాయి?

» ఆ పార్టీ నాయకుల విమర్శలపై రాహుల్ ప్రశ్న

న్యూఢిల్లీ/గుమ్లా(ఝార్ఖండ్), ఫిబ్రవరి 6: కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ భారత్ జోడో న్యాయ యాత్రలో ఒక కుక్కపిల్లకు బిస్కట్ పెట్టిన వీడియో వైరల్ అవుతోంది. బీజేపీ నాయకులు ఈ వీడియోను 'ఎక్స్'లో పోస్టు చేస్తూ రాహుల్, కాంగ్రెస్‌పై వ్యంగ్యాస్త్రాలు సంధించగా... ఆయన స్పందిస్తూ 'బీజేపీకి కుక్కలు ఏమి హాని చేశాయ'ని చురకంటించారు. ఈ వీడియో ఆదివారం ఝార్ఖండ్‌లోని ధన్‌బాద్ జిల్లాలో రాహుల్ యాత్ర జరుగుతున్నప్పటిది. ఓ వ్యక్తి తీసుకొచ్చిన కుక్కపిల్లకు రాహుల్ బిస్కట్ పెట్టారు. అది తినకపోవడంతో ఆ బిస్కట్‌ను ఆ వ్యక్తికి ఇచ్చారు. బీజేపీ నేత అమిత్ మాలవీయ ఈ వీడియోను పోస్టు చేస్తూ నాయకుడు కార్యకర్తలను కుక్కల్లా చూసే పార్టీ అంతరించిపోవడం సహజమని వ్యాఖ్యానించారు. మరో బీజేపీ నేత పల్లవి సీటీ కొన్నేళ్ల కిందటి ఘటనను ప్రస్తావించారు. 'అప్పట్లో కాంగ్రెస్‌లో ఉన్న అసోం ముఖ్యమంత్రి హిమంత్ బిశ్వశర్మ రాష్ట్ర సమస్యలపై మాట్లాడేందుకు రాహుల్ గాంధీ ఇంటికెళ్లారు. అక్కడ ప్లేట్‌లో పెట్టిన బిస్కట్లను రాహుల్ పెంపుడు కుక్క వచ్చి ముట్టుకుంది. కానీ ఆ ప్లేట్‌ను మార్చలేదు. అందులో బిస్కట్లనే రాహుల్ హిమంత్‌కు ఆఫర్ చేశార'ని పల్లవి పేర్కొన్నారు. ఇటీవల ఖర్గే కాంగ్రెస్ కార్యకర్తలను కుక్కలతో పోల్చారని, రాహుల్ ఇప్పుడు కుక్క తినని బిస్కట్‌ను కార్యకర్తకు ఇచ్చారని విమర్శించారు. బీజేపీ నేతల విమర్శలు ఇలా సాగుతుండడంతో రాహుల్ ఘాటుగా స్పందించారు. తాను బిస్కట్ పెట్టినప్పుడు కుక్కపిల్ల భయంతో తినలేదని, దాని యజమాని పెడితే తింటుందని ఆయనకు ఇచ్చానని చెప్పారు. ఆయన పెట్టగానే కుక్కపిల్ల తిన్నదని, ఇందులో సమస్య ఏముందన్నారు. కుక్కపిల్లని తీసుకుని రమ్మని దాని యజమానిని పిలిచానని తెలిపారు. 'బీజేపీ వాళ్లకి కుక్కపిల్లలతో సమస్యేంటి. అవి వాళ్లకు ఏమి హాని చేశాయ'ని ప్రశ్నించారు.



వయనాడ్ నుంచి రాహుల్ అవుట్?

రాహుల్ గాంధీ ప్రాతినిధ్యం వహిస్తున్న కేరళలోని వయనాడ్ లోక్‌సభ స్థానానికి పోటీ చేయాలని సీపీఐ భావిస్తోంది. సీట్ల పంపకాల్లో భాగంగా అధికార ఎల్‌డీఎఫ్ కూటమిలో భాగస్వామ్య పక్షం సీపీఐకి వయనాడ్ సహా నాలుగు స్థానాలు కేటాయించారు. అయితే వయనాడ్ స్థానాన్ని ఖాళీ చేయాలని కాంగ్రెస్‌ను కోరడంపై ఎలాంటి చర్చ జరగలేదని, సమీప భవిష్యత్తులో ఆ అవకాశాలను తోసిపుచ్చలేమని సీపీఐ ప్రధాన కార్యదర్శి డి. రాజా తెలిపారు. రాహుల్ మరో నియోజకవర్గం నుంచి పోటీ చేస్తే వయనాడ్ స్థానానికి సీపీఐ జాతీయ మహిళా సమాఖ్య ప్రధాన కార్యదర్శి, డి. రాజా సతీమణి అనీ రాజాను పార్టీ అభ్యర్థిగా ప్రకటించే అవకాశాలున్నాయి. సీట్ల పంపకాలపై చర్చలు జరిపేందుకు డి. రాజా, కె. నారాయణ, రామకృష్ణ పండాతో కూడిన త్రిసభ్య కమిటీ ఏర్పాటైంది. ఈ కమిటీ తొలుత కాంగ్రెస్ రాష్ట్ర శాఖతో చర్చలు జరపనుంది.

11 నుంచి యాదాద్రి కొండపైకి ఆటోలు

» రోజూ 2షిఫ్టుల్లో 100ఆటోలకు అనుమతి

» సమీక్షలో ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య వెల్లడి

యాదగిరిగుట్ట, ఫిబ్రవరి 6: ఆటో డ్రైవర్లకు ఇచ్చిన హామీ మేరకు ఈ నెల 11 నుంచి యాదగిరిగుట్ట కొండపైకి మొదటి ఘాట్ రోడ్ మీదుగా ఆటోలను అనుమతించాలని నిర్ణయించినట్లు ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య తెలిపారు. మంగళవారం యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట కొండపైన దేవస్థాన పాత ప్రధాన కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. రోజుకు 100 ఆటోలు షిఫ్టుల వారీగా కొండపైకి నడుస్తాయన్నారు. మొదటి షిఫ్టు ఉదయం 3 గంటల నుంచి ఒంటి గంట వరకు, రెండో షిఫ్టు మధ్యాహ్నం ఒంటిగంట నుంచి రాత్రి 11 గంటల వరకు ఉంటుందన్నారు. ప్రతీ షిఫ్టులో 50 ఆటోలు నడుస్తాయని, 25 కొండపైన, 25 కొండ కింద ఉంటాయన్నారు. ప్రతీ ఆటోలో డ్రైవర్‌తో పాటు ముగ్గురు ప్రయాణికులు మాత్రమే ఉండాలన్నారు. ఆటో డ్రైవర్లకు అన్ని రకాల ధ్రువపత్రాలు ఉండాలని, వారిపై నిరంతర నిఘా ఉంటుందన్నారు. ఆటో చార్జీలను డ్రైవర్లతో చర్చించి నిర్ణయిస్తామన్నారు. ఆర్టీసీ బస్సులు యథావిధిగా భక్తులను కొండపైకి చేరవేస్తాయన్నారు. యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి పుణ్యక్షేత్రంలో పురాతన సంప్రదాయాలను పునరుద్ధరించనున్నట్లు తెలిపారు. గతంలో వైటీడీఏ ఆధ్వర్యంలో జరిగిన పనుల్లో సమన్వయ లోపం స్పష్టంగా కనిపిస్తోందన్నారు. పార్టీలకు అతీతంగా అన్ని శాఖల సమన్వయంతో పనులు పూర్తి చేయనున్నట్లు తెలిపారు. కొండపైన భక్తులు టెంకాయలు సమర్పించుకునేందుకు శాశ్వత ఏర్పాట్లు చేయనున్నట్లు తెలిపారు. మరో 10 రోజుల్లో కొండపైన భక్తులు మొక్కు, నిద్రలు చేసేందుకు డార్మెటరీ హాలు నిర్మాణ పనులు ప్రారంభమవుతాయని చెప్పారు.

ఆ గదిలో ఏం మాట్లాడారు?

» బాలికలు ఎందుకు చనిపోయారు

» భువనగిరి ఎస్సీ హాస్టల్ ఘటనపై విచారణ అధికారి నియామకం

» హాస్టల్ వార్డెన్ సస్పెన్షన్?

» దోషులపై చర్యలు తీసుకోవాలి: కవిత



హాస్టల్ వద్ద విద్యార్థినులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కవిత

హైదరాబాద్, యాదాద్రి, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): ఇద్దరు బాలికలను హాస్టల్లోని ఏ గదిలో కౌన్సెలింగ్ ఇచ్చారు? ఎవరు ఇచ్చారు? బాలికలతో ఏం మాట్లాడారు? ఆ గదిలో ఇంకా ఎవరెవరున్నారు? అసలు ఆత్మహత్య చేసుకునే పరిస్థితులు వారికెందుకు ఏర్పడ్డాయి? ఈ కోణంలోనే ఇద్దరు బాలికల ఆత్మహత్య కేసును విచారణ జరుగుతోంది. భువనగిరి ఎస్సీ బాలికల వసతి గృహంలో పదో తరగతి చదువుతున్న ఇద్దరు విద్యార్థినులు ఆత్మహత్య చేసుకున్న ఘటనపై ప్రభుత్వం స్పందించింది. ఆత్మహత్యకు గల కారణాలను తేల్చేందుకు ప్రత్యేకంగా విచారణ అధికారిని నియమించింది. మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క ఆదేశాల మేరకు శాఖ జాయింట్ డైరక్టర్ (స్కీమ్స్) లక్ష్మీదేవిని విచారణ అధికారిగా నియమిస్తూ కార్యదర్శి వాకాటి కరుణ ఆదేశాలిచ్చారు. త్వరితగతిన పూర్తిస్థాయిలో విచారణ జరిపి.. ఘటనకు కారణమైన వారిని కఠినంగా శిక్షించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను సీతక్క ఆదేశించారు. కాగా, విచారణలో భాగంగా ఓ అధికారి భువనగిరి ఎస్సీ హాస్టల్‌కు వెళ్లి, వివరాలు ఆరా తీశారు. విద్యార్థినుల మరణంపై అనుమానాలున్నాయంటూ వారి తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ చేస్తున్నారు. దాంతో పోలీసుల విచారణలోనూ ఎలాంటి అంశాలు చర్చకు వచ్చాయని సర్కారు నియమించిన విచారణ అధికారి తెలుసుకోనున్నట్లు తెలిసింది. విచారణలో భాగంగా పోలీసులు మరింత సమాచారం కోసం సూసైడ్ నోట్ సహా పలు నమూనాలను ఫోరెన్సిక్‌కు పంపారు. ఆ నివేదిక వస్తేగానీ పలు విషయాలు తెలుస్తాయని, తదుపరి విచారణ ముందుకు సాగనుందని అంటున్నారు. కాగా ఘటన జరిగిన ఎస్సీ హాస్టల్ వార్డెన్ శైలజను సస్పెండ్ చేస్తూ యాదాద్రి కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిసింది. భువనగిరి ఎస్సీ హాస్టల్లో ఇద్దరు బాలికల మృతి తీవ్ర విషాదకరమని ఎమ్మెల్సీ కవిత అన్నారు. ఇద్దరు విద్యార్థినులు అనుమానాస్పదస్థితిలో మృతిచెంది నాలుగు రోజులవుతున్నా సరైన కారణాలు దొరకడం లేదని పోలీసులు అంటున్నారని, ఘటనపై విచారణ పారదర్శకంగా జరగాలని కవిత అన్నారు. మంగళవారం ఆమె హాస్టల్‌కు వచ్చి.. బాలికల గదిని పరిశీలించారు. హాస్టల్ సిబ్బందితో మాట్లాడారు. అయితే ఈ ఘటనపై దర్యాప్తునకు విచారణ అధికారిని నియమించడం పట్ల ప్రభుత్వానికి కవిత ట్విటర్ వేదికగా కృతజ్ఞతలు తెలిపారు. సంక్షేమ హాస్టల్లో ఇద్దరు విద్యార్థినుల ఆత్మహత్య అనుమానాస్పదంగా ఉందని, ఘటనపై పూర్తిస్థాయి విచారణ జరిపించాలని ప్రభుత్వాన్ని పీవోడబ్ల్యూ అధ్యక్షురాలు సంధ్య డిమాండ్ చేశారు.

హాస్టల్ నిర్వహణ అస్తవ్యస్తం

ఘటన జరిగిన భువనగిరిలోని ఎస్సీ బాలికల హాస్టల్‌పై సరైన పర్యవేక్షణ లేదనే ఆరోపణలున్నాయి. ఈ హాస్టల్లో మొత్తంగా 112 మంది పిల్లలు ఉంటున్నారు. కి.మీ పరిధిలోని వివిధ స్కూళ్లలో చదువుతుంటారు. కొందరు ఆటల్లో వెళితే ఇంకొందరు నడుచుకుంటూ వెళ్తారు. ఈ హాస్టల్ వార్డెన్ శైలజ, నాలుగు వేర్వేరు చోట్ల విధులు నిర్వహిస్తున్నారని ఫలితంగా సరైన పర్యవేక్షణ లేదనే విమర్శలున్నాయి హాస్టల్లో సీసీ కెమెరాలున్నా పనిచేయడం లేదని తెలుస్తోంది.



పలిమెలలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు

పలిమెల ఎత్తిపోతలను పునరుద్ధరిస్తాం

» ఆరు గ్యారెంటీలను అమలు చేస్తున్నాం

» ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

పలిమెల (మహదేవపూర్ రూరల్), ఫిబ్రవరి 6 : జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని పలిమెల ఎత్తిపోతల పథకాన్ని పునరుద్ధరిస్తామని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. భూపాలపల్లి జిల్లా పర్యటనలో భాగంగా సోమవారం రాత్రి పలిమెల మండల కేంద్రంలో బస చేసిన ఆయన మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తాను మంత్రిగా ఉన్నప్పుడు రూ.6 కోట్లతో 900ఎకరాల ఆయకట్టుకు సాగునీరందించే పలిమెల ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేశామని, ట్రయల్ రన్ కూడా చేపట్టామని, కానీ గత ప్రభుత్వం ఈ ప్రాజెక్టును మరుగున పడేసి రైతులను నిరాశపరిచిందని విమర్శించారు. ఈ ప్రాజెక్టును పునరుద్ధరించి రైతుల కలను సాకారం చేస్తామని అన్నారు. ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని నీటి పారుదల శాఖ అధికారులను ఆదేశించారు. అనంతరం రూ.3.5 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. తమ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన 2 రోజుల్లోనే రెండు గ్యారెంటీ పథకాలను అమలు చేశామని, ఈ నెల 8,9వ తేదీల్లో మరో రెండు గ్యారెంటీలను అమలు చేయబోతున్నామని వెల్లడించారు.

నేడు మేడారంలో గుడిమెలిగే పండుగ

—Ł $$.$V $, {"›—Ł ˙ 6: . ›
V› M $ ¿ — $ ŒV› ¿Œ ^
— $yØ˘ —Ł $ˆM P, ˚˘ ›
.—Ł $ˆ —Ł $ gŒ Ł ›˘ M $
{·˚˘ ¿ *_›M V› ¿Œ ^ ˝
‡Nf "$«§ ›—Ø˘ f˘ ›V ›
flŁ $ ¤. D fl . 21 flŁ $ _ 24
—Ł ˘ M $ W˙›fflŁ gŒ Ł ˘
f˘ ›V ›flŁ $ ›y V›.. flØ› Ł flŁ
B^Ø˘ { ‡M›˘ —Ł flŁ § —Ł ›
Ł . —Ł y z›.$(› ‡N›gŒ›˘ $.$)
"$«§ ›—Ø˘ V $y ›— $›˝V
‡ y $›V flŁ $ ˘ › ›^Ł ›
flŁ $›flØ†˘ $. D Ł Ł $ ł gŒ Ł ›
˘ M $ A M $›˘>›˘ f˙›W›
flŁ r$t ¿Œ › ˚¢˘ $. gŒ Ł ›˘ Z
¿ M $¢. ‡Nf›. ›§ $›M $fl
{ ‡«§ØflŁ § —Ł › Ł .$ —Ł $ˆM P,
˚˘ ›.—Ł $ˆ, ‡W›y ›§ "›˘›k,
Vł ›§ ›˘››k. ‡NgŒ —Ł $ ¤›˘›.$

చెరువుల కబ్జాలు సరి కాదు

భవిష్యత్తు తరాల కోసం జలవనరులను రక్షించాలి: హైకోర్టు

» హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల్లో 16 చెరువుల ఆక్రమణలపై పిల్

» అధికారులు తీసుకున్న చర్యలపై తనిఖీకి కమిటీ ఏర్పాటు చేసిన కోర్టు

హైదరాబాద్, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): భవిష్యత్తు తరాల కోసం జల వనరులను రక్షించడం ప్రస్తుత తరం బాధ్యత అని, చెరువులు, కుంటల ఆక్రమణ ఏమాత్రం ఆమోదయోగ్యం కాదని హైకోర్టు వ్యాఖ్యానించింది. హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల్లో దాదాపు 16 చెరువుల రక్షణకు రాష్ట్ర ప్రభుత్వం, జీహెచ్ఎంసీ, ఆయా జిల్లాల కలెక్టర్లు తీసుకున్న చర్యలు, ఫెన్సింగ్, వాకింగ్ ట్రాక్‌ల నిర్మాణం వంటి సౌకర్యాల ఏర్పాటుపై తనిఖీ చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల న్యాయవాదులతో కమిటీని నియమించింది. వివాదంలో ఉన్న చెరువుల రక్షణకు అన్ని రకాల చర్యలు తీసుకున్నామని, సర్వే, ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ హద్దులు, అక్రమ నిర్మాణాలను గుర్తించడంతోపాటు ఫెన్సింగ్, వాకింగ్ ట్రాక్ నిర్మాణాలు చేపట్టామని జీహెచ్ఎంసీ కమిషనర్, హైదరాబాద్, రంగారెడ్డి కలెక్టర్లు సంయుక్త నివేదికను సమర్పించిన నేపథ్యంలో అధికారులు చేపట్టిన పనులపై తనిఖీ నిర్వహించి.. నివేదిక ఇవ్వాలని నిర్దేశించింది. చెరువుల ఆక్రమణలపై అధికారులు చర్యలు తీసుకోవడం లేదని పేర్కొంటూ 2007లో హైకోర్టులో పిల్ దాఖలైంది. దానిని విచారించిన హైకోర్టు.. సంయుక్త నివేదిక ఇవ్వాలని 2013లోనే ఆదేశాలిచ్చింది. వాటిని అమలు చేయకపోవడంతో ఇటీవల ఆగ్రహం వ్యక్తం చేసింది. సదరు అధికారులు హాజరుకావాలని ఆదేశించింది. దాంతో, గతంలో జరిగిన విచారణ సందర్భంగా హాజరైన జీహెచ్ఎంసీ కమిషనర్, కలెక్టర్లు ఆదేశాలు అమలు చేస్తామని హైకోర్టుకు హామీఇచ్చారు. ఆయా చెరువుల రక్షణకు తీసుకున్న చర్యలతో మంగళవారం సంయుక్త నివేదిక సమర్పించారు. ఏయే చెరువుకు సంబంధించి ఎన్ని ఎకరాల్లో ఎఫ్‌టీఎల్ హద్దులు గుర్తించారు? ఎన్ని అక్రమ నిర్మాణాలు ఉన్నాయి ? ఫెన్సింగ్, వాకింగ్ ట్రాక్‌ల నిర్మాణాల వివరాలు తదితరాలను పేర్కొన్నారు. హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల పరిధిలోని గొలిదొడ్డి చెరువు, దుర్గం, సున్నం చెరువులు, పీర్జాదిగూడ, చిన్నదామర, చిన్నరాయుని, గంగారం పెద్దచెరువు, మేడికుంట, ఉప్పల్ నల్లచెరువు, హస్మత్‌పేట్, బైరామల్‌గూడ, నల్లగండ్ల, అంబీర్, బోయిన్ చెరువులు, మద్దెలకుంట, గోసాయికుంట తదితర చెరువుల పరిరక్షణకు తీసుకున్న చర్యలను సమర్పించారు. ఆ నివేదికను చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ అనిల్‌కుమార్ ధర్మాసనం పరిగణనలోకి తీసుకుంది. చెరువుల రక్షణకు అధికారులు తీసుకున్న చర్యలపై ప్రాథమికంగా సంతృప్తి వ్యక్తం చేసింది. నివేదికలోని వివరాలను ధ్రువీకరించుకునేందుకు కేంద్ర ప్రభుత్వ డిప్యూటీ సొలిసిటర్ జనరల్ గాడి ప్రవీణ్‌కుమార్, రాష్ట్ర రెవెన్యూ శాఖ జీపీ టి.శ్రీకాంత్ రెడ్డితో ఓ కమిటీ ఏర్పాటు చేసింది. ఈ కమిటీ ఆయా చెరువులను తనిఖీ చేసి.. మూడు వారాల్లో సీల్డ్ కవర్‌లో నివేదిక సమర్పించాలని నిర్దేశించింది. ఆయా చెరువుల వద్ద సీసీటీవీలు, మురుగు డైవర్షన్, వాకింగ్ ట్రాక్‌లు, ఫెన్సింగ్ ఏర్పాటు వంటి అంశాలపై రాష్ట్ర ప్రభుత్వ వైఖరి తెలియజేయాలని ఆదేశాలు జారీ చేసింది.



హైకోర్టులో సీబీఐ స్పెషల్ పీపీలుగా శ్రీనివాస్, సృజన్‌కుమార్‌రెడ్డి

హైకోర్టులో సీబీఐ తరఫున ప్రాతినిధ్యం వహించేందుకు స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్లుగా హైకోర్టు న్యాయవాదులు కె.శ్రీనివాస్, టి.సృజన్‌కుమార్ రెడ్డిని నియమిస్తూ కేంద్ర ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. మూడేళ్లపాటు లేదా తదుపరి ఉత్తర్వులు జారీ చేసే వరకు వారు ఈ పదవుల్లో కొనసాగుతారని డీవోపీటీ పేర్కొంది.

ఎప్‌సెట్‌కు 26 నుంచి అర్జీలు

» మే 9 నుంచి పరీక్షలు.. షెడ్యూల్ విడుదల

హైదరాబాద్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్, ఫార్మసీ సీట్ల భర్తీ కోసం నిర్వహించే ఎప్‌సెట్(ఎంసెట్) పరీక్షకు ఈ నెల 26వ తేదీ నుంచి దరఖాస్తులను స్వీకరించాలని నిర్ణయించారు. ఈమేరకు మంగళవారం ఎప్‌సెట్ షెడ్యూల్‌ను విడుదల చేశారు. రాష్ట్ర ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ ప్రొఫెసర్ లింబాద్రి ఆధ్వర్యంలో ఎప్‌సెట్ కమిటీ తొలి సమావేశం మంగళవారం జరిగింది. ఈ సమావేశంలో జేఎన్‌టీయూ వైస్‌ఛాన్సలర్ కట్టా నర్సింహారెడ్డి, సెట్ కన్వీనర్ డీన్ కుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు. సమావేశం అనంతరం షెడ్యూల్‌ను విడుదల చేశారు. ఈ షెడ్యూల్ ప్రకారం ఈ నెల 21వ తేదీన నోటిఫికేషన్ జారీ చేయనున్నారు. ఈ నెల 26 నుంచి ఏప్రిల్ 6వ తేదీ వరకు అభ్యర్థుల నుంచి దరఖాస్తులను స్వీకరించనున్నారు. ఎప్‌సెట్ పరీక్షలను మే 9 నుంచి 12వ తేదీ వరకు నిర్వహించనున్నారు. ఈ ఏడాది ఎప్‌సెట్‌లో 100 శాతం ఇంటర్ సిలబస్‌ను అమలుచేయాలని నిర్ణయించారు.

మార్చి 16 నుంచి పీజీఈసెట్ దరఖాస్తులు

మార్చి 16వ తేదీ నుంచి పీజీఈసెట్ కోసం దరఖాస్తులు స్వీకరించనున్నారు. ఈ సెట్‌కు సంబంధించిన షెడ్యూల్‌ను మంగళవారం విడుదల చేశారు. దీని ప్రకారం... మార్చి 12వ తేదీన నోటిఫికేషన్‌ను జారీ చేయనున్నారు. మార్చి 16 నుంచి మే 10వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించనున్నారు. జూన్ 6 నుంచి 9వ తేదీ వరకు పీజీఈసెట్ పరీక్షలు నిర్వహించనున్నారు.



బిహార్ కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు మన్ననూరులో స్వాగతం పలుకుతున్న అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ

నల్లమలలో బిహార్ కాంగ్రెస్ ఎమ్మెల్యేల విహారయాత్ర

» అనంతరం శ్రీశైలం క్షేత్రానికి పయనం

» నేడు తిరిగి సిరి నేచర్స్ వ్యాలీ రిసార్టుకు..

ఇబ్రహీంపట్నం, మన్ననూర్, ఫిబ్రవరి 6: తెలంగాణలో క్యాంపులో ఉన్న బిహార్ కాంగ్రెస్ ఎమ్మెల్యేలు మంగళవారం విహారయాత్రకు వెళ్లారు. నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ నల్లమల పులుల అభయారణ్య ప్రాంతంలో వారు విహరించారు. మంగళవారం మధ్యాహ్నం మన్ననూరు చెక్‌పోస్టు వద్ద గల పర్యాటక వనమాలికకు చేరుకున్న బిహార్ ఎమ్మెల్యేల బృందానికి అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ ఘనంగా స్వాగతం పలికారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు.. ఆ ఎమ్మెల్యేలకు వంశీకృష్ణ వసతి ఏర్పాటు చేశారు. సఫారీ వాహనాల్లో ఫర్హాబాద్ వ్యూ పాయింట్ వద్దకు ఎమ్మెల్యేల బృందం వెళ్లింది. ఆ తర్వాత సాయంత్రం వేళ ఎమ్మెల్యేలు అక్కడి నుంచి ఈగల పెంట భూగర్భ జలవిద్యుత్ కేంద్రం సందర్శనకు వెళ్లారు. అనంతరం పోలీసు బందోబస్తు మధ్య వారు కార్లలో కర్నూలు జిల్లా శ్రీశైల క్షేత్రానికి బయలుదేరి వెళ్లారు. అక్కడ మల్లికార్జునస్వామిని దర్శించుకొని రాత్రి అక్కడే బసచేసి బుధవారం ఉదయం బయల్దేరి మధ్యాహ్నానికి సిరి నేచర్స్ వ్యాలీకి రానున్నట్లు తెలిసింది.

వరంగల్ ఎంపీ సీటుపై సీపీఐ నజర్ !

» పొత్తులో భాగంగా మాకు కేటాయించండి

» కాంగ్రెస్ చీఫ్ మల్లిఖార్జున్ ఖర్గేకు డి.రాజా వినతి

వరంగల్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఇండియా కూటమిలో భాగస్వాములుగా ఉన్న సీపీఐ నేతలు వరంగల్ ఎంపీ స్థానం నుంచి పోటీకి ఉవ్విళ్లూరుతున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకున్న సీపీఐ కొత్తగూడెం అసెంబ్లీ స్థానం నుంచి పోటీ చేయగా ఆ పార్టీ అభ్యర్థి కూనంనేని సాంబశివరావు విజయం సాధించారు. దీంతో సీపీఐ దృష్టి ఇప్పుడు లోక్‌సభ ఎన్నికలపై పడింది. వరంగల్ లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోని స్టేషన్‌ఘన్‌పూర్, పరకాల, భూపాలపల్లి, వర్ధన్నపేట, వరంగల్ తూర్పు అసెంబ్లీ నియోజకవర్గాల్లో సీపీఐకి చెప్పుకోదగ్గ కేడర్ ఉంది. ఈ నేపథ్యంలో ఇండియా కూటమి పొత్తులో భాగంగా వరంగల్ ఎంపీ స్థానం తమకు కేటాయించాలని కాంగ్రెస్‌పై ఒత్తిడి తెస్తున్నారు. తమకు ఖమ్మం, నల్గొండ, వరంగల్ స్థానాల్లో గట్టి పట్టుందని, వీటిలో వరంగల్ నుంచి పోటీకి అవకాశం ఇవ్వాలని కోరుతున్నారు. ఈ మేరకు సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా వరంగల్ సీటు కేటాయించాలని కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు ఖర్గేను కోరడంతో తెలంగాణ కాంగ్రెస్‌లో చర్చనీయాంశంగా మారింది.

రండి.. మాట్లాడుకుందాం!

(మొదటి పేజీ తరువాయి)

చర్చలు జరిపారు. జగన్ సర్కారు పెడుతున్న తప్పుడు కేసులు, కక్షసాధింపు చర్యల గురించి వివరించారు. ఇక.. బీజేపీతో పొత్తులకు సంబంధించి ఎన్నికల కోణంలో తమ పరిశీలనను సమగ్రంగా వివరించారు. ఆయన వాదనతో బీజేపీ పెద్దలు కూడా ఏకీభవించారని, పొత్తుపై వెనక్కి తగ్గారని అప్పట్లో ప్రచారం జరిగింది. మరోవైపు... బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా సోము వీర్రాజు ఉన్నంత కాలం టీడీపీపట్ల వ్యతిరేకత ప్రదర్శిస్తూ వచ్చారు. పురందేశ్వరి ఆ పదవి చేపట్టాక పరిస్థితి మారింది. ఇదే నేపథ్యంలో, ఇప్పుడు హఠాత్తుగా మరోమారు చంద్రబాబుకు అమిత్‌షా నుంచి పిలుపు అందడం ఆసక్తికరంగా మారింది.

బీజేపీ నేతల వైఖరి ఇది...

టీడీపీతో తమకు పొత్తు ఖరారవుతుందని రాష్ట్ర బీజేపీ నేతలు ఆశాభావంతో ఉన్నారు. 'ఈ నెల తొమ్మిదో తేదీన ఢిల్లీలో బీజేపీ పార్లమెంటరీ బోర్డు సమావేశం జరగనుంది. దీనికి ముందే వివిధ రాష్ట్రాల్లో పార్టీ పరిస్థితి, అనుసరించాల్సిన వ్యూహాలను ఖరారు చేసుకోవాలని బీజేపీ నాయకత్వం భావిస్తోంది. టీడీపీతో పొత్తు పెట్టుకోవాలని నిర్ణయం తీసుకున్న తర్వాతే చంద్రబాబును పిలవాలని నిశ్చయించారు. అమిత్‌షాతో సమావేశంలో పొత్తుపై లాంఛనంగా ఒక నిర్ణయం తీసుకుంటారు' అని రాష్ట్ర బీజేపీ ముఖ్యుడొకరు తెలిపారు. టీడీపీతో పొత్తు అవసరంపై తాము జాతీయ నాయకత్వం ముందు గట్టిగా వాదన వినిపించామని, ఢిల్లీ పెద్దలు కూడా ఈ రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం అవసరమని గుర్తించారని.. అందుకే చంద్రబాబును ఆహ్వానించారని రాష్ట్ర బీజేపీ వర్గాలు పేర్కొంటున్నాయి.

గుంభనంగా టీడీపీ నేతలు

తాజా పరిణామంపై టీడీపీ వర్గాలు ఆచితూచి స్పందిస్తున్నాయి. ఢిల్లీ పిలుపుపై ఆ పార్టీ నాయకత్వం మంగళవారం సాయంత్రం వరకూ అధికారికంగా స్పందించలేదు. చంద్రబాబు ఢిల్లీ వెళ్తున్నారని ధ్రువీకరించడం మినహా ఆ పార్టీ నేతలు దీనిపై నోరుమెదపడం లేదు. పూర్తి సంయమనం పాటిస్తున్నారు. ఢిల్లీలో ఏం జరుగుతుందో చెప్పలేమని, పొత్తు విషయాన్ని అప్పుడే నిర్ధారించడం సాధ్యం కాదని అంతరంగిక సంభాషణల్లో చెబుతున్నారు. 'ఎన్నికల కోణంలో మా సమస్యలను చంద్రబాబు మరోసారి వివరిస్తారనే అనుకుంటున్నాం. లోకేశ్ చెప్పడం వేరు... చంద్రబాబు వివరించడం వేరు. పొత్తు ఉండాలని బీజేపీ అధిష్ఠానం గట్టిగా కోరుకుంటే అదే జరుగుతుంది. ఇది సున్నితమైన అంశం. ఏం జరుగుతుందో చూడాలి' అని టీడీపీ ప్రముఖుడొకరు వివరించారు.

నేడు ఆర్టీసీ బోర్డు సమావేశం

హైదరాబాద్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బోర్డు సమావేశం బుధవారం జరగనుంది. ఇందులో పలు కీలక నిర్ణయాలు తీసుకోనున్నట్లు తెలుస్తోంది. లీజుదారుల నుంచి భారీ మొత్తంలో పేరుకుపోయిన బకాయిలను పూర్తిస్థాయిలో వసూలు చేసేందుకు ప్రత్యేక కార్యాచరణ అమలు చేసే అంశంపై సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకోనున్నారు.

సంతానం పట్టించుకోవడం లేదని.. వృద్ధ దంపతుల ఆత్మహత్యాయత్నం

» భర్త మృతి, భార్య పరిస్థితి విషమం

» నల్లగొండ జిల్లా మాడ్గులపల్లిలో ఘటన



లింగయ్య(ఫైల్)

మాడ్గులపల్లి, ఫిబ్రవరి 6: వృద్ధాప్యం.. ఆ కారణంగా వచ్చే అనారోగ్య సమస్యలు.. ఆ దంపతులను ఇబ్బంది పెట్టలేకపోయినా 80 ఏళ్లపైబడ్డ తమను సంతానం పట్టించుకోవడం లేదనే తీవ్ర మనోవేదనకు గురయ్యారు. ముగ్గురు కుమారులు, ఒక కుమార్తెను కనీ పెంచి.. పెద్దచేసి.. పెళ్లిళ్లు చేస్తే.. కాలు కదపలేని వయసులో తమను ఆదరించడం లేదనే ఆవేదనతో పురుగులమందు తాగారు. భర్త మృతిచెందగా భార్య చావుబతుకులమధ్య కొట్టుమిట్లాడుతోంది. నల్లగొండ జిల్లా మాడ్గులపల్లి మండలం ఆగామోత్కూర్ గ్రామంలో ఆ విషాద ఘటన జరిగింది. స్థానికుల వివరాల ప్రకారం ఆగామోత్కూర్‌కు చెందిన మల్లెబోయిన లింగయ్య (86), పెంటమ్మ(80) దంపతులకు ముగ్గురు కుమారులు, కుమార్తె ఉన్నారు. అందరికీ పెళ్లిళ్లయ్యాయి. లింగయ్యకు ఉన్న మూడెకరాల సాగు భూమిని ముగ్గురు కుమారులకు ఇటీవలే పంచాడు. పెద్ద కుమారుడు సైదులు మండలంలోని యాద్గిరిపల్లిలో ఉంటున్నాడు. అదే గ్రామంలో ఉండే రెండో కుమారుడు రాములు చనిపోగా, చిన్న కుమారుడు శ్రీను ఆగా మోత్కూరులో వేరుగా ఉంటున్నాడు. లింగయ్య దంపతులు గ్రామంలోని స్వగృహంలో ఉంటున్నారు. భూమి పంపిణీకి ముందు రైతుబంధుతో పాటు పింఛన్ డబ్బులతో జీవితం గడిపేవారు. కొద్దికాలంగా కుమారులు తమను ఆదరించకపోవడంతో వృద్ధ దంపతులు మనస్తాపం చెందారు. చేతిలో చిల్లిగవ్వ లేకపోవడంతో తమ కష్టాన్ని ఎవరికీ చెప్పుకోలేక దుఃఖాన్ని దిగమింగుతూ ఆత్మహత్యకు సిద్ధపడ్డారు. సోమవారం రాత్రి ఇంట్లోనే ఇద్దరూ పురుగుల మందు తాగారు. ఇద్దరూ సొమ్మసిల్లి పడి ఉండటాన్ని గమనించిన స్థానికులు 108కు సమాచారం అందించారు. వారు వచ్చేలోగానే లింగయ్య మృతి చెందాడు. అపస్మారక స్థితిలో భార్య పెంటమ్మను నల్లగొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ ఆమె చికిత్స పొందుతోంది. ఆమె పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. అయితే లింగయ్య, పెంటమ్మ కొన్ని నెలలుగా కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నారని, అందుకే ఆత్మహత్యాయత్నం చేశారని కుమార్తె మంగ పద్మ పేర్కొన్నారు.

నేడు అన్నారానికి డ్యామ్ భద్రత సమీక్ష కమిటీ

హైదరాబాద్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా కట్టిన అన్నారం బ్యారేజీలో సీపేజీలతో బుంగలు ఏర్పడటం, భారీ వరదలతో బ్యారేజీ ఎగువ భాగంతో పాటు దిగువ భాగంలోని నిర్మాణాలు దెబ్బతినడంతో బ్యారేజీలో ఇంకేం లోపాలు ఉన్నాయనే దాన్ని గుర్తించడానికి వీలుగా 2డీ నమూనా అధ్యయనాలు చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. డ్యామ్ భద్రత చట్టంలో భాగంగా వేసిన డ్యామ్ భద్రత సమీక్ష ప్యానల్ ఛైర్మన్ ఏబీ పాండ్యా నేతృత్వంలోని కమిటీ ప్రతినిధులు బుధవారం అన్నారం బ్యారేజీని సందర్శించనున్నారు. హైడ్రాలిక్ లాబరేటరీ, సీడబ్ల్యూపీఆర్ఎస్ మాజీ సంయుక్త సంచాలకులు పి.బి.దియోలాలికర్‌లతో పాటు మాజీ ఈఎన్‌సీ రామరాజు అన్నారం బ్యారేజీని సందర్శించి, అధ్యయనంపై తుది నిర్ణయం తీసుకోనున్నారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

అవినీతిలో పురోగతి

అవినీతి, బంధుప్రీతి, కుటుంబపాలన మీద ప్రధాని నరేంద్రమోదీ వ్యాఖ్యానించడం కొత్తేమీ కాదు కానీ, ఎప్పుడూ వినసొంపుగానే ఉంటుంది. దేశంలో అవినీతిని అంతం చేసేంతవరకూ విశ్రమించేది లేదని ఆయన సోమవారం చేసిన ప్రతిజ్ఞ కచ్చితంగా సంతోషం కలిగించేదే. పదేళ్ళక్రితం వరకూ పార్లమెంటులో కుంభకోణాలమీద చర్చలు జరిగేవని, ప్రతిసారి చర్చలు తీసుకోవాలని సభ పట్టుబట్టేదని, ఇప్పుడు అవినీతిమీద చర్చలు తీసుకుంటూ ఉంటే కొందరు విమర్శలు చేస్తున్నారని ఆయన అన్నారు. దేశాన్ని దోచుకుంటూ ఉంటే ఊరుకొనేది లేదని, దోచుకున్న సొమ్మును వాపస్ చేసేవరకూ అవినీతి నేతలను వదిలేదని ఆయన తీవ్రహెచ్చరికలు చేశారు.

అవినీతికి పుట్టినిల్లుగా కాంగ్రెస్‌ను చిత్రీకరించి అధికారంలోకి వచ్చినవారు కనుక, కాంగ్రెస్ ముక్త్‌భారత్ సాధించేవరకూ ఆ వాదన కొనసాగుతుంది. తాము, తమ మిత్రపక్షాలు తప్ప మిగతాపార్టీలన్నీ అవినీతిమయమైనవేనని, దర్యాప్తు సంస్థలు రాజ్యాంగానికి లోబడే విపక్షనేతలను చెడుగుడు ఆడుతున్నాయని బీజేపీ సహజంగానే వాదిస్తుంది. తమ ప్రభుత్వాలను కూల్చడానికి, ఏక్‌నాథ్ షిండేలు అవతరించడానికి సీబీఐ, ఈడీ, ఐటీ ఇత్యాది సంస్థలు బీజేపీకి ఉపకరిస్తున్నాయని విపక్షాలు అంటాయి. ఈ దేశంలో కుంభకోణాలు వెలుగుచూడటంలోనే కాదు, వాటిపై దర్యాప్తు జరగడంలోనూ రాజకీయం ఉంటుంది. యూపీఏ కొంపముంచిన టూజీ స్పెక్ట్రమ్ కుంభకోణంలో 1.76లక్షల కోట్ల అవినీతి జరిగిందంటూ అప్పటి 'కాగ్' వినోద్‌రాయ్ ఇచ్చిన నివేదిక వెనుక ఎవరి కుట్రలున్నాయో ఆ తరువాత ఆడిటింగ్ బృందం అధిపతి చెప్పకనే చెప్పారు. కుంభకోణమే లేదని సుప్రీంకోర్టు పర్యవేక్షణలో సీబీఐ తేల్చినా, ఆ కేసు నిలబడకపోయినా నరేంద్రమోదీ అధికారంలోకి రావడానికి ఇది దారులుపరిచింది. ఇటువంటి ప్రమాదమే తమకు కూడా ఉన్నదని కాబోలు, స్వతంత్ర వ్యవస్థలన్నింటినీ అస్వతంత్రం చేసి దేశంలో బీజేపీ తప్ప మరేపార్టీ లేకుండా చేస్తామన్న ప్రతిజ్ఞకు అనుగుణంగా విపక్షాన్ని తుడిచిపెట్టేసే పనిలో బీజేపీ ఉంది. ప్రధాని తన ప్రసంగంలో హేమంత్ సోరేన్ పేరు ప్రస్తావించినప్పటికీ, ఆ హిట్‌లిస్టులో ఇంకా ఎవరెవరున్నారో అందరికీ తెలిసిందే.

ఈ రాజకీయ వైరాన్ని అటుంచితే, నేను తినను, ఎవరినీ తిననివ్వనని ప్రకటించిన నరేంద్రమోదీ ఈ పదేళ్ళకాలంలో అవినీతిపై పోరాటంలో ఎంతోకొంత విజయం సాధించివుండాలి. అవినీతి నిర్మూలనను ఒక ఆదర్శంగా, సమున్నత లక్ష్యంగా ప్రకటించి, ఎవ్వరినీ వదిలిపెట్టవద్దని సీబీఐ, ఐటీ అధికారులకు సందేశాలు ఇస్తుంటారు కనుక, ప్రభుత్వస్థాయిలో అవినీతి బక్కచిక్కివుండాలి. కానీ, ఇందుకు పూర్తి భిన్నంగా, ట్రాన్స్‌పరెన్సీ ఇంటర్నేషనల్ సర్వేలో దేశం ఒకేమారు ఎనిమిది ర్యాంకులు దిగజారి, 180 దేశాల్లో 93వ స్థానంలో మిగిలింది. ప్రభుత్వంలో అవినీతి పెరిగిందనీ, ముడుపులు ముట్టచెప్పవలసివస్తున్నదని, ప్రైవేటు లబ్ధి పెరిగిందన్నది ఈ సర్వే సారాంశం. ఈ నివేదికను సైతం బీజేపీ అంతర్జాతీయ కుట్రగా తీసిపారేయగలదేమో కానీ, కేంద్రంలో తామే అధికారంలో ఉంటూ, సగానికిపైగా రాష్ట్రాలు తమ చేతుల్లో ఉన్నందున మోదీ ప్రవచిత పోరాటం ప్రయోజనం చేకూర్చడం లేదని ప్రజలు భావించే ప్రమాదమైతే ఉంది.

పదేళ్ళక్రితం వరకూ పార్లమెంటులో కుంభకోణాలమీద చర్చలు జరిగేవని, చర్చలు తీసుకోవాలని సభ పట్టుబట్టేదని మోదీ తనకు తెలియకుండానే ఓ మంచి విషయం చెప్పారు. ఇప్పుడు పాలకులు ఉద్దేశపూర్వకంగానే చర్చకు వీల్లేకుండా చేస్తున్నారు. అధికారపక్షం అవినీతినీ, ఆశ్రితపెట్టుబడిదారుల అక్రమాలను ప్రస్తావించినవారిని సభనుంచి బహిష్కరించేవరకూ, శిక్షించేవరకూ వదలడం లేదు. అంతర్జాతీయ పత్రికలు, సంస్థలు వెలికి తీస్తున్న కుంభకోణాలను విదేశీకుట్రగా, వాటిమీద దర్యాప్తుకోరిన వారిని కుట్రదారులుగా ముద్రవేసి నోరుమూయిస్తున్నారు. ఐదేళ్ళవరకూ లోక్‌పాల్ ఏర్పాటు చేయకుండా, తరువాత పలు సవరణలతో చివరకు దానికి కోరలు లేకుండా చేశారు. అవినీతిని బహిర్గతం చేయడంలో ప్రధానాస్త్రంగా ప్రజలకు ఉపకరించే సమాచార హక్కు విషయంలోనూ ఇదే జరిగింది. అవినీతి నిర్మూలనకు వీలుగా సమస్త వ్యవస్థలనూ సిద్ధంచేయడానికి బదులు, ఫిర్యాదు చేస్తే ప్రాణంమీదకు వస్తుందని ప్రజలు భయపడే వాతావరణాన్ని నెలకొల్పుతున్నప్పుడు అవినీతిలో అగ్రస్థానానికి ఎగబాకుతూనే ఉంటాం.

అందెశ్రీ గీతం 'జయ జయహే తెలంగాణ' ప్రత్యేక తెలంగాణ ఉద్యమ వ్యాప్తిలో ప్రభాతగీతంగా భాసిల్లింది. తెలంగాణ అస్తిత్వ గొప్పదనం, సాహితీ సాంస్కృతిక విలువలు, పోరాటస్ఫూర్తిని నూరి పోసిన ఈ గేయాన్ని ప్రత్యేక తెలంగాణ సిద్ధించిన ఒక దశాబ్ద కాలానికి అధికారిక రాష్ట్ర గేయంగా నూతన ప్రభుత్వం గుర్తించింది. ఈ గుర్తింపు అందెశ్రీకి మాత్రమే కాకుండా, ఆయనతో పాటు తమ సాహిత్యం, కళలను పదునైన ఆయుధాలుగా మలుచుకుని తెలంగాణ ఉద్యమంలో అలుపెరగని పోరాటం చేసిన ప్రతి ఒక్కరికీ దక్కిన గౌరవంగా భావించవచ్చు. ప్రజల ఆకాంక్షను గౌరవించిన చరిత్రాత్మక సందర్భమిది.

జన తెలంగాణ జయ ధ్వానం

మనుషులకు సాపాటే కాదు, సంస్కృతి కూడా ముఖ్యం. ప్రతి సమాజానికి ఒక విలక్షణ సంస్కృతి ఉంటుంది. అది ఆ సమాజంలోని వారందరినీ ఆత్మీయంగా సంఘటితం చేస్తుంది. ఇందుకు దోహదం చేసే ఒక సాంస్కృతిక శక్తి గేయం. ప్రపంచంలో ఏ మూలలోనైనా ప్రజలపై ఈ సాంస్కృతిక ప్రభావం గణనీయంగా ఉంటుంది, అత్యాధునిక యూరోప్ గానీ, వెనుకబడిన ఆసియా దేశాలు గానీ అందుకు మినహాయింపు కాదు. ఒక జనసమూహ ఉమ్మడి లక్ష్య సాధన దిశగా ముందుకు సాగడంలో గేయాల ప్రభావం గణనీయంగా ఉంటుంది. అందునా తమ అస్తిత్వాన్ని ప్రతిబింబించే, ఆత్మగౌరవాన్ని చాటే గేయాలు ప్రజల హృదయాలలో సుస్థిరంగా ఉండడం కద్దు. అటువంటి గేయాలు కొన్ని చరిత్రలో సుస్థిర స్థానమేర్పరుచుకున్న ఉద్యమాల్ని ఉప్పొంగించాయి. ప్రజల ఆకాంక్షలను గేయాల రూపంలో పదునైన ఆయుధాలుగా మార్చి పాలకుల గుండెల్లో గుచ్చుకునేలా చేసిన కవులు, కళాకారులు ఎందరో ఉన్నారు.

కుల మతాలకు అతీతంగా కొన్ని గేయాలు ప్రజలందర్ని ఏకధాటిపై నడిపిస్తూ అస్తిత్వాన్ని, సాంస్కృతిక విలువలతో కూడిన పోరాటస్ఫూర్తిని నూరి పోస్తాయి. మహాకవి ఇక్బాల్ స్వప్నమైన ముస్లిం దేశమైన పాకిస్థాన్‌లో తమ సంస్కృతికి గుర్తింపు లేదని భావించిన తూర్పు పాకిస్థాన్ ముస్లిం ప్రజానీకం విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ రచించిన 'అమార్ సోనార్ బంగ్లా' గేయం స్ఫూర్తితో పాక్ పాలకులతో పోరాడి తమ ప్రత్యేక అస్తిత్వాన్ని చాటుకున్నారు.

గల్ఫ్ లేఖ

రవీంద్రుడు ఆ స్ఫూర్తిదాయక గేయాన్ని రచించిన అర్ధ శతాబ్ది అనంతరం జరిగిన విముక్తి పోరాటంలో అది బంగ్లా దేశీయుల ఆత్మగౌరవానికి ఊపిరి పోసింది. 1971లో ప్రత్యేక దేశంగా అవిర్భవించిన వెన్వెంటనే ఆ గేయాన్ని తమ జాతీయ గీతంగా ప్రకటించుకుని బంగ్లాదేశ్ తనను తాను గౌరవించుకున్నది.

సరిగ్గా అమార్ సోనార్ బంగ్లాతో తమ సంస్కృతి, ఆకాంక్షలకు అనుగుణంగా ప్రత్యేక దేశం కొరకు పోరాడుతున్న సమయంలో జై తెలంగాణ నినాదం జోరందుకొంది. అప్పటికే ప్రాచుర్యంలో ఉన్న అభ్యుదయ కవి దాశరథి రచించిన నా తెలంగాణ కోటి రత్నాల వీణను పాడినా జై తెలంగాణ అంటూ ఆవేశంతో హోరెత్తెక్కించిన వారే అధికంగా ఉండేవారు. ప్రత్యేక తెలంగాణ మలిదశ ఉద్యమ సమయానికి గోరటి వెంకన్న, రసమయి, ఏపూరి సోమన్న, దేశపతి శ్రీనివాస్, పసునూరి రవీందర్, జయరాజ్, విమలక్క తదితరులు అనేక మంది తమ పాటలతో తెలంగాణ ఉద్యమాన్ని ఉత్తేజపర్చగా, అందులో అందెశ్రీ రచించిన 'జయజయహే తెలంగాణ జననీ జయకేతనం' ముక్కోటి గొంతుకలు ఒక్కటైన చైతన్యం నిస్సందేహంగా ముక్కోటి గొంతుకలను ఒక్కటి చేయడంలో ఒక ముఖ్య భూమికను పోషించింది.



'జయ జయహే తెలంగాణ' ఉద్యమ వ్యాప్తిలో ప్రభాతగీతమైంది. తెలంగాణ అస్తిత్వ విశిష్టత, పోరాటస్ఫూర్తిని నూరి పోసిన ఆ గీతం తెలంగాణ పొలిమేరను దాటి ప్రపంచవ్యాప్తంగా తెలంగాణ వాదులలో మార్మ్రోగిపోయింది. అటు ఆదవుల జిల్లా ఆదిలాబాద్ మొదలు అమెరికా, అరబ్బు దేశాల వరకు తెలంగాణ వాసులు నలుగురు కలిస్తే ఈ పాటతో భేటీకి శ్రీకారం జరిగేది. గల్ఫ్ దేశాలలోని భారతీయ, అంతర్జాతీయ పాఠశాలల్లో తెలంగాణ చిన్నారుల మొదలు యు.ఏ.ఇ లోని దుబాయి నుంచి సౌదీ అరేబియాలోని తబూక్ వరకు 2500 కిలోమీటర్ల దూరం వరకు లారీలు నడిపే డ్రైవర్ల వరకు అసంఖ్యాకులను అమితంగా ఆకర్షించి పాడించేది, అందెశ్రీ గీతం. ఈ పాట వింటున్నప్పుడల్లా తెలంగాణ వచ్చి తీరుతుందన్న విశ్వాసం కలిగించేది.

గల్ఫ్ దేశాలలో రోడ్లపై వేగ నియంత్రణ కెమరాలు ఉంటాయి. పరిమితి మించి వేగంగా వాహనం నడిపితే జరిమానాను వీసా నెంబర్‌తో అనుసంధించి వసూలు చేస్తారు, 'జయ జయహే తెలంగాణ — జననీ జయకేతనం' పాటకు పరవశించిపోయే డ్రైవర్లు వేగ పరిధి సూచికలను పట్టించుకోకుండా వాహనాలు నడుపుతూ అపరాధ రుసుం రూపంలో తమ జీతంలో సగం జీతం వరకు కూడ చెల్లించుకున్నవారు అనేక మంది ఉన్నారు. ఇలా ప్రజాదరణ పొందిన అందెశ్రీ గేయం కచ్చితంగా రాష్ట్ర గేయంగా ప్రకటన రావడమే తర్వాయి అన్నట్లుగా పాఠశాలలో చిన్నారుల మొదలు ప్రభుత్వ కార్యాలయాలలో అందరు జాతీయ గీతంతో సమానంగా ఆలపించారు. ఈ గేయాన్ని కొంత సవరించి తాను కూడ కొన్ని చరణాలను జోడించినట్లుగా ఒక సందర్భంలో అప్పటి ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు వెల్లడించారు.

కారణాలు ఏమైనా అధికారికంగా మాత్రం జయ జయహే తెలంగాణ స్వరాష్ట్ర జాతీయ గీతంగా రూపుదాల్చలేదు, తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా అవిర్భవించినా ఈ గీతం అధికారిక గేయంగా లేకపోవడం స్పష్టమైన ఒక లోటుగా కనిపించేది.

తమ అస్తిత్వ పోరాటం కంటే అర్ధ శతాబ్దికి ముందు రవీంద్రనాథ్ ఠాగూర్ రచించిన అమార్ సోనార్ బంగ్లా గేయం తమ లక్ష్య సాధనకు దిక్సూచిగా ఉండగా, బంగ్లాదేశ్ ఏర్పడే నాటికి ఆయన మరణించి మూడు దశాబ్దాలయింది. మరీ, తెలంగాణ ఉద్యమంలో క్రియాశీలకంగా పాల్గొంటూ ఒక కవిగా, వాగ్గేయకారుడిగా తనవంతుగా విలక్షణ పాత్ర పోషించిన అందెశ్రీ మన మధ్య ఉన్నా ఆయన రచించిన జయ జయహే తెలంగాణ గీతాన్ని ఎందుకు అధికారిక రాష్ట్ర గేయంగా ప్రకటించలేదో తెలియదు.

ప్రత్యేక తెలంగాణ సిద్ధించిన ఒక దశాబ్ద కాలనికి అస్తిత్వం, సాహితీ సాంస్కృతిక విలువలు, పోరాటస్ఫూర్తిని నూరి పోసిన ఈ గేయాన్ని తెలంగాణ అధికారిక రాష్ట్ర గేయంగా నూతన ప్రభుత్వం గుర్తించింది. ఈ గుర్తింపు, ఒక్క అందెశ్రీకే కాకుండా ఆయనతో పాటు తమ సాహిత్యం, కళలను పదునైన ఆయుధాలుగా మలుచుకుని తెలంగాణ ఉద్యమంలో అలుపెరగని పోరాటం చేసిన ప్రతి ఒక్కరికీ దక్కిన గౌరవంగా భావించవచ్చు. ప్రజల ఆకాంక్షను గౌరవించిన చరిత్రాత్మక సందర్భమిది.

■ **మొహమ్మద్ ఇర్ఫాన్**
(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)

ఆలోచనలను గౌరవించని అవార్డులు!



■ ఎ. కృష్ణారావు

ఇండియాగేట్


'ఢిల్లీ వెళితే ప్రస్తుతం మన సమస్యలు చెప్పుకోవడానికి పెద్ద దిక్కుగా ఉన్న నాయకులు లేరు. వ్యాపారస్తులు ప్రజా ప్రతినిధులవుతున్నారు.' అని ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పద్మా పురస్కార గ్రహీతలకు సన్మానం చేస్తూ వాపోయారు. నిజమే. ఇప్పుడు దేశ రాజకీయాల్లో ఒక స్థాయి గల ప్రజా ప్రతినిధులు కనపడడం లేదు. కోట్ల విజయభాస్కర్ రెడ్డి, జైపాల్ రెడ్డి, వెంకయ్యనాయుడు, వైఎస్ రాజశేఖర్ రెడ్డి, వడ్డే శోభనాద్రీశ్వరరావు, ఎర్రన్నాయుడు తదితరులు ప్రజా ప్రతినిధులుగా ఉన్న కాలంలో నిత్యం నేతలతో మాట్లాడుతూ, విలేఖరులకు సమయం కేటాయిస్తూ గడిపేవారు. ఒక రోజు ఏపీసీసీ ఏర్పాటు చేసిన ఒక కమిటీ సమావేశంలో కోట్ల విజయ భాస్కర్ రెడ్డి తెలంగాణను వ్యతిరేకించారని తెలిసి వార్త రాశాను. మరుసటి రోజు ఎప్పటి మాదిరే ఏపీసీసీలో రోజువారీ విలేఖరుల సమావేశం పూర్తి కాగానే నలుగురైదుగురు సీనియర్ జర్నలిస్టులతో పాటు ఆయన ఇంటికి వెళ్లినప్పుడు 'ఆ వార్త ఎందుకు రాశావు.. మళ్లీ నాకు కనపడకు' అని కోట్ల ఆగ్రహించారు. మరునాడు ఆయన ఇంటికి వెళ్లలేదు. దీనితో ఆయనే ఫోన్ చేశారు. 'నిన్న ఏదో కోపంతో అంటే మనసు మీదికి తీసుకుంటావా.. నీకంటే ఎంతో పెద్దవాడిని కదా..' అనేసరికి ఎంతో సంతోషంతో ఆయనను కలుసుకున్నాను. జైపాల్ రెడ్డి ఢిల్లీలో కేంద్రమంత్రిగా ఉన్నా సరే, ఆయన ఇంటి గేట్లు ఎప్పుడూ తెరిచే ఉండేవి. ఆయనతో మాట్లాడిన తర్వాత ఎన్నో పుస్తకాలు చదివిన జ్ఞానం కలిగేది. మురళీ మనోహర్ జోషి లాంటి సాంప్రదాయవాది కూడా జైపాల్ అంటే ఇష్టపడేవారు. వెంకయ్యతో ఆయనకు వ్యక్తిగత స్నేహం బలంగా ఉండేది. తెలంగాణ ఉద్యమం ఉధృతంగా జరుగుతున్న ఒక దశలో కూడా ఇరు ప్రాంతాల ఎంపీలు, నేతలు ఆయనను కలుసుకుని ముఖ్యమంత్రిగా ఉండమని జైపాల్‌ను కోరడం ఆయన పట్ల ప్రాంతాలకు అతీతంగా ఉన్న గౌరవానికి నిదర్శనం. కాని అందుకు ఆయన నిరాకరించారు. వెంకయ్యనాయుడు బీజేపీలో జాతీయ స్థాయికి ఎదిగి ఢిల్లీలో ప్రవేశించిన తర్వాత పార్టీకి ప్రజల్లో, ఆమోదయోగ్యత పొందడంలో కీలక పాత్ర పోషించారు. ఒక అజాతశత్రువుగా పేరు పొందిన వెంకయ్య పార్టీలకు అతీతంగా అందరికీ అందుబాటులో ఉండే ప్రజాస్వామ్యవాదిగా పేరు తెచ్చుకున్నారు. రాజశేఖర్ రెడ్డి కూడా ఎంపీగా ఉన్న కాలంలో ఇతరపార్టీ నేతలతో, మీడియాతో అరమరికలు లేకుండా ఉండేవారు. వడ్డే శోభనాద్రీశ్వరరావు, ఎర్రన్నాయుడు పార్లమెంటరీ పార్టీ నేతలుగా ఉన్న కాలంలో తెలుగుదేశం పార్టీ జాతీయ స్థాయిలో ఒక వెలుగు వెలిగింది. ఎర్రన్నాయుడు పిల్లల కోడిలా ఎప్పుడూ ఎంపీలను, రాష్ట్ర నేతలను వెంటవేసుకుని కేంద్ర మంత్రుల వద్దకు తీసుకువెళ్లేవారు. కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియాగాంధీ కూడా ఎర్రన్నాయుడును చూసి చిరునవ్వుతో పలకరించేవారు.

ఇప్పుడు ఢిల్లీలో ఆ వాతావరణమే లేదు. రేవంత్ అన్నట్లుగా ఢిల్లీకి వెళ్లే తెలుగు రాజకీయ నేతలకు వెంకయ్యలాంటి పెద్ద దిక్కు ఎవరూ లేరు. అమిత్ షాతో పాటు పలువురు కేంద్రమంత్రులను తన వద్దకు పిలిపించి ఉభయ రాష్ట్రాల సమస్యలు చర్చించి పరిష్కారం సాధించగల శక్తి వెంకయ్యకు ఉండేది. ఎవరు ఢిల్లీకి వచ్చినా తన ఇంటికి పిలిచి సంభాషించే జైపాల్ రెడ్డి లాంటి విజ్ఞాన ఖని కనపడడం లేదు. వెంకయ్య, జైపాల్ ఇద్దరూ దక్షిణాది వారన్న అభిప్రాయం ఉత్తరాది వారికి కూడా ఉండేది కాదు. ఇద్దరూ తెలుగు, హిందీ, ఇంగ్లీషు భాషల్లో పట్టు సంపాదించారు. జైపాల్ రెడ్డి కేంద్రమంత్రిగా ఉన్నప్పుడు అంబానీ, రూపర్ట్ మర్డోక్ అయినా అపాయింట్‌మెంట్ తీసుకుని కలుసుకోవాల్సి వచ్చేది.

17వ లోక్‌సభ చివరి బడ్జెట్ సమావేశాలు జరుగుతున్న సమయమది. ఆలోచిస్తుంటే గడిచిన అయిదేళ్లలో ఢిల్లీలో మన తెలుగువారి దుస్థితి గుర్తుకు వచ్చి ఆవేదన కలుగుతోంది. ఒక స్థాయిగల తెలుగు నేతలు పెద్దగా ఢిల్లీలో కనపడడం లేదు. వైసీపీకి ఉభయసభల్లో 30 మంది ఎంపీలున్నా వారు తమదైన ముద్ర ఢిల్లీలో వేయలేకపోయారు. బీఆర్ఎస్ ఎంపీలు సరే సరి. బీజేపీ అగ్రనేతలు కనపడితే వంగివంగి దండాలు పెడుతుంటే మన తెలుగు రాష్ట్రాల నేతలు ఇంత మరుగుజ్జులా అన్న అభిప్రాయం కలుగుతోంది.

రెండు రాష్ట్రాలకు చెందిన పద్మా పురస్కార గ్రహీతలకు, ముఖ్యంగా పద్మవిభూషణ్ పురస్కారాలు అందుకోనున్న వెంకయ్య, చిరంజీవిలకు సన్మానం చేయడం ద్వారా రేవంత్ అటు కేంద్రానికీ, ఇటు జగన్ ప్రభుత్వానికీ సంకేతాలు పంపారు. రాజకీయాలకు అతీతంగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామంటూనే వెంకయ్యనాయుడు రాష్ట్రపతి కావాలని ఒక కాంగ్రెస్ ముఖ్యమంత్రి కోరుకోవడం రాజకీయ సందేశమే. రెండవది, సామాన్యుల్లో అసామాన్యులైన వ్యక్తులకు మోదీ ప్రభుత్వం పద్మా పురస్కారాలు ఇవ్వడం గొప్ప విషయమే అయినప్పటికీ కేవలం ఈ పురస్కారాల వల్ల ఏమి ఒరుగుతుంది? ప్రయాణ ఖర్చులు కూడా పెట్టుకోలేని వారికి చప్పట్ల వల్ల, దుప్పట్ల వల్ల ఏమి ప్రయోజనం? అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వేసిన ప్రశ్న కూడా యోచించదగిందే. నిజానికి పద్మా పురస్కారాలు పొందినవారు అనేకమంది దుస్థితి వర్ణనాతీతం. ఒడిషాలో గత కొన్నేళ్లుగా పద్మశ్రీ పురస్కారాలు లభించిన 83 మందిలో పలువురు చాలీచాలని ఆదాయంతో దుర్భర జీవితాన్ని గడుపుతున్నారని ఒడిషా ప్రభుత్వమే ప్రకటించింది. ఆ రాష్ట్రంలో దైతరీ నాయక్ అనే వ్యక్తి గోనసికా పర్వతాన్ని తానొక్కడే మూడేళ్ల పాటు శ్రమించి త్రవ్వి కాలువ నిర్మించడంతో ఆ ప్రాంతంలో దాదాపు వంద ఎకరాలకు సాగు నీరు లభించింది. పద్మశ్రీ పురస్కారం లభించిన తర్వాత తనకు కూలీగా కూడా ఎవరూ పని ఇవ్వలేదని ఆయన వాపోయారు. పేదరికంతో మగ్గుతున్న దైతరీ నాయక్ దుస్థితి గురించి పేపర్లలో వార్త చదివిన తర్వాత స్పందించిన ఒడిషా ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ ఆయనకు నెలకు రూ. పదివేల ఆర్థిక సహాయాన్ని ప్రకటించారు.

ఇటీవలే శ్రీరాముడి ప్రాణప్రతిష్ఠ జరిగిన అయోధ్యలో మొహల్లా ఖిర్కీ అలీబెయిగ్‌లో నివసించే మహమ్మద్ షరీఫ్ అనే వ్యక్తికి నాలుగేళ్ల క్రితం మోదీ ప్రభుత్వం పద్మశ్రీ ఇచ్చింది. గత పాతికేళ్లుగా ఇదే అయోధ్యలో ఆయన 25వేల అనాథ శవాలకు అంత్యక్రియలు చేస్తూ వచ్చారు. చనిపోయిన వారు ఏ మతం అన్న దానితో నిమిత్తం లేకుండా ఆయన వారి వారి ఆచారాల ప్రకారం అంత్యక్రియలు జరిపించారు. కాని ఇదే మహమ్మద్ షరీఫ్ ఇవాళ దుర్భర పేదరికంతో, అనేక జబ్బులతో కునారిల్లుతూ తానే ఒక శవంలా పడి ఉన్నారని వార్తలు వచ్చాయి.



లాల్‌కృష్ణ అద్వానీకి 'భారతరత్న' పురస్కారం ప్రదానం చేయడమే కాదు, ఆయన ఆలోచనలను కూడా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గౌరవించాల్సిన అవసరమున్నది. ఎంతైనా ఆ కురువృద్ధుడు భారతీయ జనతా పార్టీ మార్గదర్శక మండలి సభ్యుడే కదా!

ఇలాంటి వార్తలు వచ్చిన తర్వాత హర్యానాలో గత ఏడాది పద్మా పురస్కారాలు వచ్చిన తమ రాష్ట్ర పౌరులకు ముఖ్యమంత్రి మనోహర్ ఖట్టర్ రూ. 10 వేల పింఛను ప్రకటించారు. ఒడిషా ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ కూడా పద్మాపురస్కారాలు పొందిన వారిలో నిరుపేదలకు రూ. పదివేల నెలసరి ఆర్థిక సహాయాన్ని అందించాలని నిర్ణయించారు. రేవంత్ ఒక్కడుగు ముందుకు వేసి రూ. 25 లక్షల నగదుతో పాటు పాతికవేల పింఛను ప్రకటించారు.

పద్మా పురస్కారాలు ఇచ్చిన తర్వాత వారి అతీగతీ పట్టించుకోకపోడం ఒక ముఖ్యమైన విషయం అయితే వారి మనోభావాలకు, ఆలోచనలకు కూడా విలువ ఇవ్వడం అవసరం. అనేక అంతర్జాతీయ క్రీడల్లో పతకాలు గెలుచుకుని భారతదేశ కీర్తి ప్రతిష్ఠలను చాటిచెప్పిన మల్లయోధులు బజ్రంగ్ పునియా, వీరేందర్ సింగ్ యాదవ్ తమ పద్మశ్రీ పురస్కారాలను తిరిగి ఇచ్చేశారు. రెజ్లింగ్ ఫెడరేషన్ అధ్యక్షుడు, బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్ తమను లైంగిక వేధింపులకు గురి చేశారని ఏడాదికి పైగా ఫిర్యాదులు చేస్తున్నా పట్టించుకోనందుకు సుదీర్ఘకాలం తీవ్ర నిరసన తెలిపిన తమ తోటి మహిళా మల్లయోధులకు సంఘీభావంగా వారు తమ అవార్డులను తిరిగి ఇచ్చారు. బజ్రంగ్ పునియా తన పద్మశ్రీ పతకాన్ని ఇండియాగేట్ వద్ద ఫుట్ పాత్ వద్ద పెట్టేసి తిరిగి వచ్చారు. కనీసం వారినైనా పిలిచి మాట్లాడి సమస్యను పరిష్కరించి ఉంటే బాగుండేది కదా! కాని రాజకీయ కారణాలు అందుకు అడ్డువచ్చి ఉంటాయనడంలో సందేహం లేదు.

రామజన్మభూమి ఉద్యమాన్ని నిర్వహించి బీజేపీ బలోపేతం కావడానికి ప్రధానకారకుడైన లాల్‌కృష్ణ అద్వానీకి మోదీ ప్రభుత్వం భారతరత్న ప్రకటించడంలో ఆశ్చర్యం లేదు. బాబ్రీ మసీదు కట్టడం కూల్చివేతకు ప్రధాన కారకుడైన అప్పటి ముఖ్యమంత్రి కల్యాణ్ సింగ్‌కు కూడా ఆయన మరణానంతరం 2022లో మోదీ ప్రభుత్వం పద్మవిభూషణ్ పురస్కారం ప్రకటించింది. కల్యాణ్ సింగ్‌ను అభిశంసించి, ఒక రోజంతా బోనులో నిలబెట్టిన సుప్రీంకోర్టు, తర్వాత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గొగోయ్ హయాంలో అయోధ్యలో మందిర నిర్మాణానికి అనుకూలంగా తీర్పునిచ్చింది. జస్టిస్ గొగోయ్‌ను రాజ్యసభ సభ్యత్వం వరించింది. ఇది బీజేపీ సైద్ధాంతిక విశ్వాసాలకు సంబంధించిన విషయం. కాని లాల్‌కృష్ణ అద్వానీ అనేకమంది నాయకులకంటే ఎక్కువగా ప్రజాస్వామ్యాన్నీ, పత్రికా స్వేచ్ఛనూ, రాజకీయాల్లో ఉన్నత ప్రమాణాల్నీ ప్రేమించారు. ఆయన శిష్యుడైన వెంకయ్య కూడా ఏ పదవిలో ఉన్నా అదే దారిలో పయనించారు. 'పటిష్ఠమైన ప్రతిపక్షం, పత్రికా స్వేచ్ఛ, స్వతంత్ర న్యాయ వ్యవస్థ ప్రజాస్వామ్యంలోని మూడు ప్రధాన లక్షణాలు' అని అద్వానీ తన ఆత్మకథలో వివరించారు. మెజారిటీ ఉన్నది కదా అని ఒక నియంత ఆ మెజారిటీనీ ఆయుధంగా మార్చుకోవడాన్ని, చట్టసభను కూడా ఇష్టారాజ్యంగా వాడుకోవడాన్ని ఆయన విమర్శించారు. పార్లమెంటరీ ముద్రపడితే చాలు ఎటువంటి దుర్మార్గాన్నైనా సమర్థించుకోవడాన్ని, ఎటువంటి పాపమైనా పవిత్రమవుతుందనుకోవడాన్ని ఆయన తీవ్రంగా నిరసించారు. రాజకీయాల్లో శత్రువులు ఉండరని, ప్రత్యర్థులు మాత్రమే ఉంటారని, రాజకీయ ప్రత్యర్థులను తుడిచిపెట్టాలనుకునే ఆలోచన సరిఅయినది కాదని ఆయన విశ్వసించారు. ప్రజాస్వామ్యంలో శత్రుత్వమనే భావన ప్రమాదకరమైనదని, వేర్వేరు సిద్ధాంతాలు ఉన్నప్పటికీ జాతీయ ప్రాధాన్యం గల అంశాలపై కీలక ఏకాభిప్రాయసాధన అవసరమని ఆయన భావించారు. అద్వానీకి భారతరత్న పురస్కారం ప్రదానం చేయడమే కాదు, ఆయన ఆలోచనలను కూడా గౌరవించడం ప్రధానమంత్రి నరేంద్రమోదీకి అవసరం. ఎంతైనా అద్వానీ బీజేపీ మార్గదర్శక మండలి సభ్యుడే కదా!

(ఆంధ్రజ్యోతి ఢిల్లీ ప్రతినిధి)

పలకని 'నంది' కన్నా, ఉరిమే 'గద్దర్' మిన్న

సినీ రంగ ప్రముఖులతో పాటు కవులు, కళాకారులు తదితరులకు నంది అవార్డుల స్థానంలో గద్దర్ పేరిట పురస్కారాలు ఇస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించడం పెను సంచలనమే ఐంది. అది అనేక విమర్శలకు కూడా తావిస్తున్నది. ముఖ్యంగా ఒక విప్లవ కారుడి పేరిట ఈ అవార్డులు ఇవ్వడం సబబు కాదని, అంతకన్నా ముఖ్యంగా 'పవిత్రమైన నంది' స్థానంలో ఇవ్వడం ఏమిటన్న వాదన వినిపిస్తోంది. వారి వాదనలో విచారం, ఆందోళన, ఆగ్రహం, నిరసనలు ఎన్నో మిళితమైనవి. అవన్నీ గమనించదగ్గవే. ముఖ్యమంత్రి ఈ విషయంపై పునరాలోచన చేయాలని కూడా కొందరు విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ సందర్భంగా 'తెలంగాణ స్వీయ అస్తిత్వం' నుంచి, ఇక్కడి 'పోరాట వారసత్వం' నుంచి, మీదు మిక్కిలి ప్రజా మధ్యమాల్లో విశేష ఆదరణ ఉన్న గద్దర్ ప్రాసంగికతను ఈ సందర్భంగా సమీక్షించుకోవడం అనివార్యం.

గద్దర్ మాజీ మావోయిస్టు. తుది శ్వాస వరకు అంబేద్కరిస్ట్. బుద్ధిజం స్వీకరించిన వారు. వారిని దళిత మార్క్సిస్టు బుద్ధిస్టు అనవచ్చు. అంతేకాదు, ఆయన మానవతా వాది. చిన జీయర్ స్వామి నిలిపిన సమతా విగ్రహాన్ని అంగీకరిస్తూ కులమతాలకు అతీతంగా గుడిలోకే కాదు, సమస్త రంగాల్లోకి అట్టడుగు మనిషిని ఆహ్వానిస్తూ ఎలుగెత్తిన గళం. స్వయానా పాఠశాల.

ఆయన సంప్రదాయవాది కాదు, యథాతథవాది అంతకన్నా కాదు. అంతకు మించి వర్గ పోరాటానికి గోచి గొంగడి ఇచ్చి పాటను బాటగా మలచిన అనితర సాధ్యుడు. మాటగా ఉన్న విప్లవానికి సాంస్కృతిక సేనను జత చేసిన 'జననాట్య మండలి'. ఎరుపు. తన రెండో జీవితంలో ఒక్క రాజ్యాంగాన్ని అమలు చేసేలా చూసుకుంటే చాలు, అంతకన్నా పెద్ద విప్లవం అక్కర్లేదని చాటి చెప్పిన 'నీలి' సలాం. ఓటును తూటాగా మలిచిన మలిదశ మజిలీ. కానీ అతడు ఎంతటి ప్రతిభావంతుడు ఐనప్పటికీ కులానికి దళితుడు. అదే అతడి బలమూ బలహీనతా. ఇదే వారి పేరిట పురస్కారాన్ని అంగీకరించలేకపోటానికి ప్రధాన కారణంగా నిలుస్తున్నదని చెప్పక తప్పదు. నిరసించే వారిది వాదన కాదు, అభ్యంతర స్థితి అసలే కాదు, ఒక్క మాటలో వారిది 'అంటరానితనం'. నయా కుల వివక్ష. అట్టడుగు జాతి మనిషి పట్ల వ్యక్తమవుతున్న అమూర్త అణచివేత.

అందుకే నిశ్చయంగా చెప్పవచ్చు, గద్దర్ అంటరానివాడు కావడం వల్లే వారిని రేవంత్ రెడ్డి నిర్ణయం సంకట పరుస్తున్నదని. ఇది మొదటి కారణం. గద్దర్ విప్లవకారుడు కావడం కారణంగానే భద్రజీవుల ఆందోళన సామాజిక మాధ్యమాల్లో తారాస్థాయికి చేరుతున్నదని. ఇది రెండో కారణం. ఈ రెండు కారణాలూ సంప్రదాయం, పవిత్రతల మాటున ముందుకు రావడం గమనార్హం.

చిత్రమేమిటంటే, వినోద పరిశ్రమకు చెందిన వారు 'పవిత్రమైన' నంది పురస్కారం అందుకోవచ్చు గానీ ఆ వినోద వ్యాపార ధోరణిని జీవితమంతా వ్యతిరేకించి, పెట్టుబడిని, వ్యాపార విలువలను మౌలికంగా నిరసించి, అందుకు కారణమైన ప్రపంచీకరణను అడ్డుకున్న గద్దర్ పేరిట అవార్డు అంటే అది ఈ పరిశ్రమలో కూడా ఒకింత ప్రక్షాళనకు దారి తీస్తుంది. అది కూడా నిరసించే వారి మరో భయం.

నిజానికి ఉలకని పలకని నంది కన్నా గద్దర్ పురస్కారం ఒక ఉలికిపాటుకు గురి చేస్తుంది. ఆ మెమెంటో వేయి ఆలోచనలకు తావిస్తుంది. అది అందుకుంటే సదరు స్వీకర్తను ప్రజ్వలింప జేస్తుంది. నిజానికి గద్దర్ చలనశీలత ఆయన పేరుతోనే గుర్తుకు వస్తుంది. ఆయన పేరిట అవార్డు అనగానే అది ఎన్నో పాటలను వినిపిస్తుంది. మరెన్నో త్యాగాలనూ యాది చేస్తుంది. నిశ్శబ్దంగా ఆ శబ్దం కర్ణ కపాలాలను కుదిపేస్తుంది. గతం, వర్తమానం, భవితకు మార్గనిర్దేశం చేస్తుంది. ఒక్క మాటలో ప్రజాపక్షం వహించే కళలకు, ప్రతిభకు వన్నె తెస్తుంది. కనీస సామాజిక స్పృహ లేని వారిని ఆయా పురస్కారాలను స్వీకరించడానికి సైతం భయపెడుతుంది. పురస్కారాలు ఇవ్వడమే కాదు, వాటి ఎంపిక కూడా ఒక సవాలుగా మారుతుంది. అందుకే 'మార్పు'ను ఏ మాత్రం అంగీకరించని వారికి గద్దర్ పేరు ఒక అడ్డంకి. అందుకే ఈ నిరసన. కానీ ఇవ్వాలి. ఆ పురస్కారాలను మరిన్ని రంగాలకు విస్తరించాలి. ఇచ్చి, సినీ రంగంతో సహా శాస్త్ర, సాంకేతిక, సాంస్కృతిక, కళా రంగాలనూ ప్రజాస్వామీకరించాలి. సామాన్యీకరించాలి. గత పాలకుల ప్రమాణాలను సరికొత్తగా పరిశుద్ధం చేయాలి. అది గద్దర్ పురస్కారంతో జరిగే మేలు. నిజంగానే ఈ పరిణామం తెలంగాణంలో 'కొత్త ఉగాది'కి తెరలేస్తుంది.

గద్దర్ పురస్కారం ఒక ఉలికిపాటుకు గురి చేస్తుంది. ఆ మెమెంటో వేయి ఆలోచనలకు తావిస్తుంది. అది సదరు స్వీకర్తను ప్రజ్వలింపజేస్తుంది. నిజానికి గద్దర్ చలనశీలత ఆయన పేరుతోనే గుర్తుకు వస్తుంది. ఆయన పేరిట అవార్డు అనగానే అది ఎన్నో పాటలను వినిపిస్తుంది. మరెన్నో త్యాగాలనూ యాది చేస్తుంది.



గద్దర్‌కు సినీ రంగానికి ఏం సంబంధం అనే వారికి ఒక మాట. స్వయానా ఆయన 'మాస్ మీడియా'. వేదిక మీదా.. కిందా, మైదానమూ అడవీ అంతటా తన కార్యక్షేత్రం. వారి ఆటా పాటా మాటా అత్యంత ప్రభలశీలం. అది ఇక్కడి ప్రజానీకానికి సినిమా కన్నా కడు శక్తివంతమైనది. ఆయన పేరిట పురస్కారం వెండి తెరకన్నా బహు విస్తారమైనది. ఆ సంగతి గ్రహిస్తే, రేవంత్ రెడ్డి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి ముచ్చట వేస్తుంది. వారికి అభినందనలు కాదు, కృతజ్ఞతలు తెలుపుతాం.

వీటన్నిటికన్నా ఒక ముఖ్య విషయం పంచుకోవాలి. గద్దర్ అంటే విప్లవం, అంబేద్కరిజం మాత్రమే కాదు, తెలంగాణ చేతన. తొలి దశ సరే. ముఖ్యంగా మలి దశ తెలంగాణ ఉద్యమానికి పునాది వేసిందే విప్లవోద్యమం. అది వాస్తవం. మలి తెలంగాణా ఉద్యమానికి సిద్ధాంత బలాన్ని ఇచ్చినవారు మితవాదులైనప్పటికీ అందులో చేరి ఉద్యమాన్ని గమ్యాన్ని ముద్దాడే వరకూ తోడుగా నిలిచింది రైట్ వింగ్ కన్నా లెఫ్ట్ వింగే అధికం అన్నది ఒప్పుకుని తీరాలి. ఆ లెక్కన మాత్రమే కాదు, తన ఆటా పాటలతో, యాత్రలతో — మూడంచెలుగా పోరాడిన ఒకే ఒక్కడు గద్దర్. అతడే అందివచ్చిన 'ధూం ధాం'. అంతటి 'ప్రజా యుద్ధనౌక' పేరిట పురస్కారం అంటే అది సాకారమైన తెలంగాణ రాష్ట్రానికి తమ చెమటను, రక్తాన్ని మాత్రమే కాక ప్రాణాలను సైతం ధారపోసిన త్యాగధనులను తలుచుకోవడమే. ఇది సామాజిక న్యాయానికీ మార్గం కూడా. మరి ఆయన పేరిట ఏర్పాటు చేసే పురస్కారాలను తిరస్కరించి అవమానం పొందుతారా లేక వాటిని సగర్వంగా అందుకుని తెలంగాణ పోరాట వారసత్వంలో భాగమైతారా అన్నది ఎవరికి వారు నిర్ణయించుకోవాలి. ఆల్రెడీ సీఎం చెప్పారు, ఇది శాసనం అని. ఇక తిరుగులేదు.

ఐతే, గద్దర్ అంటే వ్యతిరేకతకు మరో కారణం అతడు ఎరుపు, నీలం మాత్రమే కాదు, మతతత్వ కాషాయానికి విరుగుడు కూడా. ఆ లెక్కన కూడా ఈ పురస్కారాల పట్ల విమర్శ. నిజానికి గద్దర్ అవార్డులు ఇవ్వడం రాజకీయంగా కాంగ్రెస్‌కి కలిసి వచ్చే నిర్ణయం. అది కూడా ఒక బాధ. ముఖ్యంగా మెదక్ జిల్లాకు గనుక వారి పేరు పెడితే అక్కడి బీఆర్ఎస్ పార్టీ బలహీనపడటానికి తగినంత ఆస్కారముంది. అంతేకాదు, కేసీఆర్ కుటుంబంలో ఇప్పటిదాకా కాస్త బలంగా ఉన్న హరీష్ రావుకు అది పెద్ద దెబ్బగానూ ఉంటుంది. మెదక్ పేరు మార్చి రాష్ట్రంలో సోనియా గాంధీని ఎక్కడి నుంచి ఎంపీగా పోటీ చేయించినా అది కాంగ్రెస్‌కు రాజకీయంగా కలిసివచ్చే ద్విముఖ వ్యూహంగా మారుతుంది. ఇది కూడా కాంగ్రెస్‌ను బలోపేతం కాకుండా చూడాలనుకునే వారికి ఇరకాటంగానే ఉంటుంది. ఇక, ట్యాంక్‌బండ్‌పై గద్దర్ విగ్రహం నెలకొల్పితే అది కేసీఆర్ స్థాపించిన అంబేద్కర్ విగ్రహం కన్నా ఎక్కువ గౌరవం కలిగించే విషయంగా మారుతుంది. ఆ ప్రతిష్ఠ కూడా గద్దర్ పునరుత్థానంలో ఇమిడి ఉన్నదన్నది వాస్తవం.

ఇవన్నీ గమనిస్తే రేవంత్ రెడ్డి నిర్ణయం విప్లవాత్మకం. అది ఒక నిర్ణయంగా 'అంటరాని వసంతా'నికి చరమగీతం. ఆత్మగౌరవ 'పాదం మీద పుట్టుమచ్చ'. అది సామాజిక రాజకీయ సాంస్కృతిక రంగాల్లో పురోగామి మార్గానికి దోహదనీయం. దాన్ని ఆహ్వానించడం అంటే ఆకుపచ్చని ఉగాదిని ఎరుపు నీలంతో సహా వేడుక చేసుకోవడం. తెలంగాణాలో సరికొత్త 'పొడుస్తున్న పొద్దు'ను స్వాగతించడం. నిరసించడం అంటే మా ఉగాదులూ. ఉషస్సులూ వేరని భావించడమే.

● **కందుకూరి రమేష్‌బాబు**
స్వతంత్ర జర్నలిస్టు, ఛాయా చిత్రకారుడు

వాళ్ల మీద గద్దర్‌ను రుద్దడం అవసరమా?

గద్దర్.. మెజారిటీ జీవితం విప్లవోన్ముఖదిశగా సాగిన ఒక మహా ప్రవంతి. చివర్లో ఆయన అడుగులు తడబడ్డా, కనీసం తడబడ్డట్టు విమర్శలు తీవ్రమైనా, ప్రధానంగా ఆయన వ్యతిరేకిస్తూ వచ్చింది ఈ రాజ్య వ్యవస్థను. దీనికి వ్యతిరేకంగా ఆయన గళం నిరంతరం నినదించింది. ప్రస్తుత తెలంగాణ ప్రభుత్వానికి ఆయన మీద గౌరవభావమో, ఇంకా మరేదో ఉన్నప్పటికీ దాన్ని మరో రకంగా కొంచెం ఎత్తైన విగ్రహాలు పెట్టో, ఆయన పేరు మీద ఏదో ఒక పీఠం ఏర్పాటు చేయడం వంటి వాటి ద్వారా ప్రకటించుకోవడం బహుశా ఇబ్బందికరం కాకపోవచ్చు కానీ, ఒక రాష్ట్ర అవార్డును తీసుకోబోయే వాళ్ళు అయిష్టంగా తీసుకోవాల్సిన పరిస్థితిని కల్పించడం సమంజసమేనా?

ఈ అవార్డులూ రివార్డులూ తీసుకునే వాళ్ళందరూ ఈ గద్దర్ ఎవరో, ఏమిటో ఆయన జీవిత పర్యంతం దేనికోసం పోరాడారో తెలుసుకున్నవాళ్లేననీ, తెలుసుకునే ఉంటారనీ అనుకునే ఫీల్డ్ కానీ కానే కాదు (పాపము శమించు గాక). అది పక్కా వ్యాపార రంగం. వాళ్లలో కొందరికి బిల్లా, రంగాలకు మార్క్స్, లెనిన్‌లకూ కూడా తేడా తెలియని వాళ్ళు ఉండొచ్చు. (ఇక్కడ నేను అందర్నీ ఒకే గాట కట్టడం లేదు! కొందరి గురించి మాత్రమే అనాల్సి వస్తోంది!) పైగా ఒక రాష్ట్ర స్థాయి అవార్డు కోసం ఎదురుచూస్తూ ఉండే వాళ్లకు, గద్దర్ ఒకటో రెండో సినీ పాటలు పాడిన వాడిగా మాత్రమే తెలిసే అవకాశం ఉంటుంది తప్ప, ఆ ఇండస్ట్రీలో ఆయన ఘన కీర్తి ఏమిటన్నది తెలిసే సందర్భాలు ఇంచుమించు శూన్యం.

ఒకవేళ ఇదే నిజమై, రేపు ఈ గద్దర్‌ను ఈ అవార్డు రూపంలో ఇంట్లో పెట్టుకోవాల్సిన పరిస్థితిని ఎంతమంది స్వాగతిస్తారన్నది మిలియన్ డాలర్ల ప్రశ్నేమీ కాదు! మింగలేక, కక్కలేక ఒకవేళ ఆ అవార్డు గ్రహీతలు దాన్నొక బలవంత ప్రసాదంగా స్వీకరించినా, వారందరూ దాని తాలూకా 'కిక్కు'ను పొందుతారనుకోవడం కల్ల! గద్దర్‌ను ఇంత బలవంతంగా ఆ ఫీల్డ్‌కు ఏ మాత్రం సంబంధంలేని వాళ్ళ మీద రుద్దడం అవసరమా? రాష్ట్ర ప్రభుత్వానికి ఇంకే ప్రత్యామ్నాయం కనబడటం లేదా?

— వి.విజయకుమార్

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన చిరునామా
ఎడిటోపేజీ, ఆంధ్రజ్యోతి,
ప్లాట్–76, అశ్వినీ లే ఔట్, హుడా హైట్స్,
రోడ్ నంబరు–70, జూబ్లీహిల్స్,
హైదరాబాద్–500033.
మెయిల్: editpage@andhrajyothy.com

త్వరలో వరంగల్‌కు సీఎం రేవంత్



హనుమకొండ సిటీ, జనవరి 6: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి త్వరలో వరంగల్ నగరంలో పర్యటించనున్నారు. అసెంబ్లీ సమావేశాల తరువాత ఆయన రానున్నట్లు తెలిసింది. పలు అభివృద్ధి పనులను ఆయన ప్రారంభించనున్నట్లు పార్టీ వర్గాల సమాచారం. ఇటీవలే 'కుడా'లో జరిగిన సమీక్ష సమావేశంలో మంత్రి కొండా సురేఖ సూత్రప్రాయంగా రేవంత్‌రెడ్డి పర్యటనను వెల్లడించారు. త్వరలోనే ఆయనను నగరానికి తీసుకు వచ్చే ప్రయత్నాలు చేస్తున్నట్లు పేర్కొనడంతో పార్టీ వర్గాల్లో ఈ పర్యటనపై చర్చ జరుగుతోంది. మేడారం జాతర.. ఆపై లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో కోడ్ ప్రకటన కాక ముందే రేవంత్‌రెడ్డిని వరంగల్ నగరానికి తీసుకురావాలనే యోచనలో జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలున్నారు. ఇందుకు అనుగుణంగా మేడారం జాతరకు ముందే సీఎం చేతులమీదుగా అభివృద్ధి పనులను ప్రారంభింపజేయడం సరైందని భావిస్తున్నారు.



పోలీసు పోస్టింగుల్లో పొలిటికల్ వార్

ఉమ్మడి వరంగల్ జిల్లాలో మంత్రులు వర్సెస్ ఎమ్మెల్యేలు

పోలీసు పోస్టింగుల్లో పొలిటికల్ వార్ నడుస్తోంది. తాము సిఫారసు చేసిన వారికే పోస్టింగులు ఇవ్వాలని మంత్రులు పోలీసు ఉన్నతాధికారులపై ఒత్తిడి తెస్తుంటే.. తమ నియోజకవర్గాల్లో వారి పెత్తనమేంటని ఎమ్మెల్యేలు గుర్రుమంటున్నారు. దీంతో ఉమ్మడి వరంగల్ జిల్లాలో పోలీసు బదిలీలు మంత్రులు వర్సెస్ ఎమ్మెల్యేలుగా మారాయి. వరంగల్ పోలీస్ కమిషనరేట్‌తో పాటు ఉమ్మడిజిల్లాలోనూ పోలీసుల పోస్టింగుల్లో రాజకీయ నేతల సిఫారసులు కుప్పలుతెప్పలుగా వచ్చి పడుతున్నాయి. దీంతో కొద్ది రోజుల నుంచి నేడు, రేపు పోలీసుల బదిలీలు అంటూ ప్రచారం జరుగుతున్నా.. పోస్టింగులు మాత్రం ఎవరికీ ఇవ్వడం లేదు. రాజకీయ ఒత్తిళ్ల కారణంగానే బదిలీలకు బ్రేకులు పడుతున్నట్టు సమాచారం.

- నియామకాల భర్తీకి పోటాపోటీగా సిఫారసు లేఖలు
- ఒకే పోస్టుకు మంత్రి, ఎమ్మెల్యేల సిఫారసులు
- తమ నియోజకవర్గాల్లో జోక్యం చేసుకోవద్దంటూ మంత్రులపై ఎమ్మెల్యేల గుర్రు
- వరంగల్ కమిషనరేట్‌తో పాటు జిల్లాలోనూ ఇదే తంతు
- ఎవరి మాట వినాలో తెలియక తల పట్టుకుంటున్న పైఅధికారులు
- పైరవీలు లేక లూప్ లైన్‌కే కొంతమంది పోలీసులు అధికారులు

వరంగల్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : ఉమ్మడి వరంగల్ జిల్లాలో వరంగల్ పోలీస్ కమిషనరేట్‌తో పాటు భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్ ఎస్పీ కార్యాలయాలున్నాయి. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత గెలిచిన ఎమ్మెల్యే లు, మంత్రులు తమకు నచ్చిన వారికి పోస్టింగ్‌లు ఇచ్చేందుకు కసరత్తు మొదలుపెట్టారు. ప్రధానంగా వరంగల్ కమిషనరేట్ పరిధిలోని వరంగల్, హనుమకొండ, జనగామ జిల్లాల పరిధిలో ఉన్న 45పోలీస్ స్టేషన్లతో పాటు రెండు మహిళ, మూడు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్లలో ఉన్న ఎస్‌ఐలు, సీఐలు, ఎనిమిది మంది ఏసీపీలు, ముగ్గురు డీసీపీల్లో అనేక మందికి స్థానచలనం కల్పించేందుకు అధికార పార్టీ ఎమ్మెల్యేలు ప్రయత్నాలు చేపట్టారు. భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్ జిల్లాలో కూడా ఎస్‌ఐ, సీఐ. డీఎస్పీల బదిలీపై అధికార పార్టీ నేతలు దృష్టి సారించారు. అయితే అధికారంలోకి వచ్చిన వెంటనే బదిలీలు చేస్తే ప్రజల్లో తప్పుడు సంకేతాలు పోతాయని, కొద్ది రోజుల వరకు బదిలీల జోలికి వెళ్లవద్దని స్వయంగా సీఎం రేవంత్‌రెడ్డి సూచించటంతో ఎమ్మెల్యేలు కొద్ది రోజులు వెనక్కుతగ్గారు. అయితే ఇటీవల బదిలీ పర్వం మొదలవడంతో పొలిటికల్ సిఫారసు లేఖలతో పోలీసులు తమ బదిలీల కోసం ఉన్నతాధికారుల కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. దీంతో అయిష్టంగా కొన్ని బదిలీలకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినా ఉమ్మడి వరంగల్ జిల్లాల నుంచి వస్తున్న సిఫారసు లేఖలు పోలీసు ఉన్నతా ధికారులకు తలనొప్పులు తెచ్చిపెడు తున్నాయట. ఒకే పోస్టింగ్ కోసం రెండు మూడు సిఫారసు లేఖలు వస్తుండటంతో ఎవరు సూచించిన వారికి పోస్టింగ్ ఇవ్వాలో తెలియక పోలీసు ఉన్నతాధికారులు తలలు పట్టుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్న చర్చ జరుగుతోంది.



బదిలీల్లో పొలిటికల్ వార్..

ఏ శాఖలో లేనివిధంగా పోలీసు పోస్టింగ్‌ల్లో రాజకీయ జోక్యం మితిమీరిపోతోందన్న ఆరోప ణలు వినిపిస్తున్నాయి. పదేళ్లుగా కాంగ్రెస్ నేతలు అధికా రానికి దూరంగా ఉండటంతో తమకు అను కూలంగా ఉన్నవారికి పోస్టింగులు ఇప్పించుకునేం దుకు పోటీ పడుతున్నారనే ఆరోపణలున్నాయి. పోలీసు పోస్టింగుల్లో ఎమ్మెల్యేల సిఫారసులతో పాటు మంత్రులు కూడా సిఫారసు లేఖలు ఇస్తుండటంతో పొలిటికల్ వార్ ముదురుతోంది. స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గం పరిధిలో ఓ పోలీస్ స్టేషన్‌లో సీఐ పోస్టింగ్ కోసం స్థానిక అధికార పార్టీ నేత ఓ సిఫా రసు లేఖ ఇవ్వగా, అదే స్టేషన్ కోసం ఓ మంత్రి కూడా రెక మండ్ చేస్తూ లేఖ ఇచ్చారు. అలాగే పరకాల నియోజకవర్గం పరిధిలోని నగరానికి సమీపంలో ఉన్న ఓ పోలీస్ స్టేషన్‌కు ఓ సీఐ పేరును సూచిస్తూ రాష్ట్ర మంత్రి ఒకరు సిఫారసు లేఖ ఇవ్వగా, ప్రస్తుత సీఐనే కొన సాగించాలని స్థానిక ఎమ్మె ల్యే పట్టుబడుతున్నట్టు సమాచారం. నగరంలోని వరంగల్ పశ్చిమ నియోజక వర్గంలో ఏసీపీలు, సీఐ, ఎస్‌ఐల బదిలీల్లో ఓ మంత్రి జోక్యంపై స్థానిక ఎమ్మెల్యే గుర్రుగా ఉన్నట్లు ప్రచా రం జరుగుతోంది. నర్సంపేట నియోజకవర్గంలోని ఓ సీఐ బదిలీలో మరో మంత్రి జోక్యంపై స్థానిక నేతలు నారాజ్‌గా ఉన్నట్లుగా సమాచారం. వర్ధన్నపేట నియోజకవర్గం పరిధిలోని పలు పోలీస్‌స్టేషన్లలో ఎస్‌ఐ, సీఐ, ఏసీపీ బదిలీల్లో ఓ మంత్రి జోక్యంపై స్థానిక కాంగ్రెస్ నేతలు అలకవహిస్తున్నారు. మహ బూబాబాద్ జిల్లాలో ఓ పోలీస్‌స్టేసన్ సీఐ పోస్టింగు కోసం మరో మంత్రి సిఫారసు చేయడంపై స్థానిక ఎమ్మెల్యే కినుక వహించినట్టు చర్చ జరుగుతోంది. భూపాలపల్లి జిల్లాలో ఎమ్మెల్యే సిఫారసు చేసిన సీఐ పోస్టుకు మంత్రి కూడా మరో పేరును సూచించారని సమాచారం. ఇలా కమిషనరేట్‌తో పాటు జిల్లాలో పోలీసుల పోస్టింగుల కోసం మంత్రులు, ఎమ్మెల్యేలు

పైరవీ లేకుంటే లూప్‌లైన్‌లోకే..

ఏ పార్టీ అధికారంలో ఉన్నా కొందరు నిజాయితీగా పని చేసే అధికారులకు లూప్ లైన్ డ్యూటీస్ తప్పడం లేదు. కానిస్టేబుల్ నుంచి ఎస్పీ స్థాయి అధికారి బదిలీ వరకు పైరవీలు నడుస్తున్నాయనే ఆరోపణలున్నాయి. అన్ని శాఖల కంటే పోలీసుశాఖలోనే అధికంగా బదిలీలపై రాజ కీయ ఒత్తిళ్లు ఉంటాయనే చర్చ ఉంది. దీంతో డ్యూటీని నిజాయితీగా నిర్వహించే కొంత మంది అధికారులు, పైరవీలు చేయటం ఇష్టం లేని అధికారులకు లూప్ లైన్ డ్యూటీలు తప్ప వనే చర్చ జరుగుతోంది. హనుమకొండ నగర శివారులో పని చేస్తున్న ఓ సీఐ ఏడాది క్రితమే పోస్టింగ్ వచ్చింది. నాలుగేళ్ల లూప్‌లైన్‌లో కొన సాగిన సదరు సీఐకి తాజా బదిలీల్లో పైరవీలు చేసుకునేందుకు ఇష్టం లేకపోవడంతో తిరిగి లూప్‌లైన్‌కు వెళ్లాల్సి వస్తుందనే ప్రచారం జరుగుతోంది.

ఇలా అనేక మంది పోలీసు అధికారులు నిజాయితీగా పని చేసినప్పటికి, రాజకీయ పలుకుబడి లేకపోవటంతో లూప్‌లైన్‌లో ఏళ్ల తరబడి కొనసాగుతున్నారనే ప్రచారం జరుగు తుంది. ప్రభుత్వం సిఫార్సు లేఖలకు కాకుండా బాధ్యతయుతంగా పని చేస్తున్న వారిని గుర్తించి పోస్టింగులు ఇవ్వాలనే డిమాండ్ కొంతమంది పోలీసుల నుంచి వినిపిస్తోంది.



సైలెన్సర్లు ధ్వంసం చేస్తున్న ట్రాఫిక్ పోలీసులు

సైలెన్సర్లు మారిస్తే కఠిన చర్యలు

- సెంట్రల్‌జోన్ డీసీపీ అబ్దుల్ బారీ
- కేయూ జంక్షన్‌లో సైలెన్సర్ల ధ్వంసం

హనుమకొండ క్రైం, ఫిబ్రవరి 6: వాహనాలకు కంపెనీ నుంచి అమర్చి వచ్చిన సైలెన్సర్లను మార్పిడీ చేసి ద్విచక్రవాహనాలు రోడ్లపై నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని వరంగల్ పోలీసు కమిషనరేట్ సెంట్రల్‌జోన్ డీసీపీ అబ్దుల్ బారీ హెచ్చరించారు. హనుమకొండ ట్రాఫిక్ పోలీసులు వారం పాటు నిర్వహించిన స్పెషల్ డ్రైవ్‌లో బుల్లెట్, కేటీఎం వాహనాలకు కృతిమంగా అమర్చిన సైలెన్సర్లను స్వాధీనం చేసుకున్నారు. సుమారు రూ.5లక్షల విలువ గల 300 సైలెన్సర్లను కేయూ జంక్షన్‌లో బుల్డోజర్‌తో మంగళవారం ధ్వంసం చేశారు.

ఈ కార్యక్రమానికి డీసీపీ అబ్దుల్ బారీ హాజరై మాట్లాడుతూ.. ప్రజలు రోడ్లపై ప్రయాణిస్తున్న సమయంలో బుల్లెట్ వాహనాలకు కృత్రిమంగా అమర్చిన సైలెన్సర్ల ద్వారా భారీ శబ్దాలు రావడంతో శబ్ధ కాలుష్యం ఏర్పడుతోందని, అదే విదంగా ప్రజలకు ఇబ్బందిగా ఉంటోందని అన్నారు. ప్యాషన్ కోసం సైలెన్సర్లు అమర్చుకుని ప్రయాణం చేస్తే సంతోషంలో ప్రమాదాలు జరిగి ప్రాణాలు కూడా విడిచే అవకాశం కూడా ఉంటుందని అన్నారు. ప్రధానంగా పెద్ద పెద్ద శబ్ధాలతో ప్రయాణించే వాహనాల వల్ల చిన్న పిల్లలు, వృద్ధులకు గుండెపోటు వచ్చే అవకావాలు ఉన్నాయని చెప్పారు. వరంగల్ ట్రాఫిక్ ఏసీపీ బోజరాజు మాట్లాడుతూ.. మొదటి సారి పట్టుబడ్డ వారి వాహనాల నుంచి సైలెన్సర్లు స్వాధీనం చేసుకున్న తర్వాత కూడా మరో మారు అదే పద్ధతి పాటిస్తే వాహనం సీజ్ చేయడంతో పాటు లైసెన్సు రద్దు చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ జి.సీతారెడ్డి, ఎస్‌ఐ కట్టుమల్లు, ఆర్‌ఎస్‌ఐలు వేణు, మనోజ్‌లతో పాటు ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.



పరకాలలో బాల్క సుమన్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

భగ్గుమన్న కాంగ్రెస్ నేతలు

- సీఎంపై బాల్క సుమన్ వ్యాఖ్యలతో నిరసన సెగలు
- వరంగల్, హనుమకొండ జిల్లాల్లో దిష్టిబొమ్మ దహనాలు
- పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదులు.. క్షమాపణ చెప్పాలని డిమాండ్

హనుమకొండ సిటీ, ఫిబ్రవరి 6: సీఎం రేవంత్‌రెడ్డిపై మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ చేసిన వ్యాఖ్యలతో కాంగ్రెస్ నేతలు భగ్గుమన్నారు. వరంగల్, హనుమకొండ జిల్లాల శ్రేణులు గ్రామాలు, మండలాలు, నియోజకవర్గ కేంద్రాల్లో నిరసనలు నిర్వహించి బాల్క సుమన్ దిష్టిబొమ్మలను దహనం చేశారు. మంగళవారం ఉదయం 11 గంటల నుంచే కాంగ్రెస్ నేతలు ప్రధాన రహదారులు, జంక్షన్ల వద్దకు చేరుకుని బాల్క సుమన్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. 'ఖబడ్దార్ సుమన్' అంటూ హెచ్చరికలు చేశారు.

డీసీసీ కార్యాలయం ఎదుట

హనుమకొండలోని కాంగ్రెస్ జిల్లా కార్యాలయం ఎదుట వరంగల్ పశ్చిమ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు కోడిపాక గణేశ్ ఆధ్వర్యంలో నిరసన జరిగింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై మరోసారి బాల్క సుమన్‌తో పాటు బీఆర్‌ఎస్ నేతలు ఎవరైనా నోరు జారితే సహించేది లేదన్నారు. అనంతరం హనుమకొండ పోలీస్ స్టేషన్‌లో బాల్క సుమన్‌పై ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో కట్ల శ్రీనివాస్‌రావు, అనిల్, ముప్పిడి శ్రవణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. హనుమకొండ జిల్లాలోని దామెర, ఆత్మకూరు, పరకాల, ఎలుక తుర్తి, భీమదేవరపల్లి, కమలాపూర్, శాయంపేట తదితర మండలాలతో పాటు వరంగల్ జిల్లాలోని వర్ధన్నపేట, నర్సంపేట, పర్వతగిరి ఇలా జిల్లా వ్యాప్తంగా నిరసనలు రాజుకున్నాయి. బాల్కసుమన్ మాత్రమే కాదు మాజీ మంత్రి హరీశ్‌రావు తదితర బీఆర్‌ఎస్ నేతలు నాలుక దగ్గర పెట్టుకొని మాట్లాడాలని కాంగ్రెస్ నేతలు హెచ్చరించారు. లేని పక్షంలో గుణపాఠం చెబుతామన్నారు.

బీసీ కులగణన తర్వాతే ఎన్నికలు నిర్వహించాలి

- అసెంబ్లీలో విగ్రహం ఏర్పాటు చేస్తామని ప్రభుత్వం ప్రకటించాలి..
- కేంద్రంలో బీసీ సంక్షేమ శాఖను ఏర్పాటు చేయాలి
- జనగామను సర్దార్ సర్వాయి పాపన్న జిల్లాగా ప్రకటించాలి
- రౌండ్ టేబుల్ సమావేశంలో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

హనుమకొండ టౌన్, ఫిబ్రవరి 6: బీసీ కులగణన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని, ఏప్రిల్ 11న జ్యోతిబా పూలే జయంతిలోగా అసెంబ్లీలో విగ్రహం పెడతామని ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయాలని తెలంగాణ జాగృతి వ్యవస్థాపకురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. మంగళవారం హనుమకొండలోని శ్యామల గార్డెన్స్‌లో భారత జాగృతి, యునైటెడ్ పూలే ఫ్రంట్ ఆధ్వర్యంలో బీసీల హక్కుల సాధనకై రౌండ్ టేబుల్ సమావేశం మాజీ కుడా చైర్మన్ సంగంరెడ్డి సుందర్‌రాజ్ అధ్యక్షతన నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో పాల్గొన్న కవిత మాట్లాడుతూ.. 2006లో ఆవిర్భవించిన తెలంగాణ జాగృతి సంస్థ.. అనేక సామాజిక అంశాలపై గళమెత్తి సాధించిందన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అసెంబ్లీలో అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు చేయాలని పోరాడి సాధించుకున్నామన్నారు. ఎన్నికలకు ముందే జ్యోతిబా పూలే విగ్రహం అసెంబ్లీలో ఏర్పాటు చేసేందుకు రూపకల్పన చేశామన్నారు. అయితే పూలే జయంతిలోగా ప్రస్తుత ప్రభుత్వం అసెంబ్లీలో విగ్రహం ఏర్పాటు చేయాలని, లేదంటే ఉద్యమించి సాధించుకుంటామని కవిత హెచ్చరించారు. ఓబీసీలకు దక్కాల్సిన వాటా దక్కడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్నికలకు ముందు బీసీ కులగణన చేస్తామని బీసీ డిక్లరేషన్ చేశారని, వెంటనే బీసీ గణన ప్రారంభించి ఆరు మాసాల్లో పూర్తి చేయాలన్నారు. బీసీలకు ఇచ్చిన వాగ్దానాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం నిలుపుకోవాలన్నారు.

2024-25 బడ్జెట్‌లో బీసీలకు రూ.20వేల కోట్లు కేటాయించాలని, బీసీ సబ్ ప్లాన్‌కు చట్టబద్దత కల్పించాలని కవిత డిమాండ్ చేశారు. సర్దార్ సర్వాయి పాపన్న పేరును జనగామ జిల్లాకు పెడుతామని ప్రకటించిన కాంగ్రెస్.. మాట నిలబెట్టుకోవాలని ఆమె సూచించారు. ఐఏఎస్, ఐపీఎస్, ఐఆర్‌ఎస్ ఉద్యోగాల్లో బీసీల వాటా దక్కడం లేదన్నారు. 2018 నుంచి ఇప్పటి వరకు జరిగిన యూపీఎస్ పరీక్షలో 4365మంది ఐఏఎస్, ఐపీఎస్, ఐఆర్‌ఎస్ ఉద్యోగాలు సాధిస్తే ఇందులో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు కేవలం 1,195 మందికి మాత్రమే ఉద్యోగాల పొందారని వివరించారు. జనరల్ కేటగిరీ వారే ఎక్కువ ఉద్యోగాలు సాధిస్తున్నారని ఆమె పేర్కొన్నారు. న్యాయ వ్యవస్థలోనే బీసీల పాత్ర అంతంత మాత్రమేనన్నారు. కేంద్రంలో బీసీ వెల్ఫేర్ శాఖను ఏర్పాటు చేయాలన్నారు. కేంద్రం ప్రవేశపెట్టిన రూ.26లక్షల కోట్ల బడ్జెట్‌లో బీసీలకు కేవలం రూ.5వేల కోట్లు కేటాయించడం ఎంతవరకు సమంజసమన్నారు. కలిసి ఉందాం.. కలిసి కొట్లాడి బీసీల హక్కులను సాధించుకుందామని కవిత పిలుపునిచ్చారు.

యునైటెడ్ పూలే ఫ్రంట్ కన్వీనర్ గట్టు రాంచందర్‌రావు మాట్లాడుతూ.. బీసీ కమ్యూనిటీ సమాజానికి వెన్నుముక అన్నారు. దేశంలో సగం ఉన్న బీసీలు నాగరికతకు అద్దం పడుతున్నారని ఆయన తెలిపారు. బీసీలు సామాజికంగా, ఆర్థికంగా బలపడాల్సిన అవసరం ఉందన్నారు. అందరి కోసం పోరాడిన మనం.. మన కోసం పోరాడి హక్కులు సాధించుకుందామన్నారు. పూలే జయంతిలోగా అసెంబ్లీలో ఆయన విగ్రహం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 12న ఇందిరాపార్క్ వద్ద ధర్నా చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఈ ధర్నాకు పెద్ద ఎత్తున తరలిరావాలన్నారు. ఎమ్మెల్సీ బస్వరాజ్ సారయ్య మాట్లాడుతూ.. బీసీలకు కేసీఆర్ సముచిత స్థానం కల్పించారని ఆయన తెలిపారు. బీసీ హక్కుల సాధన కోసం ఏ కార్యక్రమం తీసుకున్నా తనవంతు పాత్ర పోషిస్తానని పేర్కొన్నారు.

సభకు అధ్యక్షతన వహించిన సుందర్‌రాజ్ మాట్లాడుతూ.. 2014 ముందు బీసీల పట్ల చిన్న చూపు ఉండేదన్నారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాకనే బీసీ వర్గాలకు సముచిత స్థానం కల్పించబడిందన్నారు. 150 ఏళ్ల కిందటే జ్యోతిభా పూలే బీసీ వర్గాల్లో జ్యోతి వెలిగించారని ఆయన తెలిపారు. అసెంబ్లీలో ఆయన విగ్రహం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

ప్రతీ బీసీ కుటుంబానికి పూలే ఫొటోలు పంపిణీ చేసి ఆయన గొప్పతనాన్ని చాటాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘాల నేతలు వి.ప్రకాశ్, దాస్యం విజయభాస్కర్, నాగరాజు యాదవ్, తాళ్లపల్లి జనార్దన్‌గౌడ్, రాము, పులి రజనీకాంత్, వెంకట్రాజం, బయ్య స్వామి, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

మహాజాతరకు నేడు అంకురార్పణ

- మేడారంలో గుడిమెలిగే పండుగ



మేడారం, ఫిబ్రవరి 6: మేడారం సమ్మక్క, సారలమ్మ మహాజాతరకు బుధవారం అంకురార్పణ జరగనుంది. ప్రధానమైన గుడి మెలిగే పండగను వడ్డెలు (పూజారులు) నిర్వహించనుండగా.. ఇందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. బుధవారం ఉదయం మేడారంలోని సమ్మక్క, కన్నెపల్లిలోని సారలమ్మ, కొండాయిలోని గోవిందరాజులు, పూనుగొండ్లలోని పగిడిద్దరాజుల ఆలయాల్లో వడ్డెలు సంప్రదాయ పూజలు చేసిన తర్వాత ఆలయాలను శుద్ధి చేయనున్నారు. తర్వాత దూపదీప నైవేద్యాలను సమర్పిస్తారు. వేకువజామున పూజారులు, కుటుంబ సభ్యులు ఇళ్లను శుద్ధి చేసుకుంటారు. అనంతరం జంపన్న వాగులో పుణ్య స్నానాలు ఆచరించి మేడారంలోని సమ్మక్క, కన్నెపల్లిలోని సారలమ్మ పూజామందిరాలను దర్శించుకుంటారు. కాళ్లకు చెప్పులు లేకుండా ఉపవాసంతో ఉండి గుట్ట గడ్డిని సేకరించి డోలు వాయిద్యాల నడుమ తీసుకొచ్చి మందిరం పైకప్పుపై వేస్తారు. మహిళలు అటవీ ప్రాంతం నుంచి పుట్ట మట్టిని సేకరించి పూజామందిరాలలోని దేవతల గద్దెలను అలుకు పూతలు చేస్తారు. రంగుల ముగ్గులు వేసి అందంగా అలంకరిస్తారు. జాతర ప్రారంభ సూచికగా తొలిపూజ జరుగుతుండటంతో బుధవారం వనదేవతల గద్దెలను దర్శించుకునేందుకు లక్షలాదిగా భక్తులు మేడారం తరలిరానున్నారు.

ప్రయాణికుల కోసం
పకడ్బందీ ఏర్పాట్లు
- 'మేడారం'లో 55 ఎకరాల్లో బస్టాండ్
- 'ఆంధ్రజ్యోతి'తో ఆర్టీసీ వరంగల్ ఆర్‌ఎం శ్రీలత

7

కాజీపేట నుంచి అయోధ్యకు..

- ప్రత్యేక రైలు సర్వీసును జెండా ఊపి ప్రారంభించిన బీజేపీ నేతలు
- జై శ్రీరామ్ నినాదంతో మార్మోగిన ప్రాంగణం

కాజీపేట, ఫిబ్రవరి 6: కాజీపేట నుంచి అయోధ్యకు మంగళవారం సాయంత్రం 6:20 నిమిషాలకు స్పెషల్ రైలు బయలు దేరి వెళ్లింది. ఈ రైలును కామారెడ్డి శాసనసభ్యుడు కె.వెంకటరమణారెడ్డి, మాజీ మంత్రి ఈటల రాజేందర్, మాజీ ఎమ్మెల్యే కొండేటి శ్రీధర్, బీజేపీ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ, మాజీ ఎమ్మెల్యే ఎం.ధర్మారెడ్డి, జి.ప్రేమేందర్‌రెడ్డి, బీజేపీ నేతలు జెండా ఊపి రైలును ప్రారంభించారు. మొత్తం 22 బోగీలలో 1,226 మంది ప్ర యాణికులు ఈ రైల్లో తరలివెళ్లారు. ఐఆర్‌టీసీ ద్వారా ముం దుగానే టిక్కెట్‌లు బుక్‌చేసుకున్న భక్తులు, బీజేపీ నాయకులు మంగళవారం మధ్యాహ్నమే కాజీపేటకు పెద్దఎత్తున తరలివచ్చారు. జై శ్రీరామ్ నినాదాలతో రైల్వేస్టేషన్ ప్రాంగణం అంతా మారుమోగింది. రైల్వేస్టేషన్‌లో బ్యాండ్ మేళాలతో భక్తులకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కామారెడ్డి ఎమ్మెల్యే కట్రాపల్లి వెంకటరమణారెడ్డి, మాజీ మంత్రి ఈటల రాజేందర్ మాట్లాడుతూ.. కాజీపేట మీదుగా అయోధ్యకు ప్రత్యేక రైలు వెళ్లడం సంతోషంగా ఉందన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని జాగ్రత్తలు తీసుకున్నామన్నారు. మాజీ ఎమ్మెల్యే ఎం.ధర్మారావు, మాజీ మంత్రి జి.విజయరామారావు, మాజీ ఎమ్మెల్యే మెలుగూరి బిక్షపతితోపాటు స్థానిక నాయకులు పాల్గొన్నారు. రిటైర్డ్ డీఐజీ కృష్ణప్రసాద్‌తోపాటు బీజేపీ కేంద్ర, రాష్ట్ర నాయకులు పెద్దఎత్తున హాజరయ్యారు.



జెండా ఊపి రైలు ప్రారంభించిన బీజేపీ నాయకులు

భారీ బందోబస్తు

అయోధ్య రైలుకు, ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బంది లు తలెత్తకుండా ఆర్‌పీఎఫ్, సివిల్, జీఆర్పీతోపాటు పోలీస్ స్పెషల్ బలగాలు మొత్తంగా 42 మంది పోలీసులు పెద్దఎత్తున కాజీపేట రైల్వేస్టేషన్‌లో మొహరించారు. ముందుగా నే బుకింగ్ చేసుకోవడంతో ప్రత్యేక కౌంటర్‌ల ద్వారా ఐడీ కార్డులు టికెట్‌లు చెక్ చేసి పంపించారు. 11 మంది పోలీసులు రైలును గంటకోసారి తనిఖీ చేయనున్నారు. రైళ్లలో పనిచేసే శానిటేషన్ సిబ్బందికీ ప్రత్యేక కార్డులు ఇచ్చారు.

కేంద్రంలో మళ్లీ బీజేపీదే అధికారం

- బీజేపీ నేత ఈటల రాజేందర్

హనుమకొండ రూరల్, ఫిబ్రవరి 6: కేంద్రంలో బీజేపీ మళ్లీ అధికారం చేపడుతుందని బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మాజీ మంత్రి ఈటల రాజేందర్ ధీమా వ్యక్తం చేశారు. మంగళవారం హనుమకొండ హంటర్‌రోడ్‌లోని వేద ఫంక్షన్ హాలులో బీజేపీ వరంగల్ పార్లమెంట్ ప్రవాస యోజన సమావేశం పార్లమెంట్ కన్వీనర్ టి.కుమారస్వామి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఈటల రాజేందర్ హాజరై మాట్లాడారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ జెండా ఎగురవేయాలని పిలుపునిచ్చారు. ప్రపంచ దేశాల్లో భారత్ ముందు వరుసలో నిలిపిన ఘనత నరేంద్ర మోదీదేనని తెలిపారు. బీజేపీ గెలుపు కోసం నాయకులు, కార్యకర్తలు ఇప్పటి నుంచే సైనికుల్లా పని చేయాలని కోరారు.

ఈ సమావేశంలో బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి, వరంగల్ పార్లమెంట్ ప్రభారి డాక్టర్ వి.మురళీధర్‌గౌడ్, హనుమకొండ, వరంగల్, భూపాలపల్లి జిల్లాల అధ్యక్షులు రావు పద్మ, గంట రవికుమార్, ఎ.నిషిధర్‌రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ మంత్రి గుండె విజయరామారావు, ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండేటి శ్రీధర్, రాష్ట్ర అధికార ప్రతినిధులు కీర్తిరెడ్డి, కృష్ణప్రసాద్, మాజీ మేయర్ టి.రాజేశ్వర్‌రావు, మాజీ ఎమ్మెల్యేలు మార్తినేని ధర్మారావు, వన్నాల శ్రీరాములు, మొలుగూరి భిక్షపతి, కన్నెబోయిన రాజయ్య, మంద ఐలయ్య, సమ్మిరెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఈటల రాజేందర్

కేయూ ఎల్ఎల్బీ పరీక్షల ఫీజు గడువు 17

కేయూ క్యాంపస్, ఫిబ్రవరి 6: కాకతీయ యూనివర్సిటీ ఎల్ఎల్బీ మూడేళ్ల కోర్సుల 3, 5, ఐదేళ్ల కోర్సుల 3,7,9 సెమిస్టర్ల పరీక్షల ఫీజులను ఫిబ్రవరి 17 వరకు ఎలాంటి అపరాధ రుసుం లేకుండా చెల్లించుకోవాలని కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ చాడ రాధికారెడ్డిలు మంగళవారం ఒకప్రకటనలో తెలిపారు. రూ.250 అపరాధ రుసుంలో ఫిబ్రవరి 20 వరకు ఫీజులు చెల్లించుకోవాలని పేర్కొన్నారు. ఫిబ్రవరి 17 వరకు ఎలాంటి అపరాధ రుసుం లేకుండా ఎల్ఎల్ఎం కేయూ మూడో సెమిస్టర్ పరీక్షల ఫీజులను చెల్లించుకోవాలని అధికారులు తెలిపారు. ఎంసీఏ (సీబీసీఎస్), ఎంబీఏ మొదటి ఏడాది మొదటి సెమిస్టర్ పరీక్షల ఫీజులను ఫిబ్రవరి 17 వరకు ఎలాంటి అపరాధ రుసుము లేకుండా చెల్లించుకోవాలని పరీక్షల నియంత్రణాధికారులు తెలిపారు. రెగ్యులర్, ఎక్స్, ఇంప్రూవ్‌మెంట్ అభ్యర్థులందరు ఫీజులు చెల్లించుకోవాలని రూ.250 అపరాధ రుసుంతో ఫిబ్రవరి 20 వరకు అవకాశం ఉందని పేర్కొన్నారు.

ఇద్దరు బీటెక్ విద్యార్థులపై కత్తితో దాడి

హనుమకొండ క్రైం, ఫిబ్రవరి 6: హనుమకొండ పోలీసుస్టేషన్ పరిధిలోని పోచమ్మకుంట సగరకాలనీలో అద్దెకు ఉంటున్న ఇద్దరు బీటెక్ విద్యార్థులపై ఒకరు కత్తితో దాడి చేసిన ఘటన వెలుగులోకి వచ్చింది. ఈ దాడిలో ఒకరికి తీవ్రగాయాలు కాగా మరొకరికి స్వల్ప గాయాలయ్యాయి. హనుమకొండ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్ జిల్లా నర్సంపేటకు చెందిన ఇదిగాని జెడ్సన్, గీసుగొండకు చెందిన కోల అరవింద్, మహబూబాబాద్ జిల్లా కొత్తగూడకు చెందిన తాటిపల్లి సుమంత్‌లు పోచమ్మకుంటలో ఓ ఇంటిని అద్దెకు తీసుకుని నగరంలోని ఓ కళాశాలలో బీటెక్ చదువుతున్నారు. కాగా, వారు ఉంటున్న ఇంటి సమీపంలో మరో ఇంటిలో పాముకుంట్ల రాకేశ్ అనే విద్యార్థి అద్దెకు ఉంటున్నాడు.

ఈ క్రమంలో రాకేశ్ సోదరుడు రాజ్‌కుమార్ తమ్ముడిని చూసేందుకు సోమవారం వచ్చాడు. రాత్రి మద్యం సేవించిన తర్వాత తమ్ముడు ఉంటున్న గదిలో గట్టిగా అరవడం, అక్కడకు వచ్చిన వారిని దుర్భాషలాడి అల్లరి చిల్లర చేశాడు. ఇమేమిటని బయటకు వచ్చిన జడ్సన్, అరవింద్, సుమంత్‌లను హేళన చేస్తూ ఎందుకు వచ్చారు? చంపేస్తా..? అని బెదిరిస్తూ నానా దుర్భాషలాడాడు. భయపడి ముగ్గురు గదిలోకి వెళ్లగా వారి ఉంటున్న గదిలోకి రాజ్‌కుమార్ బలవంతంగా ప్రవేశించాడు. కూరగాయలు కోసేందుకు ఉపయోగించే కత్తితో దాడికి దిగాడు. అరవింద్‌ను కత్తితో చాతిలో గట్టిగా పొడిచాడు. అడ్డుకునేందుకు వెళ్లిన సుమంత్ చేతిపై కత్తితో దాడి చేశాడు. ఈ ఘటనలో ఒకరికి తీవ్ర కత్తి గాయాలు కాగా, మరొకరికి స్వల్ప గాయాలయ్యాయి. రక్తం మడుగులో ఉన్న అరవింద్‌ను 108 సహాయంతో చికిత్స కోసం ఎంజీఎంకు తరలించారు. జెడ్సన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.

జనగామలో బెల్టుషాపుపై దాడులు

హనుమకొండ క్రైం, ఫిబ్రవరి 6: జనగామలో ఓ ఇంటిపై వరంగల్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు మంగళవారం దాడులు నిర్వహించారు. ఈ దాడులలో రూ.6వేల విలువ గల వివిధ రకాలైన మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ తెలిపిన వివరాల ప్రకారం.. జనగామ పట్టణం వీవర్స్‌కాలనీలో ఉంటున్న రంగు నాగయ్య అనే వ్యక్తి చాలా కాలంగా ఇంటినే అడ్డాగా చేసుకుని మద్యం విక్రయిస్తున్నట్టు పక్కా సమాచారం అందింది. దీంతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు చేసి పెద్ద ఎత్తున మద్యాన్ని పట్టుకున్నారు. నాగయ్యను అరెస్టు చేసి విచారించారు.


మాట్లాడుతున్న ఆర్ఎం శ్రీలత

ప్రయాణికుల కోసం పకడ్బందీ ఏర్పాట్లు

మేడారం జాతరలో 55 ఎకరాల్లో బస్టాండ్

ఈనెల 18 నుంచి నిరంతరం బస్సులు నడిపిస్తాం..

'ఆంధ్రజ్యోతి'తో ఆర్టీసీ వరంగల్ ఆర్ఎం శ్రీలత


మేడారంలో సిద్ధం చేస్తున్న బస్టాండ్ ప్రాంగణం

హనుమకొండ, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): ఈనెల 21వ తేదీ నుంచి నాలుగు రోజుల పాటు జరిగే మేడారం సమ్మక్క సారలమ్మ జాతరకు ఆర్టీసీ బస్సులను నడిపేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తోంది. గతంలో కన్నా ఈ సారి మరిన్ని ఎక్కువ బస్సులను నడపబోతోంది. ప్రతీసారి మేడారం జాతరకు కోటి మందికిపైగా భక్తులు తల్లుల దర్శనానికి వస్తారు. వీరిలో 20 లక్షల మందికిపైగా ఆర్టీసీ బస్సుల్లోనే వనదేవతల సన్నిధికి చేరుకుంటారు. ఈ సారి మహాలక్ష్మి పథకం కింద మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం ఉన్నందు వల్ల మహిళలు మరింత ఎక్కువ సంఖ్యలో జాతరకే రావచ్చునని అంచనా వేస్తున్నారు. ఆ మేరకు బస్సుల సంఖ్యను పెంచడంతో పాటు ఏర్పాట్లను కూడా విస్తృతంగా చేస్తున్నారు. ఈ నేపథ్యంలో బస్సు ప్రయాణ ఏర్పాట్లపై ఆర్టీసీ వరంగల్ రీజియన్ రీజినల్ మేనేజర్ శ్రీలత 'ఆంధ్రజ్యోతి'తో ముచ్చటించారు. ఆ విషయాలు ఆమె మాటల్లోనే..

ఆరు వేల బస్సులు

మేడారం జాతరకు ఈసారి రాష్ట్ర వ్యాప్తంగా 41 ఆపరేషన్ పాయింట్ల నుంచి ఆరువేల బస్సులను నడపనున్నాం. ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలోని 9 డిపోల పరిధిలో 17 పాయింట్ల నుంచి 2500 బస్సులను నడుపుతాం. 2022లో రాష్ట్రవ్యాప్తంగా 2800 బస్సులనే నడిపాం. కరోనా వల్ల భక్తుల రద్దీ లేకపోవడంతో బస్సుల సంఖ్య కూడా తగ్గింది. ఈసారి భక్తులు అధిక సంఖ్యలో జాతరకు వచ్చే అవకాశాలు ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకం వల్ల మహిళలు ఇంకా ఎక్కువ మంది వస్తారని అంచనా వేస్తున్నాం. ఆ మేరకు భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకొని ముందు జాగ్రత్తగా బస్సుల సంఖ్యను కూడా పెంచుతున్నాం. ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యంతో మహిళలు పెద్ద సంఖ్యలో రానున్న వారి కోసం ప్రత్యేకంగా బస్సులను నడపడం అంటూ ఏమీ ఉండదు.

ఈ నెల 18 నుంచి బస్సులు

ఈనెల 18 నుంచి మేడారానికి బస్సులు క్రమంగా నడుపుతాం. ఇప్పటికే జాతరకు బస్సులు నడుపుతున్నాం. ప్రతీ రోజు 50 బస్సులు మేడారానికి వెళుతున్నాయి. ప్రతీ బుధ, ఆదివారాల్లో 79 బస్సులు వెళుతున్నాయి. జాతర ముగిసే వరకు బస్సుల నడుస్తాయి. అప్పటి వరకు అన్ని రూట్లలో బస్సులు అందుబాటులో ఉంటాయి. ఈ సారి 40లక్షల మంది వస్తారని అంచనా వేస్తున్నాం.

55 ఎకరాల్లో బస్‌స్టేషన్

భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకొని ఈసారి మేడారంలో బస్‌స్టాండ్‌ను కూడా మరింత విశాలంగా ఏర్పాటు చేస్తున్నాం. ఇది వరకు 40 ఎకరాల్లో బస్‌స్టాండ్ ఏర్పాటు చేసేది. ఈ సారి అదనంగా మరో 15 ఎకరాల స్థలం అదనంగా తీసుకున్నాం. మొత్తం 55 ఎకరాల్లో బస్‌స్టాండ్‌ను ఏర్పాటు చేస్తున్నాము. క్యూలైన్లను కూడా పెంచుతున్నాము. ఇదివరకు బస్‌స్టాండ్‌లో 39 క్యూలైన్లు ఉండేది. ఈసారి ఈ సంఖ్యను 45కు పెంచుతున్నాం. బస్టాండ్‌లో భక్తుల కోసం అవసరమైన అన్ని సౌకర్యాలను కల్పిస్తున్నాం. ముఖ్యంగా తాగునీటి కోసం రెండు ఆర్‌వోఆర్ ప్లాంట్లను అందుబాటులో ఉంచుతున్నాం. ఇందులో ఒకటి బస్‌స్టాండ్, రెండోది క్యూలైన్ల వద్ద ఉంటుంది. ప్రయాణికులకు తాగునీరు అందించేందుకు, తగిన మార్గదర్శనం నెరిపేందుకు స్వచ్ఛంద సంస్థల సహకారాన్ని కూడా తీసుకుంటున్నాం. బస్‌స్టాండ్ ప్రాంగణంలో ప్రయాణికుల కోసం 80 తాత్కాలిక మరుగుదొడ్లను ఏర్పాటు చేస్తున్నాం.

పార్కింగ్‌కు అదనపు స్థలం

ఈ బస్సు సంఖ్య పెంచినందువల్ల పార్కింగ్ సమస్య రాకుండా ముందస్తు ఏర్పాట్లు చేస్తున్నాం. మేడారంలో బస్‌స్టాండ్‌లో 2వేల బస్సులు నిలిచేందుకు మాత్రమే స్థలం ఉంది. మిగతా బస్సుల పార్కింగ్ కోసం కామారం వద్ద 18 ఎకరాలతో అదనంగా మరో పార్కింగ్ ఏర్పాటు చేస్తున్నాం. బస్‌స్టాండ్‌లో బస్సులు ఖాళీ అవుతుంటే కామారంలో పార్కింగ్ చేసిన బస్సులను ఇక్కడికి పంపిస్తాం. దీనివల్ల బస్‌స్టాండ్‌లో ఒత్తిడి తగ్గుతుంది. రద్దీ సమస్య ఉండదు.

రీజియన్ నుంచి 50 శాతం సర్వీసులు

ఆర్టీసీ వరంగల్ రీజియన్ పరిధిలోని మొత్తం 741 బస్సుల్లో 365 బస్సులను మేడారం స్పెషల్‌గా నడుస్తున్నాయి. మిగతావి రీజియన్ పరిధిలోనే ఆయా డిపోల పరిధిలోని జాతర బస్ పాయింట్ల వద్దకు ప్రయాణికులను చేరవేయడానికి నడుస్తాయి. జాతరకు పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సులే నడుస్తాయి. హైదరాబాద్ తదితర దూర ప్రాంతాల నుంచి సూపర్ ఎక్స్‌ప్రెస్ ఏసీ బస్సులు నడుస్తాయి.

150 కొత్త బస్సులు

జాతర కోసం ప్రస్తుతం ఉన్నవాటితో పాటు 150 కొత్త బస్సులను కూడా నడుపనున్నాం. వరంగల్ రీజియన్‌కు 50 కొత్త బస్సులు వచ్చాయి. వీటితో పాటు అదనంగా మరో 100 కొత్త బస్సులను జాతరలో నడపాలని నిర్ణయించుకున్నాము. కొత్త బస్సులు ఈ నెల 18 నుంచి జాతర భక్తులకు అందుబాటులోకి వస్తాయి.

15వేల సిబ్బంది

జాతరలో బస్సుల నిర్వహణకు 15వేల మందిని నియమిస్తున్నాం. డిపో మేనేజర్లు, డ్రైవర్లు, కండక్టర్లు, సెక్యూరిటీ ఆఫీసర్లు, ట్రాఫిక్ అధికారులు, మెకానిక్‌లు తదితర సిబ్బంది వీరిలో ఉంటారు. బస్సుల నిర్వహణలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నాం. సిబ్బంది కొరత లేకుండా ముందస్తు ఏర్పాట్లు చేస్తున్నాం.

నాలుగు చోట్ల మెకానికల్ క్యాంపులు

జాతరలో సాంకేతిక సమస్యలు తలెత్తి మార్గ మధ్యలో ఎక్కడైనా బస్సులు నిలిచిపోయిన పక్షంలో తక్షణం అక్కడకు చేరుకొని వాటికి మరమ్మతులు చేసేందుకు నాలుగు చోట్ల - మేడారం, తాడ్వాయి, పస్రా, గట్టమ్మ వద్ద మెకానికల్ క్యాంపులను ఏర్పాటు చేస్తున్నాం. ఒక్కొక క్యాంపులో ఆరుగురు మెకానిక్‌లు, ఇద్దరు ఎలక్ట్రీషియన్లు ఉంటారు. వీరు ఎక్కడ బస్సు నిలిచిపోయినా తక్షణం అక్కడి వెళ్లి వాటిని బాగు చేస్తారు. బాగుకాకపోతే ఆ బస్సును క్రేన్ సహాయంతో పక్కన పెడతారు. పన్నెండు మొబైల్ వ్యాన్ల (డీజీబీ)ను కూడా తాడ్వాయి, నార్లాపూర్, పస్రా, గట్టమ్మ దేవాలయం, ఘనపూర్, కాటారం తదితర ప్రాంతాల్లో ప్రతీ 25 కి.మీ. ఒకటి చొప్పున అందుబాటులో ఉంటాయి. ఈ మొబైల్ వ్యాన్లను బస్సును బాగు చేయడానికి అవసరమైన విడిభాగాలు సిద్ధంగా ఉంటాయి. చెడిపోయిన బస్సుల వల్ల బస్సుల రాకపోకలకు అంతరాయం కలగకుండా వాటిని ఎత్తి పక్కన పెట్టేందుకు రెండు క్రేన్లు, ఒక ట్రాక్టర్‌ను సైతం సిద్ధంగా ఉంచుతున్నాం. ఈ మొబైల్ వ్యాన్లలో ఉన్నవారి ఫోన్లను డ్రైవర్లకు, ఇతర సిబ్బందికి ఇస్తాం. వారు ఎక్కడైనా బస్సు ఆగిపోతే వారు ఫోన్ చేసి సమాచారం ఇవ్వగానే మొబైల్ వ్యాన్ తక్షణం అక్కడి చేరుకొని బస్సుకు మరమ్మత్తు చేస్తుంది.

వైర్‌లెస్ సెట్లు

జాతర మార్గంలో బస్సుల రాకపోకలను ఎప్పటికప్పుడు గమనిస్తూ అవి సాఫీగా ముందుకు సాగేలా చర్యలు తీసుకునేందుకు కూడా ఏర్పాట్లు చేస్తు న్నాం. ఇందుకోసం స్క్వాడ్లను ఏర్పాటు చేస్తున్నాం. 15 జీపులు, 6 మోటార్ సైకిళ్లపై వీరు తిరుగుతూ బస్సుల రాకపోకలను ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉంటారు. వైర్‌లెస్ సెట్లద్వారా సమాచారాన్ని తెలుసుకుంటారు. ప్రతీ 25 కి.మీ. మధ్య ఒక స్క్వాడ్ నిరంతరం తిరుగుతూనే ఉంటుంది. జాతర మార్గం మొత్తాన్ని ఈ స్క్వాడ్లు కవర్ చేస్తూ ఉంటాయి.

ట్రాకింగ్ పరికరాలు

జాతర మార్గంలో బస్సుల రాకపోకలను నిరంతరం గమనించేందుకు ట్రాఫిక్ డివైస్‌లను కూడా వినియోగిస్తున్నాం. హనుమకొండ -మేడారం మధ్యలో వీటిని ఉపయోగిస్తాం. తాడ్వాయి- మేడారం మధ్య ఇంటర్‌నెట్ వ్యవస్థ సరిగా పనిచేసేదానిపై వీటి వాడకం ఉంటుంది. అయితే హనుమకొండ- తాడ్వాయి మధ్య మాత్రం ఇవి పని చేస్తాయి. హనుమకొండ ఆర్ఎం కార్యాలయంలోని సెంటర్ కామాండ్ సిస్టమ్‌లో ఈ ట్రాకింగ్ డివైస్‌లు అనుసంధానం అయి ఉంటాయి. బస్సులు ఎలా నడుస్తున్నాయి? ఎంత వేగంతో నడుస్తున్నాయి? ఎక్కడైనా నిలిచిపోయాయా? ఏదైనా బస్సుకు సమస్య వచ్చిందా? అనేది కమాండ్ కంట్రోల్ రూంలోని మానిటర్ల ద్వారా ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉంటాం. ఆ మేరకు సిబ్బందిని అప్రమత్తం చేస్తాం. ఎక్కడైనా ట్రాఫిక్ జామ్ అయినా ఈ మానిటర్ల ద్వారా తెలుసుకోవచ్చు.

బస్ పాయింట్లు

మేడారం వెళ్లే భక్తుల కోసం నగరంలో, అన్ని డిపో కేంద్రాల్లో 17 బస్సు పాయింట్లను ఏర్పాటు చేస్తున్నాం. నగరంలో వరంగల్, కాజీపేట రైల్వే స్టేషన్ల వద్ద, అలాగే హనుమకొండలోని హయగ్రీవచారి గ్రౌండ్‌లో వీటిని ఏర్పాటు చేస్తున్నాం. జనగామలోని ప్రిస్టన్ స్కూల్, స్టేషన్‌ఘనపూర్, తొర్రూ రు, వర్ధన్నపేట, మహబూబాబాద్, నర్సంపేట, కొత్తగూడ, పరకాల, చిట్యాల, ఘనపూర్, భూపాలపల్లి, కాళేశ్వరం, కటారం తదితర ప్రాంతాల్లో బస్సు పాయింట్లు అందుబాటులో ఉంటాయి. ఇక్కడ ప్రయాణికులతో బస్సులు నిండగానే వెంట వెంటనే బయలుదేరుతాయి.

మేడారం ప్రధాన ద్వారం ముస్తాబు

తాడ్వాయి, ఫిబ్రవరి 6: మండలకేంద్రంలోని మేడారం సమ్మక్క-సారలమ్మ ప్రధాన ద్వారాన్ని రంగురంగులతో ముస్తాబు చేస్తున్నారు. మాఘశుద్ధ పౌర్ణమిని పురస్కరించుకుని ఈనెల 21నుంచి 24వతేదీ వరకు జరిగే మహాజాతర సందర్భంగా దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో మండలకేంద్రంలో గల మేడారం ఆర్చ్, గేటుకు రంగురంగులతో సమ్మక్క-సారలమ్మ దేవతల విగ్రహాలకు, సలహారానికి ముస్తాబు చేస్తున్నారు. ఈఏడాది అమ్మవార్లను దర్శించుకునేందుకు లక్షలాదిమంది భక్తులు తరలిరానుండడంతో ఈప్రాంతాన్ని అధికారులు శోభాయమానంగా తీర్చిదిద్దుతున్నారు. తాడ్వాయిలో ఎక్సైజ్, పోలీస్, ఆర్టీసీ, వైద్యఆరోగ్యశాఖ, ఆర్‌డబ్ల్యూఎస్, తదితర విభాగాల అధికారులు వారంరోజులపాటు ఉండేందుకు బస ఏర్పాట్లను ముమ్మరం చేస్తున్నారు. దీంతోపాటు విద్యుత్‌శాఖ అధికారులు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా లైన్లను ఏర్పాటు చేస్తున్నారు. మరో వారంరోజుల్లో ఏర్పాటుచేసిన బస కేంద్రాలు అందుబాటులోకి రానున్నాయి. ఏది ఏమైనప్పటికీ బుధవారం నుంచి మేడారం జాతర ఆరంభానికి నాంది పలుకుతుండడంతో భక్తులు అధిక సంఖ్యలో వస్తూ అమ్మవార్లను దర్శించుకుంటున్నారు.


తాడ్వాయిలో ముస్తాబు అవుతున్న తోరణం


వనదేవతలను దర్శించుకుంటున్న భక్తులు

వన దేవతలకు భక్తుల మొక్కులు

మేడారం, ఫిబ్రవరి 6: మేడారం మహాజాతరకు ముందుగా తరలివస్తున్న భక్తులు సమ్మక్క, సారలమ్మ గద్దెల వద్ద మొక్కులు చెల్లించుకుంటున్నారు. మంగళవారం 30వేలకుపైగా భక్తులు తరలివచ్చి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా జంపన్న వాగులో పుణ్య స్నానాలు ఆచరించారు. కల్యాణ కట్టలో తలనీలాలు సమర్పించుకున్నారు. కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో కలిసి గద్దెల వద్దకు చేరుకుని పూలు, పండ్లు, పసుపు, కుంకుమ, కొబ్బరి కాయలు, బెల్లం సమర్పించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. యాట మొక్కులు తీర్చుకుని మేడారం పరిసరాల్లోని చెట్ల కింద విడిది చేశారు.

ములుగును సమ్మక్క, సారలమ్మ జిల్లాగా నామకరణం చేయాలి


కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న పూజారుల సంఘం అధ్యక్షుడు జగ్గారావు

మేడారం, ఫిబ్రవరి 6: ములుగుకు వనదేవతలు సమ్మక్క, సారలమ్మ జిల్లాగా నామకరణం చేయాలని మేడారం పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్ధబోయిన జగ్గారావు, తుడుందెబ్బ ఆదివాసీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు వట్టం ఉపేందర్ డిమాండ్ చేశారు. ములుగు జిల్లా సాధన సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ముంజాల భిక్షపతి అధ్యక్షతన మేడారంలోని హరిత హోటల్ ప్రాంగణంలో మంగళవారం కరపత్రాలను ఆవిష్కరించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ములుగు జిల్లాకు వనదేవతల పేర్లను అధికారికంగా ప్రకటించాలన్నది ప్రజల ఆకాంక్ష అని తెలిపారు. గత ఏడాది ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమ్మక్క, సారలమ్మ సన్నిధి నుంచి హాత్ సే హాత్ జోడో యాత్రను ప్రారంభించారని, ఆ సమయంలో ఇచ్చిన హామీ మేరకు జిల్లాకు సమ్మక్క, సారలమ్మల పేరును అధికారికంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. గతంలో నూతనంగా ఏర్పడిన కొన్ని జిల్లాలకు ఆయా ప్రాంతాల్లోని పుణ్య క్షేత్రాల పేర్లు పెట్టారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు వట్టం జనార్దన్, ఉపాధ్యాయుల సంఘం, నగరభేరి రాష్ట్ర కార్యదర్శి పోరిక ఉదయ్ సింగ్, పలు సంఘాల నాయకులు శ్రీనివాస్, నవీన్, వేణు, చింత కృష్ణ, శ్రావణ్, కృష్ణప్రసాద్, మహేష్, రత్నం, పూజారులు పాల్గొన్నారు.


వైద్య శిబిరాన్ని పరిశీలించిన డీఎంహెచ్‌వో అప్పయ్య

వైద్య శిబిరాలను సందర్శించిన డీఎంహెచ్‌వో

మేడారం, ఫిబ్రవరి 6: తాడ్వాయి మండలం మేడారం మహాజాతర సందర్భంగా పరిసర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన ఆరు వైద్య శిబిరాలను జిల్లా వైద్యాధికారి (డీఎంహెచ్‌వో) డాక్టర్ అల్లెం అప్పయ్య మంగళవారం సందర్శించారు. వైద్య సేవల రికార్డులు, సిబ్బంది హాజరు రిజిస్టర్లను పరిశీలించారు. మంగళవారం వరకు 3,250 మందికి వైద్య సేవలు అందించినట్లు తెలిపారు. చికిత్స పొందిన భక్తుల్లో అధికంగా గొంతు నొప్పి, జలుబు, జ్వరం, దగ్గు, వాంతులు, విరేచనాలతో వచ్చిన వారు ఉన్నారని అన్నారు. వారికి అవసరమైన మందులు అందించామని తెలిపారు. ఆది, బుధవారాలు భక్తులు అధిక సంఖ్యలో వస్తున్న దృష్ట్యా అనారోగ్యంతో బాధపడుతున్న వారి సంఖ్య పెరుగుతోందని తెలిపారు.



రక్షణ రంగంలో వాయుసేనది కీలకపాత్ర

సుబేదారి, ఫిబ్రవరి 2 : రక్షణ రంగంలో వాయుసేన విభాగానిది కీలకపాత్ర అని ఇండియన్ ఎయిర్ ఫోర్స్‌సీనియర్ నాన్ కమిషన్ ఆఫీసర్ రాజేష్ అన్నారు. వరంగల్ ములుగురోడ్‌లోని ఎల్బీ కళాశాలలో మంగళవారం ఇండియన్ ఎయిర్ ఫోర్స్ ఆధ్వర్యంలో అగ్నిపత్ స్కీమ్‌పై అవగాహన కార్యక్రమం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అరుణ డీహెచ్‌రావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. విద్యార్థులు, ఫిజికల్ టెస్ట్‌కి సంబంధించిన అంశాలు, మెడికల్ టెస్ట్‌కు సంబంధించిన వివరాలు, ఇంటర్వ్యూ ఎలా ఫేస్ చేయాలనే విషయాలపై ఈ సందర్భంగా రాజేష్ విద్యార్థులకు వివరించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారిణి మాధవి, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రాజేందర్ రెడ్డి, ఇండియన్ ఎయిర్ ఫోర్స్ నాన్ కమిషన్ ఆఫీసర్ మిశ్రా, ఎల్బీ కళాశాల ఎన్‌సీసీ ఆర్మీ వింగ్ అధికారి కెప్టెన్ డాక్టర్ ఎం. సదానందం, ఎన్‌సీసీ క్యాడెట్స్, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటా..

▸▸ వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు

గుండ్లసింగారంలో కాంగ్రెస్ జెండా ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే

హనుమకొండ క్రైం, ఫిబ్రవరి 6: కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటానని, ఏమైనా ఇబ్బందులు ఉంటే తనను నేరుగా కలిసి చెప్పుకోవాలని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు హామీ ఇచ్చారు. ఎమ్మెల్యేగా గెలుపొందిన తర్వాత తొలిసారిగా గ్రేటర్ వరంగల్ 2వ డివిజన్‌లో పర్యటించారు. ముందుగా కాంగ్రెస్ జెండాను ఆవిష్కరించారు. స్థానిక కార్యకర్తలతో కలిసి డివిజన్‌లోని గుండ్లసింగారం, భగత్‌సింగ్ కాలనీలలో సందర్శించి అక్కడి ప్రజలకు కావలసిన మౌలిక సదుపాయాలు, డ్రైనేజీ, మంచినీరు, రోడ్ల నిర్మాణంపై ప్రజల అభిప్రాయాలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు పొన్నాల రఘు, పుట్ట తిరుపతిలతో పాటు స్థానిక కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

జంతు సంరక్షణపై అవగాహన అవసరం

సుబేదారి, ఫిబ్రవరి 6 : జంతు సంరక్షణపై ప్రతీ ఒక్కరికి అవగాహన అవసరమని మేయర్ గుండు సుధారాణి అన్నారు. ప్రజా చైతన్యం కోసం జీడబ్ల్యూఎంసీ ఆధ్వర్యంలో మంగళవారం ములుగురోడ్‌లోని వెంకటేశ్వర గార్డెన్‌లో వీధి, పెంపుడు కుక్కలపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. కుక్కల విషయంలో నగర ప్రజలు జాగ్రత్తగా ఉండాలన్నారు. కుక్కల నివారణకు మునిసిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ప్రత్యేక చర్యలు చేపడుతున్నామన్నారు. కుక్కల దాడులను నియంత్రించడానికి దృశ్యరూప ప్రదర్శన(ప్రజంటేషన్) ఇచ్చినట్లు తెలిపారు. ఈ సందర్భంగా బల్దియా రూపొందించిన డాగ్ లైసెన్సింగ్, పెట్ రిజిస్ట్రేషన్, పెట్ అడాప్షన్ అప్లికేషన్(ఆప్)ను మేయర్, కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషాతో కలిసి బటన్ నొక్కి ప్రారంభించారు. అనంతరం కుక్కలపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రూపొందించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ రాధికా గుప్తా, కార్పొరేటర్లు, మునిసిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సాహిత్యం మానవ సమాజాన్ని ప్రతిబింబిస్తుంది

కేయూ వీసీ ప్రొఫెసర్ తాటికొండ రమేశ్



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కేయూ వీసీ ప్రొఫెసర్ తాటికొండ రమేశ్

కేయూ క్యాంపస్, ఫిబ్రవరి 6: సాహిత్యం మానవ సమాజాన్ని ప్రతిబింబిస్తుందని కేయూ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ తాటికొండ రమేశ్ అన్నారు. మంగళవారం కేయూ పరిపాలన భవనంలోని సెనెట్‌హాల్‌లో తెలుగు విభాగం, పీవీ విజ్ఞాన కేంద్రం సంయుక్తంగా కవి, రచయిత ముప్వా శ్రీనివాసరావు రూపొందించిన అనితరుడు పుస్తక ఆవిష్కరణ సభ జరిగింది. ఈ సందర్భంగా తెలుగు విభాగాధిపతి ప్రొఫెసర్ బన్న అయిలయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో వీసీ రమేశ్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. సాహిత్యం అన్ని వర్గాలను అదరిస్తుందని చెప్పారు. వ్యవస్థను మార్చేశక్తి మహిళలకు ఉందన్నారు. విద్యార్థులు చదువులతోపాటు సమాజాన్ని అర్థం చేసుకోవాలని అన్నారు. సాహిత్యాన్ని ఆకళింపు చేసుకుంటే విమర్శ సులభం అవుతోందని చెప్పారు. సద్విమర్శ ఉండాలని, వాస్తవికతకు స్పందన ఉంటుందని చెప్పారు. ముప్వా శ్రీనివాసరావు సాహిత్యంలో మార్క్సిస్టు దృక్పథం, అంబేద్కర్ వాదాలున్నాయని పేర్కొన్నారు.

కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత అంపశయ్య నవీన్ మాట్లాడుతూ.. యువతరం సాహిత్యానికి దగ్గర కావాలని కోరారు. కవిత్వంలో నూతనత్వం, వైవిధ్యత ఉండాలని అన్నారు. సాహిత్యకారుల ఆలోచన పరిధి విస్తృతమైనదని చెప్పారు. పుస్తక సమీక్ష చేసిన వాసిరెడ్డి కృష్ణారావు మాట్లాడుతూ.. కవి ఆలోచనలు ఎప్పుడూ సమాజంలో ముందుంటాని చెప్పారు. ముప్వా శ్రీనివాసరావు అనితరుడు పుస్తకంలో మహిళ ప్రాధాన్యం, గౌరవం, చంద్రయాన్-3లను ప్రస్తావించినట్లు పేర్కొన్నారు. మరోక గ్రంథ సమీక్షుడు డాక్టర్ బండారు రాజ్‌కుమార్ మాట్లాడుతూ.. తెలుగు సాహిత్యం గొప్పదని, సాహిత్యానికి వయస్సు అడ్డురాదని అభ్యుదయకవులు గుర్తుంచుకోవాలని చెప్పారు. శూన్యంలో వస్తువు సృష్టి కవికి సాధ్యమన్నారు. కవిత్వం బావోద్వేగాల వేగాన్ని పెంచుతాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో గిరిజా మనోహర్‌బాబు, వీఆర్ విద్యార్థి, పొట్లపల్లి శ్రీనివాసరావు, పగిడిపల్లి వెంకటేశ్వర్లు, డాక్టర్ మంథని శంకర్, కేఏల్ ప్రసాద్, పెద్ది వెంకటయ్య, బిల్లా మహేందర్, ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణ, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు. సమావేశం అనంతరం వీసీ ప్రొఫెసర్ తాటికొండ రమేశ్ ముప్వా శ్రీనివాసరావును శాలువ, జ్ఞాపిక అందచేసి ఘనంగా సన్మానించారు.

పోలీసు పోస్టింగుల్లో పొలిటికల్ వార్!

5వ పేజీ తరువాయి

పోటాపోటీగా సిఫారసు లేఖలు ఇస్తున్నట్లు జరుగుతున్న ప్రచారం చర్చనీయాంశంగా మారింది.

మంత్రులు వర్సెస్ ఎమ్మెల్యేలు

ఉమ్మడి వరంగల్ జిల్లాలో పోలీసుల బదిలీల్లో రాజకీయం జోక్యం మితిమీరిపోతుండటం చర్చనీయాశంగా మారింది. ప్రతీ జిల్లాలో ఎమ్మెల్యేలు ఒక పేరు సూచిస్తే.. మంత్రులు ఇంకో పేరు సూచిస్తూ సిఫార సు లేఖలను పోలీసు ఉన్నతాధికారులకు అంద జేస్తున్నారు. దీంతో 'కరవమంటే కప్పకు.. విడవ మంటే పాముకు కోపం' అన్న చందంగా పోలీసు పైరవీలు ఉన్నాయన్న చర్చ జరుగుతోంది. మంత్రుల సిఫారసు లేఖలను అమలు చేయాలా? ఎమ్మెల్యేల లేఖలకు విలువ ఇవ్వాలా? తెలియక ఉన్నతాధికారులు బదిలీపై ఎటూ తేల్చుకోలేక పోతున్నారట. ఇప్పటికే వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో సీఐ, ఏసీపీ, డీసీపీల బదిలీలంటూ నాలుగైదు రోజులుగా ప్రచారం జరుగుతున్నా అర్డర్స్ మాత్రం బయటకు రావడం లేదు. దీనికి ప్రధాన కారణం రాజకీయ ఒత్తిళ్లే కారణమనే చర్చ జరుగుతుండగా.. ఒకేసారి భారీగా బదిలీలు ఉండే అవకాశం ఉందని తెలుస్తోంది. ఈ నేపథ్యంలో కొందరు పోలీసు అధికారులు కూడా తమకు ఇష్టమైన పోస్టింగు కోసం ఎమ్మెల్యేలు, మంత్రుల చుట్టూ చక్కర్లు కొడుతున్నారు. దీంతో మంత్రులు, ఎమ్మెల్యేలు ఎవరికి దగ్గరి వారికి వారు పోస్టింగుల కోసం సిఫారసు లేఖలు ఇస్తున్నారు. దీంతో మంత్రులు, ఎమ్మెల్యేల మధ్య అంతర్గతంగా వాగ్వాదం జరుగుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ క్రమంలో ఓ ఎమ్మెల్యే 'నా నియోజకవర్గంలో వేలు పెడితే ఊరుకునేదే లేదు. నీకు దండం పెడుతా నా పని నన్ను చేసుకోనివ్వు' అంటూ మంత్రితో వాగ్వాదానికి దిగినట్టు సమాచారం. కాగా, రాజకీయ నేతల నుంచి వస్తున్న ఒత్తిళ్లతో పార్లమెంట్ ఎన్నికల వరకు ఎలాంటి బదిలీలు వద్దని జిల్లా, కమిషనరేట్ పోలీసు బాసులుపై అధికారులకు సూచిస్తున్నారట. దీంతో ఎమ్మెల్యేలు, మంత్రుల మధ్య బదిలీలపై మనస్పర్థలు పెరుగుతున్నట్టు ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో బదిలీలపై ఆశతో ఉన్న పోలీసు అధికారులకు ఇప్పట్లో బదిలీలు ఉంటాయా.. లేక మేడారం మహాజాతర, పార్లమెంట్ ఎన్నికల వరకు వేచి చూడాల్సిందేనా అనే ఉత్కంఠతో ఉన్నారు.

నేడు నయీంనగర్ బ్రిడ్జి ప్రారంభోత్సవం

▸▸ రూ.85 కోట్ల వ్యయంతో నిర్మాణం

హనుమకొండ సిటీ, ఫిబ్రవరి 6 : హనుమకొండలోని నయీంనగర్ (మోరీ) బ్రిడ్జి విస్తరణ పనులను బుధవారం ఉదయం 10:30 గంటలకు ప్రారంభోత్సవ కార్యక్రమం జరుగనుంది. పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి పనులను ప్రారంభిస్తారు. రూ.85 కోట్ల వ్యయంతో దీని నిర్మాణం చేపట్టనున్నారు. నాలా విస్తరణ, రిటెయినింగ్ వాల్ నిర్మాణం తదితర పనులు కూడా వీటితో పాటు కొనసాగనున్నాయి. వర్షకాలంలో వడ్డెపల్లి చెరువు ఇతర ప్రాంతాల నుంచి వచ్చే వరద నీరుతో నయీంనగర్ బ్రిడ్జి వద్ద సమస్య ఏర్పడుతోంది. వరద నీరు బ్రిడ్జిపైకి ఉధృతంగా చేరుకోవడంతో ముంపు సమస్య ఉత్పన్నమవుతోంది. దీనిని నివారించేందుకు బ్రిడ్జి విస్తరణ, మరిన్ని వెంట్‌లను ఏర్పాటు చేసే పనులు చేపట్టనున్నారు.

ఇంటర్ పరీక్ష ఫీజు చెల్లింపునకు నేడు చివరి రోజు

హనుమకొండ రూరల్, ఫిబ్రవరి 6: ప్రభుత్వ, ప్రయివేట్ కళాశాలల్లో ఇంటర్మీడియేట్ చదువుతున్న ప్రథమ, ద్వితీయ సంవత్సర విద్యార్థులు ఎవరైనా పరీక్ష ఫీజు చెల్లించనట్లయితే ఈ నెల 7వ తేదీన రూ. 4,500 అపరాధ రుసుంతో చెల్లించవచ్చని జిల్లా ఇంటర్మీడియేట్ విద్యాధికారి ఏ.గోపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు, కళాశాల యాజమాన్యం ఈ విషయాన్ని గమనించి ఇంటర్ వార్షిక ఫీజు చెల్లించాలని సూచించారు.

పెండింగ్ సమస్యలు పరిష్కరించాలి..

హనుమకొండ క్రైం, ఫిబ్రవరి 6: ఉమ్మడి వరంగల్ జిల్లా విశ్రాంత పోలీసు అధికారుల సమస్యలు, పెండింగ్ బిల్లుల సమస్యలు పరిష్కరించాలని ఉమ్మడి వరంగల్ జిల్లా పోలీసు అధికారుల సంఘం నాయకులు రాష్ట్ర డీజీపీ రవిగుప్తాను కలిసి విన్నవించారు. హైదరాబాద్‌లోని డీజీపీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి నూతన డీజీకి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా అధికారులు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై వినతిపత్రం సమర్పించారు. జిల్లాలోని విశ్రాంత పోలీసు అధికారులకు, వారి కుటుంబాలకు మెడికల్ బిల్లులు సకాలంలో అందడం లేదని, దీనిపై డీజీపీ దృష్టి సారించి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఉమ్మడి జిల్లా విశ్రాంత పోలీసుల సంక్షేమం కోసం ప్రత్యేకంగా ఒక భవనం నిర్మించి ఇవ్వాలని వారు డీజీపీని కోరారు. డీజీపీని కలిసిన వారిలో ఉమ్మడి వరంగల్ జిల్లా విశ్రాంత పోలీసు అధికారుల సంఘం అధ్యక్షుడు పుల్లి వీరారెడ్డి, గౌరవ అధ్యక్షుడు రాధారపు సంజీవరెడ్డి, గౌరవ సలహాదారుడు పెరికారి శాంసుందర్‌రావులతో పాటు జిల్లా నాయకులు ఉన్నారు.

అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయండి



సమీక్ష జరుపుతున్న నాయిని రాజేందర్‌రెడ్డి, మేయర్ గుండు సుధారాణి

జీడబ్ల్యూఎంసీ(హనుమకొండ సిటీ), ఫిబ్రవరి 6: అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయాలని మేయర్ గుండు సుధారాణి, పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం హనుమకొండలోని కుడా కార్యాలయంలో జీడబ్ల్యూఎంసీ కమిషన్ షేక్ రిజ్వాన్ బాషాతో కలిసి అభివృద్ధి పనులను సమీక్షించారు. భద్రకాళి బండ్, స్మార్ట్‌సిటీతో పాటు వివిధ ప్రాంతాల్లో చేపట్టిన కల్వర్టులు, డ్రెయినేజీలు, రహదారుల పనులను సమీక్షించి పనులు త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో ఎస్ఈ ప్రవీణ్‌చంద్ర, కుడా ఈఈ భీమ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు పరిహారం ఇప్పించండి



మడికొండ శివారులో నిర్మిస్తున్న రైల్వే వ్యాగన్ వర్క్‌షాపు స్థలం వద్ద నిరసన తెలుపుతున్న రైతులు

మడికొండ, ఫిబ్రవరి 6 : కాజీపేట మండలం మడికొండ, అయోధ్యపురం గ్రామ రెవెన్యూ శివారులో నిర్మిస్తున్న రైల్వే పిరియాడికల్ ఓవర్ హాలింగ్, వ్యాగన్ వర్క్ షాపు కోసం భూములు కోల్పోయిన తమకు నష్టపరిహారం వెంటనే ఇప్పించాలని రైతులు డిమాండ్ చేశారు. మంగళవారం మడికొండ, అయోధ్యపురం శివారులో నిర్మిస్తున్న వ్యాగన్ వర్క్‌షాపు వద్ద రైతులు నిరసన చేపట్టారు. తమకు పరిహారం అందే వరకు వ్యాగన్ పరిశ్రమ నిర్మాణ పనులను నిలిపివేయించాలని జిల్లా కలెక్టర్‌తో పాటు వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, ఆర్‌డీవోను కోరారు. ఈ నిరసన ప్రదర్శనలో రైతులు కాగిత ప్రవీణ్, కాగిత రమ, మామిండ్ల రాములు, మామిండ్ల కృష్ణ, మామిండ్ల రవి, భైరబోయిన వెంకటయ్య మామిండ్ల భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

'పింగళి' డిగ్రీ 3, 5వ సెమిస్టర్ ఫలితాల విడుదల



ఫలితాలను విడుదల చేస్తున్న ప్రిన్సిపాల్ లెఫ్టినెంట్ డాక్టర్ బత్తిని చంద్రమౌళి, కేయూ అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ తిరుమలదేవి తదితరులు

కేయూ క్యాంపస్, ఫిబ్రవరి 6: హనుమకొండ వడ్డెపల్లిలోని పింగళి అటానమస్ మహిళ డిగ్రీ కళాశాల 3,5వ సెమిస్టర్ ఫలితాలు విడులయ్యాయి. మంగళవారం పింగళి కళాశాల ప్రిన్సిపాల్ చాంబర్‌లో జరిగిన కార్యక్రమంలో కేయూ అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఎం.తిరుమలదేవి, పింగళి కళాశాల పరీక్షల విభాగం ఇన్‌చార్జి డాక్టర్ రామకృష్ణారెడ్డి, తదితరులు ఫలితాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ లెఫ్టినెంట్ డాక్టర్ బత్తిని చంద్రమౌళి మాట్లాడుతూ.. బీఏ, బీకాం, బీఎస్సీ మొదటి, మూడో, ఐదో సెమిస్టర్ పరీక్షల ఫలితాలను వెల్లడించినట్లు తెలిపారు. మొదటి సెమిస్టర్‌లో 57.3, మూడో సెమిస్టర్‌లో 60.4 శాతం, ఐదో సెమిస్టర్‌లో 78.70 శాతం మంది విద్యార్థులు ఉత్తర్ణత సాధించినట్లు చెప్పారు. రాష్ట్రంలోని మహిళ అటానమస్ కళాశాలల్లో పింగళి కళాశాలే మొదటిగా 2,3,5వ సెమిస్టర్ పరీక్షల ఫలితాలను విడుదల చేసినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ రేణుక, శరీష, వైస్‌ప్రిన్సిపాల్ సుహాసిని, అకాడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ పార్వతి, డాక్టర్ రాజేశ్వరి, డాక్టర్ డీటీచారి, డాక్టర్ సురేశ్‌బాబు వివిధ విభాగాల అధిపతులు, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

తాగునీటి సరఫరా, పారిశుధ్య పనులు మెరుగవ్వాలి

జీడబ్ల్యూఎంసీ కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా



నల్లా నీటిని పరిశీలిస్తున్న కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా

జీడబ్ల్యూఎంసీ(హనుమకొండ సిటీ), ఫిబ్రవరి 6 : నగరంలో తాగునీటి సరఫరా, పారిశుధ్య సేవలు మరింత మెరుగవ్వాలని జీడబ్ల్యూఎంసీ అధికారులను కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా ఆదేశించారు. మంగళవారం హనుమకొండలోని చింతగట్టు, హసన్‌పర్తి తదితర ప్రాంతాల్లో క్షేత్రస్థాయిలో నీటి సరఫరా, పారిశుధ్య సేవలను పరిశీలించారు. నల్లాలకు ఆన్ ఆఫ్ బిగించకుండా కొందరు నీటిని వృథా చేస్తున్నారని కమిషనర్ అన్నారు. దీనిపి పరిశీలించి యజమానులపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

లీకేజీలు అరికట్టాలన్నారు. పారిశుధ్య పనులు సక్రమంగా జరగాలన్నారు. డ్రెయినేజీలను క్రమం తప్పకుండా శుభ్రం చేయాలని, దోమల నివారణ చర్యలు చేపట్టాలన్నారు. మారుతీనగర్‌లో పారిశుధ్య కార్మికుల హాజరును కమిషనర్ పరిశీలించారు. విధులకు గైర్హాజరవుతున్న కార్మికురాలిని తొలగించాలని సీఎంహెచ్‌వో డాక్టరు రాజేశ్‌ను ఆదేశించారు. జవహర్‌నగర్, రాజాజీనగర్ బ్రిడ్జి పనులను కమిషనర్ పరిశీలించారు. అక్రమంగా ఏర్పాటైన డబ్బాను తొలగించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈ ప్రవీణ్‌చంద్ర, ఈఈలు రాజయ్య, బీఎల్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రెండోరోజూ కొనసాగిన ఈవీఎంల తనిఖీ



ఈవీఎంలను పరిశీలిస్తున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

హనుమకొండ రూరల్, ఫిబ్రవరి 6: ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ల (ఈవీఎం) తనిఖీ రెండోరోజు కొనసాగింది. వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ యార్డులోని గోదాముల్లో భద్రపర్చిన ఈవీఎంల తనిఖీ ప్రక్రియను మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఈ నెల 12వ తేదీ వరకు మొదటి దశ తనిఖీని ఈసీఐఎల్ ఇంజనీర్ల బృందం సమక్షంలో నిర్వహిస్తామన్నారు. ఈవీఎంల మొదటిదశ తనిఖీలో 755 బ్యాలెట్ యూనిట్లు, 628కంట్రోల్ యూనిట్లు, 765వీవీ ప్యాట్ల పని తీరును సాంకేతిక నిపుణులు తనిఖీ చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మహేందర్‌జీ, ట్రెయినీ కలెక్టర్ శ్రద్ధా శుక్లా, తహసీల్దార్లు నాగరాజు, బావ్‌సింగ్, జ్యోతి వరలక్ష్మీ దేవి, ఏవో సత్యనారాయణ, నాయబ్ తహసీల్దార్ సంతోష్, రామకృష్ణ, విఠలేశ్వర్, శ్యామ్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

సదస్సును జయప్రదం చేయాలి

వడ్డెపల్లి, ఫిబ్రవరి 6: హనుమకొండ సుబేదారిలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ఆడిటోరియంలో ఈనెల 25న నిర్వహించే అంబేద్కర్ యువజన సంఘం చైతన్య సదస్సును జయప్రదం చేయాలని తెలంగాణ రాష్ట్ర అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మిద్దెపాక ఎల్లయ్య పిలుపునిచ్చారు. మంగళవారం హనుమకొండ పబ్లిక్ గార్డెన్ ప్రాంతంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద సదస్సుకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మిద్దెపాక ఎల్లయ్య మాట్లాడుతూ.. అంబేద్కర్ యువజన సంఘం గత ఐదు దశాబ్దాలుగా దళిత, గిరిజనుల సమస్యలపై సమరశీల పోరాటాలు చేస్తోందన్నారు. ఎస్సీ, ఎస్టీ మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టేందుకు కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో షెడ్యూల్ కులాల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు ఏనుట్ల రవి, జిల్లా కన్వీనర్ కడారి దేవయ్య, అంబేద్కర్ యువ సంఘం నేతలు మునిగాల డానియల్, మంత్రి చాణక్య, బంగారు బాబు, ఉమ్మడి కొమురయ్య, మేకల ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

వైద్య, ఆరోగ్యశాఖ జీవో 142ను రద్దు చేయాలి

హనుమకొండ అర్బన్, ఫిబ్రవరి 6: ప్రాథమిక ఆరోగ్య రంగాన్ని పటిష్టపర్చేందుకుగాను మానవ వనరులను హేతుబద్ధీకరించేందుకు గత ప్రభుత్వం విడుదల చేసిన జీవో ఎంఎస్ నెంబరు 142 లోపభూయిష్టంగా ఉందని, వెంటనే రద్దు చేయాలని బానోతు నెహ్రూ చంద్, కె.యాదనాయక్, కొప్పు ప్రసాద్, టి.మాధవరెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, పసియుద్దీన్ డిమాండ్ చేశారు. మంగళవారం హైదరాబాద్‌లోని మహాత్మా జ్యోతిరావు పూలే భవనంలో నిర్వహిస్తున్న ప్రజావాణిలో నోడల్ అధికారికి వారు వినతిపత్రం అందజేశారు. వైద్య, ఆరోగ్య ఉద్యోగులకు, రాష్ట్ర ప్రజలకు, మొత్తంగా వైద్య, ఆరోగ్యరంగానికి గొడ్డలిపెట్టు లాంటి జీవో 142ను రద్దు చేయాలన్నారు. ప్రజావాణి నోడల్ అధికారి స్పందిస్తూ ఈ విషయాన్ని ఆరోగ్యశాఖ కార్యదర్శి దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు.

9న జాబ్ మేళా

హనుమకొండ రూరల్, ఫిబ్రవరి 6: ఈ నెల 9వ తేదీన హనుమకొండ ములుగు రోడ్‌లోని జిల్లా ఉపాధి కల్పన కార్యాలయంలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి ఎం.మల్లయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌లోని అపోలో ఫార్మసీలో పని చేసేందుకు జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. డీఫార్మా, బీఫార్మా, ఎం ఫార్మా, డిగ్రీ, బీబీఎం చదివిన 18 నుంచి 35 యేళ్ల వయస్సుగల నిరుద్యోగ యువతీ యువకులు అర్హులని పేర్కొన్నారు. అర్హత, ఆసక్తి గల అభ్యర్థులు సర్టిఫికెట్ల జిరాక్స్‌లతో ఉపాధి కల్పన కార్యాలయానికి ఉదయం 11 గంటల వరకు హాజరు కావాలని సూచించారు. మరిన్ని వివరాలకు 98488 95937, 82476 56356లో సంప్రదించాలని తెలిపారు.

పవర్ లిఫ్టింగ్ గోల్డ్ మెడల్ విజేతలకు సన్మానం

కాజీపేట, జనవరి 6: నవంబరు 6న ముంబైలో జరిగిన నేషనల్ పవర్ లిఫ్టింగ్‌లో బంగారు పతకం సాధించిన కాజీపేట రాంనగర్‌కు చెందిన ఎం.డి. జాఫర్‌ను మంగళవారం కాజీపేటలో రైల్వే దేవాలయంలో స్థానికులు ఘనంగా సన్మానించారు. వీరే కాకుండా దామెరుప్పు మెగిళి, సుధాకర్ రన్నింగ్ విభాగంలో బంగారు పతకాలు సాధించినందుకు వీరిని సైతం పూలమాలలు వేసి, శాలువాలు కప్పి సన్మానించారు. కార్యక్రమంలో స్థానికులు సుంచు శ్రీనివాస్, పోలు శ్యామ్, మేకల రాజు తదితరులు ఉన్నారు.

ట్రాఫిక్ నియంత్రణపై అవగాహన

కేయూ క్యాంపస్, ఫిబ్రవరి 6: జాతీయ భద్రత వారోత్సవాలను పురస్కరించుకుని మంగళవారం హనుమకొండ వడ్డెపల్లిలోని పింగళి అటానమస్ పింగళి కళాశాలలో ట్రాఫిక్‌పై అవగాహన కల్పించారు. కళాశాల ఎన్ఎస్ఎస్ వలంటీర్లతో కళాశాల నుంచి ఫాతిమా కూడలి వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. కూడలిలో విద్యార్థినులు ప్రయాణాల్లో హెల్మెట్ ధరించకపోవడం, అతివేగంపై కలిగే అనార్థాలను వివరించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ లెఫ్టినెంట్ డాక్టర్ బత్తిని చంద్రమౌళి, ట్రాపిక్ ఏసీపీ బోజరాజులు ట్రాపిక్ నియంత్రణపై యువతకు కీలకమైన సూచనలు చేశారు. ట్రాపిక్ రూల్స్ పాటించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ట్రాపిక్ సీఐ సుజాత అన్వేష్‌డి. రామకృష్ణారెడ్డి, ఎన్ఎస్ఎస్ పీవోలు డి.రాధిక, కె.రాజేశ్వరి, ఐ.మంగమ్మ, వలంటీర్ల తదితరులు పాల్గొన్నారు.

స్నేహపూర్వక సమాజం కోసం కృషి చేయాలి



మాట్లాడుతున్న జిల్లా సంక్షేమ అధికారి మధురిమ

సుబేదారి, ఫిబ్రవరి 6: సమాజంలోని ప్రతీ ఒక్కరు బాలల స్నేహ పూర్వక సమాజం కోసం కృషి చేయాలని జిల్లా సంక్షేమ అధికారి కె. మధురిమ అన్నారు. జిల్లా బాలల పరిరక్షణ విభాగం, ఎఫ్ఎంఎం సాంఘిక సేవా సంస్థ ఆధ్వర్యంలో బాల్య వివాహాల నిర్మూలన, బాలల అక్రమ రవాణా, బాలల లైంగిక హింస, వేధింపులు నివారణ అనే అంశాలపై మంగళవారం సుబేదారిలోని అసుంత భవన్‌లో సమావేశం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా సంక్షేమ అధికారి మధురిమ హాజరై మాట్లాడారు. బాల్య వివాహాలు, బాలికల అక్రమ రవాణా నిర్మూలన, బాలికలపై లైంగిక హింస పర్యవసనాలపై క్షేత్ర స్థాయిలో అవగాహన కల్పిస్తే వాటి నివారణ సాధ్యమవుతుందన్నారు. చిన్న చిన్న సాకులతో, ఆర్థిక లేమి కారణాలతో ముక్కుపచ్చలారని పిల్లలకు వారి తల్లిదండ్రులు వివాహాలు చేసి వారి భవిష్యత్‌ను నాశనం చేస్తున్నారన్నారు. చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్‌పర్సన్ అన్నమనేని అనిల్ చందర్‌రావు మాట్లాడుతూ.. బాలల పరిరక్షణలో కమిటీల పాత్ర కీలకమన్నారు. పిల్లలు సామాజిక మాధ్యమాల ప్రభావాలకు లోనుకాకుండా ప్రతీ తల్లిదండ్రి జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో డీసీపీవో పి.సంతోష్ కుమార్, చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ ఎస్. ప్రవీణ్ కుమార్, చైల్డ్ హెల్ప్ లైన్ కోఆర్డినేటర్ ఎస్. భాస్, సోషల్ వర్కర్ మెరుగు శ్రీనివాసులు, జిల్లా మహిళా సాధికారత కేంద్రం లిటరసీ కోఆర్డినేటర్ స్వర్ణలత, ఎఫ్ఎంఎం సాంఘిక సేవా సంస్థ ప్రోగ్రాం అధికారి ఎర్ర శ్రీకాంత్, అజయ్ కుమార్, ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ టీచర్లు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి
నవ్య
కుటుంబ కదంబం
బుధవారం • 7 ఫిబ్రవరి 2024

హెల్తీ ఫుడ్

ఆ రెండింట్లో ఏది మేలు?

సబ్జా, షియా... ఈ రెండూ ఒకటేనా? ఏది ఎక్కువ ఆరోగ్యకరం? వీటిని ఎలా తీసుకోవాలి? ఇలా ఈ విత్తనాల గురించిన అనుమానాలు ఉన్నాయా? అయితే వీటి గురించి కొంత అవగాహన పెంచుకుందాం!

సబ్జా, షియా... ఈ రెండింట్లో సమాన పోషక విలువలుంటాయి. అధిక బరువు తగ్గాలి అనుకునేవాళ్లకు ఇవి రెండూ సూపర్ ఫుడ్స్! ఈ రెండింటినీ నీళ్లలో నానబెట్టి తీసుకోవచ్చు. అయితే చూడడానికి ఒకేలా ఉండడంతో రెండూ ఒకటేనని పొరపాటు పడుతూ ఉంటాం. అయినా ఫర్వాలేదు. పోషకాల పరంగా రెండూ ఉత్తమమైనవే! అయితే నీళ్లలో నానబెట్టే సమయాలు రెండిటికీ భిన్నంగా ఉంటాయి. మధ్య, దక్షిణ మెక్సికో నుంచి వచ్చిన షియా విత్తనాలలో పీచు, ఒమేగా - 3, ప్రొటీన్లు ఉంటాయి. మన దేశానికి చెందిన తులసి విత్తనాలైన సబ్జాలో ఛాతీలో మంట, శరీరంలోని టాక్సిన్లను తగ్గించే గుణాలుంటాయి. ఇక షియా విత్తనాలు నానడానికి కనీసం అరగంట సమయమైనా పడుతుంది. సబ్జా విత్తనాలు నీళ్లలో వేసిన క్షణాలలోపే నాని, ఉబ్బిపోతాయి. షియా విత్తనాలు నీళ్లలో నాని, బరువెక్కి, జెల్‌లాగా మారి పాత్ర అడుగుకు చేరుకుంటాయి. నానిన తర్వాత వాటి అసలు బరువుకు పదింతలు పెరుగుతాయి. సబ్జా విత్తనాలు నీళ్లలో క్షణాల్లో నానిపోయి, వాటి చుట్టూ పారదర్శక పొర ఏర్పడుతుంది.



ఇలా వాడుకోవాలి: షియా విత్తనాలను నానబెట్టి లేదా నానబెట్టకుండా నేరుగా కూడా తినవచ్చు. కానీ సబ్జా విత్తనాలను కచ్చితంగా నానబెట్టిన తర్వాతే తీసుకోవాలి. స్మూదీలు, మిల్క్‌షేక్స్‌లో షియా, సబ్జా రెండింటినీ కలుపుకుని తాగవచ్చు. సబ్జా విత్తనాలు లెమనేడ్స్, సలాడ్స్‌లో కూడా బాగుంటాయి.

బరువు తగ్గాలంటే: షియా, లేదా సబ్జా ఈ రెండింట్లో దేన్నైనా మధ్యాహ్న భోజనం లేదా రాత్రి భోజనానికి అర గంట ముందు నీళ్లలో నానబెట్టి తీసుకోవాలి. ఇలా తీసుకోవడం వల్ల కడుపు నిండుగా మారి, అతిగా తినే కోరిక తగ్గిపోతుంది.

వ్యాధినిరోధకశక్తి పెరగాలంటే

శరీరంలోని బ్యాక్టీరియా, వైరస్‌లాంటి వాటితో పోరాడాలంటే వ్యాధి నిరోధక శక్తి(ఇమ్యూనిటీ) అవసరం. ఇందుకోసం ఈ చిట్కాలు పాటిస్తే చాలు.

- కాలుష్యం బారినుంచి తప్పించుకోవాలంటే చేతులు, కాళ్లు శుభ్రం చేసుకున్న తర్వాతనే ఆహార పదార్థాలు తినాలి. ముఖ్యంగా తిండి తినటానికి సరైన సమయం ఏర్పరచుకోవాలి. డైట్ పర్ఫెక్ట్‌గా ఉంటేనే జీర్ణ సంబంధ సమస్యలు వచ్చే అవకాశాలు తక్కువ. సరైన డైట్ పాటిస్తేనే ఇమ్యూనిటీ పెరుగుతుంది.



- ఇమ్యూనిటీ ఫుడ్ అంటే మాంసాహారం, చేపలు, ఆకుకూరలు, పండ్లు.. ఇవన్నీ తాజాగా ఉంటేనే తినాలి. అప్పుడే శరీరానికి పడుతుంది. తద్వారా ఇమ్యూనిటీ పెరుగుతుంది. ముఖ్యంగా సిట్రస్ పండ్లయిన నిమ్మ, ఉసిరి, నారింజలను తినాలి. వీటిలోని విటమిన్-సి వల్ల తెల్లరక్తకణాల ఉత్పత్తి పెరుగుతుంది. ఫ్రైడ్‌ఫుడ్‌ను మానేసి నట్స్ తినాలి. యాంటీ ఆక్సిడెంట్స్‌ను ఉత్పత్తి చేసే వెల్లుల్లి లాంటి వల్ల వాటి వల్ల ఇమ్యూనిటీ పెరుగుతుంది.
- కచ్చితంగా రోజుకు కనీసం ఆరేడు గంటల నిద్ర ఉండాలి. దీనివల్ల శరీరంలోని తెల్లరక్తకణాల సంఖ్య పెరుగుతుంది. శరీరాన్ని కాపాడగలిగే ఇమ్యూనిటీ మనకు వస్తుంది.
- ప్రకృతిలో గడపటం వల్ల ఆక్సీ జన్ అందుతుంది. తద్వారా ఇమ్యూనిటీ పెరుగుతుంది. దీంతో పాటు ఒత్తిడి లేకుండా సంతోషంగా గడపటం వల్ల కూడా శరీరంలో తెలీకుండా ఇమ్యూనిటీ బూస్ట్ అవుతుంది. ఎక్కువగా నీళ్లు తాగటం.. తక్కువ చక్కెర తినటం వల్ల వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుంది.

ఫ్యాషన్

అదిరిపోయే... అటాచ్డ్ దుపట్టా



దుపట్టాలను విడిగా సింగారించుకునే రోజులు పోయాయి. జారిపోకుండా సర్దుకునే శ్రమ లేకుండా, డ్రస్‌కు కలిపి కుట్టినట్టుండే అటాచ్డ్ దుపట్టాలు తాజా ఫ్యాషన్ ట్రెండ్‌గా మారాయి. వాటి మీద ఓ లుక్కేద్దామా?

అన్ని సందర్భాల్లో...

అటాచ్డ్ దుపట్టాను కలిగి ఉన్న దుస్తులు మోడర్న్‌గా కనిపిస్తాయి కాబట్టి అవి కేవలం పార్టీ వేర్‌కే పరిమితం అనుకుంటే పొరపాటు. ఈ డ్రస్సులను పెళ్లి, పుట్టినరోజు వేడుకలు, ఈవినింగ్ పార్టీలకు కూడా ధరించవచ్చు. అయితే సాధారణ సందర్భాల్లో కాటన్‌తో తయారైన డ్రస్‌ను ఎంచుకోవాలి. ఇవి డైలీ వేర్‌కు కూడా బాగుంటాయి. వేడుకల కోసం ఫ్లాషీగా ఉండే డ్రస్‌ను ఎంచుకోవాలి.

అదనపు హంగుతో...

షరారాలు, గౌన్లు, చుడీదార్‌లు... వీటిలో దేన్నికైనా దుపట్టాను కలిపి కుడితే మరింత మోడర్న్‌గా కనిపించే డ్రస్ తయారవుతుంది. అటాచ్డ్ దుపట్టాలను కలిగి ఉండే డ్రస్సులన్నీ రెట్టింపు మోడర్న్ లుక్‌ను సంతరించుకోడానికి కారణం ఇదే! అయితే డ్రస్‌కు దానికి కలిపి కుట్టిన దుపట్టాకూ మధ్య కాంట్రాస్ట్ ఉండేలా చూసుకోవాలి. అదనపు హంగుల కోసం ఫ్రిల్స్, సెక్విన్ వర్క్ లాంటివి ఉండేలా చూసుకోవాలి.



యాక్సెసరీస్

హై హీల్స్, సింపుల్ జ్యువెలరీ, చిన్న హాండ్ బ్యాగ్ ఈ దుస్తులకు మ్యాచ్ అవుతాయి. షరారాకు న్యూడ్ హీల్స్ ధరించాలి. ఫ్రాక్స్‌కు పెన్సిల్ హీల్, లాంగ్ గౌన్‌కు బ్లంట్ హీల్స్ బాగుంటాయి. నడుముకు బెల్ట్ కూడా చక్కగా మ్యాచ్ అవుతుంది.



న్యూస్‌మేకర్

పాప్ ప్రపంచపు రాణి



అమెరికా... లాస్‌ఏంజెలెస్ మహానగరం... 'క్రిప్టో డాట్ ఎరీనా' ప్రాంగణం. వెలిగిపోతున్న వేదికపైకి... ఆకాశంలో ఒక తారలా వచ్చి... తళుక్కుమన్నది టేలర్ స్విఫ్ట్. తెల్లని సిల్క్ గౌనులో... ముఖంపై పడుతున్న ముంగురులను పక్కకు నెట్టి... ప్రతిష్టాత్మక 'గ్రామీ అవార్డు' అందుకుంది. 'ఆల్బమ్ ఆఫ్ ది ఇయర్' పురస్కారాన్ని నాలుగోసారి గెలుచుకుని... ఈ ఘనత సాధించిన ఏకైక పాప్ స్టార్‌గా నిలిచింది. పధ్నాలుగేళ్లకే పాటలు రాయడం మొదలుపెట్టిన టేలర్... గీత రచయితగా, పాప్ గాయనిగా మరపురాని విజయాలనెన్నిటినో అందుకుంది.

సంగీతంలో 'ఆస్కార్'గా భావించే 'గ్రామీ అవార్డు'ను అందుకున్నప్పుడు 34 ఏళ్ల టేలర్ స్విఫ్ట్ ఎంతో భావోద్వేగానికి లోనైంది. ఈ వేదికపై అవార్డును తీసుకోవడం ఆమెకు ఇదే మొదటిసారి కాదు. నాలుగోసారి. 'ఆల్బమ్ ఆఫ్ ది ఇయర్'గా తన పేరు ప్రకటించినప్పుడు... ఆనందంతో ఉక్కిరిబిక్కిరి అయింది. ఆహూతుల కరతాళ ధ్వనుల మధ్య.. పరుగున వెళ్లి అవార్డును అందుకుని, ముద్దాడింది. తన 'మిడ్‌నైట్స్' ఆల్బమ్‌కు ఈ పురస్కారం దక్కింది. మిలే సైరస్, బిల్లీ ఎలిష్, ఎమ్మా స్టోన్... పాప్ ప్రపంచంలో మహామహులను వెనక్కు నెట్టి టేలర్ సాధించిన విజయం ఇది. 'నా హృదయాంతరాళం నుంచి చెబుతున్న మాట... ఇది నా జీవితంలోనే అత్యద్భుత ఘట్టం. నా కష్టానికి తగిన ఫలితం. మరింత ఉత్సాహంగా పని చేయడానికి ఈ అవార్డు ప్రేరణనిస్తుంది' అంటూ 'గ్రామీ' స్వీకరించిన అనంతరం టేలర్ తన సంతోషాన్ని పంచుకుంది. అమెరికాలోని పెన్సిల్‌వేయినాలో పుట్టిన టేలర్ అలిసన్ స్విఫ్ట్ తండ్రి... స్కాట్ కింగ్స్‌లే ఒకప్పటి స్టాక్ బ్రోకర్. తల్లి అండ్రియా గార్డ్‌నర్ గృహిణి. ప్రముఖ అమెరికన్ గాయకుడు, పాటల రచయిత జేమ్స్ టేలర్ పేరునే టేలర్ స్విఫ్ట్‌కు పెట్టారు.

చదువుకొంటూనే...

తొమ్మిదేళ్లప్పుడే టేలర్‌కు పాటలపై మక్కువ కలిగింది. గాత్ర సంగీతం, నటనలో శిక్షణ కోసం తరచూ న్యూయార్క్ నగరానికి వెళ్లి వచ్చేది. షానియా ట్విన్ పాటలతో ప్రేమలోపడ్డ ఆమె... సంగీత సాధన మొదలుపెట్టింది. 'ఆరంభంలో స్థానికంగా నిర్వహించే ఈవెంట్స్‌లో పాడేదాన్ని. కొన్నాళ్లకు అర్థమైంది... సంగీతమే నా ప్రపంచం అని. అందులోనే కెరీర్ వెతుక్కొనే క్రమంలో అమ్మతో కలిసి నాష్‌విల్లే నగరానికి వెళ్లాను. అప్పుడు నాకు పదకొండేళ్లు. అక్కడి మ్యూజిక్ స్టూడియోలకు వెళ్లి, నేను పాడిన రికార్డులు కొన్ని ఇచ్చాను. వాళ్లకు నచ్చలేదు. ఎందుకంటే నగరంలో ఔత్సాహికులందరూ నాలానే ఎవరో పాడిన పాటలు పాడి వినిపిస్తున్నారు. ఇక వాటిల్లో కొత్తదనం ఏముంటుంది? నలుగురికీ భిన్నంగా, మనకంటూ ఏదో ఒక ప్రత్యేకత లేకపోతే ఈ రంగంలో రాణించలేమని అర్థమైంది. అయితే కొత్తగా ఏం చేయాలి? దీనికి సమాధానం వెతుక్కోవడం మొదలుపెట్టాను. వారాంతాలు స్టోన్‌హార్బర్, న్యూజెర్సీల్లో గడుపుతూ... అక్కడి కాఫీ షాపుల్లో పాటలు పాడేదాన్ని. పధ్నాలుగేళ్ల వయసు వరకు అలానే గడిచిపోయింది' అంటూ ఓ సందర్భంలో తన బాల్యాన్ని గుర్తు చేసుకుంది టేలర్ స్విఫ్ట్. అయితే పన్నెండేళ్ల వయసులో మ్యూజీషియన్ రోనీ క్రైమర్ ఆమెకు గిటార్‌ను పరిచయం చేశారు. సొంతంగా పాటలు రాయడంలో కూడా తర్ఫీదునిచ్చారు. అలా 'లక్కీ యూ' పేరుతో తన మొదటి పాట రాసింది. చదువుకొంటూనే టేలర్ తన కెరీర్‌కు పునాదులు వేసుకుంది. స్కూల్‌లో రోజు ఎలా గడిచిందో స్పష్టంగా, ఆసక్తిగా రాయడం మొదలుపెట్టి, నైపుణ్యం పెంచుకుంది. గతంలో జాతీయ స్థాయి కవితల పోటీలో విజేతగా నిలిచింది.

పధ్నాలుగేళ్లకే...

నైపుణ్యం సంపాదిస్తూ... తనను తాను నిరూపించుకొంటూ... ఆత్మవిశ్వాసంతో అడుగులు వేసింది టేలర్ స్విఫ్ట్. పధ్నాలుగేళ్ల ప్రాయంలోనే 'బిగ్ మిషన్ రికార్డ్స్' కోసం ప్రొఫెషనల్ కెరీర్‌లో తొలి పాట రాసింది. జానపద సంగీతంతో తన ప్రయాణం ప్రారంభించింది. ఈ లేబుల్ కింద 2006లో 'టేలర్ స్విఫ్ట్' పేరిట మొదటి ఆల్బమ్ విడుదల చేసింది. తొలి వారంలోనే దాదాపు నలభై వేల కాపీలు అమ్ముడయ్యాయి. ఆ తరువాత 'సోనీ/ ఏటీవీ మ్యూజిక్ పబ్లిషింగ్ హౌస్'తో ఒప్పందం కుదుర్చుకుంది. ఆ సంస్థ నుంచి ఆల్బమ్ అందించిన అతి పిన్న వయస్కురాలిగా చరిత్ర సృష్టించింది. 2008లో విడుదల చేసిన 'ఫియర్‌లెస్' అత్యధికంగా అమ్ముడైన ఆల్బమ్స్‌లో ఒకటిగా నిలిచింది.

'గ్రామీ'ల వరుస...

ఇరవై ఏళ్ల వయసులో టేలర్ స్విఫ్ట్ మొదటిసారి 'గ్రామీ అవార్డు' (ఆల్బమ్ ఆఫ్ ది ఇయర్) గెలుచుకుంది. తద్వారా ఈ అవార్డు అందుకున్న అతి పిన్న కళాకారిణిగా చరిత్రను తిరగరాసింది. తాజాగా 'ఆల్బమ్ ఆఫ్ ది ఇయర్' కేటగిరీలో నాలుగోసారి 'గ్రామీ' దక్కించుకుని సరికొత్త రికార్డు నెలకొల్పింది. ఇది ఆమెకు ఎంతో ప్రత్యేకం. ఎందుకంటే అరుదైన నరాల సంబంధిత వ్యాధితో బాధపడుతున్న టేలర్.. ఇప్పుడిప్పుడే దాని నుంచి కోలుకుంటోంది. ఏడాది కిందట బయటపడ్డ ఈ వ్యాధి వల్ల తన షోస్ అన్నిటినీ ఆమె రద్దు చేసుకుంది. మళ్లీ 'గ్రామీ'తో గ్రాండ్ ఎంట్రీ ఇచ్చింది. ఇరవై ఏళ్ల కెరీర్‌లో టేలర్ స్విఫ్ట్ ఎన్నో ఆటుపోట్లు. అన్నిటినీ అధిగమించి నేను ఈ స్థాయిలో నిలబడింది. 'ఫోర్బ్స్ మ్యాగజైన్' అంచనా ప్రకారం ప్రస్తుతం ఆమె ఆస్తుల విలువ 1.1 బిలియన్ డాలర్లు. కేవలం తన పాటలు, ప్రదర్శనల ద్వారా వచ్చిన సంపాదన పరంగా



చూస్తే... ప్రపంచంలో బిలియనీర్ అయిన తొలి సంగీత కళాకారిణి. అంతేకాదు... అత్యధిక పారితోషికం తీసుకొంటున్న కళాకారిణిగా 2016లో 'గిన్నిస్ బుక్' రికార్డులకు కూడా టేలర్ పేరు ఎక్కింది. ఇవికాకుండా ఎన్నో సేవా కార్యక్రమాలను చేపట్టి... సమాజాభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తోంది. 'మిడ్‌నైట్స్'తో 'గ్రామీ' గెలుచుకున్న టేలర్... ఏప్రిల్‌లో 'ది టార్చర్డ్ పోయట్స్ డిపార్ట్‌మెంట్' ఆల్బమ్ విడుదల చేయనున్నట్టు ప్రకటించింది.

విశేష ఆదరణ...

టేలర్ కెరీర్ గ్రాఫ్ 2009 నుంచి దూసుకుపోయింది. అవార్డులు ఆమెను వెతుక్కుంటూ వచ్చాయి. 'యూ బిలాంగ్ విత్ మీ'కి గానూ 'బెస్ట్ ఫిమేల్ వీడియో'గా ఎంటీవీ వీడియో మ్యూజిక్ అవార్డు స్విఫ్ట్‌ను వరించింది. 'కంట్రీ మ్యూజిక్ అసోసియేషన్' నుంచి 'ఎంటర్‌టైనర్ ఆఫ్ ది ఇయర్' అవార్డు తీసుకున్న అతిపిన్న పాప్ కళాకారిణిగా రికార్డులకు ఎక్కింది. 2010లో విడుదలైన 'స్పీక్ నౌ' ఆల్బమ్‌లోని పాటలన్నీ స్విఫ్ట్ రాసుకుంది. ఆసియా, ఐరోపా, ఆస్ట్రేలియా, ఉత్తర అమెరికాల్లోని ప్రముఖ నగరాల్లో ఏడాదికి పైగా ప్రదర్శనలు ఇచ్చింది. ఈ పర్యటనతో ప్రపంచ వ్యాప్తంగా ఆమెకు కోట్లాదిమంది అభిమానులయ్యారు. ఎక్కడికు వెళ్లినా బ్రహ్మరథం పట్టారు. అంతేకాదు... పాప్ సంగీత ప్రపంచంలో కీర్తి గడించిన జస్టిన్ బీబర్, సెలీనా గోమెజ్, నిక్కీ మినాజ్, బాబ్, ఉషర్, ఆండీ గ్రామర్ లాంటి ప్రముఖుల నుంచి 'తమ షోలో కనిపించాలని' ఆహ్వానం అందింది. వారందరితో కలిసి ఎన్నో వేదికల్లో మెరిసిన టేలర్... అద్భుతమైన గీత రచయితగా, పాప్ స్టార్‌గా మరింత ఎత్తుకు ఎదిగింది.

ప్రమాదాల్లో ప్రాణదాతగా...

"రోడ్డు ప్రమాదాల నివారణ కోసం భద్రతా వారోత్సవాలు నిర్వహిస్తున్నాం. ప్రచారం చేస్తున్నాం. కానీ దురదృష్టవశాత్తూ ప్రమాదం జరిగినప్పుడు... బాధితుల్ని సకాలంలో రక్షించే చైతన్యం, నైపుణ్యం మన సమాజంలో ఉందా?..." డాక్టర్ మాయా టాండన్‌ను వేధించిన ప్రశ్న ఇది. అందరికీ అవగాహన కల్పించడం ద్వారా ఆ ప్రశ్నకు తానే ఒక సమాధానంగా నిలిచారు. తన ముప్ఫయ్యేళ్ళ కృషికి గుర్తింపుగా ఈ ఏడాది పద్మశ్రీ పురస్కారానికి ఎంపికయ్యారు.



"రోడ్డు ప్రమాదాల నివారణ కోసం భద్రతా వారోత్సవాలు నిర్వహిస్తున్నాం. ప్రచారం చేస్తున్నాం. కానీ దురదృష్టవశాత్తూ ప్రమాదం జరిగినప్పుడు... బాధితుల్ని సకాలంలో రక్షించే చైతన్యం, నైపుణ్యం మన సమాజంలో ఉందా?..." డాక్టర్ మాయా టాండన్‌ను వేధించిన ప్రశ్న ఇది. అందరికీ అవగాహన కల్పించడం ద్వారా ఆ ప్రశ్నకు తానే ఒక సమాధానంగా నిలిచారు. తన ముప్ఫయ్యేళ్ళ కృషికి గుర్తింపుగా ఈ ఏడాది పద్మశ్రీ పురస్కారానికి ఎంపికయ్యారు.

"న్యూస్ పేపర్లలో, టీవీల్లో రోడ్డు ప్రమాదాల గురించి వార్తలులేని రోజంటూ ఉండదు. అలాంటి ప్రమాదాల్ని మనం కూడా చూస్తూ ఉంటాం. కానీ వాటిని పెద్దగా పట్టించుకోం. అదే ఆ బాధితుల స్థానంలో మన ఆత్మీయులుంటే? వారికి తొందరగా వైద్య సహాయం అందాలని ఆరాటపడతాం. అందరి విషయంలోనూ మన స్పందన ఇదే విధంగా ఉండాలి. అదే మానవత్వం" అంటారు డాక్టర్ మాయా టాండన్. ఆమె నేతృత్వంలోని 'సహాయత' సంస్థ ద్వారా శిక్షణ పొందిన వ్యక్తులు వేలాది మంది రోడ్డు ప్రమాద బాధితులకు ప్రాణదాతలుగా నిలుస్తున్నారు.

శిక్షణ కోసం 'సహాయత'

మాయ ప్రాథమిక విద్య రాజస్థాన్‌లోని అజ్మీర్‌లో సాగింది. జైపూర్‌లో మెడిసిన్ పూర్తి చేసి, అక్కడే వైద్యురాలిగా వృత్తి జీవితం ప్రారంభించారు. జె.కె.లాన్ హాస్పిటల్‌లో సూపరింటెండెంట్‌గా పదవీ విరమణ చేశారు. వైద్యురాలిగా ఎన్నో ప్రాణాలను నిలబెట్టిన ఆమె సామాజిక కార్యక్రమాల్లోనూ చురుగ్గా ఉండేవారు. "రాజస్థాన్ పోలీస్ అకాడమీలో పోలీసుల కోసం 'అత్యవసర స్పందన' (ఎమర్జెన్సీ రెస్పాన్స్) మీద ఒక కార్యక్రమాన్ని 1994లో నిర్వహించాను. పోలీస్ అధికారులతో మాట్లాడుతున్నప్పుడు... ఈ అంశంపై మనకు తెలిసింది తక్కువేనని అర్థమయింది. నిజానికి ఇది ఏ ఒక్కరి వల్లనో అయ్యే పని కాదు. ప్రజలకు ప్రాథమిక శిక్షణ ఇచ్చినట్టయితే, ఎన్నో ప్రాణాలను కాపాడవచ్చనిపించింది" అని వివరించారు మాయ. అనంతరం తన మిత్రులతో చర్చించి... 'సహాయత' అనే సంస్థను నెలకొల్పారు. 1995లో పదవీ విరమణ చేసిన తరువాత... పూర్తి స్థాయిలో రహదారి భద్రతా శిక్షణకే అంకితమయ్యారు. ప్రమాదాల నివారణతో పాటు ప్రమాదాలు సంభవించినప్పుడు అత్యవసర చికిత్స అందించడంపై ప్రభుత్వ విభాగాల్లో, విద్యా సంస్థల్లో శిక్షణ ప్రారంభించారు. దానికోసం వైద్యులు, ఇతర నిపుణులతో బృందాలను ఏర్పాటు చేశారు. వారితో కలిసి రాజస్థాన్ రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థులకు, వాలంటీర్లకు, పౌరులకు శిక్షణ కార్యక్రమాలను ముప్ఫయ్యేళ్ళుగా నిర్వహిస్తున్నారు. "నేను నిర్వహించిన అతి పెద్ద శిక్షణ కార్యక్రమం... జైపూర్-ఢిల్లీ హైవేని ఆనుకొని నివసించే ప్రజల కోసం. అది ప్రమాదాలకు ప్రసిద్ధి చెందిన రహదారి. ఆ కార్యక్రమానికి మేము ఊహించనంత స్పందన వచ్చింది. వందలమంది శిక్షణ తీసుకున్నారు. కళ్ళెదుట ప్రమాదం జరిగి, వ్యక్తులు ప్రాణాపాయంతో ఉన్నా... వారికి ఎలా సహాయం అందించాలో చాలామందికి తెలీదు. మరోవైపు పోలీసు కేసుల్లో చిక్కుకుంటామనే బెదురు కూడా ఉంటుంది. అలాగే బాధితులకు శరీరంలో వివిధ భాగాలకు గాయాలు తగిలినప్పుడు, ఊపిరి ఆడడం కష్టమైనప్పుడు, కాలిన గాయాలైనప్పుడు, మానసికమైన షాక్‌లో ఉన్నప్పుడు... స్వస్థత కలిగించడానికి అనుసరించవలసిన పద్ధతులు భిన్నంగా ఉంటాయి. ఈ అంశాను ప్రధానంగా నేర్పిస్తున్నాం. మా దగ్గర శిక్షణ పొందినవారు ప్రాణాలను కాపాడారన్న సమాచారం దాదాపు ప్రతిరోజూ మేము అందుకుంటున్నాం" అని చెబుతారు మాయా టాండన్.



ప్రమాదాలు జరిగినప్పుడు మొదటి గంట సమయాన్ని 'గోల్డెన్ అవర్' అంటారు. ఎవరైనా రోడ్డు ప్రమాదంలో చిక్కుకుంటే, ఆ బాధితుణ్ణి ఆసుపత్రికి తీసుకువెళ్ళే లోపు ఫస్ట్ ఎయిడ్ అందిస్తే వారి ప్రాణాలను నిలబెట్టవచ్చు.

తప్పనిసరి బోధనాంశం చెయ్యాలి...

'సహాయత' ద్వారా మాయ, ఆమె బృందం అందించే శిక్షణలో... సిపిఆర్, ప్రమాద స్థలాల్లో చేపట్టాల్సిన సహాయక చర్యల క్రమం, ప్రోటోకాల్స్, వైద్య బృందాలకు, పోలీసులకు సమాచారం అందించడం తదితర అంశాలు ప్రధానంగా ఉంటాయి. స్థానికులు సహాయం చేయలేని పరిస్థితుల్లో ఉన్నప్పుడు... తక్షణమే తమకుగానీ, దగ్గరలో ఉన్న ఆసుపత్రులకు కానీ సమాచారం అందించేలా ప్రజలకు చైతన్యాన్ని కలిగిస్తున్నారు. "ఇప్పుడు రాజస్థాన్ రాష్ట్ర వ్యాప్తంగా మా శిక్షణ కొనసాగిస్తున్నాం. ప్రమాదాలు జరిగినప్పుడు మొదటి గంట సమయాన్ని 'గోల్డెన్ అవర్' అంటారు. ఎవరైనా రోడ్డు ప్రమాదంలో చిక్కుకుంటే, ఆ బాధితుణ్ణి ఆసుపత్రికి తీసుకువెళ్ళే లోపు... తగిన విధంగా ఫస్ట్ ఎయిడ్ అందిస్తే... వారి ప్రాణాలను నిలబెట్టవచ్చు. అత్యవసర పరిస్థితుల్లో గుండెపై ఒత్తిడిని అప్లై చెయ్యడం, నోటి ద్వారా శ్వాసను అందించడం (సిపిఆర్) లాంటి చర్యలు ప్రధానం. అయితే గాయపడిన ప్రతి ఒక్కరికీ సిపిఆర్ అవసరం లేదు. బాధితుడికి గాయం ఎక్కడయిందో ముందుగా గమనించాలి. ఏవైనా భాగాలు బయటికి వస్తే, వాటిని తిరిగి లోపలికి పంపాలని ప్రయత్నించకూడదు. ఆ భాగాన్ని శుభ్రమైన వస్త్రంతో కప్పి, వెంటనే అంబులెన్స్‌కు సమాచారం ఇవ్వాలి. అంబులెన్స్ రావడానికి సమయం పట్టేలా ఉంటే... దగ్గరలో ఉన్న ప్రభుత్వ లేదా ప్రైవేట్ ఆసుపత్రికి బాధితుణ్ణి తక్షణమే తరలించాలి. ఇటువంటి అనేక అంశాలను ప్రజలకు మేము వివరిస్తున్నాం. దేశవ్యాప్తంగా ఈ అంశాలపై ఉద్యమస్థాయిలో ప్రచారం జరగాలి. రోడ్డు ప్రమాదాలు ఎక్కడైనా జరగవచ్చు. ప్రతి పౌరుడికీ ప్రథమ చికిత్స తెలిసి ఉంటే... ఎన్నో ప్రాణాలను కాపాడవచ్చు" అని వివరించారామె. ముప్ఫయ్యేళ్ళ తన కృషికి ఎన్నో అవార్డులను, గౌరవాలను అందుకున్న 87 ఏళ్ళ మాయా టాండన్‌కు ఈ ఏడాది కేంద్ర ప్రభుత్వం 'పద్మశ్రీ' పురస్కారం ప్రకటించింది. "ఇది మా బాధ్యతను మరింత పెంచింది. ఈ గుర్తింపు సమష్టి కృషి ఫలితం. మనిషి పట్ల మరొక మనిషికి ఉన్న బాధ్యతను తెలుసుకొని... అత్యవసర సమయాల్లో ఆదుకోవాలనే తపనతో ఎందరో మాతో చేతులు కలిపారు. నా కుటుంబ సభ్యులు కూడా అండగా నిలిచారు. అందరికీ ధన్యవాదాలు" అంటున్నారు మాయ. ఆమె జాతీయ రహదారి భద్రతా మండలిలో సభ్యురాలుగానూ కొంతకాలం వ్యవహరించారు. "పాఠశాలల్లో 'అత్యవసర ప్రథమ చికిత్స'ను తప్పనిసరి బోధనాంశంగా చెయ్యాలి. ప్రభుత్వాలు ఈ దిశగా చర్యలు చేపట్టాలి" అనేది ఆమె విజ్ఞాపన.

డైనింగ్ రూల్స్

రెస్టారెంట్‌లో ఇలా

ఫ్యాన్సీ రెస్టారెంట్‌కి వెళ్లాలంటే డైనింగ్ నియమాలు తెలిసి ఉండడం అవసరం. ఆ నియమాలు ఇవే...

- టేబుల్ పైన ఫోన్, తాళాలు, పర్సు లాంటివి ఉంచకూడదు.
- ఆతిథ్యం ఇస్తున్నది మీరైతే ఒకడుగు ముందే బిల్ చెల్లించాలి.
- ఆర్డర్ చేసే అవకాశం అతిథికే ఇవ్వాలి.
- అందంగా తయారవడమూ ముఖ్యమే!
- వెయిటర్ మీద కోప్పడడం లాంటివి చేయకూడదు. సంభాషణ మృదువుగా సాగాలి.
- కలిసి వచ్చిన వ్యక్తి భోజనాన్ని రుచి చూడడం కోసం చేతులను టేబుల్ అవతలి వైపుకు చాపి పదార్థాలను అందుకోకూడదు.
- కంపానియన్ ఆర్డర్ చేసిన వాటి కంటే ఎక్కువ కోర్సులు ఆర్డర్ చేయకూడదు.
- సరిగా ఉడకని పదార్థాలను తిప్పి వెనక్కి పంపవచ్చు.
- న్యాప్కిన్‌ను ఒళ్లో ఉంచుకోవాలి.
- ప్రతిసారీ సాల్ట్, పెప్పర్‌లు రెండింటినీ కలిపి అందించాలి.



ఆంధ్రజ్యోతి

నవ్య చిత్రజ్యోతి

బుధవారం • 7 ఫిబ్రవరి 2024

cinema@andhrajyothy.com

గగనంలో ప్రేమపక్షుల ప్రణయ గీతం



వరుణ్‌తేజ్ కథానాయకుడిగా రూపొందిన తెలుగు-హిందీ ద్విభాషా చిత్రం 'ఆపరేషన్ వాలెంటైన్'. భారత వైమానిక దళ వీరుల అలుపెరుగని పోరాటాన్ని, దేశాన్ని రక్షించడానికి వారు ఎదుర్కొంటున్న సవాళ్లను ఈ చిత్రంలో ఆవిష్కరించబోతున్నారు. మానుషి చిల్లర్ కథానాయిక. శక్తి ప్రతాప్ సింగ్ హడా దర్శకుడు. మార్చి 1న విడుదలవుతోంది. మంగళవారం ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో చిత్రబృందం రెండో గీతాన్ని విడుదల చేసింది. 'గగనాల' అంటూ సాగే ఈ గీతంలో హీరో, హీరోయిన్ల మధ్య ప్రణయాన్ని ఆవిష్కరించారు. మిక్కీ జే మేయర్ స్వరపరిచిన ఈ రొమాంటిక్ గీతాన్ని అర్మాన్ మాలిక్ ఆలపించారు. రామజోగయ్య శాస్త్రి సాహిత్యం అందించారు. ఈ సందర్భంగా వరుణ్‌తేజ్ మాట్లాడుతూ "ఆపరేషన్ వాలెంటైన్' మరో స్థాయిలో ఉంటుంది. 130 కోట్ల మంది ప్రజలను తన కుటుంబంగా భావించే సైనికుల త్యాగాలను ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలనే ఉద్దేశంతో ఈ సినిమా చేశాం' అన్నారు. మానుషి చిల్లర్ మాట్లాడుతూ "ఆపరేషన్ వాలెంటైన్' అందరూ గర్వపడే అద్భుతమైన సినిమా' అని చెప్పారు.

ఊచకోతకు సిద్ధం



'అలాంటోడు మళ్లీ తిరిగొస్తున్నాడంటే...?' ఎలా ఉండబోతోందో చూసేందుకు డేట్ ఖరారైంది. పవన్ కల్యాణ్ కథానాయకుడిగా నటిస్తోన్న 'ఓజీ' చిత్రం విడుదల తేదీ అధికారికంగా ఖాయమైంది. సెప్టెంబర్ 27న ఈ చిత్రాన్ని విడుదలచేస్తున్నట్లు యూనిట్ ప్రకటించింది. ఈ విషయాన్ని ప్రకటిస్తూ మంగళవారం రిలీజ్ డేట్ పోస్టర్‌ను వదిలింది. ఇందులో పవన్ కల్యాణ్ టీ గ్లాస్ పట్టుకొని స్టైలిష్‌గా కనిపించారు. ముంబై-జపాన్ బ్యాక్‌డ్రాప్‌లో గ్యాంగ్‌స్టర్ కథాంశంతో ఈ చిత్రం తెరకెక్కుతోంది. 'సాహో' ఫేమ్ సుజీత్ దర్శకత్వం వహిస్తున్నారు. డి.వి.వి. దానయ్య నిర్మాత. బాలీవుడ్ నటుడు ఇమ్రాన్ హష్మీ ప్రతినాయక పాత్ర పోషిస్తున్నారు. ప్రియాంక అరుళ్ మోహన్ కథానాయిక. అర్జున్‌దాస్, శ్రియారెడ్డి, వెంకట్ కీలకపాత్రలు పోషిస్తున్నారు.

నిర్మాతగా గర్వపడుతున్నాను

అలియాభట్



హీరోయిన్‌గా తిరుగులేని స్టార్‌డమ్‌ను ఎంజాయ్ చేస్తున్నారు బాలీవుడ్ కథానాయిక అలియాభట్. ఓ వైపు సినిమాలతో తీరిక లేకుండా ఉన్నా నిర్మాతగానూ తన ప్రయాణాన్ని కొనసాగిస్తున్నారు. తన అభిరుచి మేరకు వినూత్న కథలతో సినిమాలు, సిరీస్‌లు నిర్మిస్తున్నారు. ఆమె సహ నిర్మాతగా మారి నిర్మించిన వెబ్‌సిరీస్ 'పోచర్' ఈ నెల 23న ప్రముఖ ఓటీటీలో విడుదలవుతోంది. ఈ సందర్భంగా అలియాభట్ మాట్లాడుతూ 'ఈ పుడమిపై జీవించే సమస్త జీవరాశిపై మానవులు దయ చూపించాలనే సందేశాన్ని 'పోచర్' సిరీస్ అందిస్తుంది. వన్యప్రాణుల పట్ల మృగాల్లా వ్యవహరించే శక్తుల గురించి ప్రజల్లో చైతన్యం కలిగిస్తుంది. ఇలాంటి మంచి ప్రాజెక్ట్‌లో నిర్మాతగా భాగమైనందుకు గర్వంగా ఉంది. దర్శకుడు రిచీ ఈ సిరీస్‌ను ఎంతో శ్రమకోర్చి అద్భుతంగా తెరకెక్కించారు' అని చెప్పారు. ఏనుగు దంతాలను స్మగ్లింగ్ చేసే ముఠాల నేపథ్యంలో కథ సాగుతుంది. ఇందులో నిమేషా సజయన్, రోషన్ మాథ్యూ ప్రధాన పాత్రలు పోషించారు.

ప్రపంచంలోని బూతులన్నీ మీర్జాపూర్‌లో ఉన్నాయి కదా!

యానిమల్‌పై విమర్శలకు సందీప్ రెడ్డి వంగా కౌంటర్







రణ్‌బీర్‌కపూర్ హీరోగా తెలుగు దర్శకుడు సందీప్‌రెడ్డి వంగా తెరకెక్కించిన 'యానిమల్' చిత్రం బాక్సాఫీసు దగ్గర భారీ హిట్‌గా నిలిచిన విషయం తెలిసిందే. అయితే ఈ సినిమా విడుదలైనప్పటి నుంచి వసూళ్లతోపాటు వివాదాలతోనూ వార్తల్లో నిలుస్తోంది. సినిమా ఫుల్ రన్ పూర్తయినా సోషల్ మీడియా వేదికగా ఇంకా పలువురు ప్రముఖులు 'యానిమల్'పై దుమ్మెత్తి పోస్తున్నారు. ఏదో ఒక ఇంటర్వ్యూ ఇస్తూ అందులో ఈ సినిమాపై తమ అభ్యంతరాలను, అసహనాన్ని వ్యక్తం చేయడం బాలీవుడ్ సెలబ్రిటీలకు పరిపాటిగా మారింది. అయితే సందీప్‌రెడ్డి వంగా కూడా ఏ మాత్రం తగ్గడం లేదు. తన ఇంటర్వ్యూల్లో విమర్శకులకు అదే స్థాయిలో బదులిస్తున్నారు. 'యానిమల్ లాంటి సినిమాలు సభ్య సమాజానికి ప్రమాదకరం' అంటూ రచయిత జావేద్ అక్తర్ చేసిన వ్యాఖ్యలకు సందీప్ ఘాటుగా బదులిస్తూ 'మీ కొడుకు ఫర్హాన్ అక్తర్ నిర్మించిన 'మీర్జాపూర్' వెబ్‌సిరీస్ మాటేమిటి' అని ప్రశ్నించారు. 'ప్రపంచంలో ఉన్న బూతులన్నీ అందులోనే ఉన్నాయి, ప్రచార చిత్రాలు చూస్తుంటేనే వాంతి వచ్చినట్లు అనిపించింది. ముందు మీ కొడుక్కి సంస్కారం నేర్పండి' అని స్పందించారు. మహిళలు శృంగారానికి మాత్రమే పనికొస్తారనేలా యానిమల్‌లో చూపించడాన్ని కంగన గతంలో తప్పుపట్టారు. పనిలో పనిగా కంగన వ్యాఖ్యలకు కూడా సందీప్ కౌంటర్ ఇచ్చారు. ఆమెకు సరిపోయే పాత్ర తన సినిమాలో ఉంటే తప్పకుండా అవకాశం ఇస్తానని వ్యంగ్యంగా బదులిచ్చారు. మీ సినిమాల్లో నాకు ఎలాంటి అవకాశం వద్దు, మీరు సినీ పరిశ్రమకు కావాలి అని కంగన బదులిచ్చారు. స్త్రీలపై వేధింపుల్ని ప్రోత్సహించేలా ఉందని అమీర్‌ఖాన్ మాజీ భార్య కిరణ్‌రావు గతంలో 'యానిమల్' సినిమాను పరోక్షంగా విమర్శించారు. 'ఆమె ఒకసారి అమీర్‌ఖాన్ నటించిన 'దిల్' సినిమా చూసిన తర్వాత మాట్లాడాలి' అని సందీప్ కోరారు. దాంతో "నా వ్యాఖ్యలు 'యానిమల్' సినిమా, సందీప్ గురించి కాదు, ఆయన అలా ఎందుకు అనుకున్నారో నాకు తెలియదు" అని సందీప్ విమర్శలపై కిరణ్‌రావు స్పందించడం గమనార్హం.

ముద్దు సీను.. లీగల్ నోటీసు!



సినిమాల్లో ఇప్పుడు ముద్దు సీన్లు కామన్ అయ్యాయి. తెలుగు సినిమాల్లో హీరోహీరోయిన్లు తెరపై తెగబడి లిప్ టు లిప్ కిస్సులు ఇచ్చుకుంటుంటే ఆడియన్స్ కూడా ఎంజాయ్ చేస్తున్నారు. 'ముద్దుకు లేదు హద్దు' అని సినిమా వాళ్లు అంటుంటే ఓకే ఓకే అంటూ సెన్సార్ బోర్డ్ కూడా సరిపుచ్చుకుంటోంది. అయితే ఇప్పుడు ఓ సినిమాలో ముద్దు చూసి ఒళ్లు మండిన ఓ మహిళ లీగల్ నోటీసు ఇవ్వడంతో ఆ వార్త వైరల్ అయింది. విషయం ఏమిటంటే ఇటీవల విడుదలైన 'ఫైటర్' చిత్రంలో హృతిక్ రోషన్, దీపికా పదుకోన్ జంటగా నటించారు. పనిలో పనిగా వీరిద్దరి మీద ఓ ముద్దు సీన్ కూడా గాఢంగా చిత్రీకరించారు దర్శకుడు. ఆడియన్స్ కూడా ఆ సీన్‌ని ఆస్వాదించేశారు. అయితే ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ ఆఫీసర్స్ గెటప్‌లో ఉండి ఇలా ముద్దు పెట్టుకోవడం చూసి ఆగ్రహించారు వింగ్ కమాండర్ సౌమ్య దీప్ దాస్. ఇలాంటి సన్నివేశం పెట్టడం ఇండియన్ ఎయిర్‌ఫోర్స్‌ని, అధికారులను అవమానించడమే అంటూ ఆమె మండిపడి దర్శకనిర్మాతలకు లీగల్ నోటీసు పంపించారు. దీనిపై చిత్ర యూనిట్ స్పందించాల్సి ఉంది.

'బేబి' సినిమాతో పోలిక లేదు



ఎస్‌కేఎన్

'బేబీ' చిత్రంతో ఇండస్ట్రీ హిట్ అందుకొని మంచి జోరు మీదున్నారు నిర్మాత ఎస్‌కేఎన్. తాజాగా ఆయన తమిళ చిత్రం 'ట్రూ లవర్'హక్కులను సొంతం చేసుకున్నారు. దర్శకుడు మారుతితో కలసి తెలుగులో విడుదల చేస్తున్నారు. ఈ చిత్రంలో మణికందన్, శ్రీ గౌరీప్రియ, కన్నరవి లీడ్‌రోల్స్‌లో నటించారు. ప్రభురామ్ వ్యాస్ దర్శకత్వం వహించారు. ఈ నెల 10న 'ట్రూ లవర్' విడుదలవుతోంది. ఈ సందర్భంగా సినిమా విశేషాలను ఎస్‌కేఎన్ మీడియాతో పంచుకున్నారు.

- ఒక స్నేహితుడి ద్వారా 'ట్రూ లవర్' సినిమా గురించి తెలిసింది. మారుతితో కలసి సినిమా చూశా. ఇద్దరికీ నచ్చడంతో తెలుగులో విడుదల చేయాలనుకున్నాం.
- ఏ రిలేషన్‌కు అయినా నమ్మకమే పునాది. 'ట్రూ లవర్' సినిమాలో మెయిన్ పాయింట్ అదే. 'బేబీ' సినిమాతో 'ట్రూ లవర్'ను పోల్చలేం. సినిమా చూస్తున్నంతసేపు ప్రేక్షకులు పాత్రలతో అనుభూతి చెందుతారు. ఈ తరం యువతీ యువకులు ప్రేమలో ఎదుర్కొంటున్న సమస్యలను ఈ సినిమాలో దర్శకుడు చూపించారు. కొన్ని సీన్లు అద్భుతం అనిపించాయి. దర్శకుడు తను ఎంచుకున్న కథకు పూర్తి న్యాయం చేశాడు.
- మాది 'ఈగల్' చిత్రంతో పోటీపడగల సినిమా కాదు. చిన్న సినిమా. చాలా తక్కువ థియేటర్లలో విడుదలచేస్తున్నాం. అయినా అందరికీ ఆమోదయోగ్యంగా ఉండాలని 'ఈగల్' రిలీజైన మరుసటి రోజు థియేటర్లలోకి వస్తున్నాం.
- రాజా సాబ్ సినిమాను మారుతి దర్శకత్వంలో పీపుల్ మీడియా ఫ్యాక్టరీ నిర్మిస్తోంది. ఆ టీమ్‌లో నేనూ ఉన్నాను. ఆ సంస్థ మా ఫ్రెండ్లీ బ్యానర్ లాంటిదే. ప్రస్తుతం నిర్మాతగా నాలుగు చిత్రాలు చేస్తున్నా. మూడు యూత్ ఫుల్ లవ్‌స్టోరీస్. ఒకటి సైన్స్ ఫిక్షన్ జానర్‌లో ఉంటుంది. అలాగే అతీంద్రియ శక్తుల నేపథ్యంలో సాగే చిత్రం ఒకటి చేయాలనుంది. 'బేబీ' సినిమాను హిందీలో రీమేక్ చేస్తున్నాం. త్వరలో పూర్తి వివరాలు ప్రకటిస్తాం. నిర్మాతగా నేను ఇంకా ఓనమాలు దిద్దుతున్నాను. మరింత అనుభవం గడించాక అల్లు అర్జున్‌తో సినిమా చేస్తా.

విహార యాత్రకు వెళ్లినట్లుంది



రవితేజ కథానాయకుడిగా కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వం వహించిన చిత్రం 'ఈగల్'. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బేనర్‌పై టీజ విశ్వ ప్రసాద్ నిర్మించారు. ఈ నెల 9న ఈ చిత్రం విడుదలవుతోంది. ఈ సందర్భంగా రవితేజకు జోడీగా నటించిన కావ్యాథాపర్ మీడియాతో మాట్లాడారు.

- కార్తిక్ చెప్పిన కథ కొత్తగా, అద్భుతంగా అనిపించింది. హీరో రవితేజ కావడంతో తప్పకుండా 'ఈగల్' సినిమా చేయాలనుకున్నా. ఇందులో యాక్షన్, రొమాన్స్, లవ్ సరికొత్తగా ఉంటాయి. కచ్చితంగా ప్రేక్షకులు ఎంజాయ్ చేస్తారు. ఈ చిత్రంలో నా పాత్ర పేరు రచన. జీవితంలో తనకంటూ కొన్ని లక్ష్యాలు ఉంటాయి.
- రవితేజకు నేను పెద్ద అభిమానిని. ఆయన చాలా పాజిటివ్ ఎనర్జీతో ఉంటారు. సెట్స్‌లో ఉంటే సరదాగా ఉండేది. రవితేజతో పనిచేయడం మర్చిపోలేని అనుభూతి. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ లాంటి సంస్థలో అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నాను. సినిమాను చాలా గ్రాండ్‌గా నిర్మించారు.
- 'ఈగల్' షూటింగ్ పోలాండ్, లండన్‌లో ఎక్కువగా జరిగింది. విహార యాత్రలకు వెళ్లినట్లు అనిపించింది. చాలా ఎంజాయ్ చేశాను. ప్రస్తుతం 'డబుల్ ఇస్మార్ట్' షూటింగ్ జరుగుతోంది. భవిష్యత్‌లో మాస్, యాక్షన్ సినిమాలు చేయాలనుంది.

పన్నెండేళ్ల వైవాహిక బంధానికి వీడ్కోలు



సినీ దంపతులు ధర్మేంద్ర, హేమమాలినిల కుమార్తె ఈషా డియోల్ తన భర్త భరత్ తక్తాని నుంచి విడిపోతున్నారు. ఇక నుంచి తమ మార్గాలు వేర్వేరు అని ఇద్దరూ ఆంగ్ల మీడియాకు వెల్లడించారు. 'ఒకరి అభిప్రాయాలు మరొకరు గౌరవించుకుంటూ తీసుకున్న నిర్ణయం. దీని వల్ల మా ఇద్దరి పిల్లల భవిష్యత్ దెబ్బ తినకూడదు. ఆ విషయంలో పూర్తి జాగ్రత్త వహిస్తాం' అని చెప్పారు ఈషా, భరత్. తల్లి, తండ్రి అడుగుజాడల్లో నడుస్తూ 2002లో హీరోయిన్‌గా చిత్ర రంగం ప్రవేశం చేసిన ఈష కొన్ని సినిమాల్లో నటించారు. ఆ సమయంలోనే వ్యాపారవేత్త భరత్ పరిచయం కావడంతో మనసులు కలసి కొంత కాలం ఆయనతో డేటింగ్ చేశారు. 2012 జూన్ 29న వీరిద్దరూ పెళ్లి చేసుకున్నారు. పెళ్లయిన పన్నెండేళ్లకు, ఇద్దరు పిల్లలు పుట్టిన తర్వాత ఈషా, భరత్ విడిపోవాలని నిర్ణయించున్నారు. ప్రేమించి పెళ్లి చేసుకున్న వీరిద్దరూ ఇలాంటి నిర్ణయం తీసుకోవడం బాలీవుడ్‌లో చర్చనీయాంశం అయింది. ఇటీవలే ఓటీటీ వేదికపైకి అడుగుపెట్టిన ఈషా నటిగా కొనసాగుతుందేమో చూడాలి.



ఆరేళ్లలో రూ.5.56 లక్షల కోట్లు

- సహజవాయు రంగంలోకి పెట్టుబడులు
- వినియోగం 15 శాతానికి పెంచడం లక్ష్యం
- ఇండియా ఎనర్జీ వీక్ సదస్సులో ప్రధాని మోదీ

బెతుల్ (గోవా): ప్రపంచంలో శరవేగంగా వృద్ధి చెందుతున్న బడా ఆర్థిక వ్యవస్థగా అవతరించిన భారత్ అవసరాలు తీర్చేందుకు ఇంధన రంగంలోకి అసాధారణ స్థాయిలో పెట్టుబడులు వస్తున్నాయని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. ఇందులో భాగంగా, వచ్చే 5-6 ఏళ్లలో సహజ వాయువు సరఫరా విభాగంలోకి 6,700 కోట్ల డాలర్ల (రూ.5.56 లక్షల కోట్ల పైమాటే) మేర పెట్టుబడులు రావచ్చన్నారు. మంగళవారం 'ఇండియా ఎనర్జీ వీక్ 2024' సదస్సు ప్రారంభ కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. తమ ప్రభుత్వం చేపట్టిన సంస్కరణలు దేశీయంగా సహజ వాయువు ఉత్పత్తి పెరుగుదలకు దోహదపడుతున్నాయన్నారు. మొత్తం ఇంధన వినియోగంలో సహజ వాయువు వాటాను 2030 నాటికి 15 శాతానికి పెంచాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందన్నారు. ప్రస్తుతం ఈ వాటా 6.3 శాతంగా ఉంది. 2070 నాటికి భారత్ కర్బన తటస్థ దేశంగా ఎదిగేందుకు సహజ వాయువు కీలక ఇంధనం కాగలదన్నారు. నేచురల్ గ్యాస్‌ను విద్యుత్, ఎరువుల ఉత్పత్తికి వినియోగించడంతో పాటు వాహనాల్లో ఉపయోగించే సీఎన్‌జీ, వంటకు ఉపయోగించే ఎల్‌పీజీగా మార్చవచ్చు. అంతేకాదు, బొగ్గు వంటి సంప్రదాయ ఇంధన వనరులతో పోలిస్తే ఇది తక్కువ కాలుష్యం విడుదల చేస్తుంది. ఈ సదస్సులో పాల్గొన్న సందర్భంగా ఎక్సాన్ మొబిల్, బీపీ, ఖతార్ ఎనర్జీ, టోటల్ ఎనర్జీస్ వంటి 20 అంతర్జాతీయ ఆయిల్ అండ్ గ్యాస్ కంపెనీల సీఈఓలు, నిపుణులతో మోదీ సమావేశమయ్యారు. ఇంధన రంగంలో పరిస్థితులపై చర్చించడంతోపాటు భారత ఆయిల్ అండ్ గ్యాస్ సెక్టార్‌లో పెట్టుబడులు పెట్టాలని వారిని కోరారు.

వేదాంత రూ.33,220 కోట్ల పెట్టుబడులు

వచ్చే మూడేళ్లలో చమురు ఉత్పత్తిని రెట్టింపు చేసేందుకు 400 కోట్ల డాలర్ల (రూ.33,220 కోట్లు) పెట్టుబడులు పెట్టనున్నట్లు వేదాంత లిమిటెడ్ చైర్మన్ అనిల్ అగర్వాల్ తెలిపారు. ఈ గ్రూప్ కంపెనీ కెయిర్న్ ఆయిల్ అండ్ గ్యాస్ ... ఎనర్జీ (గతంలో కెయిర్న్ ఎనర్జీ) వచ్చే మూడేళ్లలో రోజుకు 3 లక్షల బ్యారెళ్ల (ఏడాదికి 1.5 కోట్ల టన్నులు) ఆయిల్ ఉత్పత్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకుందని ఇండియా ఎనర్జీ వీక్‌లో అనిల్ అగర్వాల్ వెల్లడించారు.

టాటా @ రూ.30 లక్షల కోట్లు



మార్కెట్ క్యాప్‌లో కొత్త రికార్డు • ఈ ఘనత సాధించిన ఏకైక గ్రూప్

ముంబై: స్టాక్ మార్కెట్ ర్యాలీ టాటా గ్రూప్ కంపెనీలకు బాగా కలిసి వచ్చింది. మంగళవారం మార్కెట్లో ఏర్పడిన రిలీఫ్ ర్యాలీతో టాటా గ్రూప్‌లోని లిస్టెడ్ కంపెనీలన్నింటి షేర్ల మార్కెట్ విలువ రూ.30 లక్షల కోట్లు దాటింది. దేశంలో మరే పారిశ్రామిక గ్రూప్ కంపెనీల మార్కెట్ క్యాప్ ప్రస్తుతం ఈ స్థాయిలో లేదు. ముకేశ్ అంబానీ నేతృత్వంలోని రిలయన్స్ గ్రూప్ కంపెనీల మార్కెట్ క్యాప్ సైతం ప్రస్తుతం రూ.21.3 లక్షల కోట్లు మాత్రమే. టాటా గ్రూప్ ప్రధాన కంపెనీ టీసీఎస్ కూడా తొలిసారిగా రూ.15 లక్షల కోట్ల మార్కెట్ విలువను దాటింది. కంపెనీ షేర్లు మంగళవారం బీఎస్ఈలో 4.05 శాతం లాభంతో రూ.4,133.45 వద్ద ముగిశాయి. దీంతో కంపెనీ మార్కెట్ క్యాప్ రూ.15,12,450.59 కోట్ల వద్ద స్థిరపడింది. టాటా గ్రూప్‌లోని మరో రెండు ప్రధాన కంపెనీలు టాటా మోటార్స్, టాటా స్టీల్ కంపెనీల షేర్లు కూడా మంగళవారం 52 వారాల గరిష్ఠ స్థాయి వద్ద ముగిశాయి.

లాభాలతో ముగిసిన సెన్సెక్స్

ఈక్విటీ మార్కెట్ మంగళవారం లాభాలతో ముగిసింది. సెన్సెక్స్ 454.67 పాయింట్ల లాభంతో 72,186.09 వద్ద, నిఫ్టీ 157.70 పాయింట్ల లాభంతో 21,929.49 వద్ద ముగిశాయి. టీసీఎస్, ఇన్ఫోసిస్ వంటి ఐటీ కంపెనీల షేర్లకు కొనుగోళ్ల మద్దతు, ఎఫ్‌పీఐల కొనుగోళ్లు, సానుకూల అంతర్జాతీయ సంకేతాలు ఇందుకు దోహదం చేశాయి. సెన్సెక్స్‌లోని 30 కంపెనీల షేర్లలో 19 కంపెనీల షేర్లు లాభాలతో, 11 కంపెనీల షేర్లు నష్టాలతో ముగిశాయి. బ్యాంకింగ్, పవర్, యుటిలిటీస్ సూచీలు తప్ప, మిగతా అన్ని సూచీలు మంగళవారం లాభాలతో ముగిశాయి.

నేటి నుంచి మరో మూడు ఐపీఓలు

బుధవారం నుంచి మరో మూడు కంపెనీలు ఐపీఓకు వస్తున్నాయి. రాశి పెరిఫెరల్స్, జన స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్, క్యాపిటల్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ ఈ ఐపీఓల ద్వారా రూ.1,700 కోట్లు సమీకరించనున్నాయి. ఇందులో రాశి పెరిఫెరల్స్ రూ.295-311, జన స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ రూ.393-414, క్యాపిటల్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ రూ.445-468 ధరల శ్రేణిలో ఐపీఓలు జారీ చేస్తున్నాయి.

9 నుంచి ఎంటిరో హెల్త్‌కేర్ ఐపీఓ: ఈ నెల 9 నుంచి ఎంటిరో హెల్త్‌కేర్ సొల్యూషన్స్ కంపెనీ ఐపీఓ ప్రారంభమవుతోంది. ఫిబ్రవరి 13న ముగిసే ఈ ఐపీఓ ద్వారా కంపెనీ రూ.1,600 కోట్లు సమీకరించనుంది. ఇందుకోసం ఒక్కో షేరును రూ.1,195-1,258 ధరల శ్రేణిలో జారీ చేస్తోంది. ఈ రూ.1,600 కోట్లలో రూ.1,000 కోట్లు కొత్తగా ఈక్విటీ షేర్లు జారీ చేయడం ద్వారా, మరో రూ.600 కోట్లు ఆఫర్ ఫర్ సేల్ కింద జారీ చేస్తోంది.

వ్యాన్‌బరీ ఎబిటా రికార్డు

ఫార్మా ఏపీఐ రంగంలోని వ్యాన్‌బరీ డిసెంబరు త్రైమాసికంలో రికార్డు స్థాయిలో ఎబిటా సాధించింది. డిసెంబరు 31తో ముగిసిన త్రైమాసికంలో రూ.22 కోట్లు, 9 నెలల కాలంలో రూ.54 కోట్లు ఎబిటా సాధించినట్టు కంపెనీ ప్రకటించింది. కాగా క్యు3లో రూ.146 కోట్ల అమ్మకాలపై రూ.10 కోట్ల నికరలాభం ఆర్జించినట్టు వెల్లడించింది. డిసెంబరు చివరి నాటికి రుణభారాన్ని కూడా రూ.608 కోట్ల నుంచి రూ.117 కోట్లకు తగ్గించుకున్నట్టు తెలిపింది.

అజాద్ ఇంజనీరింగ్ లాభం 49% వృద్ధి

అజాద్ ఇంజనీరింగ్ డిసెంబరు త్రైమాసికానికి రికార్డు ఫలితాలు సాధించింది. కంపెనీ త్రైమాసికాదాయం రూ.89.2 కోట్లుగా నమోదయింది. గత ఏడాది ఇదే త్రైమాసికంలో ఆర్జించిన రూ.59.8 కోట్లతో పోల్చితే ఆదాయం 49 శాతం పెరిగింది. అలాగే లాభం ఏకంగా 339 శాతం పెరిగి రూ.రూ.3.83 కోట్ల నుంచి రూ.16.8 కోట్లకు పెరిగింది.

ఐసీఐసీఐ బ్యాంక్ ఈక్విటీలో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌కు వాటా

న్యూఢిల్లీ: ఆరు ప్రధాన బ్యాంకుల ఈక్విటీలో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ గ్రూప్ వాటా మరింత పెరగనుంది. ఐసీఐసీఐ బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్, సూర్యోదయ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్, బంధన్ బ్యాంక్, ఎస్ బ్యాంక్, ఇండస్ఇండ్ బ్యాంక్‌ల ఈక్విటీలో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ గ్రూప్ వాటా ప్రస్తుత ఐదు శాతం నుంచి 9.5 శాతానికి పెంచుకునేందుకు ఆర్‌బీఐ అనుమతించింది. తన గ్రూప్ సంస్థలైన హెచ్‌డీఎఫ్‌సీ మ్యూచువల్ ఫండ్, హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ, హెచ్‌డీఎఫ్‌సీ ఎర్గో జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీల ద్వారా హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ఈ వాటాలను కొనుగోలు చేయనుంది.

ఖతార్ నుంచి ఎల్ఎన్‌జీ దిగుమతి ఒప్పందం
మరో 20 ఏళ్లు పొడిగింపు

డీల్ విలువ రూ.6.48 లక్షల కోట్లు

భారత్‌కు రూ.50,000 కోట్ల ఆదా

ఖతార్ నుంచి ద్రవ రూప సహజ వాయువు(ఎల్ఎన్‌జీ) దిగుమతి ఒప్పందాన్ని భారత్ మరో 20 ఏళ్లు (2048 వరకు) పొడిగించుకుంది. ఈ పొడిగింపు డీల్ విలువ 7,800 కోట్ల డాలర్లు. మన కరెన్సీలో దాదాపు రూ.6.48 లక్షల కోట్లు. ఈ ఒప్పందంలో భాగంగా బ్రిటిష్ థర్మల్ యూనిట్ ఎల్ఎన్‌జీని ప్రస్తుత మార్కెట్ రేటు కంటే 0.8 డాలర్లు తక్కువకు భారత్ దిగుమతి చేసుకోనుంది. తద్వారా దేశానికి 20 ఏళ్లలో 600 కోట్ల డాలర్ల (దాదాపు రూ.50,000 కోట్లు) ఆదా కానుంది. దేశంలో అతిపెద్ద సహజవాయువు దిగుమతిదారైన పెట్రోనెట్ ఎల్ఎన్‌జీ లిమిటెడ్. ఖతార్ ఎనర్జీతో కుదుర్చుకున్న రెండు ఒప్పందాల ద్వారా ఏటా 85 లక్షల టన్నుల ఎల్ఎన్‌జీని దిగుమతి చేసుకుంటోంది. అందులో 75 లక్షల టన్నుల దిగుమతికి సంబంధించిన 25 ఏళ్ల కాంట్రాక్టు 2028తో ముగియనుంది. మరో పది లక్షల టన్నుల దిగుమతి ఒప్పందాన్ని 2015లో కుదుర్చుకుంది. కాగా, ఏటా 75 లక్షల టన్నుల ఎల్ఎన్‌జీ కొనుగోలు ఒప్పందాన్ని 2048 వరకు పొడిగించే ఒప్పందంపై రెండు కంపెనీలు మంగళవారం సంతకం చేశాయి.

సిగ్నిటీ కన్సాలిడేటెడ్ లాభం రూ.48 కోట్లు

హైదరాబాద్: సిగ్నిటీ టెక్నాలజీస్ కన్సాలిడేటెడ్ లాభం వర్తమాన ఆర్థిక సంవత్సరం డిసెంబరు త్రైమాసికంలో 9.4 శాతం వృద్ధితో రూ.468.02 కోట్లుగా నమోదయింది. గత ఏడాది ఇదే త్రైమాసికంలో ఆర్జించిన ఆదాయం రూ.427.99 కోట్లు. కన్సాలిడేటెడ్ లాభం 3.2 శాతం వృద్ధితో రూ.46.55 కోట్ల నుంచి రూ.48.04 కోట్లకు పెరిగింది. ఇదే తేదీతో ముగిసిన తొమ్మిది నెలల కాలంలో కంపెనీ ఆదాయం 11.2 శాతం పెరిగి రూ.1222.61 కోట్ల నుంచి రూ.1359.37 కోట్లకు చేరగా లాభం 16.3 శాతం పెరిగి రూ.119.08 కోట్ల నుంచి రూ.138.46 కోట్లుగా నమోదయింది. ఎన్నో సవాళ్లను తట్టుకుని కూడా తాము మంచి ఆర్థిక ఫలితాలు సాధించినట్టు కంపెనీ సీఈఓ శ్రీకాంత్ చక్కిలం తెలిపారు.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	63,000 ▼	57,750 ▼	76,000 ▼
ముంబై	62,480 ▼	57,230 ▼	69,980 ▼

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

6వ తేదీ		విజయవాడ	546
హైదరాబాద్	545	విశాఖపట్నం	555
7వ తేదీ		వరంగల్	547
చిత్తూరు	583		
గోదావరి	546	డజను గుడ్లు రూ.72	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	113	గోదావరి	115
వరంగల్	113	విజయవాడ	115
కరీంనగర్	113	గుంటూరు	119
మహబూబ్‌నగర్	113	ఒంగోలు	119
కర్నూలు	113	చిత్తూరు	126
విశాఖపట్నం	110		

రంగంలోకి ఈడీ, ఎఫ్ఐయూ!

పేటీఎంపై చర్యల వివరాలివ్వండి
ఆర్‌బీఐకి సూచన

న్యూఢిల్లీ: పేటీఎం పేమెంట్స్ బ్యాంక్ (పీపీబీఎల్) వ్యవహారం నానాటికీ ముదురుతున్నట్టు కనిపిస్తోంది. ఆ వ్యవహారంలో దర్యాప్తు చేపట్టాలని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్, కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ నిర్వహణలోని ఫైనాన్షియల్ ఇంటలిజెన్స్ యూనిట్ (ఎఫ్ఐయూ) భావిస్తున్నాయి. పీపీబీఎల్‌పై తీసుకున్న చర్యలకు సంబంధించిన వివరాల నివేదిక తమకు అందించాలని ఈడీ, ఎఫ్ఐయూ అధికారులు ఆర్‌బీఐని కోరారు. ఆ సమాచారం ఆధారంగా పేటీఎం పేమెంట్ బ్యాంక్ అక్రమ నగదు లావాదేవీలకు పాల్పడింది, లేనిదీ తెలుసుకుని కేసులు నమోదు చేయాలని ఈ రెండు సంస్థలు భావిస్తున్నాయంటున్నారు. చర్యల నివేదిక అందించినట్టయితే ఆ వ్యవహారంలో మరింత లోతైన దర్యాప్తు చేపట్టాలా అనే అంశం పరిశీలిస్తామని ఈడీ తెలిపింది. మనీలాండరింగ్ వ్యవహారంలో పేటీఎం సహా పలు ఆన్‌లైన్ పేమెంట్ వాలెట్లపై ఈడీ ఇప్పటికే దర్యాప్తు జరుపుతోంది. నివేదిక అందినట్టయితే తాజా దర్యాప్తు చేపట్టే అవకాశంతో పాటు ఇప్పటికే జరుపుతున్న దర్యాప్తులోనే తాజా అభియోగాలు జోడించే ఆస్కారం సైతం ఉన్నదని పరిశీలకులంటున్నారు. అలాగే మనీలాండరింగ్, నల్లధనం కేసులను పరిశీలించే అధికారం ఎఫ్ఐయూకి కూడా ఉంది. ఇదిలా ఉండగా ప్రస్తుత పరిస్థితి నుంచి బయటపడేందుకు పేటీఎం ప్రధాన ప్రమోటర్ విజయ్ శేఖర్ శర్మ మంగళవారం ఆర్‌బీఐ ఉన్నతాధికారులతో సమావేశమైనట్టు సమాచారం. అయితే ఈ భేటీపై పేటీఎం గానీ, ఆర్‌బీఐగానీ అధికారికంగా స్పందించలేదు.

చర్చలు నిజమే : హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్

వ్యాలెట్ వ్యాపారాన్ని విక్రయించే విషయంలో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌తో చర్చలు జరుపుతున్నట్టు పీపీబీఎల్ తెలిసింది. బ్యాంకు సీనియర్ అధికారి ఒకరు ఈ విషయాన్ని ధ్రువీకరించారు. అయితే ఈ చర్చలు వ్యాలెట్ కొనుగోలు కోసమా లేక ఇతర అంశాలపైనా అనే విషయాన్ని ఆయన వెల్లడించలేదు. మరోవైపు పేటీఎం వ్యాలెట్ కొనుగోలు కోసం తాము ప్రయత్నిస్తున్నట్టు వచ్చిన వార్తలను జియో ఫైనాన్షియల్స్ తోసిపుచ్చింది.

స్పోర్ట్స్

'ఫిఫా క్వాలిఫయర్స్'కు ఆతిథ్య అవకాశం ఇవ్వండి

ఏఐఎఫ్ఎఫ్‌కు శాట్స్ లేఖ



సీఎం రేవంత్ రెడ్డిని కలిసిన రాష్ట్ర ఫుట్‌బాల్ సంఘం ప్రధాన కార్యదర్శి ఫల్గుణ

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): ఫుట్‌బాల్ వరల్డ్‌కప్‌కు సంబంధించిన ఫిఫా క్వాలిఫయర్స్ మ్యాచ్‌కు ఆతిథ్యమిచ్చేందుకు తెలంగాణ ప్రభుత్వం ఆసక్తి వ్యక్తం చేసింది. ఈ మ్యాచ్ నిర్వహణ గురించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి రాష్ట్ర ఫుట్‌బాల్ సంఘం ప్రధాన కార్యదర్శి జి.ఫల్గుణ తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన సీఎం రేవంత్.. మ్యాచ్ నిర్వహణపై సంబంధిత అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. దీంతో అఖిల భారత ఫుట్‌బాల్ సమాఖ్య (ఏఐఎఫ్ఎఫ్)కు స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ (శాట్స్) లేఖ రాసింది. ఫిఫా క్వాలిఫయర్స్‌లో భాగంగా ఈ జూన్ 6వ తేదీన భారత్-కువైట్ మధ్య జరగాల్సిన మ్యాచ్‌ను హైదరాబాద్‌లో నిర్వహించేందుకు తమకు అవకాశమివ్వాలని కోరింది.

అదరగొట్టిన రుత్విక



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): జాతీయ సీనియర్ ర్యాంకింగ్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ మిక్స్‌డ్ డబుల్స్‌లో తెలుగమ్మాయి రుత్విక శివానీ జోడీ విజేతగా నిలిచింది. బెంగళూరులో మంగళవారం జరిగిన మిక్స్‌డ్ ఫైనల్లో రుత్విక-రోహన్ కపూర్ ద్వయం 21-12, 21-16తో ధ్రువ్ రావత్-త్రిషా హెగ్డే జంటపై గెలిచి టైటిల్ అందుకుంది.

కుర్రాళ్లు కేక

వరుసగా ఐదోసారి ఫైనల్‌కు భారత్



అండర్-19 ప్రపంచకప్‌లో భారత్ ఫైనల్ చేరడం ఓవరాల్‌గా ఇది తొమ్మిదోసారి. ఇక, రికార్డు స్థాయిలో ఐదుసార్లు విజేతగా నిలిచింది.

సెమీస్‌లో దక్షిణాఫ్రికాపై 2 వికెట్లతో గెలుపు
సచిన్, కెప్టెన్ ఉదయ్ సూపర్ ఇన్నింగ్స్

ఆరో టైటిల్‌పై కన్నేసిన భారత యువ క్రికెటర్లు అంచనాలకు తగ్గట్టే చెలరేగుతున్నారు. దక్షిణాఫ్రికాపై సెమీస్‌లో 32 పరుగులకే నాలుగు వికెట్లు కోల్పోయినా.. ఒత్తిడిని తట్టుకుంటూ నిలిచి గెలిచారు. కెప్టెన్ ఉదయ్ సహరన్ ఫామ్ నిరూపించుకోగా.. సచిన్ దాస్ వరుసగా రెండో శతకాన్ని తృటిలో కోల్పోయాడు. అయితేనేం.. మెరుపు ఆటతో జట్టు అద్భుత విజయం సాధించేందుకు తోడ్పడ్డాడు. తద్వారా అండర్-19 వరల్డ్‌కప్‌లో వరుసగా ఆరో విజయంతో భారత్ తుది పోరుకు చేరింది.

బెనోని: ఉత్కంఠభరితంగా సాగిన అండర్-19 వరల్డ్‌కప్ తొలి సెమీస్‌లో యువ భారత్ అదరగొట్టింది. ఓ దశలో ఓటమి తప్పదా? అనిపించినా.. సచిన్ దాస్ (95 బంతుల్లో 11 ఫోర్లు, 1 సిక్స్‌తో 96), కెప్టెన్ ఉదయ్ సహరన్ (124 బంతుల్లో 6 ఫోర్లతో 81) అసమాన ఆటతీరుతో అండగా నిలిచారు. ఫలితంగా.. మంగళవారం దక్షిణాఫ్రికాతో జరిగిన ఈ మ్యాచ్‌లో డిఫెండింగ్ చాంపియన్ భారత్ 2 వికెట్ల తేడాతో నెగ్గింది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన సౌతాఫ్రికా 50 ఓవర్లలో 7 వికెట్లకు 244 పరుగులు చేసింది. ఓపెనర్ ప్రిటోరియస్ (76), రిచర్డ్ (64) అర్ధసెంచరీలు చేశారు. రాజ్ లింబానికి మూడు, ముషీర్‌కు రెండు వికెట్లు దక్కాయి. లక్ష్య ఛేదనలో భారత్ 48.5 ఓవర్లలో 8 వికెట్లకు 248 పరుగులు చేసి గెలిచింది. మఫాక, లూస్‌లకు మూడేసి వికెట్లు దక్కాయి. మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్‌గా ఉదయ్ నిలిచాడు. ఆస్ట్రేలియా, పాకిస్థాన్ జట్ల మధ్య జరిగే రెండో సెమీఫైనల్ విజేతతో భారత్ ఈనెల 11న ఫైనల్ మ్యాచ్ ఆడనుంది.

32 రన్స్‌కే 4 వికెట్లు కోల్పోయినా..: 245 పరుగుల లక్ష్యం కోసం బరిలోకి దిగిన భారత్‌కు టోర్నీలో తొలిసారిగా గట్టిపోటీనే ఎదురైంది. ఇన్నింగ్స్ తొలి బంతికే ఓపెనర్ ఆదర్శ్ వికెట్‌ను కోల్పోయింది. ఆ తర్వాత పేసర్ లూస్ మరింతగా దెబ్బతీశాడు. భీకర ఫామ్‌లో ఉన్న ముషీర్ ఖాన్ (4)ను నాలుగో ఓవర్‌లో అవుట్ చేయగా, కాసేపటికే వరుస ఓవర్లలో అర్షిన్ (12), మోలియా (5)ల వికెట్లు పడగొట్టాడు. అప్పటికి జట్టు స్కోరు 32/4 మాత్రమే. ఈ దశలో జట్టుకు ఓటమి తప్పదా అనిపించింది. కానీ పరుగులు రావడం కష్టంగా మారిన ఈ పిచ్‌పై సచిన్ దాస్, ఉదయ్ సమయోచితంగా ఆడారు. ఉదయ్ నిదానంగా ఆడినా మరో ఎండ్‌లో సచిన్ చెలరేగాడు. చక్కటి సమయస్ఫూర్తితో రిస్కీ షాట్లకు వెళ్లకుండా ఈ జోడీ జట్టును విజయంవైపు నడిపించింది. 47 బంతుల్లోనే సచిన్ అర్ధసెంచరీ సాధించాడు. అయితే 40వ ఓవర్‌లో సిక్సర్ బాదిన తను సెంచరీకి అతి చేరువలో వచ్చాడు. కానీ మరో నాలుగు పరుగుల దూరంలో క్యాచ్ అవుట్‌గా వెనుదిరిగాడు. అప్పటికే ఐదో వికెట్‌కు 171 పరుగులు జత చేరడం విశేషం. ఇక విజయానికి మరో 19 పరుగుల దూరంలో అవనీశ్ (10), అభిషేక్ (0) అవుట్ కావడంతో ఉత్కంఠ పెరిగింది. అప్పటికి 16 బంతుల్లో 18 రన్స్ కావాల్సి ఉండగా చేతిలో మూడు వికెట్లున్నాయి. అయితే 48వ ఓవర్‌లో రాజ్ లింబాని (13 నాటౌట్) అలవోకగా సిక్సర్ బాదేసి ఒత్తిడి తగ్గించాడు. 12 బంతుల్లో 9 రన్స్ అవసరమైన వేళ 49వ ఓవర్‌లో ఉదయ్ ఫోర్ కొట్టి రనౌట్ కాగా, లింబాని మరో ఫోర్‌తో మ్యాచ్‌ను ముగించాడు.

సంక్షిప్త స్కోర్లు

దక్షిణాఫ్రికా: 50 ఓవర్లలో 244/7 (ప్రిటోరియస్ 76, రిచర్డ్ సెలెట్స్వేన్ 64; లింబాని 3/60, ముషీర్ ఖాన్ 2/43).
భారత్: 48.5 ఓవర్లలో 248/8. (సచిన్ దాస్ 96, ఉదయ్ 81; మఫాకా 3/32, లూస్ 3/37).

ఫుట్‌బాల్ ఫైనల్లో అమ్మాయిలు

శాఫ్ అండర్-19 చాంపియన్‌షిప్

ఢాకా: దక్షిణాసియా ఫుట్‌బాల్ సమాఖ్య (శాఫ్) అండర్-19 మహిళల చాంపియన్‌షిప్‌లో భారత జట్టు ఫైనల్‌కు దూసుకెళ్లింది. మంగళవారం ఇక్కడ జరిగిన తమ లీగ్ చివరి మ్యాచ్‌లో భారత్ 4-0 గోల్స్ తేడాతో నేపాల్‌ను చిత్తుచేసింది. నేహా (54వ, 80వ) రెండు గోల్స్‌తో చెలరేగగా.. రౌల్ (85వ), సిండీ (90+3వ) చెరో గోల్ చేశారు. గురువారం జరిగే టైటిల్ పోరులో డిఫెండింగ్ చాంపియన్, ఆతిథ్య బంగ్లాదేశ్‌తో భారత్ తలపడనుంది.

జూలైలో జింబాబ్వే టూర్‌కు టీమిండియా

హరారే: ఐదు టీ20ల సిరీస్ కోసం భారత ద్వితీయ శ్రేణి జట్టు జింబాబ్వేలో పర్యటించనుంది. టీ20 వరల్డ్‌కప్ ముగిసిన తర్వాత.. జూలై 6 నుంచి 14 వరకు ఈ ద్వైపాక్షిక సిరీస్‌ను షెడ్యూల్ చేసినట్టు జింబాబ్వే క్రికెట్ (జెడ్‌సీ) ప్రకటించింది. హరారే వేదికగా జూలై 6, 7, 10, 13, 14న మ్యాచ్‌లు జరుగుతాయని తెలిపింది. వీటిల్లో మూడో మ్యాచ్‌ను మాత్రమే డే/నైట్‌గా నిర్వహించనున్నారు.

జాతీయ హాకీ ఆటగాడు వరుణ్‌పై అత్యాచార ఆరోపణలు

పోక్సో చట్టం కింద కేసు నమోదు



బెంగళూరు: భారత హాకీ జట్టు ఆటగాడు, అర్జున అవార్డు గ్రహీత వరుణ్ కుమార్‌పై ఓ మహిళ లైంగిక వేధింపుల ఆరోపణలు చేసింది. వివాహం చేసుకుంటానని నమ్మించి మైనర్‌గా ఉన్నప్పుడే తనపై వరుణ్ పలుమార్లు అత్యాచారం చేశాడని సోమవారం బెంగళూరు పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు పోక్సో చట్టం కింద వరుణ్‌పై కేసు నమోదు చేశారు. జలంధర్‌లో నివసిస్తున్న 28 ఏళ్ల వరుణ్ ప్రస్తుతం పరారీలో ఉన్నాడని, అతడి కోసం గాలిస్తున్నట్టు పోలీసులు తెలిపారు. 2018లో ఇన్‌స్టాగ్రామ్‌లో వరుణ్ పరిచయమైనప్పుడు ఆ యువతికి 17 ఏళ్లు. ఆ సమయంలో వరుణ్ స్థానిక సాయ్ సెంటర్‌లో శిక్షణ తీసుకుంటున్నాడని యువతి పేర్కొంది. టోక్యో ఒలింపిక్స్‌లో పాల్గొన్న భారత జట్టులో వరుణ్ స్టాండ్‌బై ప్లేయర్‌గా ఉన్నాడు. మరోవైపు ఎఫ్ఐహెచ్ ప్రోలీగ్‌లో ఆడేందుకు జాతీయ జట్టుతో పాటు వరుణ్ భువనేశ్వర్‌లోనే ఉన్నట్టు హాకీ ఇండియా వర్గాలు పేర్కొనడం గమనార్హం. 2017 నుంచి జాతీయ జట్టులో సభ్యునిగా ఉన్న వరుణ్.. టీమిండియా తరఫున 142 మ్యాచ్‌లు ఆడి 40 గోల్స్ చేశాడు.

కేన్ మరో శతకం

కివీస్ ఆధిక్యం 528 పరుగులు
సౌతాఫ్రికాతో తొలి టెస్టు



మౌంట్ మాంగనుయ్: కేన్ విలియమ్సన్ (109) రెండో ఇన్నింగ్స్‌లోనూ శతకంతో చెలరేగడంతో.. దక్షిణాఫ్రికాతో తొలి టెస్టులో ఆతిథ్య న్యూజిలాండ్ పట్టుబిగించింది. 349 పరుగుల భారీ ఆధిక్యంతో రెండో ఇన్నింగ్స్ బరిలోకి దిగిన కివీస్ మూడో రోజు ఆట ముగిసేసరికి 179/4 స్కోరు చేసింది. డారెల్ మిచెల్ (11), బ్లండెల్ (5) క్రీజులో ఉన్నారు. నీల్ బ్రాండ్ 2 వికెట్లు పడగొట్టాడు. ప్రస్తుతం న్యూజిలాండ్ 528 పరుగుల భారీ ఆధిక్యంలో ఉంది. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 80/4తో తొలి ఇన్నింగ్స్‌ను కొనసాగించిన సౌతాఫ్రికా 162 రన్స్‌కు కుప్పకూలింది. కేగన్ పీటర్సన్ (45) టాప్ స్కోరర్. హెన్రీ, శాంట్నర్ చెరో 3 వికెట్లు తీశారు. అయితే, ప్రత్యర్థిని ఫాలో ఆన్ ఆడించడానికి కివీస్ నిరాకరించింది. మొదటి ఇన్నింగ్స్‌లో కివీస్ 511 పరుగులు చేసింది. కాగా, తొలి ఇన్నింగ్స్‌లోనూ 118 రన్స్ చేసిన విలియమ్సన్.. ఓ టెస్టులో రెండు ఇన్నింగ్స్‌లోనూ సెంచరీలు చేసిన ఐదో కివీస్ ఆటగాడిగా రికార్డులకెక్కాడు.

ఆసీస్ క్లీన్‌స్వీప్

మూడో వన్డేలోనూ విండీస్ ఓటమి

కాన్‌బెర్రా: వెస్టిండీస్‌తో మూడు వన్డేల సిరీస్‌ను ఆస్ట్రేలియా 3-0తో క్లీన్‌స్వీప్ చేసింది. మంగళవారం జరిగిన ఆఖరిదైన మూడో వన్డేలో ఆసీస్ 8 వికెట్లతో విజయం సాధించింది. ముందుగా విండీస్ 24.1 ఓవర్లలో 86 పరుగులకే కుప్పకూలింది. ఓపెనర్ అథనజె (32) మినహా అంతా విఫలమయ్యారు. జేవియర్ బార్ట్‌లెట్‌కు 4, మోరిస్, జంపాలకు రెండేసి వికెట్లు దక్కాయి. ఛేదనలో ఆసీస్ 6.5 ఓవర్లలోనే 2 వికెట్లకు 87 పరుగులు చేసి నెగ్గింది. ఓపెనర్లు జేక్ ఫ్రేజర్ (41), ఇన్‌గ్లిస్ (35 నాటౌట్) ఆకట్టుకున్నారు.

కెప్టెన్‌గా రోహిత్‌ను ఎందుకు తప్పించామంటే..

ముంబై కోచ్ బౌచర్ వివరణ



కేప్‌టౌన్: ఇటీవల ఐపీఎల్ జట్టు ముంబై ఇండియన్స్ కెప్టెన్సీ బాధ్యతల నుంచి రోహిత్ శర్మను తప్పించడం పెను సంచలనమే అయింది. హిట్‌మ్యాన్ స్థానంలో హార్దిక్ పాండ్యాకు జట్టు పగ్గాలు అప్పగించిన సంగతి తెలిసిందే. అయితే, జట్టు నాయకత్వ మార్పుపై ముంబై కోచ్ మార్క్ బౌచర్ వివరణ ఇచ్చాడు. 'ఇది ఆటపరంగా తీసుకొన్న నిర్ణయం. జట్టు ప్రస్తుతం మార్పు దశలో ఉంది. ఫ్యాన్స్ ఈ విషయాన్ని అర్థం చేసుకోవాలి. గత రెండు సీజన్లలో బ్యాటర్‌గా హిట్‌మ్యాన్ రాణించలేదు. నాయకత్వ బాధ్యతల నుంచి తప్పించడం వల్ల రోహిత్ మరింత స్వేచ్ఛగా ఆడే అవకాశం దక్కుతుంది. అందరం కలసి చర్చించిన తర్వాతనే ఈ నిర్ణయం తీసుకొన్నాం. ఆటకు సంబంధించినంత వరకు భావోద్వేగాలను పక్కనబెట్టాల'ని ఓ పాడ్‌కాస్ట్ ఇంటర్వ్యూలో బౌచర్ చెప్పాడు.

విండీస్ ఆల్‌రౌండర్ ఫాబియెన్ అలెన్‌పై దాడి



జొహాన్నెస్‌బర్గ్: వెస్టిండీస్ ఆల్‌రౌండర్ ఫాబియెన్ అలెన్‌ను దుండగులు తుపాకీతో బెదిరించి అతని వస్తువులను దోచుకెళ్లారు. ప్రస్తుతం అతడు దక్షిణాఫ్రికాలో జరుగుతున్న ఎస్ఏ20 లీగ్‌లో పార్ల్ రాయల్స్ తరఫున ఆడుతున్నాడు. గత నెల 25న జట్టు హోటల్ బయట అలెన్‌పై దాడి జరిగింది. ఈ ఘటనలో అతడి ఫోన్‌తో పాటు వ్యక్తిగత వస్తువులున్న బ్యాగ్‌ను దుండగులు లాక్కొని పరారయ్యారు. ఈ దాడితో ఆటగాళ్ల భద్రతపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. అయితే అలెన్ సురక్షితంగానే ఉన్నట్టు జట్టు వర్గాలు పేర్కొన్నాయి.

నల్లగొండ సభలోపే

బీఆర్ఎస్ నేతలు కాంగ్రెస్‌లోకి..

- లోక్‌సభ ఎన్నికల తర్వాత బీఆర్ఎస్ నాలుగు ముక్కలు
- కేసీఆర్ తెలివితక్కువతనం వల్లే కాళేశ్వరం కూలింది
- 12-13 ఎంపీ స్థానాలు సాధిస్తాం: మంత్రి కోమటిరెడ్డి

హైదరాబాద్, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): ఈనెల 13న నల్లగొండలో బీఆర్ఎస్ నిర్వహించబోయే బహిరంగ సభకు ముందే ఆ పార్టీ నేతలు కాంగ్రెస్‌లో చేరతారని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన మంగళవారం గాంధీ భవన్‌లో లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి జరిగిన పీఈసీ సమావేశంలో పాల్గొన్న అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడారు. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి పోటీ చేసేందుకు 17 స్థానాలకు 309 దరఖాస్తులు వచ్చాయన్నారు. కులాలు, సామాజిక వర్గాలవారీగా రేపటిలోగా పరిశీలించి సీఈసీకి పంపిస్తామని, తుది నిర్ణయం అధిష్ఠానానిదేనని చెప్పారు. దరఖాస్తు చేయనివారి పేర్లనూ పరిశీలిస్తున్నామన్నారు. రానున్న ఎన్నికల్లో 12-13 స్థానాలు కచ్చితంగా గెలుస్తామని మంత్రి ధీమా వ్యక్తం చేశారు. రానున్న లోక్‌సభ ఎన్నికల తర్వాత బీఆర్ఎస్ నాలుగు ముక్కలు అవుతుందన్నారు. కేసీఆర్ తెలివితక్కువతనం వల్లనే కాళేశ్వరం కుప్పకూలిందని విమర్శించారు.

మేము వెయ్యి చెప్పులు చూపిస్తాం: మందుల సామేలు

- బాల్క సుమన్ ఒక తిరుగుబోతు: టీపీసీసీ

హైదరాబాద్, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): ఓడిపోయిన బీఆర్ఎస్ నేతలు ఒక్క చెప్పు చూపిస్తే తాము వెయ్యి చెప్పులు చూపిస్తామంటూ కాంగ్రెస్ ఎమ్మెల్యే మందుల సామేలు ధ్వజమెత్తారు. పదేళ్ల పాలనలో ప్రజల హక్కులను కాలరాసిన ఘనుడు కేసీఆర్ అని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిర్మించిన నాగార్జునసాగర్ 50 ఏళ్లయినా చెక్కు చెదరలేదని, కానీ రూ. 90 వేల కోట్లతో బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు మాత్రం కుంగిపోయిందన్నారు. కేసీఆర్ పాలనలో బొందలగడ్డలు మాత్రమే అభివృద్ధి చెందాయని ఆరోపించారు. బీఆర్ఎస్ నేతలు చెప్పులు, చేతులు చూపించుడు మానుకోవాలని హెచ్చరించారు. బాల్క సుమన్ ఒక తిరుగు బోతు, దాసోజు శ్రవణ్ ఒక తాగుబోతంటూ టీపీసీసీ అధికార ప్రతినిధి భవానీ రెడ్డి ధ్వజమెత్తారు. సుమన్, శ్రవణ్‌లు ఇద్దరూ బలుపెక్కి నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నారన్నారు. కేసీఆర్ కంపెనీలో కుక్కలా కాపలా కాయడం తప్ప బాల్క సుమన్‌కు ఏమీ తెలియదన్నారు. ఇక దాసోజు శ్రవణ్ ఎక్కడ అడుగు పెడితే ఆ పార్టీ ఖతమైపోతుందన్నారు.



హనుమకొండ జిల్లాలో నిరసన వ్యక్తం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

బాల్క సుమన్‌పై భగ్గుమన్న కాంగ్రెస్ నాయకులు

- దిష్టిబొమ్మ దహనం, పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదులు

హనుమకొండ సిటీ/నల్లగొండ, దిల్‌సుఖ్‌నగర్/సరూర్‌నగర్/చాదర్‌ఘాట్/కరీంనగర్, తార్నాక, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌పై రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్ నేతలు భగ్గుమన్నారు. ఆయన దిష్టి బొమ్మను దహనం చేసి పోలీసు స్టేషన్లలో ఫిర్యాదు చేశారు. ఆయన్ను వెంటనే అరెస్టు చేయాలని కోరారు. బాల్క సుమన్ వెంటనే తన వ్యాఖ్యలను ఉపసంహరించుకుని ముఖ్యమంత్రి రేవంత్‌కు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. రేవంత్‌పై మరోసారి బీఆర్ఎస్ నేతలు ఎవరైనా నోరు జారితే సహించేది లేదని హెచ్చరించారు. వరంగల్, హనుమకొండ, సూర్యాపేట, యాదాద్రి భువనగిరి, కరీంనగర్ జిల్లాల్లోని పలు మండలాల్లో కాంగ్రెస్ నేతలు బాల్క సుమన్ దిష్టి బొమ్మను దహనం చేసి పోలీస్‌స్టేషన్లలో ఫిర్యాదు చేశారు. హైదరాబాద్‌లోని దిల్‌సుఖ్‌నగర్, సరూర్‌నగర్, చాదర్‌ఘాట్ ప్రాంతాల్లో కాంగ్రెస్ నాయకులు నిరసనలు తెలిపారు. ఓయూ జేఏసీ ఆధ్వర్యంలో విద్యార్థులు ఓయూ ఆర్ట్స్ కళాశాల ముందు తమ నిరసనను వ్యక్తం చేశారు.

బీజేఎల్పీ నేతపై కొనసాగుతున్న సస్పెన్స్

హైదరాబాద్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): బీజేపీ తెలంగాణ శాసనసభాపక్ష నేత ఎవరనే దానిపై సస్పెన్స్ ఇంకా కొనసాగుతోంది. గురువారం నుంచి అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో పార్టీ నాయకత్వం ఎవరికి ఆ అవకాశం ఇస్తుందోనని బీజేపీ నేతలు చర్చించుకుంటున్నారు. బీజేఎల్పీ ఎవరికి ఇవ్వాలనే అంశంపై పార్టీ రాష్ట్ర ఇంచార్జులు తరుణ్‌చుగ్, సునీల్ బన్సల్ తెలంగాణ బీజేపీ నేతల అభిప్రాయాలు తీసుకున్నారు. ఈ ప్రక్రియ జరిగి నెల రోజులవుతున్నా బీజేఎల్పీ నేతను ఖరారు చేయలేదు. గోషామహల్ నుంచి వరుసగా మూడోసారి అసెంబ్లీకి ఎన్నికయిన రాజాసింగ్ లేదా నిర్మల్ ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డిల్లో ఒకరికి ఈ పదవి ఇవ్వవచ్చని ప్రచారం జరుగుతోంది. అయితే పార్టీ అధికారంలోకి వస్తే బీసీ నేతను సీఎం చేస్తామని ప్రకటించినందున తమకే ఆ అవకాశం ఇవ్వాలని బీసీ నేతలు కోరుతున్నారు. ఇందుకు అనుగుణంగా ఆదిలాబాద్ నుంచి గెలిచిన పాయల శంకర్ పేరు ప్రతిపాదనకు వచ్చిందని పార్టీ నేతలు పేర్కొంటున్నారు. నేడో రేపో బీజేఎల్పీపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

విజయసాయిరెడ్డిపై పోలీసులకు ఫిర్యాదు

బంజారాహిల్స్, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రభుత్వం త్వరలో కూలిపోతుందంటూ రాజ్యసభలో సంచలన వ్యాఖ్యలు చేసిన వైసీపీ రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డిపై బంజారాహిల్స్ పోలీసులకు మంగళవారం ఫిర్యాదు అందింది. విజయసాయిరెడ్డిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, కార్పొరేటర్ పి విజయారెడ్డి, కాంగ్రెస్ అధికార ప్రతినిధి కాల్వ సుజాత ఈ ఫిర్యాదు చేశారు. విజయసాయి వ్యాఖ్యల వెనుక కుట్ర దాగి ఉందని వారు ఫిర్యాదులో పేర్కొన్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. బీఆర్ఎస్, వైసీపీ కలిసి తెలంగాణలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూల్చేందుకు కుట్ర చేస్తున్నాయని ఆరోపించారు.

15 నుంచి కానిస్టేబుల్ శిక్షణ..!

హైదరాబాద్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): పోలీసు కానిస్టేబుల్ పోస్టులకు ఎంపికైన వారికి త్వరలో శిక్షణ ప్రారంభం కానుంది. లోక్‌సభ ఎన్నికల కోడ్ వచ్చేలోగా ఈ కార్యక్రమాన్ని ప్రారంభించాలని పోలీసు శాఖ భావిస్తోంది. ఈ నెల 15 నుంచి శిక్షణను ప్రారంభించడానికి సన్నాహాలు చేస్తోంది. దీనిపై రాష్ట్రంలోని అన్ని జిల్లాల శిక్షణ కేంద్రాల/పోలీస్ ట్రైనింగ్ కాలేజీ(పీటీసీ)ల ఇన్‌చార్జులు/ప్రిన్సిపాల్స్‌తో డీజీపీ రవిగుప్తా బుధవారం వర్చువల్‌గా సమీక్ష నిర్వహించనున్నారు. ఎన్నికల కోడ్ రావడానికి ముందే శిక్షణను ప్రారంభించాలని అధికారులు యోచిస్తున్నారు. ఒకవేళ కోడ్ వచ్చినట్లైతే జూన్ వరకు వేచి చూడాల్సిన పరిస్థితి ఉంటుందని అంటున్నారు.

అవిశ్వాసంపై కొరడా?

ఇల్లెందు మున్సిపల్ అవిశ్వాస నేత ఆస్తులపై అధికారుల దాడులు

ఇల్లెందు రూరల్, ఫిబ్రవరి 6: భద్రాద్రి జిల్లా ఇల్లెందు మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావుపై అవిశ్వాసానికి నాయకత్వం వహించిన బీఆర్ఎస్ కౌన్సిలర్ కొండపల్లి సరిత, ఆమె భర్త కొండపల్లి గణేష్‌లకు చెందిన ఆస్తులపై మంగళవారం రెవెన్యూ, ఫారెస్ట్, పోలీసు సిబ్బంది దాడులకు దిగారు. ఇల్లెందు తహసీల్దార్ కోట రవికుమార్, ఫారెస్ట్ రేంజర్ గుగులోత్ నాగేశ్వరరావు, ఎస్ఐ రఫూఫ్ ఆధ్వర్యంలో సుమారు 100 మంది పోలీసు, ఫారెస్ట్ బలగాలు రాజీవ్ నగర్ తండాకు తరలివచ్చారు. తండా సమీపంలో కొండపల్లి గణేష్, ఆతడి కుటుంబ సభ్యులు ఫారెస్ట్, రెవెన్యూ భూములను కబ్జా చేసి వాటిలో ఇళ్లు, కోళ్ల ఫారాలను నిర్మించారని అధికారులు పేర్కొన్నారు. వాటిని తొలగించాలని నోటీసులు ఇచ్చామని, అయినా తొలగించకపోవటంతో ఎక్స్‌కవేటర్‌తో కూల్చేందుకు వచ్చామన్నారు. అయితే వారిని కొండపల్లి గణేష్ కుటుంబ సభ్యులు, స్థానిక రైతులు, బీఆర్ఎస్ మున్సిపల్ వార్డు కౌన్సిలర్లు అడ్డుకున్నారు. ఇల్లెందు చైర్మన్‌పై అవిశ్వాసం పెట్టిన కౌన్సిలర్లకు నాయకత్వం వహించినందువల్లే అధికార పార్టీ రాజకీయ కక్షసాధింపు చర్యలకు దిగుతోందని గణేష్ కుటుంబ సభ్యులు, బీఆర్ఎస్ వార్డు కౌన్సిలర్లు ఆరోపించారు. తమ ఆస్తుల జోలికి వస్తే తీవ్ర ప్రతిఘటన తప్పదని వారు హెచ్చరించారు. వారి నిరసనతో అధికారులు వెనుదిరిగారు.

నల్లగొండలో నీళ్ల వార్!

కాంగ్రెస్ కంచుకోటలో పోరాటానికి బీఆర్ఎస్ శ్రీకారం

- లోక్‌సభ ఎన్నికల ముంగిట

13న భారీ బహిరంగ సభ

నల్లగొండ, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): కృష్ణా జలాల పంపిణీ, నాగార్జున సాగర్, శ్రీశైలం ప్రాజెక్టుల అప్పగింత వ్యవహారం అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ మధ్య రాజకీయ కాక పెంచుతోంది. ఇందుకు మీరంటే.. మీరే కారణమంటూ ఇరు పార్టీల నేతలూ తీవ్రస్థాయిలో ఆరోపణలు చేసుకుంటున్నారు. రెండు మూడు నెలల్లోనే లోక్‌సభ ఎన్నికలు జరగనుండడం, ఉమ్మడి నల్లగొండ జిల్లా కాంగ్రెస్‌కు కంచుకోటగా ఉన్న నేపథ్యంలో ఈ అంశంపై ఇక్కడి నుంచే పోరాటానికి శ్రీకారం చుట్టాలని బీఆర్ఎస్ భావిస్తోంది. సాగర్ ప్రాజెక్టు నల్లగొండ జిల్లాలో ఉండడం అందివచ్చిన అవకాశంగా మారింది. కృష్ణా జలాల్లో తెలంగాణ హక్కుల సాధన కోసం ఈనెల 13న నల్లగొండలో భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ మంగళవారం ప్రకటించారు. సాగర్ ప్రాజెక్టును కేఆర్ఎంబీకి ఇవ్వవద్దని డిమాండ్ చేస్తూ నల్లగొండ నుంచే ఉద్యమించాలని నిర్ణయించారు. ఈ అంశంపై ఇప్పటికే నల్లగొండకే చెందిన ఉత్తమ్ కుమార్ రెడ్డి, జగదీశ్ రెడ్డితో పాటు సీఎం రేవంత్, మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్ రావు మధ్య మాటల యుద్ధానికి దారి తీసింది. ఒకరిపై మరొకరు తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించుకుంటున్నారు. ఈ నేపథ్యంలోనే 13న నల్లగొండలో బహిరంగ సభ ఏర్పాటు చేయడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. 13న బీఆర్ఎస్ సభకు రైతులు స్వచ్ఛందంగా తరలి వచ్చేందుకు సిద్ధంగా ఉన్నారని, ఈ అంశాన్ని రాజకీయ కోణంలో చూడవద్దని, రైతుల హక్కుల కోసం పోరాడే ఉద్యమంగా భావించాలని మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి చెబుతున్నారు. రైతులు అక్కడక్కడ ఉద్యమాలు చేస్తున్నారని, తాము వారి పక్షాన నిలిచి పోరాడుతామని తెలిపారు. అదే సమయంలో సోమవారం రాత్రి నుంచి జిల్లాలో 30, 30 (ఏ) పోలీస్ యాక్ట్‌ను అమల్లోకి తెచ్చారు. ర్యాలీలు, సభలపై నిషేధం విధించారు. మాజీ సీఎం కేసీఆర్ నల్లగొండలో అడుగుపెడితే ప్రజలే అడ్డుకుంటారని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఇప్పటికే వ్యాఖ్యానించారు. సభ నిర్వహించి తీరతామని కృష్ణా బేసిన్‌లో తెలంగాణ హక్కులు కాపాడడం కోసం ఎంతవరకైనా పోరాడతామని మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి తేల్చి చెప్పారు. దీంతో, నల్లగొండ జిల్లాలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది.

అనుమతి తీసుకోవాలి

ముందస్తుగా దరఖాస్తు చేసుకుంటే సభ నిర్వహణకు అనుమతి ఇస్తాం. ఎవరు సభను నిర్వహించినా అడ్డుకోం. అలజడులు చెలరేగకుండా, శాంతి భద్రతలకు సమస్యలు రాకుండా చూసుకోవాలి. 30, 30(ఏ) అనేవి సాధారణమైన చట్టాలే. వీటి అమలు సహజ ప్రక్రియలో భాగమే.

- చందనా దీప్తి, నల్లగొండ జిల్లా ఎస్పీ

టచ్ చేయలేవ్!



తెలంగాణ భవన్‌కు చేరుకుంటున్న కేసీఆర్, చిత్రంలో కేటీఆర్

(మొదటిపేజీ తరువాయి)

అవగాహన లేదు. అందుకే కేంద్రం గేమ్ స్టార్ట్ చేసి కేఆర్ఎంబీ పరిధిలోకి ప్రాజెక్టులను తీసుకొంది. సాగర్, శ్రీశైలం సహా కృష్ణా నదిపై ఉన్న ప్రాజెక్టులను కేఆర్ఎంబీకి అప్పజెప్పిన రాష్ట్ర ప్రభుత్వం కేంద్రం చేతికి మన జుట్టు అందించింది. అవగాహన రాహిత్యంతో కాంగ్రెస్ ప్రభుత్వం సంతకాలు చేసి మరీ తీసుకున్న ఈ నిర్ణయం దక్షిణ తెలంగాణ సాగునీటి హక్కులపై గొడ్డలిపెట్టులా మారింది" అని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో, ఉమ్మడి హైదరాబాద్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్, నల్లగొండ, ఖమ్మం జిల్లా ప్రజలు సాగు, తాగునీరు అందక మళ్లీ కరువు కోరల్లో చిక్కుకునే ప్రమాదం ఏర్పడిందని అన్నారు. ఈ అంశంపై కాంగ్రెస్ నేతలకు అవగాహన లేక ఏదేదో మాట్లాడుతున్నారని, వాస్తవ విషయాలను ప్రజలకు వివరించి.. చెప్పాల్సిన బాధ్యత మనపైనే ఉందని బీఆర్ఎస్ శ్రేణులకు కేసీఆర్ సూచించారు. కేంద్రం ఎంత ఒత్తిడి తెచ్చినా పదేళ్లలో ఏనాడూ తెలంగాణ ప్రాజెక్టులను కేంద్రానికి అప్పగించలేదని గుర్తు చేశారు. ప్రాజెక్టులను తమకు అప్పగించాలని, లేదంటే తామే నోటిపై చేస్తామని కేంద్ర జలశక్తి మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ తనను బెదిరించారని కేసీఆర్ వెల్లడించారు. "కావాలంటే తెలంగాణలో రాష్ట్రపతి పాలన పెట్టుకో. నా ప్రభుత్వాన్ని రద్దు చేస్తా. తెలంగాణకు అన్యాయం చేస్తామంటే అసలే ఒప్పుకోను. ప్రాజెక్టులను అప్పగించే ప్రసక్తే లేదు" అని తాను ఆనాడే తేల్చి చెప్పానని వివరించారు.

ఈ కేసీఆర్ వెనక్కిపోడు

"కృష్ణా బోర్డు పరిధిలోకి ప్రాజెక్టులను తీసుకోవడంపైనే ఇక మన పోరాటం. నల్లగొండలో భారీ బహిరంగ సభతో ఉద్యమాన్ని ఉధృతం చేద్దాం. తెలంగాణ కోసం ఈ కేసీఆర్ ఏనాడూ వెనక్కిపోడు. రాష్ట్ర ప్రయోజనాల కోసం ఏం చేయాలో నాకు బాగా తెలుసు" అని ఆయన వ్యాఖ్యానించారు. తెలంగాణ ప్రయోజనాలకు విఘాతం కలిగేలా రాష్ట్ర ప్రభుత్వం కృష్ణా ప్రాజెక్టులను కేఆర్ఎంబీకి అప్పగించిందని, దీన్ని వ్యతిరేకిస్తూ.. కృష్ణా జలాల వాటా సాధన కోసం ఎంతటి పోరాటానికైనా సిద్ధమని స్పష్టం చేశారు. ఉద్యమం ద్వారా రాష్ట్రాన్ని సాధించి.. తెలంగాణ హక్కులను కాపాడుకున్న స్ఫూర్తితోనే ఇప్పుడు మరో ప్రజా ఉద్యమానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రజల హక్కులకు భంగం వాటిల్లకుండా చూసుకునే బాధ్యత బీఆర్ఎస్ కార్యకర్తలది, తెలంగాణ ఉద్యమకారులదేనని అన్నారు. దీనిని మరో ప్రజా ఉద్యమంగా జనంలోకి తీసుకు వెళ్లాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. తెలంగాణ సాగునీటి హక్కులను కాపాడుకునేందుకే నల్లగొండ సభ నిర్వహిస్తున్నామని, ఇది జరగకుండా ఎవరెన్ని అడ్డంకులు సృష్టించినా.. సభ జరిగి తీరుతుందని తేల్చి చెప్పారు. సభకు ఆ జిల్లాతోపాటు ఉమ్మడి ఖమ్మం, మహబూబ్‌నగర్ జిల్లాల నుంచి ప్రజలు తరలివచ్చేలా ఏర్పాట్లు చేయాలన్నారు. సమావేశంలో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రులు హరీశ్ రావు, జగదీశ్ రెడ్డి, నిరంజన్ రెడ్డి, సబితా ఇంద్రా రెడ్డి, పువ్వాడ అజయ్‌కుమార్, సత్యవతి రాథోడ్, శ్రీనివాస్ గౌడ్, తలసాని, మల్లారెడ్డి, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మాజీ ఎమ్మెల్యేలు, ఆయా జిల్లాల

తెలంగాణ భవన్‌లో సందడి

అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ తొలిసారిగా మంగళవారం తెలంగాణ భవన్‌కు వచ్చారు. డిసెంబరు తొలి వారంలో యశోద ఆసుపత్రిలో ఆయన తుంటికి శస్త్ర చికిత్స చేయించుకున్న విషయం తెలిసిందే. మూడు నెలల విశ్రాంతి తర్వాత పార్టీ కార్యాలయానికి వచ్చిన ఆయనకు మహిళలు హారతులిచ్చారు. పార్టీ కార్యకర్తలు, నాయకులు జై తెలంగాణ.. జై కేసీఆర్ నినాదాలు చేస్తూ ఘన స్వాగతం పలికారు. ఆయనను కలిసేందుకు పెద్దఎత్తున వచ్చిన పార్టీ నేతలు, ముఖ్య కార్యకర్తలతో తెలంగాణ భవన్ రోజంతా సందడిగా కనబడింది.

ఉద్యమం మనకు అలవాటైన పనేగా!

- ఈ సర్కారును వాళ్లకు వాళ్లే కూల్చుకుంటారు
- జిల్లాల నేతలతో విడిగా సమావేశంలో కేసీఆర్



ఎన్నో ఉద్యమాలు చేసి ఇక్కడి దాకా వచ్చామని, కృష్ణా ప్రాజెక్టులపై కేంద్రం పెత్తనాన్ని అడ్డుకునేందుకు మరో ప్రజా ఉద్యమాన్ని నిర్మిద్దామని పార్టీ ముఖ్య నేతలతో మాజీ సీఎం కేసీఆర్ అన్నారు. నల్లగొండ సభ నిర్వహణపై ఆయా జిల్లాల ముఖ్య నేతలతో ఆయన విడిగా సమావేశమయ్యారు. తొలుత కృష్ణా పరీవాహక ప్రాంత జిల్లాల ప్రతినిధులతో తెలంగాణ భవన్లో సమావేశమైన ఆయన.. సాయంత్రం నంది నగర్‌లోని తన నివాసంలో నల్లగొండ, ఖమ్మం, మహబూబ్‌నగర్, హైదరాబాద్, రంగారెడ్డి ఉమ్మడి జిల్లాల ముఖ్య నేతలు, సమన్వయకర్తలతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. సభ విజయవంతానికి చేపట్టాల్సిన కార్యాచరణను వారికి వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. "ఎన్నో ఉద్యమాలు చేసి ఇక్కడి దాకా వచ్చాం. ఏం జిట్టా బాలకృష్ణ.. ఉద్యమం అనేది మనకు అలవాటైన పనేగా.. రవీందర్ సింగ్.. తల్వార్ సిద్ధం కావాలె.. కృష్ణా నదీ జలాలపై తెలంగాణ హక్కులను కాపాడడం కోసం ఎంతకైనా పోరాడదాం" అని పిలుపునిచ్చారు. ప్రాజెక్టులపై కేంద్రం పెత్తనం వస్తే మనం అడుక్కోవాల్సిందేనని, దీన్ని అడ్డుకునేందుకు మరో ప్రజా ఉద్యమాన్ని నిర్మిద్దామని పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ సభను అడ్డుకుంటానని మంత్రి కోమటిరెడ్డి అంటున్నారని, నల్లగొండ ఆయన జాగీరా.. ఇలాంటి వాళ్లను చాలా మందిని చూశామని అన్నారు. "ప్రాజెక్టులపై ఎమ్మెల్యేలు అసెంబ్లీలో ప్రభుత్వంపై పోరాడతారు. నల్లగొండలో మనం పోరాటం చేద్దాం. మనం తక్కువేం లేం. 39 మంది ఎమ్మెల్యేలం ఉన్నాం. రేవంత్‌వి పిల్లచేష్టలు. పాలన చేతకాక నామీద కారు కూతలు కూస్తున్నడట.. సీఎం అనెటోళ్లు ఎవరైనా.. ఈరోజు ఉంటరు. రేపు పోతరు. తెలంగాణ ప్రయోజనమే మనకు ముఖ్యం" అని వ్యాఖ్యానించారు. ఈ ప్రభుత్వాన్ని కూల్చడానికి మనం గడ్డపారలు పట్టుకొని తిరగాల్సిన అవసరం లేదని, వాళ్లకు వాళ్లే కొట్టుకుంటారని, ఇచ్చిన హామీలు అమలు చేయకపోతే ప్రజలే తిరుగుబాటు చేస్తారని కేసీఆర్ వ్యాఖ్యానించినట్లు తెలిసింది.



10 నుంచి సంజయ్ ప్రజాహితయాత్ర

- కరీంనగర్ లోక్‌సభ

నియోజకవర్గ పరిధిలోనే..

హైదరాబాద్/కరీంనగర్ టౌన్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ ఈ నెల 10 నుంచి ప్రజాహిత యాత్ర చేపట్టనున్నారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా గతంలో నిర్వహించిన ప్రజాసంగ్రామ యాత్ర తరహాలో ఆయన మరోసారి పాదయాత్రకు సన్నద్ధమయ్యారు. ఈ పాదయాత్ర కరీంనగర్ లోక్‌సభ నియోజకవర్గం పరిధిలోనే కొనసాగనుంది. లోక్‌సభ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడే వరకు యాత్ర ఉంటుంది. ఇందుకు అనుగుణంగా పార్టీ జాతీయ నాయకత్వం సంజయ్‌కి ప్రత్యేక అనుమతినిచ్చింది. రాష్ట్రవ్యాప్తంగా పార్టీ ముఖ్య నేతలు కూడా రథయాత్రలు చేపట్టాలన్న ప్రతిపాదన ఉన్న నేపథ్యంలో సంజయ్ పాదయాత్రను కొనసాగించవచ్చని పేర్కొంది. సంజయ్ ఈనెల 10న కొండగట్టు వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి మేడిపల్లి నుంచి యాత్ర ప్రారంభిస్తారు. తొలివిడతగా వేములవాడ, సిరిసిల్ల నియోజకవర్గాల్లో 119 కిలోమీటర్ల మేర పాదయాత్ర షెడ్యూలు ఖరారైంది. సిరిసిల్ల జిల్లాలోని తంగళ్లపల్లిలో తొలివిడత ముగింపు సభను నిర్వహించనున్నారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో సగటున 3 రోజుల చొప్పున యాత్ర చేసేలా రూట్ మ్యాప్ ఖరారు చేశారు. మరోవైపు లోక్‌సభ నియోజకవర్గ క్లస్టర్‌లవారీగా రాష్ట్రంలో బీజేపీ నిర్వహించతలపెట్టిన రథయాత్రలపై మరోసారి సందిగ్ధత ఏర్పడింది. ఈ రథయాత్రలు ఇప్పటికే మూడుసార్లు వాయిదా పడ్డాయి. తాజాగా రథయాత్రలు రద్దయ్యే అవకాశం కూడా ఉందని బీజేపీ ముఖ్యనేత ఒకరు వెల్లడించారు. రథయాత్రలను ఈనెల 20నుంచి ప్రారంభించాలన్న ప్రతిపాదన ఉంది. అయితే, ఈనెల 17, 18 తేదీల్లో ఢిల్లీలో పార్టీ జాతీయ కౌన్సిల్ సభ్యుల సమావేశాలు ఉన్నాయి. దీంతో యాత్రల సన్నద్ధతకు సమయం సరిపోయే అవకాశం లేదు. ఈ పరిస్థితిలో ప్రతిపాదిత రథయాత్రలు కొనసాగే అవకాశం కూడా లేదు అని ఆయన వివరించారు.

బోగస్ ఓట్లపై ఈసీకి ఫిర్యాదు: సంజయ్

హైదరాబాద్ సహా రాష్ట్రంలో లక్షలాది బోగస్ ఓట్లు ఉన్నట్లు ఆధారాలు సేకరించామని బండి సంజయ్ తెలిపారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో పెద్ద ఎత్తున ఓట్లు గల్లంతయ్యాయని, సుదూర ప్రాంతాల్లో పోలింగ్ బూత్‌లు కేటాయించడం వల్ల ఓటింగ్ శాతం తగ్గిందని ఆరోపించారు. వీటికి సంబంధించి మర్రి శశిధర్‌రెడ్డి, ఆంటోనిరెడ్డి ఆధ్వర్యంలోని బృందం అన్ని ఆధారాలతో ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసిందని చెప్పారు. 17 ఎంపీ స్థానాలను గెలుచుకోవడమే లక్ష్యంగా కార్యాచరణ రూపొందించామని చెప్పారు.

బీఆర్ఎస్‌కు షాక్!

కాంగ్రెస్‌లో చేరిన పెద్దపల్లి ఎంపీ.. ఢిల్లీలో కండువా కప్పుకొన్న వెంకటేశ్ నేత



పార్టీలో చేరిన తరువాత ఖర్గేను కలిసిన పెద్దపల్లి ఎంపీ వెంకటేశ్ నేత, చిత్రంలో సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టి, కేసీ వేణుగోపాల్ తదితరులు

న్యూఢిల్లీ/పెద్దపల్లి, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): పార్లమెంటు ఎన్నికల ముంగిట బీఆర్ఎస్‌కు తొలి షాక్ తగిలింది. ఆ పార్టీకి చెందిన పెద్దపల్లి ఎంపీ బొర్లకుంట వెంకటేశ్ నేత కాంగ్రెస్ పార్టీలో చేరారు. మంగళవారం ఉదయం సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క సమక్షంలో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్.. వెంకటేశ్ నేతకు కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. వెంకటేశ్ నేతతోపాటు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన బీఆర్ఎస్ ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి సోదరుడి కుమారుడు మన్నె జీవన్‌రెడ్డి, బీఆర్ఎస్ నేత రహ్మాన్ కూడా కాంగ్రెస్ పార్టీలో చేరారు. చేరికల అనంతరం కేసీ వేణుగోపాల్, సీఎం రేవంత్‌తో కలిసి ఎంపీ వెంకటేష్ నేత, మన్నె జీవన్ రెడ్డి.. ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే నివాసానికి వెళ్లి ఆయనను కలిశారు. కాగా, వచ్చే ఎన్నికల్లో వెంకటేశ్ నేతకు బీఆర్ఎస్ పార్టీ టికెట్ ఇవ్వదనే ప్రచారం గత కొన్ని రోజులుగా జరుగుతోంది. పార్టీ అధిష్ఠానం కొద్దిరోజులుగా నిర్వహిస్తున్న నియోజకవర్గాల సమీక్ష సమావేశాలకు కూడా వెంకటేశ్ నేత గైర్హాజరయ్యారు. దీంతో ఆయన పార్టీ మారనున్నారనే అనుమానాలు రేకెత్తాయి. వచ్చే ఎన్నికల్లో టికెట్ ఖాయంగా ఇస్తామని, పార్టీ మారవద్దని, సీరియస్‌గా పనిచేసుకోవాలని వెంకటేశ్ నేతకు కేటీఆర్ అభయం ఇచ్చినట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఇటీవల పార్టీ అధినేత కేసీఆర్‌ను కూడా కలుసుకుని మాట్లాడినట్లు తెలిసింది. అయితే టికెట్ విషయంలో కేసీఆర్ నుంచి బలమైన హామీ లభించని కారణంగానే వెంకటేశ్ డైలమాలో పడినట్లు సమాచారం. చివరికి అనుమానాలను నిజం చేస్తూ మంగళవారం కాంగ్రెస్ పార్టీలో చేరిన వెంకటేశ్ నేత.. బీఆర్ఎస్ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేశారు. రాజీనామా లేఖను పార్టీ అధినేత కేసీఆర్‌కు పంపించారు.

2018 అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఎక్సైజ్ శాఖలో డీసీగా పనిచేసిన వెంకటేష్ నేత.. రాజకీయాలపై మక్కువతో అప్పట్లో కాంగ్రెస్ పార్టీలో చేరారు. చెన్నూరు నుంచి అసెంబ్లీకి పోటీ చేసి ఓడిపోయారు. అనంతరం నాలుగు నెలలకే జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌లో చేరి పెద్దపల్లి నుంచి ఎంపీగా పోటీ చేసి గెలిచారు. కాగా, ఇటీవల అసెంబ్లీ ఎన్నికల్లో పెద్దపల్లి లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోని అన్ని స్థానాల్లోనూ బీఆర్ఎస్ అభ్యర్థులు ఓడిపోయారు. దీంతో పార్ల

బీఆర్ఎస్ టికెట్ దక్కదనే!

మెంట్ ఎన్నికల్లో బలమైన నాయకుడిని పోటీలో నిలపాలని బీఆర్ఎస్ అధిష్ఠానం భావిస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్‌ను గానీ, మాజీ ఎంపీ బాల్క సుమన్‌ను గానీ పెద్దపల్లి బరిలో నిలుపుతారనే ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలోనే వెంకటేశ్ నేత పార్టీ మారినట్లు, మంచిర్యాల జిల్లాకు చెందిన ఓ ఎమ్మెల్యే ఇందుకు తెరవెనుక మంత్రాంగం నడిపినట్లు తెలుస్తోంది. అయితే పెద్దపల్లి నుంచి కాంగ్రెస్ టికెట్ ఆశిస్తూ ఎమ్మెల్యే గడ్డం వివేక్ తనయుడు వంశీకృష్ణ, టీపీసీసీ కార్యదర్శి గొమాసే శ్రీనివాస్, మాజీ ఎంపీ డాక్టర్ సుగుణ కుమారి, యువజన నాయకుడు ఊట్ల వరప్రసాద్ తదితరులు దరఖాస్తు చేసుకున్నారు. అనూహ్యంగా వెంకటేశ్ నేత కాంగ్రెస్‌లో చేరడం, ఆయనకే టికెట్ వస్తుందనే ప్రచారం జరుగుతుండడంతో ఆశావహుల్లో ఆందోళన మొదలైంది.

కల్వకుంట్ల కుటుంబాన్ని బొందపెడతా

- ఓడిపోగానే కిందపడ్డట్టు కేసీఆర్ కథ అల్లిండు
- కేటీఆర్ పెద్ద వెధవ.. ఇంగ్లిష్ తప్ప మరేంరాదు
- రేవంత్‌రెడ్డి తలచుకుంటే అంతా జైల్లో ఉంటారు
- కార్యకర్తల జోలికొస్తే హరీశ్ ఇంటి మీద దాడి చేస్తా
- కాంగ్రెస్ నేత, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి తీవ్ర వ్యాఖ్యలు



సిద్దిపేట, ఫిబ్రవరి 6, ఆంధ్రజ్యోతి : మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి కేటీఆర్‌పై కాంగ్రెస్ నేత, మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు రెచ్చిపోయారు. కల్వకుంట్ల కుటుంబాన్ని బొంద పెట్టేదాకా నిద్రపోనంటూ కార్యకర్తల సాక్షిగా ప్రమాణం చేశారు సీఎం రేవంత్ రెడ్డి తలచుకుంటే కల్వకుంట్ల కుటుంబం అంతా జైల్లో ఉంటుందని హెచ్చరించారు. మంగళవారం నిర్వహించిన సిద్దిపేట నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ క్యాంపు కార్యాలయం భూమి పూజకు మైనంపల్లి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మైనంపల్లి మాట్లాడుతూ కేటీఆర్ పెద్ద వెధవ అని, తన ముందు బచ్చాగాడని, ఇంగ్లిష్ ముక్కలు తప్ప ఏమీ రాదని దూషించారు. ఆనాడు కేకే మహేందర్‌రెడ్డి వల్లే కరీంనగర్ ఉప ఎన్నికలో కేసీఆర్ ఎంపీగా గెలిచారన్నారు. పదేళ్ల అధికారంలో రాష్ట్రాన్ని దోచుకున్నారని, హైదరాబాద్‌ను కబ్జా చేశాడని మండిపడ్డారు. ఉద్యమం, అధికారం పేరిట 23ఏళ్లు ఇష్టారాజ్యంగా ప్రవర్తించిన కేసీఆర్ ఎన్నికల్లో ఓడిపోగానే కిందపడినట్లు కథ అల్లిండని ఆరోపించారు. రేవంత్‌రెడ్డి గురించి మాట్లాడితే కాంగ్రెస్ కార్యకర్తలు దుస్తులు ఊడదీసి కొడతారని, సొంత కులస్తులే చెప్పులతో దాడి చేస్తారని హెచ్చరించారు. బీఆర్ఎస్ పాలనలో రేవంత్‌ను ఎన్నో కష్టాలు పెట్టారని గుర్తు చేశారు. మెదక్, సిద్దిపేటలో కాంగ్రెస్ కార్యకర్తల జోలికొస్తే తానే స్వయంగా హరీశ్‌రావు ఇంటిమీద దాడి చేస్తానని మైనంపల్లి హెచ్చరించారు. హరీశ్‌రావు కూడా బీఆర్ఎస్‌లో ఉండరని, బీజేపీలో చేరతారని ఆరోపించారు. మైనంపల్లి అంటేనే ఒక పవర్ అని స్పష్టం చేశారు.

హైదరాబాద్ రిజిస్ట్రార్ సస్పెన్షన్

(మొదటిపేజీ తరువాయి)

సౌత్ జిల్లా రిజిస్ట్రార్ దొంత వెంకటేశ్వర ప్రసాద్ భార్య కూడా ఈ భూములు కొన్న వారిలో ఉన్నారు. దీంతో ఆయన పాత్రపైనా విచారణ జరిపారు. తన భార్య కస్తూరి హరిరంజని పేరున దొంత వెంకటేశ్వర ప్రసాద్ భూమిని రిజిస్ట్రేషన్ చేయించుకున్నట్లు తేలింది. నిబంధనల ప్రకారం, జిల్లా రిజిస్ట్రార్ తన కుటుంబ సభ్యుల పేరిట ఏదైనా స్థిరాస్తిని రిజిస్ట్రేషన్ చేయాలంటే ముందుగా ప్రభుత్వ అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. కానీ, వెంకటేశ్వర ప్రసాద్ ఆ అనుమతి తీసుకోలేదని అధికారులు గుర్తించారు. పైగా, రిజిస్ట్రేషన్ వెంటనే అయ్యేలా శంకరపల్లి సబ్ రిజిస్ట్రార్‌పై ఒత్తిడి చేసినట్లు కూడా విచారణలో తేలింది. దీంతో దొంత వెంకటేశ్వర ప్రసాద్‌ను సస్పెండ్ చేస్తూ ప్రభుత్వం మంగళవారం ఆదేశాలు జారీ చేసింది. అలాగే నకిలీ రిజిస్ట్రేషన్లకు సంబంధించి సమగ్ర విచారణకు ప్రభుత్వం ఉన్నతాధికారులతో ప్రత్యేక కమిటీని నియమించింది.

ఇదీ నేపథ్యం..

రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలో ప్రోగ్రెసివ్ ఆగ్రో సర్వీసెస్ పేరుతో 5.12 ఎకరాల వ్యవసాయ భూమి రెండు వేర్వేరు సర్వే నెంబర్లలో ఉంది. 334 సర్వే నెంబరులో 0.23 గుంటలు, 335 సర్వేనెంబరులో 4.29 ఎకరాలు ఉంది. ఈ మొత్తం 5.12 ఎకరాల వ్యవసాయ భూమికి అసలైన యజమాని ముళ్లపూడి వీర వెంకట సత్యనారాయణ. ఆయన 2023 మార్చి 17న శంకర్‌పల్లి తహసీల్దారు ఎండీ నయీమొద్దీన్ ద్వారా నాలా ధ్రువీకరణ పత్రాన్ని కూడా పొందారు. అయితే ఈ భూమికి యజమానిని నేనే అంటూ మరో వ్యక్తి ముడగుల వరప్రసాద్ ముందుకొచ్చారు. ఈయన శంకర్‌పల్లి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో గత నెల 20న నీలంగౌడ్, రవీందర్‌కుమార్, పినిమెల్లి ప్రశాంత్, కస్తూరి హరిరంజనిలకు ఈ భూమిని విక్రయించాడు. ఈ మొత్తం వ్యవహారంలో రిజిస్ట్రేషన్ అధికారుల పాత్ర కీలకంగా ఉందని ఉన్నతాధికారుల విచారణలో తేలింది. దొంగ పత్రాలతో నకిలీ వారసుడిని తెరపైకి తెచ్చి అధికారులు రిజిస్ట్రేషన్ చేశారు. ఈ భూమిని దక్కించుకున్నవారిలో జిల్లా రిజిస్ట్రార్ దొంత వెంకటేశ్వర ప్రసాద్ భార్య కస్తూరి హరిరంజని కూడా ఉన్నారు.

తక్కువ వ్యయంతో ఎక్కువ ఆయకట్టు

» ప్రాజెక్టుల జాబితాను సిద్ధం చేయండి: మంత్రి ఉత్తమ్



హైదరాబాద్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): తక్కువ వ్యయంతో ఎక్కువ ఆయకట్టుకు నీరందించడంతో పాటు, తక్కువ వ్యవధిలో పూర్తయ్యే ప్రాజెక్టుల జాబితాను సిద్ధం చేయాలని నీటిపారుదల మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధికారులకు సూచించారు. బడ్జెట్‌లో కేటాయించిన నిధులను పొదుపుగా ప్రాజెక్టులకు కేటాయించడానికి తగిన చర్యలు తీసుకోవాలని నిర్దేశించారు. అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు పలు ప్రాజెక్టుల వివరాలను మంత్రికి అందించారు.

రాష్ట్రంలో ఎవరూ అనాథలు కాదు: మంత్రి పొన్నం



రాంనగర్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎవరూ అనాథలు కాదని, ప్రభుత్వ ప్రైవేటు హోమ్‌లలో ఉంటున్న పిల్లలందరికీ ప్రభుత్వం అండగా ఉంటుందని బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో తల్లిదండ్రుల సంరక్షణ లేని పిల్లలకు జనన, కుల ధ్రువీకరణ పత్రాలు, సదరం సర్టిఫికెట్లు, ఆధార్ కార్డులు పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన పొన్నం మాట్లాడుతూ కాంగ్రెస్ హయాంలో తల్లిదండ్రుల సంరక్షణ, ఆదరణ లేని పిల్లలకు లోటు తెలియకుండా వారికి కావాల్సిన సౌకర్యాలు సమకూరుస్తామన్నారు. తల్లిదండ్రులు కుటుంబ భారం మోయలేక పిల్లలను శిశువిహార్లలో చేర్పిస్తున్నారన్నారు. ఎవరూ అనాథలుగా, అభాగ్యులుగా రోడ్లపై ఉండకూడదన్నారు.

ఎస్సీ వర్గీకరణకు కట్టుబడి ఉన్నాం: దామోదర



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణలో ఎస్సీ వర్గీకరణకు సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ తెలిపారు. ఎస్సీ వర్గీకరణ ఎవరికీ వ్యతిరేకం కాదని, జనాభా ప్రాతిపాదికన ఎవరి వాటా వారికి దక్కాలన్నారు. అందువల్ల ఈ వ్యవహారంలో లీగల్ అంశాలు, సవరణలకు తమ ప్రభుత్వం సిద్ధమని చెప్పారు. అసెంబ్లీ ఎన్నికల్లో వాగ్దానం చేసినట్లుగానే వర్గీకరణ అంశంపై రాష్ట్రప్రభుత్వం తరఫున సుప్రీంకోర్టులో బలమైన వాదనలు వినిపించనున్నట్లు వెల్లడించారు. ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ, అడ్లూరి లక్ష్మణ్, ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పిడమర్తి రవితో కలిసి మంత్రి మీడియాతో మంగళవారం మాట్లాడారు. వర్గీకరణ విషయంలో సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం ముందు వాదనలు ప్రారంభమైనట్లు చెప్పారు. ఈ కేసులో తెలంగాణ ప్రభుత్వం కూడా భాగమైన నేపథ్యంలో తామంతా సుప్రీంకోర్టు ముందు హాజరైనట్లు చెప్పారు. మాదిగ వర్గానికి మేలు జరిగేలా తెలంగాణ తరఫున రాష్ట్ర ప్రభుత్వం మాజీ సొలిసిటర్ జనరల్ వివేక్ తన్కాను నియమించిందన్నారు. తొమ్మిదిన్నర ఏండ్ల పాలనలో బీఆర్ఎస్ ఆదివాసీలు, దళితులు అస్థిత్వం కోల్పోయేలా వ్యవహరించిందని మంత్రి విమర్శించారు. అనంతరం ఎమ్మెల్యేలు అడ్లూరి లక్ష్మణ్, కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ... కాంగ్రెస్ ఆధ్వర్యంలోనే వర్గీకరణ సాధ్యమవుతుందన్నారు.

రూ.2000 కోట్ల అప్పు తీసుకున్న రాష్ట్రం

హైదరాబాద్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం మరో రూ.2000 కోట్ల అప్పు తీసుకుంది. మంగళవారం రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నిర్వహించిన ఈ-వేలం ద్వారా ఈ రుణాన్ని సేకరించింది. 11 ఏళ్ల కాల పరిమితి 7.49 శాతం వార్షిక వడ్డీతో రూ.1000 కోట్లు, 21 ఏళ్ల కాల పరిమితి 7.46 శాతం వార్షిక వడ్డీతో రూ.1000 కోట్ల చొప్పున రుణాన్ని తీసుకున్నది. రాష్ట్రంతో కలిపి దేశంలోని 14 రాష్ట్రాలు రూ.26,710 కోట్ల అప్పులు తీసుకున్నాయి.

టీవీవీపీలో జీవో నంబరు 317 అమలు

» స్టాఫ్ నర్సులకు నేటి నుంచి సొంత జోన్‌ల కేటాయింపు

హైదరాబాద్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): ఎట్టకేలకు తెలంగాణ వైద్య విధాన పరిషత్ పరిధిలో జీవో నంబరు 317 అమలు కాబోతోంది. నేటి నుంచి టీవీవీపీ పరిధిలోని ఆస్పత్రుల్లో పనిచేస్తున్న 1616 మంది స్టాఫ్‌నర్సులను వారి సొంత జోన్లకు పంపనున్నారు. జీవో ప్రకారం ఎవరికైనా అన్యాయం జరిగితే... వారు ప్రభుత్వానికి అప్పీల్ చేసుకునే అవకాశం కల్పించారు. అలాగే సీనియర్లు కోరుకున్న చోటుకి బదిలీలు జరిగేలా ఉన్నతాధికారులు యత్నిస్తున్నారు. జోన్ల కేటాయింపు ముగిసిన అనంతరం ఈ నెల 12, 13 తేదీల్లో ఇటీవల కొత్తగా నియమితులైన నర్సులకు కౌన్సిలింగ్ నిర్వహించి పోస్టింగ్స్ ఇవ్వనున్నారు. కొత్తగా రిక్రూట్ అయిన 6956 మందిలో 736 మంది టీవీవీపీకి నియమితులయ్యారు.

మాజీ మంత్రి మల్లారెడ్డిపై లోకాయుక్తలో ఫిర్యాదు

కీసర, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డిపై లోకాయుక్తలో ఫిర్యాదు నమోదయింది. మంగళవారం నాగారం మున్సిపాలిటీకి చెందిన జయకుమార్ గోవింద్, రవీందర్‌రెడ్డి అనే ఇద్దరు.. మల్లారెడ్డితోపాటు పలువురు అధికారులు, స్థానిక మున్సిపల్ చైర్మన్, వైస్‌చైర్మన్, కౌన్సిలర్లపై ఆ ఫిర్యాదు చేశారు. నాగారంలోని కోమటివాని కుంట, దాయరకుంట, అన్నరాయి చెరువు, చర్లపల్లి చెరువుల కాలువలు పూర్తిగా కబ్జా కావడంతో వరదనీరు దిగువ ప్రాంతానికి సరిగ్గా ప్రవహించక ట్రాఫిక్ సమస్య ఏర్పడడంతో పాటు దిగువ ప్రాంతంలోని 22 కాలనీలు ముంపునకు గురవుతున్నాయని వారు ఫిర్యాదులో తెలిపారు. 2022లో ఎమ్మెల్యే మల్లారెడ్డి, మున్సిపల్ చైర్మన్, కౌన్సిలర్లు, అధికారులు ఆ 22 కాలనీల మధ్యలో నుంచి కాలువ ఏర్పాటుకు రంగం సిద్ధం చేశారని చెప్పారు. అది కాలనీ మధ్య వంకలు తిరుగుతూ వెళ్తోంది. దాంతో వ్యయం అంచనా రూ.65 కోట్ల నుంచి రూ.80 కోట్లకు పెరిగిందని, ప్రజాధనం వృథా అవుతోందని, కాలనీల మధ్య నుంచి కాకుండా ప్రధాన రోడ్డు ద్వారా కాలువ ఏర్పాటు చేస్తే రూ.10 కోట్లు మాత్రమే ఖర్చు అవుతుందని వారు వివరించారు. సమస్య ప్రజాధనాన్ని వృథా చేసేలా ప్రణాళిక రూపొందించిన, దానిని ఆమోదించిన సంబంధిత అధికారులందరిపై చర్యలు తీసుకోవాలని వారు పేర్కొన్నారు.

పెరిగిన ఆంధ్ర, తెలంగాణ అప్పులు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : ఈ ఆర్థిక సంవత్సరానికి ఆంధ్రప్రదేశ్ మొత్తం అప్పు రూ. 4,85,490.80 కోట్లు, తెలంగాణ అప్పు రూ. 3,89,672.50 కోట్లు ఉంటుందని కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి వెల్లడించారు. లోక్‌సభలో ఒక ప్రశ్నకు మంగళవారం సమాధానమిస్తూ 2022లో రూ. 3.82 లక్షల కోట్లున్న ఆంధ్రప్రదేశ్ అప్పు 2023 నాటికి రూ.4.28 లక్షల కోట్లకు చేరుకుందని తెలిపారు. అదే తెలంగాణ అప్పు 2022లో రూ. 3.14 లక్షల కోట్లు కాగా 2023 నాటికి అది రూ. 3.52 లక్షల కోట్లకు చేరుకుందని ఆయన వెల్లడించారు.

గ్రామాల్లో నేటి నుంచి పారిశుద్ధ్య కార్యక్రమాలు

హైదరాబాద్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో నేటి నుంచి ఈనెల 15 వరకు ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు రోజువారి కార్యక్రమాల నిర్వహణపై పంచాయతీల ప్రత్యేక అధికారులకు జిల్లాల వారిగా అవగాహన కల్పించారు. 9 రోజులపాటు నిర్వహించే కార్యక్రమాల్లో ప్రతిరోజు మురుగు కాల్వల శుభ్రం, రహదారులపై చెత్త తొలగింపు వంటి ప్రజాప్రయోజన స్థలాల్లో పారిశుద్ధ కార్యక్రమాలు చేపట్టాలని పేర్కొన్నారు. పంచాయతీ పరిధిలోని అన్ని ఇళ్లలో శుక్రవారం డ్రైడేను పాటించేలా ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని ఆదేశించింది. ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాల్లో యువత, స్వయంసహాయక సంఘాలు, స్వచ్ఛంద సంస్థలను భాగస్వామ్యం చేయాలని కోరింది. నిధుల కొరత కారణంగా 9 రోజులపాటు కార్యక్రమాల నిర్వహణకు నిధులు ఎలా సర్దుబాటు చేయాలన్న దానిపై అధికారులు మల్లగుల్లాలు పడుతున్నారు.

సీఎంఆర్ గడువు పెంచిన కేంద్రం

2022- 23 వానాకాలం, యాసంగి సీజన్లకు సంబంధించిన కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) గడువును ఈ నెలాఖరు వరకు కేంద్రం పొడిగించింది. ఈ మేరకు మంగళవారం కేంద్ర ఆహార, వినియోగదారుల మంత్రిత్వ శాఖ కార్యదర్శి దీపేందర్ సింగ్ ఉత్తర్వులు జారీచేశారు.

రాజధానికి ఇక కొత్తరూపు

» అందుకు 'మూసీ' నమూనాలు రూపొందించండి

» సింగపూర్ కంపెనీ ప్రతినిధులతో సీఎం రేవంత్



హైదరాబాద్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): ఔటర్ రింగ్ రోడ్డు, రీజనల్ రింగ్ రోడ్డు, నగరం చుట్టూ రాబోయే రైలు మార్గాల విస్తరణతో రాబోయే రోజుల్లో హైదరాబాద్ రూపు రేఖలు మారిపోనున్నాయని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. అందుకు అనుగుణంగానే మూసీ రివర్ ఫ్రంట్ నమూనాలను రూపొందించాలని సింగపూర్‌కు చెందిన మెయిన్‌హర్ట్ కంపెనీ ప్రతినిధులకు ఆయన సూచించారు. మంగళవారం సచివాలయంలో కంపెనీ ప్రతినిధులతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా వివిధ దేశాల్లో తాము చేపట్టిన ప్రాజెక్టుల డిజైన్లతో పాటు, హైదరాబాద్ మూసీ డెవలప్‌మెంట్‌కు అనుసరించాల్సిన ప్రాజెక్టు నమూనాలను పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా ప్రతినిధులు సీఎంకు వివరించారు. అనంతరం రేవంత్‌రెడ్డి మాట్లాడతూ హైదరాబాద్ భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా నమూనాలను రూపొందించాలని కంపెనీ ప్రతినిధులకు సూచించారు. కాగా, మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్టును చేపట్టేందుకు ప్రపంచ వ్యాప్తంగా పేరొందిన కంపెనీలు ఆసక్తిచూపుతున్నాయి. ప్రాజెక్టు నిర్మాణం కోసం ఇటీవల లండన్, దుబాయ్ పర్యటనలో ముఖ్యమంత్రి అక్కడి రివర్ ఫ్రంట్ ప్రాజెక్టులను పరిశీలించారు. ఇందులో భాగంగానే దుబాయ్‌లో పలు విదేశీ కంపెనీలు, డిజైన్ ప్లానింగ్ ఆర్కిటెక్చర్ సంస్థల ప్రతినిధులు, కన్సల్టెన్సీల నిపుణులతో సమావేశమయ్యారు. అక్కడి చర్చల నేపథ్యంలో తదుపరి సంప్రదింపుల్లో భాగంగా హైదరాబాద్ అర్బన్ డెవలప్‌ఎమెంట్ అథారిటీ, మూసీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ అధికారులు వివిధ కంపెనీలతో చర్చలు జరుపుతున్నారు. ఈ క్రమంలోనే మంగళవారం సింగపూర్‌కు చెందిన కంపెనీతో సీఎం భేటీ అయ్యారు. ఈ సమావేశంలో కంపెనీ సీఈవో ఒమర్ షహజాద్, సురేష్ చంద్ర సహా వారి బృందం, సీఎస్ శాంతికుమారి, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ముఖ్య కార్యదర్శి దానకిషోర్, హెచ్ఎండీఏ జాయింట్ కమిషనర్, మూసీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండీ కాట అమ్రపాలి పాల్గొన్నారు. కాగా, మంగళవారం సచివాలయంలో సీఎం రేవంత్ రెడ్డిని ఫిషిన్ ఇండియా కంపెనీ ప్రతినిధులు జాయ్ ఫోక్, మనీష్ కుమార్, అల్తాఫ్ అలీ ఖాన్, వందన కుమార్‌లు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చించారు.

'కాళేశ్వరం' భయంతో కృష్ణాపై దుష్ప్రచారం

(మొదటిపేజీ తరువాయి)

పత్రికా సమావేశాలు, కార్యక్రమాలు నిర్వహించి వివరించాలని అన్నారు. కృష్ణా పరివాహక ప్రాంతాల నేతలకు ఈ విషయమై ప్రత్యేక సూచనలు చేశారు. రానున్న లోక్‌సభ ఎన్నికలకుగాను రాష్ట్రంలోని 17 నియోజకవర్గాలకు అభ్యర్థిత్వాన్ని ఆశిస్తూ 309 దరఖాస్తులు అందిన నేపథ్యంలో.. వాటిని పరిశీలించి షార్ట్ లిస్ట్ చేయడానికి సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన ప్రదేశ్ ఎన్నికల కమిటీ మంగళవారం గాంధీభవన్‌లో సమావేశమైంది. ఈ సందర్భంగా రేవంత్ మాట్లాడుతూ.. లోక్‌సభ ఎన్నికలను తేలిగ్గా తీసుకోవద్దన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో మెజారిటీ వచ్చిన ప్రాంతాల్లో ఎలాగూ గెలుస్తామని అజాగ్రత్తగా ఉంటే మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో మల్కాజ్‌గిరి లోక్‌సభ నియోజకవర్గం పరిధిలో కాంగ్రెస్ పార్టీ ఒక్క అసెంబ్లీ సీటు కూడా గెలుచుకోకపోయినా.. ఆ తర్వాత జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో తాను గెలిచానని గుర్తు చేశారు. అదే సమయంలో ఖమ్మం లోక్‌సభ స్థానం పరిధిలో మెజారిటీ అసెంబ్లీ సీట్లు దక్కినా.. ఎంపీ సీటును దక్కించుకోలేకపోయామన్నారు. ఈ నేపథ్యంలో లోక్‌సభ ఎన్నికలను తేలికగా తీసుకోకుండా జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు. కాగా, ఏయే ఎంపీ స్థానాలకు టికెట్ కోసం ఎవరెవరు దరఖాస్తులు చేసుకున్నారన్న వివరాలను పీఈసీ సమావేశంలో సభ్యులకు ఇచ్చారు. దరఖాస్తు చేసుకున్నవారికి తొలి, మలి, మూడో ప్రాధాన్యాలు నిర్ణయించేటప్పుడు గెలుపు అవకాశం, సామాజిక న్యాయాన్ని దృష్టిలో పెట్టుకోవాలని రేవంత్‌రెడ్డి సూచించారు. ప్రాధాన్యాలు, అభిప్రాయాలను సీల్డ్ కవర్‌లో పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీకి బుధవారం మధ్యాహ్నం 2 గంటల వరకు అందజేయాలన్నారు.



గాంధీభవన్‌లో ప్రారంభమైన టీపీసీసీ ఎలక్షన్ పీఈసీ సమావేశంలో పాల్గొన్న సీఎం రేవంత్, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి, తెలంగాణ ఇన్‌ఛార్జి దీపాదాస్ మున్షి తదితరులు

సోనియాగాంధీ పోటీ చేసే చాన్స్..!

వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో తెలంగాణ నుంచి ఏదో ఒక నియోజకవర్గం నుంచి పోటీ చేయాల్సిందిగా సోనియాగాంధీని కలిసి ఆహ్వానించినట్లు రేవంత్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఖమ్మం నుంచి పోటీ చేయిద్దామని కేంద్ర మాజీ మంత్రి రేణుకా చౌదరి ప్రతిపాదించారు. అయితే సరైన సమయంలో సరైన నిర్ణయం తీసుకుంటానని సోనియాగాంధీ చెప్పారని, ఏ నియోజకవర్గం అన్నదీ నిర్ణయించలేదని రేవంత్ అన్నారు. ఈ విషయంలో కార్యకర్తలను గందరగోళానికి గురి చేయవద్దని పార్టీ నేతలకు సూచించారు. కాగా, ఎస్సీ రిజర్వుడ్ స్థానాలు మూడింటిలో మాదిగ సామాజిక వర్గానికి రెండు సీట్లు కేటాయించాలని ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్ సూచించారు. జనాభా దామాషా, ప్రస్తుత రాజకీయ పరిణామాలను అనుసరించి ఈ నిర్ణయం తీసుకోవాలన్నారు. గత లోక్‌సభ ఎన్నికల సమయంలో మాదిగ సామాజిక వర్గానికి న్యాయం జరగలేదని, ఈసారి ఆ పరిస్థితి రానివ్వవద్దని అన్నారు. పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ మాట్లాడుతూ.. లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో పార్టీలో చేరికలపై దృష్టి పెట్టాలని సూచించారు. ముఖ్యంగా క్షేత్రస్థాయిలో ప్రభావం చూపగల నేతలు, తటస్థులను చేర్చుకోవడంపై దృష్టి సారించాలన్నారు. అభ్యర్థుల ఎంపిక ప్రక్రియను ఏఐసీసీ స్క్రీనింగ్ కమిటీ చైర్మన్ హరీశ్ చౌదరి వివరించారు. ఈ సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, దీపాదాస్ మున్షీ, హరీష్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్‌కు నీళ్ల గురించి ఏమీ తెలియదు

అందుకే మేడిగడ్డను కట్టి నిండా ముంచారు: భట్టి విక్రమార్క

హైదరాబాద్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం కేసీఆర్‌కు నీళ్ల గురించి ఏమీ తెలియదని, అందుకే మేడిగడ్డను కట్టి నిండా ముంచారని డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం నాగార్జునసాగర్, ఎస్సారెస్పీ వంటి ప్రాజెక్టులను కట్టిందని, దశాబ్దాలుగా అవి పంటలకు నీళ్లు అందిస్తూనే ఉన్నాయని గుర్తు చేశారు. ప్రాజెక్టులపై కాంగ్రెస్ నాయకులకు అవగాహన లేదంటూ కేసీఆర్ వ్యాఖ్యానించిన నేపథ్యంలో భట్టివిక్రమార్క ఈ మేరకు స్పందించారు.

'మూసీ'కి రూ. 5,813 కోట్లు!

» అంతకు మించే ఖర్చవుతుందని ప్రభుత్వం అంచనా

» 55 కి.మీ. మేర పర్యాటక ప్రాంతాలు

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి6 (ఆంధ్రజ్యోతి): మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌ఎమెంట్ ప్రాజెక్టుకు రూ.5813కోట్ల (ఏడు బిలియన్ డాలర్లు) కంటే ఎక్కువ ఖర్చవుతుందని రాష్ట్ర ప్రభుత్వం అంచనా వేసింది. మూసీనది అభివృద్ధిలో భాగంగా పశ్చిమాన ఔటర్ రింగ్ రోడ్డు నుంచి తూర్పున ఔటర్ వరకు మూసీ వెంట 55కిలోమీటర్ల మేర పీపుల్స్ ప్లాజాలు, సైకిల్ ట్రాక్‌లు, గ్రీన్‌స్పేస్‌లు, హాకర్‌జోన్‌లు, వంతెనలు, వినోద, పర్యాటక ప్రాంతాలు, క్రీడా సౌకర్యాలు, పార్కింగ్ ప్రాంతాలు, వాణిజ్య, రిటైల్ స్థలాలు, ఆతిథ్య మౌలిక సదుపాయాలను కల్పించేందుకు నిర్ణయించారు. ఇందుకు రాష్ట్ర ప్రభుత్వ నిధులతో పాటు బహుపాక్షిక ఫండింగ్ ఏజెన్సీలు, ఫైనాన్షియల్ మార్కెట్లు, ప్రైవేట్ రంగ నిధులతో సహా వివిధ రకాల వనరుల ద్వారా ఈ ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్లేందుకు ప్రతిపాదించారు. పీపీపీ పద్ధతిలో ప్రాజెక్టు కావడంతో మూసీనది పొడవునా పలు విస్తీర్ణములో ఉన్న భూములను వివిధ సంస్థలకు అభివృద్ధికి అప్పగించి పూర్తిగా వాణిజ్యీకరణ చేయనున్నారు. మున్ముందు ఈ మూసీ రివర్ ఫ్రంట్ అభివృద్ధి ప్రాజెక్టును ప్రభుత్వానికి ఆదాయం సమకూర్చే వేదికగా తీర్చిదిద్దనున్నారు. ప్రధానంగా పర్యావరణ స్పృహతో పాటు ఆర్థికంగా స్థిరమైన అభివృద్ధికి ఒక నమూనాగా ఉండాలని లక్ష్యాన్ని మూసీ నది అభివృద్ధి ప్రాజెక్టుకు నిర్దేశించారు.

వరద ఉధృతి అంచనాకు కన్సల్టెన్సీలకు ఆహ్వానం

మూసీనదిని ప్రైవేటు పబ్లిక్ పట్నర్‌షిప్ (పీపీపీ) పద్ధతిలో అభివృద్ధి చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. అందులో భాగంగా మూసీనది వివిధ ప్రాంతాల వారీగా వరద ప్రవాహ ఉధృతి తీరును ఓ నమూనాలో అంచనా వేయడానికి ఆసక్తి వ్యక్తీకరణ చేసే కన్సల్టెన్సీ కోసం టెండర్లను ఆహ్వానించింది. ఎంపికైన సంస్థలు మూడు నెలల్లోనే పూర్తిస్థాయి నివేదికను ప్రభుత్వానికి అందజేయాలని నిబంధనలు విధించారు. మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టులో భాగంగా ఉస్మాన్ సాగర్ డ్యామ్ దిగువ భాగం నుంచి ఔటర్ రింగ్ రోడ్డు తూర్పున గల గౌరెల్లి వరకు, హిమాయత్‌సాగర్ డ్యామ్ దిగువ భాగం నుంచి బాపూఘాట్ వద్ద సంగమం వరకు వరద ప్రవాహ ఉధృతి తీరును అంచనా వేయనున్నారు. వర్షపాతం నమోదైన సందర్భంలో, ఎలాంటి వర్షాలు లేని సందర్భంలో వరద ఉధృతిని అంచనా వేయాల్సి ఉంటుంది. హిమాయత్‌సాగర్, ఉస్మాన్‌సాగర్ నుంచి నీటిని విడుదల చేసిన సందర్భంలో, నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి వరద మూసీ నదిలో చేరిన సందర్భంలో ప్రవాహ తీరును ప్రతీ కిలోమీటర్‌కు అంచనాలు రూపొందించాలి. ఆయా ప్రాంతాల వారీగా గరిష్ఠ నిల్వ పరిమాణం, మూసీ గరిష్ఠ నీటి స్థాయిలపై, రుతుపవనాల కాలానుగుణంగా నివేదికను కన్సల్టెన్సీలు అందజేయాలని టెండర్ నిబంధనల్లో పొందుపరిచారు.

మరో 60 గ్రూపు-1 పోస్టులు

» భర్తీకి ఆర్థిక శాఖ ఉత్తర్వులు..

» 563కు చేరిన మొత్తం పోస్టులు

హైదరాబాద్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): మరో 60 గ్రూపు-1 పోస్టులను భర్తీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు ఉత్తర్వులు జారీ చేశారు. పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేయాలని టీఎస్‌పీఎస్సీకి సూచించారు. కొత్త పోస్టులకు సంబంధించిన రోస్టర్ పాయింట్ల వివరాలను టీఎస్‌పీఎస్సీకి సమర్పించాలని జీవోలో ఆయా విభాగాల అధిపతులకు సూచించారు. కొత్త పోస్టుల్లో 24 డీఎస్పీ, 19 మండల పరిషత్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ పోస్టులు ఉన్నాయి. ఇప్పటికే 503 గ్రూపు-1 పోస్టులను భర్తీ చేయాలని గత ప్రభుత్వం నిర్ణయించిన విషయం తెలిసిందే. తాజా పోస్టులను కలిపితే... గ్రూపు-1 మొత్తం పోస్టుల సంఖ్య 563కి చేరినట్టయింది. కాగా, గత ప్రభుత్వ హయాంలో 503 గ్రూపు-1 పోస్టుల భర్తీ కోసం నిర్వహించిన ప్రిలిమినరీ పరీక్ష పేపర్ లీకైంది. దాంతో సదరు పరీక్షను రద్దు చేశారు. తర్వాత మళ్లీ రెండోసారి ప్రిలిమినరీ పరీక్షను నిర్వహించారు. ఈ పరీక్ష ఫలితాలను ఇంకా విడుదల చేయలేదు. అయితే.. ఈ పరీక్ష నిర్వహణలో అధికారులు నిబంధనలను పాటించ లేదని కొందరు హైకోర్టును ఆశ్రయించారు. పరీక్షను రద్దు చేయాలని హైకోర్టు సూచించింది. హైకోర్టు తీర్పును టీఎస్‌పీఎస్సీ సుప్రీంకోర్టులో సవాల్ చేసింది. ప్రస్తుతం ఈ కేసును పెండింగ్‌లో ఉంది. ఈ నేపథ్యంలో ఈ పరీక్షను రద్దు చేస్తారా? లేదా? అనే విషయం సందిగ్ధంలో పడింది.

ప్రత్యేక నోటిఫికేషనా? అదనపు నోటిఫికేషనా?

తాజాగా ప్రకటించిన పోస్టుల భర్తీని ఎలా చేపడతారనే అంశంపై స్పష్టత రావాల్సి ఉంది. ఈ పోస్టుల కోసం మళ్లీ ప్రత్యేకంగా నోటిఫికేషన్‌ను జారీ చేస్తారా? లేక పాత నోటిఫికేషన్‌కు అనుబంధంగా అదనపు నోటిఫికేషన్ ఇస్తారా? అనే అంశంపై టీఎస్‌పీఎస్సీ అధికారులు నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. అదనంగా నోటిఫికేషన్‌ను జారీ చేస్తే గతంలోని పోస్టులకు తాజా పోస్టులు అదనంగా చేరుతాయి. అటువంటప్పుడు, పోస్టుల భర్తీకి ఇప్పటికే పూర్తయిన ప్రిలిమ్స్‌నే పరిగణనలోకి తీసుకుంటారా? లేక, దాన్ని రద్దు చేసి, కొత్తగా మళ్లీ పరీక్షను నిర్వహిస్తారా? అనే విషయం కూడా కీలకంగా మారనుంది.

కొత్త పోస్టులు

పేరు	సంఖ్య
అసిస్టెంట్ ఆడిట్ ఆఫీసర్	1
డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్	24
డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ జైల్స్	3
డిస్ట్రిక్ట్ ఎంప్లాయిమెంట్ ఆఫీసర్	3
ఎంపీడీఓ	19
డిస్ట్రిక్ట్ పంచాయితీ ఆఫీసర్	2
డిప్యూటీ కలెక్టర్	3
అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్	4
డిస్ట్రిక్ట్ రిజిస్ట్రార్	1
మొత్తం	60

లబ్ధిదారులకే గ్యాస్ సబ్సిడీ నగదు!

రాష్ట్రంలోని బీపీఎల్ కుటుంబాలకు ఏటా 6 గ్యాస్ సిలిండర్లు .. ఒక్కో సిలిండర్‌పై రూ.415 చొప్పున భరించనున్న సర్కారు

హైదరాబాద్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): మహాలక్ష్మి పథకంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం అమలుచేయబోతున్న సబ్సిడీ గ్యాస్ సిలిండర్ పథకంలో.. సబ్సిడీ మొత్తాన్ని నేరుగా లబ్ధిదారులకే చెల్లించే అవకాశాలు కనిపిస్తున్నాయి. సబ్సిడీ సొమ్మును రాష్ట్ర ప్రభుత్వం నుంచి తీసుకోవడానికి గ్యాస్ కంపెనీలు, డిస్ట్రిబ్యూటర్లు విముఖత చూపిస్తున్న నేపథ్యంలో.. ఆ సొమ్మును నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలకే బదిలీచేయాలనే ఆలోచనకు రాష్ట్ర ప్రభుత్వం వచ్చినట్లు విశ్వసనీయవర్గాల ద్వారా తెలిసింది. దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న (బీపీఎల్) కుటుంబాలకు రూ.500కే గ్యాస్ సిలిండర్ అందిస్తామంటూ ఇచ్చిన ఎన్నికల హామీని అమలు చేయడానికి కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధమైన సంగతి తెలిసిందే. ఈ పథకం అమలుకు రేషన్‌కార్డును ప్రామాణికంగా తీసుకోనున్నారు. రాష్ట్రంలో 90 లక్షల కుటుంబాలకు తెల్ల రేషన్ కార్డులు ఉన్నాయి. వీటిలో తెల్ల రేషన్‌కార్డుతోపాటు గ్యాస్ కనెక్షన్లు ఉన్న కుటుంబాలు 64 లక్షలు ఉన్నాయి. ఇప్పటికిప్పుడు ఈ పథకాన్ని అమలుచేస్తే ఈ 64 లక్షల కుటుంబాలకూ సబ్సిడీ ఇవ్వాల్సి ఉంటుంది. ఒక్కో కుటుంబానికీ రెండు నెలలకు ఒక సిలిండర్ చొప్పున ఏడాదికి ఆరు గ్యాస్ సిలిండర్లు.. అంటే మొత్తం ఏడాదికి 3.84 కోట్ల రీఫిల్స్ రాయితీపై పంపిణీ చేయాల్సి ఉంటుంది. ప్రస్తుతం ఒక్కో గ్యాస్ సిలిండర్ ధర రూ.955గా ఉంది. ఇందులో కేంద్ర ప్రభుత్వ సబ్సిడీ రూ.40 పోగా.. వినియోగదారుడు రూ.915కు సిలిండర్ కొనుగోలు చేయాల్సి వస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం ఇదే సిలిండర్‌ను రూ.500కు పంపిణీ చేయాలని నిర్ణయించింది. అంటే ఒక్కో సిలిండర్‌పై రూ. 415 చొప్పున భారాన్ని మోయాల్సి వస్తుంది. సబ్సిడీ కింద దాదాపు రూ.1,594 కోట్లు ఇవ్వాల్సి వస్తుంది.

రాజస్థాన్‌లోనూ..

మొన్నటివరకు రాజస్థాన్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉంది. అక్కడ కూడా రూ.500కే వంట గ్యాస్ సిలిండర్ పథకాన్ని అమలుచేశారు. అక్కడకూడా గ్యాస్ కంపెనీలు ముందుకురాకపోవడంతో ప్రభుత్వం నేరుగా లబ్ధిదారులకే సబ్సిడీ మొత్తాన్ని పంపిణీ చేసింది. ఇక్కడా అదే తరహాలో గ్యాస్ సబ్సిడీ పథకాన్ని అమలుచేయాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తుండటం గమనార్హం. వినియోగదారుడు గ్యాస్ సిలిండర్ బుక్ చేసుకోగానే.. ఒకటి, రెండు రోజుల్లో రీఫిల్ ఇంటికి వస్తుంది. ఆ తర్వాత రెండు-మూడు రోజుల్లో కేంద్ర ప్రభుత్వ సబ్సిడీ రూ.40 వినియోగదారు బ్యాంకు ఖాతాలో జమ అవుతుంది. అదే పద్ధతిలో వినియోగదారుని బ్యాంకు ఖాతాకు తాము కూడా ఐదారు రోజుల్లోనే సబ్సిడీ మొత్తం రూ.415 బదిలీ చేయాలనే ఆలోచనలో రాష్ట్ర సర్కారు ఉన్నట్లు విశ్వసనీయవర్గాల ద్వారా తెలిసింది.

కేంద్రంతో వ్యవహారం.. నో!


తెలంగాణ పౌరసరఫరాల భవన్‌లో కమిషనర్ డీఎస్ చౌహాన్ ఇటీవలే గ్యాస్ కంపెనీల ప్రతినిధులతో భేటీ అయ్యి.. ఈ పథకం అమలుపై చర్చించారు. ఆ సమావేశంలో మూడు ఆప్షన్లు చర్చకు వచ్చాయి. ఒకటి లబ్ధిదారులకు నేరుగా సబ్సిడీ మొత్తాన్ని ప్రభుత్వమే చెల్లించటం! రెండోది... గ్యాస్ కంపెనీలకు రాష్ట్ర ప్రభుత్వం చెల్లించడం. మూడోది.. గ్యాస్ ఏజెన్సీలకు సబ్సిడీ మొత్తాన్ని చెల్లించడం. కానీ, గ్యాస్ కంపెనీల ప్రతినిధులు ఇందుకు ససేమిరా అన్నారు. ఇది కేంద్ర ప్రభుత్వంతో ముడిపడిన అంశమంటూ చేతులెత్తేశారు. మరో ప్రయత్నంగా గ్యాస్ ఏజెన్సీలు(డిస్ట్రిబ్యూటర్ల)తో సమావేశం నిర్వహించాలని పౌరసరఫరాల శాఖ ఉన్నతాధికారులు నిర్ణయించారు. అయితే డిస్ట్రిబ్యూటర్లు కూడా ఇందుకు సుముఖంగాలేరని విశ్వసనీయవర్గాల ద్వారా తెలిసింది. ప్రభుత్వం మాత్రం.. నేరుగా రూ.500కే సిలిండర్‌ను వినియోగదారుకు సరఫరా చేయగలిగితేనే ఈ పథకం ప్రభావం ఉంటుందని భావిస్తోంది.

ప్రజావాణి ఆదుకుంటోంది..

» ఆరోగ్య సమస్యలతో వచ్చిన వారికి తక్షణ సాయం

» లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ చేయించుకున్న యువతికి 3 నెలలకు సరిపడా మందులు

బేగంపేట, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్య సమస్యలతో ప్రజావాణిని ఆశ్రయించిన వారికి తక్షణ సాయం లభిస్తోంది. అర్జీదారులకు అవసరమైన సాయం చేసేందుకు ప్రజావాణి అధికారులు సత్వర చర్యలు తీసుకుంటున్నారు. హైదరాబాద్‌లోని సైఫాబాద్‌కు చెందిన దివ్యశ్రీ అనే యువతికి 2017లో లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ జరిగింది. వైద్యుల సూచనల మేరకు నాటి నుంచి ఆమె మందులు వాడుతుండగా నెలకు రూ.12 వేలు ఖర్చు అవుతోంది. జీవితాంతం ఆమె ఈ మందులను వాడాలి. దీంతో ఆర్థికంగా ఎన్నో ఇబ్బందుల పడుతున్న దివ్యశ్రీ సాయం కోరుతూ ఫిబ్రవరి 2న ప్రజావాణిని ఆశ్రయించింది. ప్రజావాణి నోడల్ అధికారి దివ్య దేవరాజన్‌ను కలిసి తన సమస్యను చెప్పుకుంది. దీంతో దివ్యశ్రీకి ప్రతి నెలా ఉచితంగా మందులు పంపిణీ చేయాలనే ఆదేశాలు జారీ అయ్యాయి. ఇందులో భాగంగా దివ్యశ్రీని రెండ్రోజుల క్రితం ప్రజాభవన్‌లోని ఆరోగ్య కేంద్రానికి పిలిచిన అధికారులు తొలుత ఆమెకు ఆరోగ్య శ్రీ కార్డు జారీ చేశారు. మూడు నెలలకు సరిపడా సుమారు రూ.38 వేలు విలువైన మందులు ఉచితంగా అందజేశారు. ఇక, తమ నాలుగు నెలల చిన్నారి గుండెలో రంధ్రం ఉందని హైదరాబాద్ జియాగూడకు చెందిన సునీత సాయం కోరుతూ జనవరి 30న ప్రజావాణిని ఆశ్రయించారు. దీంతో స్పందించిన అధికారులు ఆ చిన్నారిని నగరంలోని స్టార్ ఆస్పత్రికి పంపించి ఆరోగ్యశ్రీలో ఉచితంగా శస్త్రచికిత్స నిర్వహించేలా ఏర్పాట్లు చేశారు. రెండు రోజుల్లో ఈ శస్త్ర చికిత్స జరగనుంది.



దివ్యశ్రీకి మందులు అందజేస్తున్న ఆరోగ్యశ్రీ సిబ్బంది

ప్రజావాణికి 2,192 అర్జీలు

ప్రజాభవన్‌లో మంగళవారం నిర్వహించిన ప్రజావాణికి వేర్వేరు సమస్యలపై 2,192 అర్జీలు వచ్చాయి 2017లో టీఎస్‌పీఎస్సీ ద్వారా 3,300 స్టాఫ్‌నర్సు ఉద్యోగాలకు నోటిఫికేషన్ వెలువడగా 2,400 మందికి ఉద్యోగాలు ఇచ్చారని, మిగిలిన 800 మందికి ఉద్యోగం ఇవ్వాలని అభ్యర్థులు ప్రజావాణిలో దరఖాస్తు చేసుకున్నారు. ప్యాకర్స్ అండ్ మూవర్స్ వాహనాలను హైదరాబాద్ నగరంలో పగలు అనుమతించకపోవడంతో ఉపాధి కోల్పోతున్నామని ఎల్బీనగర్ ప్యాకర్స్ అసోసియేషన్ వారు ప్రజావాణిలో వినతి పత్రం ఇచ్చారు. పోలీసులు రూ.4 వేల దాకా చలానాలు వేస్తున్నారని, ఒక్క రోజులో మూడు కమిషనరేట్ల పరిధిలో చలానాలు వేస్తున్నారని పేర్కొన్నారు. సింగరేణిలో 35 ఏళ్ల క్రితం 50 ఎకరాల తమ భూమి పోయిందని, ఇప్పటి వరకు నష్టపరిహారం ఇవ్వలేదని, పరిహారం దక్కేలా చర్యల తీసుకోవాలని ఖమ్మం జిల్లా కారెపల్లికి చెందిన సుందర్‌లాల్ లోథ్ ప్రజావాణిలో దరఖాస్తు చేసుకున్నారు.

మూడు కొత్త కౌంటర్లు

ప్రజావాణి ప్రక్రియను సులభతరం చేసేందుకు అధికారులు మూడు కొత్త కౌంటర్లు ఏర్పాటు చేశారు. ప్రజావాణి ప్రారంభమైన నాటి నుంచి సుమారు 12 టేబుళ్లలో సిబ్బంది అర్జీలను తీసుకుంటున్నారు. వాటికి అదనంగా గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో చేయూత పెన్షన్ల కౌంటర్, మహిళా శిశు సంక్షేమ శాఖ అధ్వర్యంలో ఉపాధి మరియు శిక్షణకు చెందిన కౌంటర్లు ప్రత్యేకంగా పెట్టారు.

నాపై అక్రమాస్తుల ఆరోపణలు నిరాధారం

- 36 సంవత్సరాల సర్వీసులో నాది క్లీన్ రికార్డ్
- తప్పుడు ఆరోపణలు చేసేవారిపై క్రిమినల్ చర్యలు
- టీఎస్‌పీఎస్‌సీ చైర్మన్ మహేందర్ రెడ్డి హెచ్చరిక



హైదరాబాద్, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): తనకు రూ.వేల కోట్ల అక్రమ ఆస్తులు ఉన్నాయంటూ హైకోర్టు న్యాయవాది రాపోలు భాస్కర్ చేసిన ఆరోపణలపై టీఎస్‌పీఎస్‌సీ చైర్మన్, మాజీ డీజీపీ మహేందర్‌రెడ్డి స్పందించారు. ఆ ఆరోపణలన్నీ నిరాధారం, సత్యదూరమని ఆయన తేల్చిచెప్పారు. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన తనపై బురదజల్లేందుకే ఈ తప్పుడు, నిరాధార ఆరోపణలు చేస్తున్నారన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో పోలీసు శాఖలో 36 సంవత్సరాలకు పైగా అంకితభావంతో, ఎలాంటి మచ్చా లేకుండా పనిచేశానని.. తన సర్వీసు మొత్తం క్లీన్ రికార్డు ఉందని గుర్తుచేశారు. అలాంటి తనపై ఇలా ఇప్పుడు అసత్య ఆరోపణలు చేయడం దురదృష్టకరమన్నారు. ఈ ఆరోపణలు చేస్తున్నవారిపై, సోషల్ మీడియాలో దీనిని వైరల్ చేస్తున్నవారిపై క్రిమినల్ పరువునష్టం దావా వేస్తానని మహేందర్ రెడ్డి హెచ్చరించారు.

ప్రజా భద్రతకు మరింత భరోసా: డీజీపీ రవిగుప్తా

- ఎఫ్ఎస్ఎల్ వెబ్‌సైట్, 8 భరోసా కేంద్రాలు ప్రారంభం

హైదరాబాద్, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): ప్రజలకు భద్రత కల్పించడం, బాధితులకు సత్వర న్యాయం అందించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామని డీజీపీ రవిగుప్తా తెలిపారు. మంగళవారం నూతనంగా రూపొందించిన ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబొరేటరీ(ఎఫ్ఎస్ఎల్) వెబ్‌సైట్‌ను డీజీపీ ఆవిష్కరించారు. రాష్ట్రంలో 8 భరోసా కేంద్రాల్ని తన కార్యాలయం నుంచి ఆన్‌లైన్‌లో ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కేసుల దర్యాప్తు, సాంకేతిక ఆధారాల విశ్లేషణలో ఎఫ్ఎస్ఎల్ కీలక భూమిక పోషిస్తుందన్నారు. మహిళా భద్రత విభాగం, ఎఫ్ఎస్ఎల్ చీఫ్ శిఖా గోయల్ మాట్లాడుతూ.. లైంగిక వేధింపులు, అత్యాచార కేసుల్లో బాధితులకు అన్ని రకాల సహాయాలు ఒకే గొడుగు కింద అందించేందుకు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

మల్లన్నసాగర్‌కు కర్ణాటక ఎమ్మెల్యేలు

తొగుట, ఫిబ్రవరి 6: కర్ణాటక రాష్ట్రానికి చెందిన 12 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యే సిద్దిపేట జిల్లా తుక్కాపూర్ శివారులోని మల్లన్న సాగర్ రిజర్వాయర్‌ను మంగళవారం సాయంత్రం సందర్శించారు. సొరంగంలోని పంపుహౌజ్, నీటిని ఎత్తిపోసే బాహుబలి మోటార్లు, కట్ట నిర్మాణాన్ని పరిశీలించారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ ఈఎన్‌సీ హరిరాం ప్రాజెక్టుకు సంబంధించిన వివరాలను ఎమ్మెల్యేలకు వివరించారు. గోదావరి నది నుంచి 10 పంపులతో మల్లన్నసాగర్ నుంచి కొండపోచమ్మ వరకు నీటిని ఎత్తిపోస్తున్నామని తెలిపారు. ఏడాదికి 240 టీఎంసీల నీటిని ఎత్తిపోసేందుకు పథకం రూపొందించామన్నారు. ఈ పథకంలో 147 టీఎంసీల నిల్వ సామర్థ్యం ఉండడం వల్ల వర్షాభావ పరిస్థితులతో సంబంధం లేకుండా రైతులకు నీటిని సరఫరా చేయొచ్చని వివరించారు. అంతకుముందు ఎమ్మెల్యేలంతా చిన్నకోడూరు మండలం చంద్లాపూర్ గ్రామ శివారులోని రంగనాయక్‌సాగర్‌ను సందర్శించారు.

వక్ఫ్ బోర్డు చైర్మన్‌గా అజ్మతుల్లా హుసేని !

హైదరాబాద్, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సయ్యద్ అజ్మతుల్లా హుసేనిను వక్ఫ్ బోర్డు చైర్మన్‌గా నియమించాలని ప్రభుత్వం నిర్ణయించింది. విద్యార్థి దశ నుంచి కాంగ్రెస్‌లో ఉన్న అజ్మతుల్లా.. ఉమ్మడి రాష్ట్రంలో ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడిగా పనిచేశారు. కాంగ్రెస్ మైనార్టీ విభాగంలో కీలకనేత అయిన అజ్మతుల్లాను సీఎం రేవంత్ రెడ్డి వక్ఫ్ బోర్డు డైరెక్టర్‌గా ఎంపిక చేశారు. వక్ఫ్‌బోర్డు నిబంధనల ప్రకారం బోర్డు డైరెక్టర్లలో ఒకరిని చైర్మన్‌గా ఎన్నుకుంటారు. ఈ ఎన్నికకు సంబంధించిన బోర్డు సమావేశం ఈనెల 16న జరగనుంది.

5 వైద్య కళాశాలలకు ఓకే

- ఆయా జిల్లాల కలెక్టర్లకు ప్రభుత్వం ఆదేశాలు
- ఉన్నతాధికారుల బృందం క్షేత్రస్థాయి పరిశీలన
- కొత్తగా కొడంగల్‌లో మెడికల్ కాలేజీకి నిర్ణయం

హైదరాబాద్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): గత సర్కారు చివరి నిమిషంలో జీవోలు ఇచ్చిన 8 చోట్లా కొత్త మెడికల్ కాలేజీల ఏర్పాటు సాధ్యం కాదని ఉన్నతాధికారులు తేల్చేశారు. రెండు రోజుల క్రితం ఉన్నతాధికారుల బృందం క్షేత్రస్థాయి పరిశీలనకు వెళ్లింది. కేవలం ఐదుచోట్లే (గద్వాల, నారాయణపేట, ములుగు, వరంగల్ (నర్సంపేటలో), మెదక్) కాలేజీల ఏర్పాటు సాధ్యమవుతుందన్న అభిప్రాయానికి వచ్చింది. కనీసం ఆస్పత్రులు కూడా లేని మహేశ్వరం, కుత్బుల్లాపూర్, యాదాద్రిలో కాలేజీల ఏర్పాటు కష్టమని తేల్చేసింది. కొత్త ప్రభుత్వం 8 చోట్లా కాలేజీల ఏర్పాటుకు సానుకూలంగా ఉన్నప్పటికీ అధ్యాపకుల తీవ్ర కొరత, మౌలిక సదుపాయాల లేమి, ఆస్పత్రులు లేకపోవడాన్ని అధికార యంత్రాంగం ప్రధాన కారణంగా చూపుతోంది. క్షేత్రస్థాయి నివేదికల మేరకు ప్రభుత్వం ఐదు చోట్ల ఏర్పాటుకు మొగ్గుచూపింది. ఆ జిల్లాల కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేసింది. కాంట్రాక్టు పద్ధతిలో అధ్యాపకులను నియమించుకోవాలని, కాలేజీల వారీగా ప్రకటనలు ఇవ్వాలని పేర్కొంది. కాగా కొత్తగా సీఎం రేవంత్‌రెడ్డి నియోజకవర్గం కొడంగల్‌లోనూ మెడికల్ కాలేజీ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం 8 జిల్లాల్లో వైద్య కళాశాలల ఏర్పాటుకు నిర్ణయించింది. తొలుత ఒక్కో కాలేజీలో వంద సీట్లు ఉంటాయని ప్రకటించింది. కానీ 50 సీట్లతో ఏర్పాటుకే దరఖాస్తు చేసింది. కనీసం 220 పడకల అనుబంధ ఆస్పత్రి ఉంటేనే 50 ఎంబీబీఎస్ సీట్లతో కాలేజీకి దరఖాస్తు చేయాలని జాతీయ వైద్య కమిషన్ నిబంధనలు చెబుతున్నాయి. మెజారిటీ చోట్ల 220 పడకల ఆస్పత్రులు లేవు. మూడుచోట్ల సర్కారీ దవాఖానాలే లేవు. ఈ కాలేజీల ఏర్పాటు సాధ్యం కాదన్న అప్పటి డీఎంఈ రమేశ్‌రెడ్డి సూచనను గత ప్రభుత్వం పక్కనపెట్టి హడావుడిగా జీవో జారీ చేసింది. కాగా, కొత్త మెడికల్ కాలేజీలకు సంబంధించి సిద్దిపేట మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ విమలా థామస్‌ను సర్కారు ప్రత్యేక అధికారిగా నియమించింది. ఒకటి రెండు రోజుల్లో ఉత్తర్వులు రానున్నాయని వైద్యవర్గాలు తెలిపాయి.

భగీరథలో అవినీతిపై విచారణ!

(మొదటి పేజీ తరువాయి)

అందించాయి. ఈ నేపథ్యంలోనే, అవినీతి అక్రమాలపై పూర్తిస్థాయి విచారణ జరపాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించినట్లు తెలిసింది. కేసీఆర్ సర్కారు అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన మేడిగడ్డ బ్యారేజీపై ఇప్పటికే విచారణ జరుగుతుండగా.. అప్పట్లో కాంగ్రెస్ నేతలు కమీషన్ భగీరథ అని విమర్శించిన మిషన్ భగీరథపైనా ఇప్పుడు సర్కారు విచారణకు ఆదేశించడం గమనార్హం.

నీటి సరఫరాపైనా ఆరా..!

మిషన్ భగీరథ ద్వారా అన్ని గ్రామాలు, తండాలకు వంద శాతం తాగునీటిని సరఫరా చేస్తున్నట్లు గత ప్రభుత్వం ప్రకటించుకున్న విషయం తెలిసిందే. ఇందులో ఏమాత్రం వాస్తవం లేదని, చాలా మారుమూల గ్రామాలు, తండాలకు తాగునీరు అందడం లేదని తమ దృష్టికి వచ్చిందని ఇటీవల పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులతో చేపట్టిన సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించిన విషయం తెలిసిందే. దీన్ని దృష్టిలో ఉంచుకొని జిల్లాలవారీగా అధికారులు తమ పరిధిలోని గ్రామాలు, తండాల్లో ఇంటింటికీ నల్లానీరు అందుతుందా..? అది ప్రజల అవసరాలకు సరిపడా ఉంటుందా? అన్న దానిపై వివరాలు సేకరిస్తున్నారు. ఆయా గ్రామాల్లో ఎంత శాతం నీరు అందుతోంది? ఎంత సమయం సరఫరా చేస్తున్నారు? అనే విషయంపై కూడా సమాచారం సేకరిస్తున్నారు. వాస్తవ పరిస్థితిపై జిల్లాల వారీగా పూర్తి సమాచారాన్ని త్వరలోనే ప్రభుత్వానికి అందించనున్నట్లు తెలుస్తోంది.



మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సొదరుడు ప్రసాద్‌రెడ్డి కుమారుడు లోహిత్ రెడ్డి, రియల్‌ఎస్టేట్ వ్యాపారవేత్త మహేందర్ రెడ్డి కూతురు భవానిల ప్రీ వెడ్డింగ్ రిసెప్షన్ మంగళవారం రాత్రి జరిగింది. గౌలిదొడ్డిలోని అనన్య కన్వెన్షన్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి సీఎం రేవంత్‌రెడ్డి హాజరై వధూవరులను ఆశీర్వదించారు. - నార్సింగ్ (ఆంధ్రజ్యోతి)

యూపీఐతో రైలు టికెట్లు

- రైల్వే స్టేషన్లలోని టికెట్ కౌంటర్ల వద్ద డిజిటల్ లావాదేవీలు

హైదరాబాద్, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): రైల్వే ప్రయాణికులకు శుభవార్త. జనరల్ టికెట్ కొనుగోలు సమయంలో ప్రయాణికులు ఇకపై చిల్లర కోసం జేబులు తడుముకోవాల్సిన పని లేదు. రైల్వే స్టేషన్‌లోని టికెట్ కౌంటర్ల వద్ద యూపీఐ లావాదేవీలు చేయవచ్చు. రైల్వే స్టేషన్‌లో టికెట్ కౌంటర్ వద్ద ఉన్న క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి యూపీఐ యాప్ ద్వారా చెల్లింపులు చేసేలా దక్షిణ మధ్య రైల్వే (ఎస్‌సీఆర్) ఏర్పాట్లు చేసింది. యూపీఐ యాప్ లేదా డెబిట్, క్రెడిట్ కార్డులతో చెల్లింపులు చేసేందుకు చర్యలు తీసుకుంది. ఇందుకోసం తమ పరిధిలోని రైల్వేస్టేషన్లలో ఇప్పటికే 466 పీఓఎస్ యంత్రాలు, యూపీఐ క్యూఆర్ కోడ్‌లను ఏర్పాటు చేశామని ఎస్‌సీఆర్ జీఎం అరుణ్‌కుమార్ జైన్ వెల్లడించారు. దాదాపు అన్ని స్టేషన్లలో ప్యాసింజర్ రిజర్వేషన్ సిస్టమ్, అన్‌రిజర్వ్‌డ్ టికెటింగ్ సిస్టమ్ కౌంటర్లలో ఇవి అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

హలో.. మంత్రిగారు ఫైల్ అడిగారు!

హెచ్‌ఎండీఏ ప్లానింగ్ అధికారులకు శివబాలకృష్ణ ఫోన్ ఆదేశాలు.. బెదిరింపులు



- అలా తెప్పించుకునే దస్త్రాలకు.. 'ప్లానింగ్' ప్రమేయం లేకుండా పర్మిషన్లు
- ఏసీబీ విచారణలో హెచ్‌ఎండీఏ అధికారుల వెల్లడి

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): "హలో.. మంత్రిగారు ఫోన్ చేశారు..! మీ దగ్గర ఏదో పర్మిషన్ ఫైల్ పెండింగ్‌లో పెట్టారట. వెంటనే ఆ ఫైల్‌ను తీసుకుని, నా దగ్గరకు రండి".. ఇదీ హెచ్‌ఎండీఏ డైరెక్టర్ హోదాలో శివబాలకృష్ణ జోనల్ ప్లానింగ్ అధికారులకు ఫోన్‌లో ఆదేశాలు జారీచేస్తూ.. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీల పేరు చెప్పి.. బెదిరింపులకు దిగే తీరు..! 2021-23 మధ్య కాలంలో శివబాలకృష్ణ తన పరిధిలోని అధికారులను డమ్మీలుగా చేసి.. అంతా తానై చూసుకునేవాడని అవినీతి నిరోధక శాఖ(ఏసీబీ) గుర్తించింది. శివబాలకృష్ణ అరెస్టయ్యాక.. రెరా కార్యాలయంలో జరిపిన సోదాల్లో హెచ్‌ఎండీఏ అనుమతుల ఫైళ్లు కూడా లభించడంతో రెండ్రోజులుగా అమీర్‌పేట స్వర్ణజయంతి కాంప్లెక్స్‌లోని హెచ్‌ఎండీఏ కార్యాలయంలో అధికారులను విచారిస్తున్నారు. ఈ విచారణలో ఆసక్తికరమైన అంశాలు వెలుగులోకి వచ్చాయి.

అప్పట్లో మేము డమ్మీలమే..!

శివబాలకృష్ణ తమకు ఫోన్లలో ఎలా ఆదేశాలు ఇచ్చేవారు? ఫైళ్లను ఎలా తెప్పించుకునేవారు? సాంకేతికంగా తాము ఆపిన ఫైళ్లకు ఆయన అనుమతులు ఇచ్చే తీరును హెచ్‌ఎండీఏ అధికారులు ఏసీబీకి పూసగుచ్చినట్లు చెప్పినట్లు సమాచారం. "ఏవైనా బడా ప్రాజెక్టులు, లేఅవుట్లలో లోపాలుంటే.. అలాంటి ఫైళ్లను హోల్డ్‌లో పెట్టి, సరిచేసుకునే అవకాశాలు ఇవ్వొచ్చు. అలా పెండింగ్‌లో ఉన్న కొన్ని ఫైళ్ల విషయంలో శివబాలకృష్ణ సార్ ఫోన్ చేసేవారు. మంత్రిగారు ఫోన్ చేశారని, వెంటనే ఆ ఫైళ్లను తనకు పంపాలని ఆదేశించేవారు. కొన్ని సందర్భాల్లో మమ్మల్ని కూడా పిలిపించేవారు. ఆ ఫైళ్లలో మేము ఎలాంటి ఫైల్‌నోట్ రాసేవారిమి కాదు. అయితే.. శివబాలకృష్ణ సార్ మాత్రం.. అనుమతులు ఇవ్వాలంటూ నోట్ రాసేవారు. ఒక్కోసారి ఆయన కార్యాలయం నుంచే అనుమతులు ఇచ్చేవారు. ఇలా కొన్ని సందర్భాల్లో మేము డమ్మీలుగా ఉండేవారిమి" అని పలువురు టౌన్‌ప్లానింగ్ అధికారులు ఏసీబీకి వివరించినట్లు తెలిసింది. సోమవారం 26 మంది ఏసీబీ అధికారులు.. మంగళవారం మరో 10 మంది హెచ్‌ఎండీఏలో విచారణ జరిపారు. పలు దస్త్రాలను తనిఖీ చేశారు. శివబాలకృష్ణ రికమండ్ చేసిన పలు అనుమతులపై ఆరా తీశారు. ఉదయం 10 నుంచి రాత్రి 7 గంటల వరకు ఏసీబీ అధికారుల సోదాలు జరిగాయి.

ఆ మూడేళ్ల ఫైళ్లపైనే ఫోకస్

శివబాలకృష్ణ హెచ్‌ఎండీఏ డైరెక్టర్‌గా ఐదేళ్లకు పైగా పనిచేశారు. అయితే.. 2021-23 మధ్య కాలంలో జారీ అయిన అనుమతులపైనే ఏసీబీ అధికారులు దృష్టి సారించారు. ఆ మూడేళ్లలో శంకర్‌పల్లి, శంషాబాద్, ఘట్‌కేసర్ జోన్లలో జారీ అయిన భవనాల అనుమతులు, లేఅవుట్ల పర్మిషన్లు, చేంజ్ ఆఫ్ ల్యాండ్ యూజ్(నాలా మార్పిడి) జారీకి సంబంధించిన దస్త్రాలకు శల్యపరీక్షలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో ఘట్‌కేసర్ జోన్ పరిధిలో 2021లో జారీ అయిన 18 ముఖ్యమైన అనుమతులు, 2022లో 21 పర్మిషన్లు, 2023లో జారీ అయిన 19 దస్త్రాలపై ఆరా తీశారు. ఇక శంకర్‌పల్లి, శంషాబాద్ జోన్లలో ఈ మూడేళ్లలో 100కు పైగా అనుమతులను ఏసీబీ పరిశీలిస్తున్నట్లు సమాచారం. ఈ అనుమతుల విషయంలో శివబాలకృష్ణ రాసిన రిపోర్టులు/నోట్‌లు, ఆయన సంతకాలను ఏసీబీ సేకరించినట్లు తెలిసింది. ఏసీబీ అధికారులు ఆయా దస్త్రాలను స్కాన్‌చేసి, డిజిటల్ రూపంలో ఆధారాలుగా భద్రపరచనున్నారు.

శివబాలకృష్ణ సోదరుడి అరెస్టు

హైదరాబాద్, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): శివబాలకృష్ణ సోదరుడు శివనవీన్‌కుమార్‌ను ఏసీబీ అధికారులు మంగళవారం అరెస్టు చేశారు. శివబాలకృష్ణకు అతను బినామీగా ఉన్నట్లు ఏసీబీ గుర్తించింది. నవీన్ తరఫున బాలకృష్ణ పెట్టుబడులు పెట్టినట్లు ఆధారాలను సేకరించింది. "శివబాలకృష్ణ అక్రమ సంపాదనను దారి మళ్లించడంలో నవీన్ కీలకంగా వ్యవహరించారు. అతణ్ని మూడ్రోజులపాటు విచారించాం. మంగళవారం అరెస్టు చేశాం" అని ఏసీబీ వర్గాలు వివరించాయి. నవీన్‌ను కస్టడీలోకి తీసుకుని, విచారిస్తే.. మరిన్ని విషయాలు వెలుగులోకి వస్తాయని అధికారులు భావిస్తున్నారు. శివబాలకృష్ణకు బినామీలుగా వ్యవహరించారనే అనుమానాలతో పలువురు బంధుమిత్రులకు కూడా నోటీసులు పంపినట్లు సమాచారం. దీంతో.. మరికొందరి అరెస్టులు తప్పవని తెలుస్తోంది. మరోవైపు.. శివబాలకృష్ణ పోలీసు కస్టడీ బుధవారంతో ముగియనుంది. మరో ఐదు రోజులపాటు అతణ్ని కస్టడీకి ఇవ్వాలని ఏసీబీ అధికారులు కోర్టును ఆశ్రయించనున్నట్లు తెలిసింది.

శివబాలకృష్ణ పంపిన ఎస్సెమ్మెస్‌లు

ఏసీబీ విచారణ సందర్భంగా కొన్ని దస్త్రాలకు పర్మిషన్లు ఇవ్వాలంటూ తమకు శివబాలకృష్ణ పంపిన సందేశాలను కొందరు టౌన్‌ప్లానింగ్ అధికారులు చూపించినట్లు తెలిసింది. కొన్ని మెసేజ్‌లలో శివబాలకృష్ణ బెదిరింపు ధోరణితో హుకుం జారీ చేశారని ఏసీబీ గుర్తించింది. వాటిని కూడా డిజిటల్ ఆధారాలుగా సేకరించింది. "ఆయన మా పైఅధికారి కావడం వల్ల మేము ఫైళ్లను తీసుకెళ్లాం. సాంకేతికంగా దస్త్రాల్లో సమస్యలున్నా.. కాదనలేకపోయాం" అని టౌన్‌ప్లానింగ్ అధికారులు వివరించినట్లు సమాచారం.

బదిలీ అయినా.. పాత తేదీలతో..

గత ఏడాది జూలై 12న రాష్ట్ర ప్రభుత్వం శివబాలకృష్ణను హెచ్‌ఎండీఏ నుంచి బదిలీ చేసింది. రెరా కార్యదర్శిగా, మెట్రో సీజీఎంగా నియమించింది. అయితే.. శివబాలకృష్ణ మాసాబ్ ట్యాంక్‌లోని డీటీసీపీ భవనంలో రెరా సెక్రటరీగా బాధ్యతలను నిర్వర్తిస్తూనే.. హెచ్‌ఎండీఏ టౌన్‌ప్లానింగ్ అధికారులకు మంత్రుల పేరుతో బెదిరించడాన్ని కొనసాగించారు. హెచ్‌ఎండీఏ నుంచి బదిలీ అయినా.. పలు దరఖాస్తులు/దస్త్రాలను తెప్పించుకుని, వాటికి పాత తేదీలతో అనుమతులు ఇచ్చేవాడని ఏసీబీ నిగ్గుతేల్చింది. ఈ కోవలో పలు బహుళ అంతస్తుల భవనాలు, డ్రాఫ్ట్/ఫైనల్ లేఅవుట్లు ఉన్నట్లు హెచ్‌ఎండీఏ అధికారులు ఏసీబీకి చెప్పినట్లు తెలిసింది. తాము సంతకాలు చేయకున్నా.. శివబాలకృష్ణ హెచ్‌ఎండీఏలో లేకున్నా.. ఏకపక్షంగా అనుమతులు ఇచ్చేవాడని అధికారులు వాంగ్మూలమిచ్చినట్లు సమాచారం.

దళారులెందరున్నారు?

కొందరు రియల్టర్లు, డెవలపర్లు దళారుల సాయంతో శివబాలకృష్ణను కలిసి, పనులు చేయించుకునేవారని ఏసీబీ గుర్తించింది. ఈ క్రమంలో జోన్ల వారీగా దళారులు ఎవరెవరున్నారు? అనే కోణంపై దృష్టి సారించింది. ఈమేరకు హెచ్‌ఎండీఏ అధికారులను కూడా విచారించినట్లు తెలిసింది. శివబాలకృష్ణ కాల్ డేటా ఆధారంగా దళారులను గుర్తించే అవకాశాలున్నట్లు తెలుస్తోంది.

అంతర్జాతీయ డ్రగ్స్ స్మగ్లర్ స్టాన్లీ అరెస్ట్

- 50 రోజులపాటు అతడి కదలికలను పసిగట్టి పట్టుకున్న టీన్యాబ్, పంజగుట్ట పోలీసులు

పంజగుట్ట/హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా మాదకద్రవ్యాలు సరఫరా చేస్తున్న అంతర్జాతీయ డ్రగ్స్ కింగ్ పిన్ ఉవాల ఉడొక స్టాన్లీ (43)కి టీఎస్ న్యాబ్ (తెలంగాణ స్టేట్ యాంటీ నార్కొటిక్స్ బ్యూరో), పంజగుట్ట పోలీసులు చెక్ పెట్టారు. సుమారు 50 రోజుల పాటు ఆపరేషన్ నిర్వహించి.. వివిధ రూపాల్లో అతడి కదలికలు గమనించి ఎట్టకేలకు అరెస్టు చేశారు. అతని వద్ద రూ.8 కోట్ల విలువ చేసే 557 గ్రాముల కొకైన్, 902 ఎక్స్‌టసీ మాత్రలు, 105 ఎల్ఎస్డీ బ్లాట్స్, 215 గ్రాముల ఛరస్, 21 గ్రాముల హెరాయిన్, 7 గ్రాముల యాంఫిటమిన్, 45 గ్రాముల ఓజీ వీడ్, 190 గ్రాముల వీడ్, 8 సెల్‌ఫోన్లు, 5.40 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. ఇటీవలి కాలంలో మన పోలీసులు ఇంత పెద్ద మొత్తంలో డ్రగ్స్ స్వాధీనం చేసుకోవడం ఇదే మొదటి సారి. కాగా.. అతనికి నైజీరియాలో డ్రగ్స్ తయారీదారులతో నేరుగా సంబంధాలు ఉన్నట్టు సమాచారం. అలాగే.. దేశవ్యాప్తంగా 500 మందితో నెట్‌వర్క్ ఏర్పాటు చేసుకున్నట్టు తెలిసింది. ఆ 500 మందిలో నగరానికి చెందినవారు ఏడుగురున్నారు. పంజగుట్ట పీఎస్‌లో మంగళవారం విలేకరుల సమావేశంలో పోలీసులు ఈ కేసు వివరాలు వెల్లడించారు. వారు చెప్పిన వివరాల ప్రకారం.. నైజీరియాకు చెందిన స్టాన్లీ 2009లో వ్యాపార వీసా మీద భారతదేశానికి వచ్చాడు. ముంబై అంధేరీలో జెవెల్ అనే వ్యక్తి వద్ద షెల్టర్ తీసుకుని తొలుత దుస్తుల వ్యాపారం చేశాడు. తర్వాత గోవాలోని కండోలిమ్ ప్రాంతానికి మకాం మార్చాడు. అక్కడే అతడికి మాదకద్రవ్యాలు అలవాటయ్యాయి. డ్రగ్స్ విక్రయంతో డబ్బు సులభంగా సంపాదించవచ్చని అర్థం కావడంతో.. స్థానికంగా నైజీరియన్స్ వద్ద డ్రగ్స్ కొనుగోలు చేసి కండోలిమ్ ప్రాంతానికి వచ్చే పర్యాటకులకు అధిక ధరలకు విక్రయించేవాడు. క్రమంగా నైజీరియాలో డ్రగ్స్ ముఠాలతో నేరుగా సంబంధాలు పెట్టుకుని.. ఘరానా స్మగ్లర్‌గా మారాడు.

అరకిలో ముడిసరుతో 3 కిలోల డ్రగ్స్..

నైజీరియాలో మాదకద్రవ్యాలను ఉత్పత్తి చేసే వారితో పరిచయాలు పెంచుకున్న స్టాన్లీ.. అక్కడి నుంచే నేరుగా వివిధ మార్గాల్లో ముడి సరుకును దేశానికి తెప్పించే వాడు. అరకిలో ముడిసరుకుతో మూడు కిలోల డ్రగ్స్‌ను తయారు చేసేవాడు. దేశవ్యాప్తంగా ఉన్న తన నెట్‌వర్క్‌లోని 500 మంది ద్వారా ఆ డ్రగ్స్‌ని విక్రయించేవాడు. ఈ క్రమంలో 2012లో గోవాలోని మాపుసా పోలీసులకు చిక్కి జైలుకు వెళ్లాడు. ఆ తర్వాత కొద్దిరోజులు డ్రగ్స్‌కు విరామం ఇచ్చి కిరాణా దుకాణం ప్రారంభించాడు. కానీ అది మూణ్నాళ్ల ముచ్చటే అయ్యింది. మళ్లీ డ్రగ్స్ దందా మొదలుపెట్టాడు. ఇటీవల టీన్యాబ్ ఎస్ఆర్‌నగర్ పోలీసులు ముంబైకి చెందిన బాబూసో దివాకర్ అలియాస్ బాబును అరెస్టు చేశారు. అతణ్ని విచారించగా స్టాన్లీ పేరు బయటకు వచ్చింది. దాంతో వారు ప్రత్యేక టీమ్‌ను గోవాకు పంపారు. అక్కడ 50 రోజుల పాటు మకాం వేసిన పోలీసులు సాంకేతిక ఆధారాలతో స్టాన్లీని గుర్తించారు. అతడు డ్రగ్స్ సప్లై చేయడానికి హైదరాబాద్‌కు వచ్చిన విషయం తెలుసుకున్నారు. ఎర్రమంజిల్ ప్రాంతంలో అతడిని అరెస్టు చేశారు. స్టాన్లీని లోతుగా విచారించి మరింతమంది స్మగ్లర్స్ వివరాలు తెలుసుకుంటామని.. డీసీపీ విజయ్‌కుమార్ వెల్లడించారు.

కునుకు కరువాయె

దేశంలో అబ్‌స్ట్రక్టివ్ స్లీప్ అప్నియా బాధితులు 10 కోట్లు



- పురుషులలోనే బాధితులు అధికం.. ఢిల్లీ ఎయిమ్స్ అధ్యయనం
- హైదరాబాద్‌లోనూ కేసులు పెరుగుతున్నాయ్: నిపుణులు
- ఒత్తిడితోనే అధిక సమస్య, సాంకేతికత కూడా కారణం

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): దేశంలో నాణ్యమైన ఆహారం తీసుకుంటున్నవారు ఎక్కువే ఉండొచ్చు కానీ, నాణ్యమైన నిద్ర పోతున్నవారు ఎందరు ఉంటారంటే చెప్పడం అనుమానమే! ఎంతసేపు మంచం మీద ఉంటున్నాం అని కాదు.. ఎంత నాణ్యమైన నిద్ర పోయారనేది ముఖ్యమనేది వైద్య నిపుణుల మాట. రోజుకు నాలుగు గంటలు మాత్రమే నిద్ర పోతామని చెబుతున్న వారు హార్మోన్ల లోపాలతో బాధపడుతుంటారని పేర్కొంటున్నారు. నిద్ర లేమితో బాధపడేవారికి రక్తపోటు, గుండెజబ్బులు, ఒబేసిటీ, అర్థ్రైటిస్, మధుమేహం వంటి ఎన్నో ఆరోగ్య సమస్యలు కూడా వస్తాయని చెబుతున్నారు. నాణ్యమైన నిద్ర కనీసం ఆరు గంటలైనా కావాల్సిందేనని సూచిస్తున్నారు. కాగా, ఈ అంశానికి సంబంధించి ఢిల్లీ ఎయిమ్స్ పరిశోధకులు చేసిన అధ్యయనం ప్రస్తుత పరిస్థితిని చాటుతోంది. దేశంలో 10.4 కోట్లమంది అబ్‌స్ట్రక్టివ్ స్లీప్ అప్నియా (ఓఎస్ఏ)తో బాధపడుతున్నారని వారు తేల్చారు. వీరిలో పురుషులు 13% అని.. స్త్రీలు 5% అని వెల్లడించారు. ఈ వివరాలు స్లీప్ మెడిసన్ రివ్యూ జర్నల్‌లో ప్రచురితమయ్యాయి. దేశంలో అతి ప్రధానమైన ప్రజారోగ్య సమస్యగా ఓఎస్ఏ మారుతుందని ఎయిమ్స్ పరిశోధకులు చెబుతున్నారు. అత్యంత తీవ్రమైన అనారోగ్య పరిస్థితులు కూడా ఎదురవుతాయని హెచ్చరిస్తున్నారు. మరోవైపు స్లీప్ ఫౌండేషన్ నివేదికల ప్రకారం 90% మంది తమ నిద్రను పెంచుకోవాలనుకుంటుంటే, 48% మాత్రమే ఆ ప్రయత్నంలో విజయం సాధించారని, 56% మంది అతి అరుదుగా మాత్రమే నిద్రపై దృష్టిసారిస్తున్నామని చెబుతున్నారట. "ప్రశాంతంగా నిద్రపోవడానికి నేటి తరానికి ఎన్నో అడ్డంకులున్నాయి. ఒత్తిడి మొదటి కారణమైతే, ఎలక్ట్రానిక్ గ్యాడ్జెట్స్, ఎంటర్‌టైన్‌మెంట్, సోషలైజింగ్‌తో పాటుగా సౌకర్యవంతమైన పడక లేకపోవడం మరో కారణం. ఈ నేపథ్యంలోనే హైదరాబాద్‌లో ఓఎస్ఏ కేసులు బాగా పెరుగుతున్నాయి" అని వివరించారు పల్మనాలజిస్ట్ డాక్టర్ ప్రభాకర్.

నిద్రలేమిని గుర్తించడం ఎలాగంటే?

ముఖంలో అలసట, కళ్ల కింద వలయాలు, కనురెప్పలను పూర్తిగా తెరవని పరిస్థితి ద్వారా ఒక వ్యక్తి సరిగా నిద్రపోతున్నదీ, లేనిది తెలుసుకోవచ్చు. నిద్ర లేమి బాధితులు చురుగ్గా ఉండలేరు. ఉదయం లేచిన తరువాత కూడా అలసటగా ఉంటారు. చర్మం పొడిబారడం, దురదలు రావడం వంటి సమస్యలూ ఎదుర్కొంటారు. తరచూ అనారోగ్యానికి గురయ్యే అవకాశాలూ ఉన్నాయి. ఏకాగ్రత చూపకపోవడం, పగటి పూట నిద్రపోవడం, అధికంగా ఆహారం తీసుకోవడం వంటివన్నీ నిద్రలేమికి నిదర్శనాలని నిపుణులు చెబుతున్నారు.

సుఖ నిద్రకు ఎన్ని అడ్డంకులో..

ఆహారం లేకుండా ఆరోగ్యవంతమైన వ్యక్తి 40 రోజులు బతకగలడేమో కానీ, నిద్ర పోకుండా గరిష్ఠంగా 11 రోజులు మాత్రమే జీవించగలడు. అయితే, ఇప్పుడు వయసులతో సంబంధం లేదు. సుఖ నిద్రకు ఎన్నో అవరోధాలు. ఓటీటీల్లో సినిమాలు, మొబైల్ ఫోన్లో సోషల్ మీడియా.. వీటిలో ఏదో ఒక దానితో రాత్రిళ్లు కాలక్షేపం చేయాల్సిందే. వాటి కారణంగా కంటి నిండా నిద్ర ఉండడం లేదు. ఇక టీనేజర్లు పరీక్షల ఒత్తిడితో నిద్రను త్యాగం చేస్తుంటారు. ఓ విధంగా చెప్పాలంటే సరిగా నిద్రపోతున్న యూత్ పెద్దగా కనిపించడం లేదిప్పుడు. జర్నల్ ఆఫ్ చైల్డ్ సైకాలజీ అండ్ సైకియాట్రీలో ప్రచురితమైన ఓ అధ్యయనమైతే యువత నిరాశలో కూరుకుపోవడానికి నిద్రలేమి కూడా ఓ కారణమని పేర్కొంది. టీనేజర్లకు కనీసం 8.5-10 గంటల నిద్ర అవసరమని స్పష్టం చేసింది.

నాణ్యమైన నిద్ర కోసం ఏం చేయాలంటే

'మనిషికి నిద్ర అవసరం. అది విలాసం కాదని గుర్తించాలి. కనీసం 8 గంటలు నిద్రపోవడానికి ప్రయత్నించాలి' అంటున్నారు మాగ్నిఫ్లెక్స్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ ఆనంద్ నిచానీ. "కంప్యూటర్, స్మార్ట్ ఫోన్ (డిజిటల్ డిటాక్స్) వంటివాటిని పక్కమీదకు తీసుకురావొద్దు. కనీసం గంట ముందే వాటికి దూరంగా ఉండాలి. పుస్తకాలు చదవడం, ధ్యానం చేయడం మంచిది. సరైన నిద్ర కావాలంటే సరైన వాతావరణం కూడా ఉండాలి. నాణ్యమైన పరుపులు, దిండ్లను ఎంచుకోవాలి. హెవీ మీల్స్ తినకూడదు. పక్క మీదకు వెళ్లేముందు కెఫిన్, నికోటిన్ అసలు తీసుకోకూడదు. పగటి వేళ నీరు ఎక్కువ తాగాలి.

షికాగోలో నగర యువకుడిపై దాడి, దోపిడీ

- తీవ్ర గాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితుడు

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): అమెరికాలోని షికాగో నగరంలో చదువుతున్న నగర యువకుడు సయ్యద్ మజర్ అలీపై అక్కడ దుండగులు దాడి చేసి దోపిడీకి పాల్పడ్డారు. అతను నివసించే అపార్టుమెంట్ సమీపంలోనే వెంబడించిన ముగ్గురు దోపిడీ దొంగలు... అతని ముఖంపై పిడిగుద్దులతో దాడి చేసి డబ్బు, ఇతర వస్తువులు దోచుకుని పారిపోయారు. ఇదంతా సీసీ కెమెరాల్లో రికార్డయ్యింది. తీవ్ర గాయాలపాలైన ఆ యువకుడు రక్తపు మడుగులో పడి ఉండటాన్ని గమనించిన కొందరు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. నగరంలోని లంగర్‌హౌజ్ హషీమ్ నగర్‌లో నివసిస్తున్న అతని తల్లి, భార్య ఈమేరకు వివరాలు వెల్లడించారు. లంగర్‌హౌజ్‌కు చెందిన సయ్యద్ మజర్ అలీ యూఎస్‌లోని ఇండియానా వెస్లియాన్ యూనివర్సిటీలో మాస్టర్స్ ఇన్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ చదువుతున్నాడు. ఈ నెల 4న మజర్ అలీ భార్య రుఖయ్యా ఫాతిమాకు యూఎస్‌లోని ఆమె భర్త స్నేహితుడు ఫోన్ చేసి దాడి గురించి వివరించాడు. అక్కడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడని... కోలుకుంటున్నాడని వివరించాడు. వెంటనే వీడియో కాల్ ద్వారా భర్తను పరామర్శించిన ఆమె మాట్లాడటానికి ప్రయత్నించినా అతను మాట్లాడలేకపోయాడు. అతనికి వైద్య సాయం అందించాలని.. అతడి కాంటాక్ట్ నెంబరు, ఇతర వివరాలతో ఫాతిమా విదేశాంగ శాఖ మంత్రి జైశంకర్‌కు మంగళవారం మెయిల్ పంపారు.



గాయపడిన సయ్యద్ మజర్ అలీ

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., printed at Aamoda Press, H.No.5-9-287/10 & 11, Plot No. 53 & 54, Prasanth Towers, Rajeev Gandhi Nagar, Moosapet, Kukatpally (Mandal), Kukatpally Municipality, Ranga Reddy District and Published at Plot No.76, Ashwini Layout, Huda Heights, Road No.70, Jubilee Hills, Hyderabad-500033. Editor: K. Srinivas. Fax No. 23558288, Phone No: 23558233 / 44 / 55, Regd. No.H/HD 674, RNI No.44903 / 86. Managing Director: Vemuri Radha Krishna, Founder: K.L.N.Prasad.

SCHOLARSHIP ALERT

Inlaks Shivdasani Scholarships

Description: Inlaks Shivdasani Scholarships 2024 is a merit-based opportunity offered by the Inlaks Shivdasani Foundation (a non-profit organisation), to Indian students pursuing postgraduate studies at European, American, and UK universities abroad.
Eligibility: Open for an Indian passport holders who have a first-class or equivalent degree from recognised Indian universities/institutions. Students must have scored 65% in the Arts related subjects and 70% in Maths and Science related subjects. Applicants must be proficient in English and have received a valid deferred offer letter for the current academic year.
Prizes & Rewards: A maximum of USD 1,00,000 and other benefits (one-time)
Last Date: 22-03-2024 ***Application:*** Online Only
Short Url: www.b4s.in/aj/INLAKS1

JN Tata Endowment Loan Scholarship for Fall 2024 to Spring 2025

Description: The J N Tata Endowment invites loan scholarship applications from Indian students who wish to pursue higher studies overseas. Students who are selected for the loan scholarship may be recommended for a partial 'Travel Grant' and a 'Gift Award' which is linked to their academic performance in their overseas studies at the sole discretion of the Trustees of the concerned Trusts.
Eligibility: Open for Indian citizens who have completed at least one undergraduate degree OR students who are in the final year of any undergraduate programme at a recognised university/college/institution in India. • Candidates must be interested to pursue Postgraduate/Doctoral/Postdoctoral studies abroad.
• Candidates who are at the end of the 1st year and entering into the second year of their overseas studies (Fall 2024 – Spring 2025) are also eligible to apply. This is applicable only if the minimum duration of the course is 2 years and there is at least one full academic year remaining to complete at the time of award of the loan scholarship, which is normally by July of any calendar year.
• Candidates must have scored at least 60% marks on average in their undergraduate or postgraduate studies. • Candidates must not be older than 45 years as on June 30, 2024.
Prizes & Rewards: Loan scholarship of up to Rs. 10 lakhs ***Last Date to Apply:*** 15-03-2024
Application mode: Online applications only
Short Url: www.b4s.in/aj/JNT8

Disha Scholarship Program

Description: An initiative of Birlasoft to offer financial assistance and support to individuals, facilitating their educational pursuits and ensuring the successful completion of their academic journey.
Eligibility: Only Female students
• Students domiciled in Delhi-NCR or Pune enrolled in the first year of General/Professional Undergraduate courses at premier NIRF institutions or accredited universities and colleges across India.
• Candidates must have scored 65% in aggregate or an equivalent CGPA in the Grade 12 board examination from Delhi-NCR and Pune in 2023.
• The annual family income of the applicants from all sources must not exceed INR 5 lakh.
• Applicants must fall within the age bracket of 17 to 29 years at the time of submitting their applications.
Prizes & Rewards: Up to INR 25,000 annually
Last Date to Apply: 15-03-2024
Application mode: Online applications only
Short Url: www.b4s.in/aj/SSPSP1

buddy4study.com



ఆంధ్రజ్యోతి
దిక్సూచి
హైదరాబాద్ • బుధవారం 7 ఫిబ్రవరి 2024
diksuchi@andhrajyothy.com

ఐఐఎస్సీలో పీజీ, పీహెచ్‌డీ

బెంగళూరులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ (ఐఐఎస్సీ)- పీజీ, పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఎంటెక్, ఎండిజైన్, ఎంమేనేజ్‌మెంట్, ఎమ్మెస్సీ, పీహెచ్‌డీ, ఇంటిగ్రేటెడ్ పీహెచ్‌డీ, ఎంటెక్ (రీసెర్చ్) ప్రోగ్రామ్‌లు అందుబాటులో ఉన్నాయి.

రీసెర్చ్ ప్రోగ్రామ్‌లు

పీహెచ్‌డీ ఇన్ సైన్స్ స్పెషలైజేషన్స్: ఆస్ట్రానమీ అండ్ ఆస్ట్రో ఫిజిక్స్, బయో కెమిస్ట్రీ, ఎకోలాజికల్ సైన్సెస్, హై ఎనర్జీ ఫిజిక్స్, ఇనార్గానిక్ అండ్ ఫిజికల్ కెమిస్ట్రీ, మెటీరియల్స్ రీసెర్చ్, మేథమెటిక్స్, మైక్రో బయాలజీ అండ్ సెల్ బయాలజీ, మాలిక్యులర్ బయో ఫిజిక్స్, డెవలప్‌మెంటల్ బయాలజీ అండ్ జెనెటిక్స్, న్యూరో సైన్సెస్, ఆర్గానిక్ కెమిస్ట్రీ, ఫిజిక్స్, సాలిడ్ స్టేట్ అండ్ స్ట్రక్చరల్ కెమిస్ట్రీ, ఇన్‌స్ట్రుమెంటేషన్ అండ్ అప్లయిడ్ ఫిజిక్స్.

పీహెచ్‌డీ ఇన్ ఇంటర్ డిసిప్లినరీ స్పెషలైజేషన్స్: బయో ఇంజనీరింగ్, ఎనర్జీ, మేథమెటికల్ సైన్సెస్, వాటర్ రీసెర్చ్, సైబర్ ఫిజికల్ సిస్టమ్స్, క్లయిమేట్ ఛేంజ్, బ్రెయిన్ కంప్యూటేషన్ అండ్ డేటా సైన్స్.

పీహెచ్‌డీ ఇన్ ఇంజనీరింగ్/ఎంటెక్(రీసెర్చ్) స్పెషలైజేషన్స్: ఏరోస్పేస్, అట్మాస్పిరిక్ అండ్ ఓషనిక్ సైన్సెస్, కెమికల్, సివిల్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఆటోమేషన్, ఎర్త్ సైన్సెస్, ఎలక్ట్రికల్ కమ్యూనికేషన్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్ సిస్టమ్స్, మేనేజ్‌మెంట్ స్టడీస్, మెటీరియల్స్ ఇంజనీరింగ్, మెకానికల్, నానో సైన్స్ అండ్ ఇంజనీరింగ్, డిజైన్ అండ్ మాన్యుఫాక్చరింగ్, సస్టయినబుల్ టెక్నాలజీస్, కంప్యూటేషనల్ అండ్ డేటా సైన్సెస్.

అర్హత: బీఈ/బీటెక్/బీఫార్మసీ/నాలుగేళ్ల బీఎస్సీ/ఎంబీబీఎస్ ఉత్తీర్ణులు; మాస్టర్స్ డిగ్రీ(సైన్స్/ఎకనామిక్స్/జాగ్రఫీ/సైకాలజీ/మేనేజ్‌మెంట్/కామర్స్/ఆపరేషన్స్ రీసెర్చ్/కంప్యూటర్ సైన్స్/కంప్యూటర్ అప్లికేషన్స్/ఇంజనీరింగ్/టెక్నాలజీ/ఆర్కిటెక్చర్/అగ్రికల్చర్/ఫార్మసీ/వెటర్నరీ సైన్సెస్)/ఎంబీఏ/ఎండీ ఉత్తీర్ణులు అప్లయ్ చేసుకోవచ్చు. నెట్ జేఆర్ఎఫ్/జీప్యాట్/గేట్ వ్యాలిడ్ స్కోర్ తప్పనిసరి.

ఎంపిక: నెట్ జేఆర్ఎఫ్/గేట్/జీప్యాట్ స్కోర్ ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

ఇంటిగ్రేటెడ్ పీహెచ్‌డీ

స్పెషలైజేషన్‌లు: బయలాజికల్ సైన్సెస్, కెమికల్ సైన్సెస్, మేథమెటికల్ సైన్సెస్, ఫిజికల్ సైన్సెస్

అర్హత: ప్రథమ శ్రేణి మార్కులతో బీఈ/బీటెక్ లేదా సంబంధిత సబ్జెక్టులతో బీఎస్సీ డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. జామ్ 2024(బయోటెక్నాలజీ/ కెమిస్ట్రీ/మేథమెటిక్స్/ఫిజిక్స్)/జెస్ట్ 2024 స్కోర్ తప్పనిసరి.

ఎంపిక: జామ్/జెస్ట్ స్కోర్ ఆధారంగా షార్ట్‌లిస్ట్ చేసిన అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించి అర్హులకు ప్రవేశాలు కల్పిస్తారు.

ఎక్స్‌టర్నల్ రిజిస్ట్రేషన్(పీహెచ్‌డీ/ఎంటెక్ రీసెర్చ్)

- ఆర్ అండ్ డీ సంస్థలు, ఇండస్ట్రీస్‌కు చెందిన వర్కింగ్ ప్రొఫెషనల్స్ కోసం ఈ ప్రోగ్రామ్‌లను ఉద్దేశించారు. ఇంజనీరింగ్, అగ్రికల్చరల్, ఫార్మాస్యూటికల్, వెటర్నరీ, మెడికల్ విభాగాలకు సంబంధించిన ప్రభుత్వ/ప్రైవేట్ ఫ్యాకల్టీ మెంబర్లు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. కనీసం రెండేళ్ల అనుభవం ఉండాలి. సీఎస్ఐఆర్ యూజీసీ నెట్ జేఆర్ఎఫ్/ యూజీసీ నెట్ జేఆర్ఎఫ్/డీబీటీ జేఆర్ఎఫ్/ఐసీఎంఆర్ జేఆర్ఎఫ్/గేట్/ఎన్‌బీహెచ్ఎం అర్హత ఉండాలి. ఇంటర్వ్యూ ఆధారంగా అడ్మిషన్స్ ఇస్తారు.

ఎంటెక్

స్పెషలైజేషన్స్: ఏరోస్పేస్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, సివిల్ ఇంజనీరింగ్, మెటీరియల్స్ ఇంజనీరింగ్, సస్టయినబుల్ టెక్నాలజీస్, బయో ఇంజనీరింగ్, ఎర్త్ అండ్ క్లయిమేట్ సైన్సెస్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్ ప్రొడక్ట్ డిజైన్, ఎలక్ట్రానిక్ సిస్టమ్స్ ఇంజనీరింగ్, ఇన్‌స్ట్రుమెంటేషన్ సిస్టమ్స్, మెకానికల్ ఇంజనీరింగ్, మైక్రో ఎలక్ట్రానిక్స్ అండ్ వీఎల్ఎస్ఐ డిజైన్, మొబిలిటీ ఇంజనీరింగ్, క్వాంటం టెక్నాలజీ, రోబోటిక్స్ అండ్ అటానమస్ సిస్టమ్స్, సెమీకండక్టర్ టెక్నాలజీ, సిగ్నల్ ప్రాసెసింగ్, స్మార్ట్ మాన్యుఫాక్చరింగ్, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, కెమికల్ ఇంజనీరింగ్, కంప్యూటేషనల్ అండ్ డేటా సైన్సెస్.

అర్హత: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ద్వితీయ శ్రేణి మార్కులతో బీఈ/బీటెక్/బీఆర్క్/ఏఎంఐఈ లేదా మాస్టర్స్ డిగ్రీ (ఫిజికల్ సైన్సెస్/మేథమెటిక్స్/స్టాటిస్టిక్స్/జియాలజీ/ఇన్‌స్ట్రుమెంటేషన్/ఎలక్ట్రానిక్స్/కంప్యూటర్ అప్లికేషన్స్) ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. గేట్(2022/2023/2024) స్కోర్ తప్పనిసరి.

ఎంపిక: ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, కెమికల్ ఇంజనీరింగ్, కంప్యూటేషనల్ అండ్ డేటా సైన్సెస్ విభాగాలకు రాత పరీక్ష ఉంటుంది. గేట్ స్కోర్‌కు 70 శాతం, రాత పరీక్షకు 30 శాతం వెయిటేజీ ఇస్తారు. మిగిలిన స్పెషలైజేషన్‌లకు గేట్ స్కోర్, ఇంటర్వ్యూల ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

ఎండిజైన్

అర్హత: ద్వితీయ శ్రేణి మార్కులతో డిగ్రీ(ఇంజనీరింగ్/టెక్నాలజీ/డిజైన్/ఆర్కిటెక్చర్) ఉత్తీర్ణతతోపాటు గేట్(2022/2023/2024) లేదా సీడ్ 2024 స్కోర్ ఉండాలి.

ఎంపిక: గేట్/సీడ్ స్కోర్ ఆధారంగా షార్ట్‌లిస్ట్ చేసిన అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించి మెరిట్ ప్రకారం అడ్మిషన్స్ ఇస్తారు. గేట్/సీడ్ స్కోర్‌కు 70 శాతం, ఇంటర్వ్యూ స్కోర్‌కు 30 శాతం వెయిటేజీ ఇస్తారు.

ఎమ్మెస్సీ

స్పెషలైజేషన్‌లు: లైఫ్ సైన్సెస్, కెమికల్ సైన్సెస్

అర్హత: లైఫ్ సైన్సెస్ విభాగానికి ప్రథమ శ్రేణి మార్కులతో డిగ్రీ (ఫిజికల్, కెమికల్, బయలాజికల్, వెటర్నరీ, అగ్రికల్చరల్, ఫార్మాస్యూటికల్ సైన్సెస్ లేదా బయోటెక్నాలజీ)/బీఈ/బీటెక్ ఉత్తీర్ణులై ఉండాలి. కెమికల్ సైన్సెస్ విభాగానికి బీఎస్సీ(కెమిస్ట్రీ) పూర్తిచేసి ఉండాలి. ఇంటర్ స్థాయిలో మేథమెటిక్స్ చదివి ఉండాలి. జామ్ 2024/గేట్ వ్యాలిడ్ స్కోర్ తప్పనిసరి.

ఎంపిక: కెమికల్ సైన్సెస్ విభాగానికి జామ్ 2024(కెమిస్ట్రీ) స్కోర్ ఆధారంగా అడ్మిషన్స్ ఇస్తారు. లైఫ్ సైన్సెస్‌లో ప్రవేశానికి జామ్ 2024/గేట్ (2022/2023/2024) స్కోర్ ఆధారంగా షార్ట్‌లిస్ట్ చేసిన అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించి మెరిట్ ప్రకారం అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

ఎంమేనేజ్‌మెంట్

అర్హత: ప్రథమ శ్రేణి మార్కులతో బీఈ/బీటెక్ ఉత్తీర్ణతతోపాటు గేట్(2022/2023/2024) లేదా క్యాట్ 2023 లేదా జీమ్యాట్ వ్యాలిడ్ స్కోర్ ఉండాలి.

ఎంపిక: జాతీయ పరీక్ష స్కోర్ ఆధారంగా షార్ట్‌లిస్ట్ చేసిన అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారు. గేట్/క్యాట్/జీమ్యాట్ స్కోర్‌కు 15 శాతం, అకడమిక్ ప్రతిభకు 15 శాతం, కమ్యూనికేషన్ స్కిల్స్‌కు 30 శాతం, ఇంటర్వ్యూ స్కోర్‌కి 40 శాతం వెయిటేజీ ఇస్తూ అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్, స్పాన్సర్డ్ అభ్యర్థులకు రూ.800; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.400
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** మార్చి 22
- **వెబ్‌సైట్:** https://iisc.ac.in/admissions

ఐఐటీ మద్రాస్‌లో స్పోర్ట్స్ కోటా

ప్రస్తుత విద్యా సంవత్సరం(2024-25) నుంచి అండర్ గ్రాడ్యుయేట్ కోర్సుల్లో స్పోర్ట్స్ కోటాను ప్రవేశపెడుతున్నట్లు ఐఐటీ మద్రాస్ ప్రకటించింది. ప్రతి డిగ్రీ కోర్సులో అదనంగా రెండు సీట్లను ఈ కోటా కింద ఏర్పాటు చేయనున్నారు. వీటిలో ఒక సీటును విద్యార్థినులకు ప్రత్యేకిస్తారు. ఈ సీట్లు పొందాలంటే అభ్యర్థులు జేఈఈ అడ్వాన్స్‌డ్(కామన్ ర్యాంక్ లిస్ట్/కేటగిరీ ర్యాంక్ లిస్ట్)లో అర్హత పొందడంతోపాటు గత నాలుగేళ్ల వ్యవధిలో జాతీయ/ అంతర్జాతీయ స్థాయి క్రీడాపోటీల్లో కనీసం ఒక మెడల్ సాధించి ఉండాలి. అడ్మిషన్ ప్రక్రియను జోసా(జాయింట్ సీట్ అలకేషన్ అథారిటీ) పోర్టల్ ద్వారా కాకుండా సంస్థ నూతనంగా ఏర్పాటు చేసిన 'స్పోర్ట్స్ ఎక్సలెన్స్ అడ్మిషన్(ఎస్ఈఏ)' ద్వారా నిర్వహిస్తారు. అభ్యర్థులు సాధించిన క్రీడా విజయాలను పరిగణనలోకి తీసుకుంటూ విడిగా 'స్పోర్ట్స్ ర్యాంక్ లిస్ట్(ఎస్ఆర్ఎల్)'ను రూపొందిస్తారు. ఈ లిస్ట్ ప్రకారమే సీట్ల అలాట్‌మెంట్ ఉంటుంది. క్రీడల్లో నైపుణ్యం ఉన్నవారిని గుర్తించి ప్రోత్సహించడంతోపాటు వారు మరింతగా రాణించేందుకు అడ్వాన్స్‌డ్ ఎక్విప్‌మెంట్‌తో స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ను కూడా ప్రారంభించనున్నట్లు సంస్థ డైరెక్టర్ వీ.కామకోటి తెలిపారు. ఇప్పటి వరకూ ఐఐటీల్లో స్పోర్ట్స్ కోటా లేకపోవడం గమనార్హం.

పరీక్షల సమయంలో పేరెంట్సే మెంటార్స్

ఎంతటి ప్రశాంతత పాటించే తల్లిదండ్రులైనా, తమ పిల్లలకు పరీక్షలు అంటే ఆందోళన చెందడం సహజం. పరీక్షలంటే ఒత్తిడి ఈ రోజుల్లో విద్యార్థులకే పరిమితం కావటం లేదు. ఆ సెగ పేరెంట్స్‌నూ తాకుతోంది. అందుకే పరీక్షల సమయంలో తల్లిదండ్రుల పాత్ర కీలకమని నిపుణులు కూడా అభిప్రాయపడుతున్నారు. యావత్తు వాతావరణాన్ని కూల్‌గా ఉంచాల్సిన బాధ్యత వారిపైనే ఉంటుందని కూడా చెబుతున్నారు. అధిక ఒత్తిడిలో పిల్లలు ఆందోళన చెందకుండా ఉండాలన్నా, పరిస్థితులు చల్లబడి పరీక్షలకు అనుగుణమైన సానుకూల వాతావరణం ఏర్పడాలన్నా తల్లిదండ్రులు ఇతోధిక పాత్ర పోషించాల్సి ఉంటుంది. అందుకు కొన్ని సూచనలు...



- ప్రతి విద్యార్థిలో కొన్ని ప్రత్యేక లేదా కొనియాడదగ్గ లక్షణాలు ఉండి తీరతాయి. అవేంటో తల్లిదండ్రులకే ఎక్కువ తెలుస్తాయి. పరీక్షలకు తమ పిల్లలు సన్నద్ధమవుతున్న సమయంలో తల్లిదండ్రులు వారి వెంట ఉంటే అద్భుతాలను రాబట్టవచ్చు. మానసికంగా, ఉద్వేగపరంగా వారికి బాసటగా నిలిచినట్లవుతుంది. ముందు పేర్కొన్నట్టు విద్యార్థి బలాన్ని అర్థం చేసుకుని, ప్రోత్సహిస్తే బాగుంటుంది. అదే సమయంలో మరొకరితో పోలికలు తేవద్దు. ఒక సబ్జెక్టులో వీక్‌గా ఉన్నా మరికొన్నింటిలో బలంగా ఉండొచ్చు. అందుకని ఆ అమ్మాయి/అబ్బాయిలా అంటూ పోల్చి మాట్లాడటంతో వ్యతిరేక ప్రభావాలు కలుగుతాయని తల్లిదండ్రులు గుర్తించాలి.
- తల్లిదండ్రులు ఎన్నడూ తమ ఆలోచనలు, ఆకాంక్షలను పిల్లలపై రుద్దకూడదు. పరీక్షలకు ఉన్న ప్రాధాన్యం తెలియజేయాలి. అందుకు అనుగుణంగా వారిని సన్నద్ధం చేయాలి. పరీక్షలే వారి భవితను నిర్దేశిస్తాయని చెప్పకూడదు.
- పరీక్షల సమయంలో పేరెంట్స్ మెంటార్ల మాదిరిగా వ్యవహరించాలి. పరీక్షకు ఉద్దేశించిన సిలబస్ మొత్తం కవర్ అయ్యేలా స్టడీ షెడ్యూల్ రూపొందించుకునేలా సహకరించాలి. దీంతో తమ అబ్బాయి/అమ్మాయికి ఫోకస్ అలాగే స్పష్టత పెరుగుతుంది. అదే వారిలో ఆత్మవిశ్వాసాన్ని పెంచుతుంది. పరీక్షల్లో బెస్ట్ పర్ఫార్మెన్స్ ఇచ్చేందుకు దోహదడుతుంది.
- ప్రిపరేషన్ నుంచి తమ పిల్లలు దృష్టితప్పకుండా చూసుకోవాలి. అంటే టీవీ షోలు చూడడం, పెద్ద సౌండ్‌తో సంగీతం పెట్టడం, ఫ్యామిలీ గెట్ టుగెదర్స్, పిక్నిక్‌లు, కమ్యూనిటీపరంగా కలవడాలు, మొబైల్, వీడియో గేమ్స్, చిట్‌చాట్స్, సోషల్ మీడియాకు దూరంగా ఉండేలా చూడాలి.

> పరీక్షల సమయంలో పేరెంట్స్ మెంటార్ల మాదిరిగా వ్యవహరించాలి. పరీక్షకు ఉద్దేశించిన సిలబస్ మొత్తం కవర్ అయ్యేలా స్టడీ షెడ్యూల్ రూపొందించుకునేలా సహకరించాలి. దీంతో తమ అబ్బాయి/ అమ్మాయికి ఫోకస్ అలాగే స్పష్టత పెరుగుతుంది. అదే వారిలో ఆత్మవిశ్వాసాన్ని పెంచుతుంది. పరీక్షల్లో బెస్ట్ పర్ఫార్మెన్స్ ఇచ్చేందుకు దోహదడుతుంది.

- సరైన పౌష్టికాహారం చాలా అవసరం. తేలికగా అరిగే ఆహారం అందించాలి. పండ్లు, కూరగాయలు, నట్స్, ఎక్కువగా నీరు - డైట్‌లో ఉండేలా చూడాలి. చిరుతిండి, శీతల పానీయాలు, కెఫిన్ ఉండే డ్రింకులకు దూరంగా ఉంచాలి. ఇవన్నీ మత్తును కలిగిస్తాయి. అది జీవక్రియ మందగించేలా చేస్తుంది. అలాగే ఒత్తిడికి కూడా దూరంగా ఉంచాలి. సరిపోను నిద్రపోయేలా చూడాలి. అదే ఆలోచన, మెమరీని పెంచుతుంది. మెంటల్‌గా ఫోకస్డ్‌గా ఉండేలా చూస్తుంది. నిద్రకు ఉన్న ప్రాధాన్యం తెలుసుకోవాల్సిందే. నిజానికి నిద్ర పిల్లల నుంచి పెద్దల వరకు అందరికి చాలా అవసరమైనది.
- వెర్బల్(తిట్టడం) లేదా పనిష్మెంట్స్ అస్సలు వద్దు. శిక్షిస్తే పిల్లల్లో ముఖ్యంగా పెద్దలపై వ్యతిరేక భావన పెరుగుతుంది. భయం కలిగిస్తుంది. చివరకు కోలుకోలేని దెబ్బ తగిలేందుకు దారితీస్తుంది. ఏదో ఒక టాస్క్ ఇచ్చి, పూర్తి చేస్తే అందుకు బహుమతి ఇవ్వడం మంచిది. అది అటు తల్లిదండ్రులు ఇటు పిల్లల మధ్య మంచి పరిస్థితులు నెలకొనేందుకు దారితీస్తుంది.
- పరీక్ష రోజున కూడా సహాయపడవచ్చు. ముఖ్యంగా పిల్లలు పరీక్ష హాలుకు ఒక అరగంట ముందే చేరుకునేలా చూడాలి. హాల్ టికెట్, స్టేషనరీ పెట్టుకునే పౌచ్, వాటర్ బాటిల్ తదితరాలు ఉన్నాయా లేదా అన్నది చెక్ చేయాలి. పరీక్ష రోజున ఏదైనా తిని వెళ్ళేలా చూడాలి. పరీక్ష రోజుల్లో ఒకటి పూర్తయిన వెంటనే మరొక సబ్జెక్టుపై దృష్టిపెట్టేలా చూడాలి. అయిపోయిన పరీక్షను అక్కడికి వదిలేయమనాలి. బాగా రాసినా, రాయకున్నా అక్కడికి ఆ సబ్జెక్ట్ క్లోజ్ అని చెప్పి ఒప్పించాలి. అంటే రాసిన రోజు పరీక్ష ప్రభావం మరునటికి క్యారీ ఫార్వార్డ్ కాకుండా చూడగలగాలి. క్రాస్ వెరిఫికేషన్, రాసిన దానిపై చర్చలు ఉండకుండా శ్రద్ధవహించాలి.
- చివరగా పిల్లలకు పరీక్షల సమయంలో చేదోడువాదోడుగా ఉండగలిగితే మంచిది, పిల్లలకు తల్లిదండ్రులే మొదటి టీచర్లు, మెంటార్లు, స్నేహితులు, గైడ్స్ అందుకని అడుగడుగునా పిల్లల ఎదుగుదలలో పేరెంట్స్ సహకారం అవసరమవుతుంది. పిల్లలకు సంబంధించి ఎంత సమయం అని ప్రశ్నించుకోవడం కన్నా, వారితే వీలైనంత ఎక్కువసేపు గడిపేందుకు తల్లిదండ్రులు సన్నద్ధం కావాలి. అప్పుడే పిల్లలు పరీక్షలే కాదు, జీవితంలోనూ రాణిస్తారు.

ఎగ్జామ్ టైమ్

> ప్రిపరేషన్ నుంచి తమ పిల్లలు దృష్టితప్పకుండా చూసుకోవాలి. అంటే టీవీ షోలు చూడడం, పెద్ద సౌండ్‌తో సంగీతం పెట్టడం, ఫ్యామిలీ గెట్ టుగెదర్స్, పిక్నిక్‌లు, కమ్యూనిటీ పరంగా కలవడాలు, మొబైల్, వీడియో గేమ్స్, చిట్‌చాట్స్, సోషల్ మీడియాకు దూరంగా ఉండేలా చూడాలి.

- బూస శశి కుమార్,
బైజూస్


లిటిల్స్




మీకు తెలుసా?

- ఆఫ్రికాలోని చిట్టి పొట్టి నక్క ఇది. దీని చెవుల వల్ల 'బ్యాట్ ఇయర్డ్ ఫాక్స్' అనే పేరుతో పిలుస్తారు.
- చాటలాంటి ఈ చెవులు ఐదు ఇంచుల పొడవు ఉంటాయి. ముఖ్యంగా ఎడారి ప్రాంతంలో ఉండే ఈ నక్కలకు ఈ చెవుల వల్ల కాస్త చల్లదనం కలుగుతుంది. దీంతో పాటు అద్భుతంగా వినగల సామర్థ్యం ఈ చెవులకు ఉంది. ఎంతా అంటే.. తన దగ్గరలో చిన్న పురుగులు తిరిగినా వాటి శబ్దం వీటికి వినపడుతుంది.
- శాండీగ్రే రంగుల్లో ఉంటాయి. ముఖం దగ్గర కాస్త గోధుమ రంగు ఉంటుంది.
- తూర్పు, ఉత్తర ఆఫ్రికాల్లో కనిపించే ఈ నక్కలు గుంపుగా ఉంటాయి. ప్రతి గుంపులో కనీసం రెండు నుంచి ఐదు ఉంటాయి. ఇవి కేవలం 200 ఎకరాల్లోపలే ఉంటాయి. గుంపుగా ఉండటమే వీటిబలం.
- గద్దలు, హైనాలు, నక్కలు బారినపడి చనిపోతుంటాయివి. అందుకే వాటికి దొరక్కుండా ఉండటానికి ఇవి మట్టిని తవ్వి నివాసాన్ని ఏర్పరచుకుంటాయి. అలా వీటి పంజాలు మట్టిని తవ్వటంలో బాగా ఉపయోగపడతాయి. ముఖ్యంగా ఈ గుంతల్లో ఛాంబర్స్ ఉంటాయి. ఇవి నిద్రపోయేది.. పిల్లలను కనేది అక్కడే.
- ఇవి చిన్నపురుగులు, మిడతలు, బల్లులులాంటి పండ్లు, దుంపలు తింటాయి.
- దంతాలు యాభై వరకూ ఉంటాయి. ఇవి చీల్చి ఆహారాన్ని తినటంలో ముందుంటాయి.
- ఇవి రాత్రంతా వాటి నివాసాల్లో సేదతీరుతాయి. మధ్యాహ్నం తర్వాతనే వాటి గుహల్లోంచి బయటకు వస్తాయి.
- ఇవి తొమ్మిది రకాలుగా శబ్దాలు చేస్తాయి.
- ఆరు పిల్లలను కంటాయి. వీటిలో ఒకటి లేదా రెండు వారంలోపే చనిపోతుంటాయి. మిగతా నాలిగింటికి పురుగులు, ఇతర ఆహారపదార్థాలు తెచ్చి తినిపిస్తాయి. ఆర్నెళ్ల వరకూ డెన్‌లోనే జాగ్రత్తగా పెంచుతాయి.
- 16 ఇంచుల పొడవుండే ఈ జంతువుల బరువు ఒకటిన్నర కేజీ నుంచి రెండు కేజీల లోపు ఉంటుంది.

దారి కనుక్కోండి




చుక్కలు కలిపి రంగులు వేయండి



5 తేడాలు గుర్తించండి





ఎంత మంది?

డైలీ సుడోకు - 223

8	7					2		
4			7		9			3
		2	1					
	8	6		4				
	3						6	
				1		5	3	
					7	3		
2			4		1			7
		8					4	6

సుడోకు - 222 సమాధానం

3	1	9	2	6	5	4	8	7
5	2	4	1	7	8	3	9	6
7	6	8	9	3	4	1	5	2
4	5	1	6	8	9	2	7	3
6	3	2	5	4	7	8	1	9
8	9	7	3	1	2	6	4	5
9	8	5	4	2	6	7	3	1
1	7	6	8	9	3	5	2	4
2	4	3	7	5	1	9	6	8

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.